# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, అక్టోబర్, 2023 ₹ 50/-

ISSN 2454–4329




భీష్మ

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 34 సంచిక 10

అక్టోబర్ - 2023

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం


Printed & Published by
**BAPANNA ALAPATI**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,
**Hyderabad - 500 020.**
Ph: 040 - 27612436, 27645538.



Editor: V. ASWINI KUMAR
Ph: 994 951 6567


**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : జి. ఉమాసుందరి
040-27645536

Scan QR to Pay
Misimi Publication


LCCN 91-903060
UGC Care
ISSN 2454-4329



misimi90monthly@gmail.com
www.misimimonthly.com
facebook.com/misimimaasapathrika


YouTube : Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# అక్టోబర్ నెల సూచికలు...





బేగం హజ్రత్ మహల్


కమ్మతెమ్మెరలు : ...3
నగ్నముని విలోమ కథలు : సి.ఎస్. రాంబాబు ... 4
వారణాసిలో వారకాంతలు : డా. కిల్లాడ సత్యన్నారాయణ ... 5
గాంధీ వైరుధ్యాలతో సహజీవనం : డా. అవధానం రఘుకుమార్ ... 10
ఎడిటర్స్ డైరి : అశ్వినీకుమార్ ... 15
అదృష్టం - దురదృష్టం : జయశ్రీ అట్లూరి ... 16
ఆత్మచిత్రం : అలజంగి మురళీధర రావు... 17
గిరిజన కథా భూషణం : సారపల్లి నాగరాజు ... 20
దళిత సాహిత్యం : డా. కొప్పరపు నారాయణమూర్తి .... 23
రెండు వంశాలు-రెండు జమీందారీలు : గార రంగనాథం ... 27
బంగోరె-బ్రౌన్ : డా.ఎన్ ఎలిజబెత్ జయకుమారి.... 35
అసమర్థుని జీవయాత్ర : రామవరపు లక్ష్మీ సునీత... 39
అట్టాడ అప్పలనాయుడు కథలు : మునకాల ధనలక్ష్మి ... 42
వంగపండు ప్రసాదరావు జీవితం : బద్రి కూర్మారావు ...46
జనపదుల యాస పలుకులే : దాసరి కృష్ణారెడ్డి ... 50
చిత్రగీతాలు - హిందుస్థానీ బాణీలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 53
సూక్తి సురభి : రెంటాల సాంబశివరావు .... 61
రాజస్థాన్-3 : ప్రొ. లక్ష్మీ అయ్యర్... 63
మనస్సాక్షి - నవలాహృదయం : రాజా... 66
గ్రామనామానురక్తికి మేలిమి అభివ్యక్తి : జంధ్యాల శరత్‌బాబు .... 68
తాళ్ళపాకను సందర్శించిన సాళువ నరసింహరాయలు : గూడూరు యానాదిరాజు ... 70
సీరపాణి ప్రకృతి సందేశం : పిళ్లా తిరుపతిరావు ... 72
స్త్రీలకు విద్య - దేశానికి ముక్తి : శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ ... 74
చదవండి : **మిసిమి** ... 78


## అట్టమీది బొమ్మలు




జపాన్ గార్డెన్ టెంపుల్




భీష్మ




అంబ, అంబిక, అంబాలిక
కాశీరాజు పుత్రికలు



సిద్ధివినాయక

*వివరాలు : 22పుట*

# కమ్మతెమ్మెరలు

"... *మిసిమి* సంపాదకులు వల్లభనేని అశ్వనీకుమార్ గారికి...మహాశయా, ఆగష్టు '*మిసిమి*' చదివి 'అనంత శయన' దారు శిల్పం గురించి తెలుసుకున్నాను. నా తెలివిడికి కారకులైన చిరంజీవులు అశ్వనీకుమార్, చదలవాడ శరత్‌బాబు, రాయన గిరిధర్ గౌడ్, టిన్ కో విన్ ప్రభృతులు అందరూ నాకంటే వయసులో చిన్నవారు. వీరిని ప్రేరేపించిన ఆ సరస్వతీ దేవికి నా సాష్టాంగ ప్రణామములు.



*మిసిమి* లో ఉండతగనివి వేరు వేరు పుటల్లో ఒక పేరుకే వేరు వేరు అక్షర క్రమం. కల్లేన్ బాక్(15), కల్లెన్ బాక్, కల్లెన్ బాక్, కల్లెం బాక్ (17).

చిత్రగీతాలు : 'నగుమోము' రచన దాశరథి, సంగీతం సి. నారాయణ రెడ్డి! 'శివదీక్షాపరురాలనురా' జావళి కాదు. నిర్మాణ రీత్యా పదం.

కొప్పర్తి వ్యాసం. త్యాగరాజు ద్వితీయ శరభోజీ ఆస్థానంలో ఉండేవాడా? ఎవరన్నారు! 'సీతారామ విజయం' నైపుణ్యం గురించి రచయితకెలా తెలిసింది? ఆ రచన అలభ్యం!

*– వి.ఎ.కె. రంగారావు, ఫోన్ : 9444734024*

ఆర్యా,

నమస్కారములు...*మిసిమి* ఆగష్టు పత్రికలో ప్రచురించిన అద్భుత దారు శిల్పం విశేషాలు చాలా ఆకట్టుకున్నాయి... 1500 సంవత్సరాల మహావృక్ష కాండాన్ని మహావిష్ణువుగా మలచిన తీరు, శరత్ గారి ఆశయం, చిత్రకారులు గిరిధర్ గౌడ్ గారి మరియు బర్మా శిల్పుల నైపుణ్యం కలగలిసి ఇంతటి చక్కని మూర్తికి ప్రాణం పోయడం ముదావహం. అలాగే కొమర్రాజు వారి పరిశోధన పై మండలి బుద్ధ ప్రసాద్ గారి వ్యాసం, డా. నల్లపనేని విజయలక్ష్మి గారి కర్పూర పరిమళాలు అలరించాయి. అన్ని వ్యాసాలు చక్కగా ఉన్నాయి. మంచి పత్రికను అందిస్తున్నందుకు మీకు అభినందనలు. – సునీతా రామవరపు

*మాన్యులు అశ్వినీ కుమార్ గారికి వందనం*

*మీ సు"వర్ణ" శోభిత ఆగస్ట్ **మిసిమి** 2023 సంచిక ముద్రు ప్రతిని అందుకోవడం పరమానందం. మీ అసమాన **మిసిమి** పత్రికను గత ఏడున్నర సంవత్సరాలుగా నిరాఘాటంగా పొందటం నా పూర్వజన్మ సుకృతం. మీ సారస్వత సేవ చిరస్మరణీయం. మీ కృషి అభినందీయం. ధన్యవాదాలు మీ వీరాభిమాని*

– రా సత్యనారాయణ

నేను గత ఆరేడు ఏళ్లుగా *మిసిమి* పత్రిక చదువుతున్నాను. ఇతర తెలుగు పత్రికల కంటె భిన్నంగా *మిసిమి* పత్రిక ప్రత్యేకత సంతరించుకున్న విషయం సర్వాంగీకారం. గౌరవనీయ సంపాదకులు అశ్వనీకుమార్ గారు ప్రత్యేక పంథాలో పత్రికను నడిపిస్తూ, పత్రిక విలువల్ని పెంపొందిస్తున్న విషయం ప్రశంసనీయం. అలాగే *మిసిమి* కి చక్కని వ్యాసాలు వ్రాస్తూ, పత్రిక విలువల్ని కాపాడుతున్న రచయితలకు ప్రత్యేక ధన్యవాదాలు.

ప్రస్తుతం నైతికంగా దిగజారిపోతున్న సమాజాన్ని ప్రక్షాళనం చేస్తూ, సామాజిక అవసరాల్ని గుర్తించి, పరిష్కార మార్గాల్ని సూచించే వ్యాసాల్ని పంపిస్తే చాల బాగుంటుంది. ముఖ్యంగా సమాజానికి రథసారథులు యువతరం; టెక్నాలజీ మాయలో పడి పుస్తకాలు చదవడం మరచిపోయారు. వారిని ఆ మాయలోంచి బయట పడేసే మార్గాల్ని సూచించే రచనలు సాగిస్తే సమాజానికి ఎంతో మేలు చేసినట్టవుతుంది. దేశానికి, ప్రపంచానికి పరిపాలనా దక్షులను ఎంపిక జేసేది, నాయకత్వాన్ని అందించేది యువతే కదా! మేధావి వర్గమంతా సమాజానికి ఎప్పుడూ అనుకూలంగా ఉంటారన్నది అందరికి తెలిసిన విషయమే. ఇక్కడ యువశక్తి ప్రధానాంశం. వారిని జాగృతపరచడమే అందరి ముందున్న కర్తవ్యం. అది నెరవేర్చగలమా? ఈ ప్రశ్నకు సమాధానం కోసం ఎదురు చూస్తూ...

*– దూబ వేణుగోపాలరావు, హైదరాబాదు. ఫోన్ : 9493433877*

# కాలం పరీక్షకు నిలబడిన విలోమ కథలు

దిగంబరకవి నగ్నముని విలోమ కథలు వచ్చి దాదాపుగా నలభై ఇదేళ్ళవుతోంది.

ఆ కథలను మళ్ళీ చదివినా పాతబడ్డాయి ఈ కథలు అనిపించకపోవటం ఈకథల ప్రత్యేకత.ఎమర్జెన్సీ కాలంలో వచ్చిన అధివాస్తవిక కథలే కానీ అవాస్తవిక కథలు కావివి. నూట ఇరవై ఏళ్ల తెలుగు కథా ప్రస్థానంలో మరెవ్వరూ సాధించని ఘనత ఒక కథకుడిగా ఆయన సాధించారు. ఇవి నిజంగా కథలేనా. ఎందుకు వీటిల్ని విలోమ కథలన్నారు అన్న ప్రశ్న వేస్తే వీటిల్ని యాంటీ స్టోరీస్‌గా చెప్పాలి అంటారు. నైఘంటిక అర్థంలో విలోమ కథలు అన్నారు. సమాజ జీవన గమనం తల్లకిందులైనవేళ ఆ సమాజాన్ని ప్రతిబింబించే కథలు మరోలా ఉండబోవు. ఇందులో వ్యంగ్యం, అధిక్షేపణ, అధివాస్తవికత, అసంబద్ధత అన్నీ ఉన్నాయి. ఎమర్జెన్సీ కాలం నాటి నియంతృత్వ ధోరణిలో ప్రజలెలా నలిగిపోయారు, వ్యవస్థలెంతగా కూలిపోయాయి, భావప్రకటనకు సంకెళ్ళెలా పడ్డాయి.. ఇలా వీటినన్నింటిని రచయిత కొన్ని పాత్రలు కల్పించి, ఒక బీభత్స వాతావరణం మనుషుల్ని ఎలా బిక్కుమనేలా చేసిందో ఈ కథల్లో చూపిస్తారు రచయిత. విలోమ కథల్లోని మొదట మూడు కథలు ఎమర్జెన్సీ కాలంలో ప్రజాతంత్రలో ప్రచురించి సంపాదకులు దేవిప్రియ ఇబ్బందులు పడటమో విషాదం. ఆయన రాసింది ఆరు కథలే కానీ అవి ఈరోజు చదివినా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. కవి కథకుడైనప్పుడు వచనమంతా కవిత్వమై చుట్టేస్తుంది. అది మనమీ కథల్లో గమనించవచ్చు.దానివలన ఈ కథలు పాఠకుడిలో మరింతగా చొచ్చుకుపోతాయి.




ఇవి ప్రయోగాత్మక కథలే. ఒక వ్యవస్థను అత్యద్భుతంగా ఆవిష్కరించిన కథలు.అయితే ఒక సందేహం మాత్రం రావటం ఖాయం. నగ్నముని గారెందుకు ఈ తరహా కథలను మళ్ళీ ప్రయత్నించలేదు అనిపిస్తుంది. ఈ కథల్లో ఆయన ధోరణి భిన్నంగా ఉందెందుకు, ఎవరి ప్రభావంతో రాశారంటే ఆయనా సమాధానం చెప్పలేకపోయారు కానీ, కవులు, రచయితలు ఎమర్జెన్సీని పొగుడుతుంటే ఆయన ఊర్కోలేకపోవటం ఆయన మనస్సాక్షి ఆయనను కుదురుగా ఉండనివ్వకపోవటమే కారణమనిపించకమానదు. అప్రయత్నంగానే కవి దాశరథి గుర్తుకొస్తారు ఈ కథలను చెప్పటానికి మనుషుల రూపంలో జంతుపాత్రలు, జంతురూపంలో ఉన్న మనుష పాత్రలు సృష్టించారు. తెలుగు కథకో కొత్త దారి వేశారు. ఎందుకో ఆదారిలో వెళ్ళటానికి తదుపరి కథలు సాహసించలేకపోయారు. అంతెందుకు.. సాక్షాత్తు ఆయనే ఆ ప్రయత్నం మళ్ళీ చేయలేదు. ఈ కథలు అసంబద్ధ అధివాస్తవికత ధోరణిలో ఉన్నా పాఠకుడు చదివేందుకు ఇబ్బందిపడడు సరికదా, సమకాలీన పరిస్థితులనూ పోల్చుకోగలుగుతాడు. మొదటి కథ శీర్షికే చూడండి. ఎలా ఉందో. "ఇందుమూలముగా సమస్తమైన వారికి మన ముఖాలూ కాళ్ళు చేతులూ వగైరా సర్వాంగాలను గురించి తెలియజేయడేమేమనగా".ఇది నగ్నముని గారి శైలి. మనలని కదిపేసి కుదిపేసే ఈ కథలు కథాలక్షణాలేవి పుణికిపుచ్చుకోకున్నా ఈ కథల్లోని అలజడి, అశాంతి, అసంతృప్తి మనల్ని తాకుతాయి. విలోమంగా ఉన్న సమాజంపై విలయ తాండవం చేసిన కథలివి. తెలుగు కథల్లో ఓ కాఫ్కా (Kafka) ఓ కేమూ (Albert Camus) ఓ నగ్నమునిగా చొరబడ్డారని అనిపించే కథలు. కథ ఎందుకు ప్రభావశీలో, కథకెందుకు ప్రాసంగికత ఉంటుందో చెప్పే కథలు ఈ "విలోమ కథలు"

మూడో ముద్రణగా విలోమ కథలు ఇప్పుడు "నరగ్రహణం మొదలైన విలోమ కథలు" గా వచ్చిన ఈ సందర్భంలో మళ్ళీ మనం హత్తుకోవలసిన కథలివి.

*- సి.యస్.రాంబాబు, ఫోన్ : 8374818961*

# వారణాసిలో వారకాంతలు

**– కిల్లాడ సత్యన్నారాయణ**



మనిషికి రొటీన్ నుండి బ్రేక్ కావాలి. అది వినోదం కల్పిస్తుంది. అది కొందరికి పున్నమి వెన్నెల కావొచ్చు. కొందరికి నిత్యం పలకరించే పక్షుల కూకూరవాలు కావొచ్చు. వినోదానికి వెయ్యి తలుపులు. అవి తలపుల్ని బట్టి తెరచుకుంటాయి. కొందరికి వ్యసనాలు వినోదం. కొందరికి సినిమాలు, వీడియోలు. మరికొందరికి తవైఫ్ లు. స్త్రీలను వినోదవస్తువుగా మార్చిన వ్యవస్థ అన్ని సమాజాల్లోనూ ఉంది. తవైఫ్ లను స్త్రీలుగా చూసే పురుషులు అరుదు. అలాంటిది తవైఫ్ లలో దేశభక్తిని చూడడం మరీ అరుదు. తవైఫ్, వేశ్య, గణిక, వారాంగన, నగరవధు, పతురియ, రండి-ముండి మన దేశ సంస్కృతిలో ఉన్నాయి. బౌద్ధ కాలంలో ఆమ్రపాలి కథ అందరికీ తెలిసిందే. అంతవరకు విహారలో మహిళల్ని అనుమతించలేదు. ఆమ్రపాలి వల్ల దాని తలుపులు తెరచుకున్నాయి. గూఢాచారులుగా గణికలను ఉపయోగించమని కౌటిల్యుడు చెప్పాడు. అక్బర్ మున్సబుదారు రాజా మాన్ సింగ్ కాశీలో విశ్వనాథ మందిర మరమ్మత్తు చేయించాడు. ఆ సందర్భంగా నృత్యకార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలనుకున్నాడు. అందుకు ఎవరూ సిద్ధపడలేదు. ఇక్కడ నగరవధువులు ప్రదర్శించారు. అప్పటి నుండీ వీళ్ళు ప్రజల ముందు కార్యక్రమాలు యిచ్చే సంప్రదాయం పెరిగింది. చైత్రనవరాత్రి మసాన్ హోలీలో వీరు నృత్యం చేస్తారు.

తవైఫ్ అరబీ శబ్దం. వ్యక్తుల దళమని దీని అర్థం. అంటే పాడేవాళ్లు, నాట్యంచేసే వాళ్ళు, వాద్యాలు వాయించేవాళ్ళ సమూహం. ఈ సమూహంలో నర్తకిలదే ప్రధానపాత్ర. వారినే తవైఫ్ గా పిలుస్తారు. ప్రాథమికంగా వీరు కళాకారులు. వేశ్యలు కాదు. మొదట్లో జమీందార్ల, సంపన్నుల వివాహాది శుభకార్యాల్లో వీరి ముజ్రా పెట్టేవారు. తర్వాత వీరికి ఒక స్థానాన్ని నిశ్చయించారు. దాన్ని కోటే అంటారు. అక్కడకు ప్రముఖులంతా చేరేవారు. వారణాసిలోని చౌక్ పోలీసు స్టేషను దగ్గర కోటే ఉండేది. దాల్మండి మొహల్లాలో ఈ కోటేలు ఎక్కువగా ఉండేవి. మున్షీ ప్రేమ్ చంద్ 'సేవాసదన్' నవలలో దాల్మండి కోటేను వర్ణించారు. ఈ కోటేలు బెనారస్ సంగీత సంస్కృతిని నిలబెట్టాయి. తర్వాతకాలంలో ఈ కోటేలు సానికొంపలుగా మారాయి. తర్వాత కొందరు తవైఫులు సంపన్నులకు ఉంపుడుగత్తెలుగా మారారు. కొందరు వేశ్యలుగా మారారు. కొందరు తవైఫులుగా ఉండిపోయారు. కొందరు సంగీత, నృత్యాల్లో శిఖరాలకు చేరారు. వారిలో కొందరు పద్మశ్రీలు అయ్యారు. కొందరు పద్మభూషణాలు అయ్యారు.

కాశీ సంగీత, నృత్య సంస్కృతిలో తవైఫ్‌లు ముఖ్య పాత్ర నిర్వహించారు. ఆధునిక హిందీ వైతాళికుడైన భారతేందు హరిశ్చంద్ర కూడా వీరి నుండి ప్రభావిత మయ్యారు. ' ప్రేమయోగిని' లో ఆయన ఇలా రాస్తారు. "సగం కాశీ భాట్, భటేరియా, బ్రాహ్మన్, సన్యాసిబీ మిగతా సగం కాసీ రండీ, ముండీ, రాండ్, ఖాంగీ ఖాసీబీ ఓ కాశీ వాసులారా! మీ కాశీని చూసాను, మీ కాశీని చూసాను." ఉస్తాద్ బిస్మిల్లాఖాన్‌కు తవైఫ్ బిబ్బాలాతో ఒక కచేరీలో పరిచయం ఏర్పడింది. ఆమె పాడిన ' మనసు ఆటవస్తువు

పగిలిపోయింది' పాట బిస్మిల్లా ఖాన్‌ను కదిలించింది. "నేను ఆమెతో కలిసి సంగీత సాధన చేసేవాణ్ణి. ఆమె పాటను నేను శహనాయిలో ఊదేవాణ్ణి. అది అమరమై పోయింది." అంటారు బిస్మిల్లా ఖాన్.

తవైఫ్‌ల ప్రపంచంలో మనకు ప్రముఖంగా వినిపించే పేరు జద్దన్ బాయ్. ఆమె ప్రఖ్యాత సినీనాయిక నర్గీస్ తల్లి. జద్దన్ బాయ్ 1892లో జన్మించారు. తండ్రి మియాజాన్ మరణించాక, జద్దన్ బెనారస్ వెళ్ళారు. ఆమె ఇక్కడ రథయాత్ర వీధిలో ఖన్నాబాబుతో ఉండేవారు. గాయనిగా ఎదిగారు. ఆమె పాటలు రేడియో రికార్డింగ్ చేసారు. ప్రదర్శన కోసం ఆమెను రాజదర్బారులకు ఆహ్వానించారు. తర్వాత నృత్యం ప్రారంభించారు. 1933లో ఆమెకు ' రాజా గోపీచంద్ ' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. తన కుమార్తె నర్గీస్‌ను కూడా చిత్రపరిశ్రమకు దగ్గర చేసారు. ఆమెను సునీల్ దత్ పెళ్లిచేసుకున్నారు. రసూలన్ బాయ్, రాజేశ్వరిబాయ్, కాశీబాయ్, తౌకీబాయ్, హస్నాబాయ్, జవహర్ బాయ్, చంపాబాయ్, బడీమైనా, చోటిమైనా, సిద్ధేశ్వరీ దేవి, చంద్రకుమారి, షాజహాబేగం... మొదలైనవాళ్ళు కాశీ పేరును కళారంగంలో సువర్ణాక్షరాలతో రాసారు. సంగీత ప్రపంచంలో కాశీకి ఉన్నతస్థానం సంపాదించారు. ప్రఖ్యాత తవైఫ్ ఉమ్రావ్ జాన్ చివరిదశలో వారణాసిలో ఉన్నారు. ఆమె డిశంబర్, 26, 1937న ఇక్కడే కన్నుమూసారు. ఆమె సమాధి బిస్మిల్లా ఖాన్ సమాధికి దగ్గరలో ఉంది.

రాజాదర్వాజా వద్ద ఛోటీమోతీ, సిద్దేశ్వరీ, గిరిజాదేవి ఉండేవారు. ఇక్కడే ఫారసీ నాటకకారుడు ఆగా హశ్ర ఇల్లుండేది. దీనికి దగ్గరలో త్రిమోహిని వీధి ఉంది. అక్కడ కన్హయ్యాలాల్ బంగారం దుకాణం ఉండేది. దీనికి దగ్గరలో హుస్నాబాయి ఉండేవారు. ఈమె గొప్పగాయకి. మంచి షాయరీ. పద్ధతిగల మహిళ. ఆమె కంఠం ఒక గొప్ప ఆకర్షణ. ఇక్కడకు దగ్గరలో నారాయణదాసు ఇల్లుంది. అక్కడ ప్రముఖ గాయకి విద్యాధరి ఉండేవారు. చౌక్‌లో ఫోవ్వారే వద్ద గౌహర్ జాన్ ఉండేవారు. చౌక్ పోలీస్ స్టేషన్ వెనుక వైపు లాల్తా ఉండేవారు ఆమె తండ్రి మంచి తబలా వాదకులు. ఇక్కడ ఒక కోటే (సానికొంప) ఉండేది. దీనిలో భగోతీ, ముస్తరి, మలకా, ప్రఖ్యాత గాయకి రాజేశ్వరి ఉండేవారు. ఇది విప్లవకారులకు రహస్య స్థావరంగా ఉండేది. సానుల కొంప స్వతంత్రతా సేనానులకు స్థావరం అవుతుందని బ్రిటిష్ వాళ్ళు ఊహించలేదు. పై అంతస్తులు కోటే ఉండేది. భూతలంలో కిళ్ళీ దుకాణం ఉండేది. కోటే బాగా అలంకరించబడి ఉండేది. వచ్చిన వాళ్లను గౌరవంగా కూర్చోబెట్టేవారు. బాయ్ వచ్చేవారు. అందరికీ నమస్కరించే వారు. సంపన్నులు నోట్లు విసిరే వారు. ఏ పాట కావాలో చెప్పేవారు. తబలా, సారంగి వాదకులు ప్రారంభించేవారు. బాయ్ పాట మొదలయ్యేది. పాటతో పాటు నాట్యం కూడా. ఖ్యాల్ తో మొదలై తరానా, టుమ్రీ, దాద్రా, చైతీ, హెూలీ, టప్పా వినిపించేవారు.

"ఫూల్‌గెందవా న మారో హెూ రాజా...పాన్ ఖాత్ ముఖ్ లాల్ భయోరీ"అని పాడేవాళ్ళు.



అజీజాన్ బాయ్ (1857)

ఏ కోటే కింద నిలబడినా సంగీతం వర్షిస్తుంది. మనం నాణానికి ఒకవైపే చూస్తున్నాం. రెండో వైపు చూస్తే తవైఫుల దేశభక్తి కనబడుతుంది. వారి నిజాయితీ తెలుస్తుంది. వారి గొప్పతనం పిలుస్తుంది. 1857 తొలి స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో చరిత్రకళ్ళు చూడని త్యాగం ఒకటుంది. అజీజన్ బాయ్. ఆ పేరు చెబితే, ఆంగ్లేయులకు దడ పుట్టేది. ఆమె తవైఫ్ (నర్తకి)గానే లోకానికి తెలుసు. ఆంగ్లేయులకు కూడా అదే తెలుసు. ఆమె దేశభక్తురాలని దేశభక్తులకే తెలుసు.

అజీజన్ బాయ్ అసలు పేరు అంజుల. 1824లో మధ్యప్రదేశ్ లోని రాజగడ్ లో జమీందారు కుటుంబంలో జన్మించారు. యవ్వనంలో మిత్రులతో కలిసి మేళాకు వెళ్లారు. ఆంగ్ల సిపాహి ఒకడు ఈమెను ఎత్తుకు పోయాడు.

ఈమె దారిలో ఒక నదిలోకి దూకింది. సిపాహి వెళ్ళిపోయాడు. ఆమెను ఒక వ్యక్తి కాపాడాడు. అతను ఆమెను కాన్పూర్ లో అమ్మేసాడు. వాళ్ళు ఆమెకు సంగీతం నేర్పించారు. ఆమెకు తవైఫా శిక్షణ ఇచ్చారు. అప్పటి నుండి ఆమె అజీజన్ బాయ్ గా మారింది. అందంలో, నృత్యంలో ఆమె పేరు నలువైపులా వ్యాపించింది. కాన్పూర్‌లో ఆమె కచేరీకి ఆంగ్ల అధికారులు వచ్చేవారు. తాంతియా తోపేకు ఈ విషయం తెలిసింది. తాంతియా ఆ కచేరీపై దాడి చేసాడు. ఆంగ్ల అధికారులు తప్పించుకున్నారు. హోలీ పండుగకు బిటూర్ రమ్మని తాంతియా ఆమెను ఆహ్వానించాడు. ఆమె వెళ్ళారు. తన నృత్యంతో అక్కడున్న వాళ్ళను ముగ్ధుల్ని చేసారు. పారితోషికంగా ఆమెకు డబ్బు యివ్వబోయారు తాంతియా. "నాకు డబ్బు కాదు, మీరు వేసుకున్న యూనిఫారం ఇవ్వండి'' అన్నారట అజీజన్ బాయ్. అలా ఆమె తాంతియా దళంలో చేరింది. ఒకసారి అజీజన్ బాయ్ ఒక కచేరీ పెట్టారు. దానికి కేవలం ఆంగ్లేయులనే పిలిచారు. అక్కడ ముందుగానే తిరుగుబాటు దారులు కాచుకున్నారు. ఒక్కసారిగా కచేరీలోని అంగ్లేయు లపై దాడి చేసారు. చాలా మందిని హతమార్చారు. నానాసాహెబ్‌కు అజీజన్ బాయ్ గురించి తెలిసింది. అతను ఆమెకు రాఖీ కట్టారు. దానికి ఆమె చాలా ఆనందపడింది. తాను సంపాదించిన ఆస్తినంతా తిరుగుబాటు కోసం ఆమె నానా సాహెబ్‌కు యిచ్చేసారు.


బేగం హజ్రత్ మహల్

అజీజన్ బాయ్ మిగతా తవైఫులతో కలిసి 'మస్తానీ టోలి' స్థాపించారు. వీరికి యుద్ధ నైపుణ్యం మీద శిక్షణ ఇచ్చేవారు. ఆమె పగలు సైనికవేషంలో ఆంగ్లేయులతో పోరాడేవారు. రాత్రి నర్తకిగా కచేరీలు చేసేవారు. ఆమె ప్రేరణతో చాలా మంది సిపాయిలు తిరుగుబాటు చేసారు. కాన్పూర్ నుండి ఆంగ్లేయులను తరిమికొట్టారు. జూలై 8, 1857న నానాసాహెబ్ కాన్పూర్ లో స్వాతంత్ర్యం ప్రకటించాడు. జూలై 17, 1857 న జనరల్ హేవ్లాక్ పెద్ద సైన్యంతో కాన్పూర్ పై దండెత్తాడు. నానా సాహెబ్ పారిపోయాడు. అజీజన్ బాయ్ దొరికిపోయింది. తిరుగుబాటుదారుల స్థావరాల గురించి చెబితే విడిచి పెడతామన్నారు. ఆమె చెప్పలేదు. తుపాకీతో కాల్చి చంపుతామన్నారు. ఆమె భయపడ లేదు. అలా తుపాకీ గుళ్ళకు నేల కొరిగింది అజీజన్ బాయ్. తవైఫ్‌ల మధ్య తారగా వెలిగింది అజీజన్ బాయ్. ఏ దేశ భక్తుడికీ తీసిపోని త్యాగాన్ని చూపింది.

ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన మరొక తవైఫ్ బేగం హజ్రత్ మహల్. ఈమె 1820లో ఫైజాబాద్ లో ఒక పేద కుటుంబంలో జన్మించారు. ఈమె అసలు పేరు మొహమ్మద్ ఖానున్. చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఈమెను లక్నోలోని నవాబుకోటలో అమ్మేసారు. అక్కడ ఆమెను తవైఫుగా తీర్చిదిద్దారు. నృత్యం నేర్పించారు. ఆమె చాలా అందగత్తె. లక్నో నవాబు వాజిద్ అలీషా ఆమెను ఉంపుడు గత్తెగా స్వీకరించారు. వీరికి ఒక కుమారుడు పుట్టాడు. వాజిద్ అలీకి చాలా మంది ఉంపుడు గత్తెలుండేవారు. వారసున్ని కన్న వాళ్ళను తాత్కాలికంగా పెళ్ళి చేసుకొనేవాడు. అలా ఖానున్‌ను పెళ్ళిచేసుకుని, హజ్రత్ మహల్‌గా బిరుదునిచ్చాడు. అలా మొహమ్మద్ ఖానున్ బేగమ్ హజ్రత్ మహల్ అయ్యింది.

క్రీ.శ. 1856లో బ్రిటిష్ వారు అవధ్ రాజ్యాన్ని ఆక్రమించారు. వాజిద్ అలీని కలకత్తాకు పంపించారు. కానీ బేగం హజ్రత్ మహల్ తన కుమారునితో లక్నోలోనే ఉండిపోయారు తన కొడుకును నవాబుగా ప్రకటించారు. 1857లో నానాసాహెబ్, ఫైజా బాద్ మౌల్వీలతో కలిసి బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసారు. 1858లో ఆంగ్లేయులు లక్నోపై విజయం సాధించారు. నానాసాహెబ్ తో కలిసి ఆమె నేపాల్ కు పారిపోయారు. 1879లో ఆమె ఖాట్మండులో స్వర్గస్తులయ్యారు. మరణించే వరకూ ఆమె బ్రిటిష్ వారికి తలొగ్గలేదు. అవి సహాయ నిరాకరణోద్యమ రోజులు. నవంబర్ 25, 1920 న గాంధీజీ కాశీ వచ్చారు. రెండు రోజులున్నారు. విద్యాధరి బాయ్ నేతృత్వంలో కొందరు

తవైఫులు టౌన్ హాల్లో గాంధీజీ సభకు వచ్చారు. గాంధీజీ ప్రసంగం నుండి ప్రభావితులయ్యారు. విద్యాధరీబాయ్ గాంధీజీ ఉద్యమ పద్ధతులను దినపత్రికల్లో చదివేవారు. వాటి పట్ల ఆకర్షితురాలయ్యారు. గాంధీజీ ప్రసంగం ఆమెపై చెరగని ముద్ర వేసింది. ఆమె వెంటనే విదేశీ వస్త్రాలను తగులబెట్టారు. ఖాదీ వస్త్రాలను ధరించారు. ఆమె ఉద్యమకారులకు ధనసహాయం చేసేవారు. కొందరు విప్లవకారులకు దాక్కునేందుకు చోటిచ్చేవారు. కాశీ నరేష్ కోటలో ఆస్థాన నర్తకిగా, గాయనిగా పనిచేసేవారు.

"ఈ యుగం స్వేచ్ఛా వాయువులు పీల్చ మంటుంది నీ జైలుకి భయపడేవాళ్ళెవరూ లేరిక్కడ నీ అణిచివేతకు మా త్యాగం సమాధానం ఇవన్నీ చిన్నపిల్లల ఆటలు మాకు" అంటూ విద్యాధరీ బాయి పాడేవారు. ఆమె ప్రతీ కార్యక్రమం ఈ పాటతోనే మొదలయ్యేది. అంతే కాదు. ఆమె మహాత్మా గాంధీ నుండి ప్రభావితమై ఈ కింది పాట పాడేవారు. " ఔ తర్ మహాత్మా గాంధీ హై భారత్ కా భార్ ఉతారాన్ కో...." "హమ్ గరీబోం కే గలే కా హార్ బందేమాతరమ్..."



గౌహర్‌జాన్

ఆరోజు నుండీ ఆమె దేశభక్తి గీతాలను పాడేవారు. తన ఇంట్లో సహాయ నిరాకరణోద్యమ మీటింగులు పెట్టేవారు. మిగతా తవైఫులను ఉద్యమం వైపు ప్రోత్సహించేవారు. ఆమెతో తవైఫ్ సుల్తానా చేతులు కలిపారు. హస్నా బాయ్ కూడా వెంట నడిచారు. కాశీలో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నడిపిస్తున్న ప్రేమ్ కుమార్ ఖన్నాను కలిసారు. తవైఫులను కలవడానికి ఆయన మొదట నిరాకరించారు. వీరి దేశభక్తి గ్రహించి ఆయనే మళ్ళీ వీరిని ఆహ్వానించారు. వీళ్లంతా కలిసి సహాయ నిరాకరణోద్యమ సభ నిర్వహించారు. మొదట విద్యాధరి దేశభక్తి పాట పాడారు. తర్వాత హుస్నాబాయ్ ప్రసంగించారు. తవైఫులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చెప్పారు. అంతే కాదు, ఉద్యమంలో తవైఫులు పాల్గోవాలన్నారు. ప్రేమ్ కుమార్ ఖన్నా కూడా మాట్లాడారు. గాంధీజీ చూపిన మార్గంలో తవైఫులు స్వాతంత్ర్యోద్యమంలో ముందుకు రావాలన్నారు. 103 ఏళ్లు జీవించి విద్యాధరీబాయ్ 1971లో కన్నుమూశారు. ఆమె 1930 ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. ఈమె బెనారస్ తవైఫుల సంఘాన్ని స్థాపించారు. హుస్నాబాయ్ ఠుమ్రీ, టప్పాలో అద్భుత గాయకురాలు. తవైఫులకు గౌరవప్రద జీవితం కల్పించడం కోసం ప్రయత్నించారు. శృంగార పాటల నుండి దేశభక్తి పాటలవైపు మళ్ళాలన్నారు. భజనలు, కీర్తనలు పాడమన్నారు. ఆమెతో పాటు కొందరు తవైఫ్‌లు చరఖా ఉద్యమంలో చేరారు.

కావ్య అభివ్యక్తిపై భారతేందు ఆమెతో చర్చించేవారు. జయదేవుని ' గీతాగోవిందాని'కి సంగీతం కూర్చమని భారతేందు ఆమెను అడిగారట. విద్యాధరి బాయ్, బడీ మోతీబాయ్ ఈమెకు సమకాలికులు. 1926-27 లో గాంధీజీ సమాజోద్ధరణ కార్యక్రమాలు చేపట్టారు. దానిలో వేశ్యలను తమ వృత్తి విడిచి పెట్టమన్నారు. సమాజం కోసం పాటుపడమన్నారు. ఆ పిలుపు విని, కొందరు వేశ్యలు చరఖా పట్టారు. వారణాసిలో తవైఫ్‌లు గాంధీజీ సిద్ధాంతాలపై చర్చించాలనుకున్నారు. ఒక పెద్ద సభ ఏర్పాటు చేసారు. దీనికి నగరంలో ఉన్న తవైఫ్‌లందరూ వచ్చారు. ఈ సభకు ప్రసిద్ధ తవైఫ్ హుస్నాబాయి అధ్యక్షత వహించారు.

హుస్నాబాయి ప్రసంగాన్ని గోస్వామి సుధాధర్ దేవ్ శర్మ రాసిన ' వారవధు వివేచన' పుస్తకంలో యథా తథంగా ప్రచురించారు. ఈ పుస్తకం 1929లో వెలువడింది. ఆమె ప్రసంగ సారాంశం –

"మందిర్ మే హై చాంద్ చమక్తా, మస్జిద్ మే మురలీ కీ తాన్ మక్కా హో చాహే బృందావన్, హోతే ఆపస్ మే కుర్బాన్"

(మందిరంలో వెలుగు తూన్న చందమామ, మసీదులో మురళీ గానం / మక్కా అవనివ్వండి, బృందావనం కానివ్వండి ఒకరినొకరు బలి తీసుకుంటారు) "ప్రియ సోదరీ మణులారా!" అని ప్రారంభించింది. ఆమె

ప్రసంగంలోని కొన్ని భాగాలు. ‘మనల్ని సంస్కృతంలో గణికలనీ, ఫారసిలో తవైఫ్‌లనీ, పరీలనీ పిలుస్తారు. అంటూ రంభ, ఊర్వశిలు కూడా మనవాళ్ళే అన్నారు. శకుంతల అప్సరసకు పుట్టినదే. ఆమెకు పుట్టిన భరతుడి పేరు ఈ దేశంలో స్వర్ణాక్షరాలతో లిఖించారు విద్య లేకపోవడం, ఈర్ష్యాద్వేషాలు, మద్యపానం, సంగీత సాహిత్యాలు మనలో తగ్గిపోవడం, నాట్యం చేయలేక పోవడం వల్ల మనం పతనమవుతున్నాం. దీనికి తోడు అశ్లీల పాటలు, డ్యాన్సులు మన గౌరవాన్ని మంట గలుపుతున్నాయి. ఇప్పుడు ప్రజలు దేశభక్తి పాటల వైపు చూస్తున్నారు. మనం కూడా దేశభక్తి పాటలతో, నృత్యాలతో కార్యక్రమాలు చేద్దాం. వీటివల్ల మనకు గౌరవం, ఆదాయం లభిస్తాయి. దీనివల్ల మనం ప్రగతి సాధిస్తాం. ఈ దేశభక్తి పాటల పుస్తకాలు కావాలంటే మీరు విధ్యాధరీబాయ్ నుండి తీసుకోండి. నేను ఈ రోజు నుండి విదేశీ వస్తువులు కొననని ప్రమాణం చేస్తున్నాను. మీరు కూడా విదేశీ వస్తువులు బహిష్కరించండి. హిందూస్తాన్ త్వరలోనే స్వాతంత్ర్యం పొందుతుంది....” ఆమె ప్రసంగం అక్కడున్న చాలా మందిలో స్ఫూర్తిని నింపింది. ఆమె మిగతా తవైఫ్‌లతో కలిసి విదేశీవస్తు బహిష్కరణ చేసారు. అలా తవైఫ్‌లకు సమాజంలో ఓ గౌరవస్థానం కల్పించడం కోసం కృషిచేసారు.

తవైఫ్‌ల సంగీత ఆకాశంలో వెలిగిన తార గౌహర్ జాన్. ఆమె 1873లో బెనారస్ దగ్గర ఆజామ్ గడ్ జిల్లాలో పుట్టారు. ఆరేళ్ల వయసులో తల్లితో కలిసి కలకత్తా వచ్చారు. ఎలినా పేరును గౌహర్ జాన్ గా మార్చుకున్నారు. కోటేలో ఉన్నప్పుడు 13 ఏళ్ల వయస్సులో లైంగిక శోషణనకు గురయ్యారు. బెనారస్‌లోని కబీర్ చౌరాహాలో ఉండి సంగీతం నేర్చుకున్నారు. అనతి కాలంలోనే ఆమె పాట దేశం నలుమూలలా వ్యాపించింది. ఆ కాలంలో అత్యంత ఖరీదైన గాయని ఆమె. ఫీజు తగ్గించమని ఆమెకు బ్రిటిష్ అధికారులు నోటీస్ ఇచ్చారు. 1902-20ల మధ్య ఈమె పాడిన 600 పాటలు 20 భాషల్లో రికార్డు అయ్యాయి. దేశంలో మొదటి గ్రామఫోన్ రికార్డింగ్ గౌహర్ జాన్ దే. స్వరాజ్యోద్యమానికి నిధులు సమీకరించాలని గాంధీజీ ఈమెను కోరారు. అందుకు ఆమె అంగీకరించారు. అయితే తన కచేరీలో గాంధీజీ కూర్చోవాలని షరతు పెట్టారు. ఆ కచేరీలో 24వేల రూపాయలు వచ్చాయి. అయితే గాంధీజీ రాలేదు. చందా తీసుకు రమ్మని గాంధీజీ మౌలానా షౌకత్ అలీని పంపారు. గాంధీజీ తన కార్యక్రమానికి రాలేనందుకు ఆమె కోపగించింది. వచ్చిన నిధులలో సగమే ఇచ్చి పంపింది. గౌహర్ జాన్ తవైఫ్ సంఘం స్థాపించారు. దాని ద్వారా స్వాతంత్ర్యోద్యమానికి సహకారాన్ని అందించారు. గౌహర్ సంపదను బంధువులు, భర్తలు దోచుకున్నారు. 1930లో జ్వరంతో చనిపోయారు. ఆమెను చూడ్డానికి ఎవరూ రాలేదు. ఆమెకు ఎప్పుడు, ఎవరు అంత్య క్రియలు చేసారో తెలీదు. అమీరుగా ఎదిగిన గాయని అనాథగా మరణించారు. స్వాతంత్ర్యోద్యమంలో కాశీలో హుస్నాబాయ్, విద్యాధరీ బాయ్, రాజేశ్వరీ బాయ్, గౌహర్ జాన్, టామీబాయ్ పాల్గొన్నారు. తవైఫుల గురించి తెలుసు కోవాలని దాల్మండికి వెళ్ళాను. అక్కడ ఎటు చూసినా కిరాణా దుకాణాలు. హోల్ సేల్. వ్యాపారులు హడావిడిగా తిరుగుతున్నారు. ఒక వ్యాపారిని అడిగాను. లోపలి సందులోకి వెళ్ళమన్నాడు. అక్కడ ఒక ముసలామె కన్పించింది. అడిగాను. ఆమె బరువుగా నవ్వింది. శిధిలాలు మిగిలాయి. చూడు అంది. ఇప్పుడు తవైఫులు నగరంలో ఎక్కడా లేరా? అనడిగాను. అస్తమించిన సూర్యుణ్ణి చూపింది. ‘ఉమ్రావ్ జాన్’ సినీమా తీసిన ముజఫర్ అలీ మాటలు గుర్తొచ్చాయి. “ ఇప్పుడు వాళ్ళు సినిమాల్లో దొరుకుతారు”. ‘దేవదాస్, ప్యాసా, జిందగీ యా తూఫాన్, పాకీజా, గోమతీ కే కినారే, ఉమ్రావ్ జాన్, తవైఫ్, పతి పత్నీ ఔర్ తవైఫ్, కలంక్ ‘ వంటి సినిమాల్లో తవైఫుల సంగీత ప్రభావాన్ని చూడొచ్చు.

నైరాశ్యపు చీకటిముసుగున దాగిన జాతి రత్నాలు వీరు. పాడుబడిన కోటే బ్రతుకుల వెతలనుండి వెలుగులు పూయించిన జ్యోతులు వీరు. స్వాతంత్ర్యోత్సవ దీపావళిలో ఈ దీపాల స్థానం ఎక్కడ? తవైఫుల జీవితాలు చీకట్లో. వాళ్ళ ప్రదర్శనలు వెలుగులో. ఆ వెలుగులో తమ ఇళ్లను చక్కదిద్దుకున్న వారెందరో. గౌరవం వాళ్లకు ఆమడ దూరంలో. కానీ దేశగౌరవం నిలపడానికి వాళ్లెప్పుడూ ముందంజలో. స్వాతంత్ర్య సమరంలో వాళ్ళు చేయిచేయి కలిపి నడిచారు. కానీ చరిత్ర రాసిన చేతులు ఎందుకో వాళ్ళను మరిచాయి. వాళ్ళలో రసికశక్తినే అందరూ చూసారు. కానీ వాళ్ళ దేశభక్తి ఏ గుర్తింపుకూ నోచుకోలేదు. తప్పు సమాజానిదా? వాళ్ళ పుట్టుకదా? అలోచించండి.

డా. కిల్లాడ సత్యన్నారాయణ
ఫోన్ : 8333987838



# గాంధీ
# వైరుధ్యాలతో సహజీవనం

– అవధానం రఘుకుమార్

వాల్ట్ విట్ మాన్ అనే అమెరికన్ కవి ఒక కవిత లో ఇలా అంటాడు:

"నన్ను నేను వ్యతిరేకిస్తున్నానా?
అవును! నన్ను నేను వ్యతిరేకిస్తున్నాను!
నా అస్తిత్వం విశాలం,
నాలో అనేక విషయాలను పొందుపరచుకున్నాను."

సాంగ్ ఆఫ్ మై సెల్ఫ్ అనేక విషయాలను, అవసరం అయితే ఒకటికొకటి పొసగని ఆలోచనలను, ఆచరణలను నెత్తిన వేసుకుని, అన్నింటిలో ఓ సమన్వయం, అనంత సత్యం దాగి వుంది, వ్యతిరేకాలు బాహ్యమే అంతటా అన్నిటా వున్నది ఆ హరి పుండరీకాక్షుడే, అని నమ్ముతూ, వెతుక్కుంటూ, ఓడిపోతూ, గెలుస్తూ, పడిపోతూ.. కొన్ని జీవితాల కథలు. ఇంత శ్రమ ఎందుకు పడుతున్నావు, ఏమిటి నీ వేదన, ఎవరికి కావాలి నీ శోధన అంటే ఎవరైనా జవాబు ఇవ్వగలరా? చైతన్యంతో నిండి, అద్భుతమైన కాంతితో, ముఖంపై ప్రశాంతమైన ఓ చిరునవ్వుతో తన్మయత్వంలో వున్న సిద్ధార్థుడు ఏమీ చెప్పగలడు? శరీరపు ఒక్కొక్క భాగాన్ని చీల్చుకుంటూ వెళుతోన్న మేకుల్ని, పెనవేసుకుంటూన్న శిలువని, ధారగా కారుతోన్న రక్తాన్ని చూస్తూ – "నా నిమిత్తము ఎడవకుడి: మీ నిమిత్తమును మీ పిల్లల నిమిత్తమును ఏడువుడి" అన్న జీసస్ ఏమని జవాబిస్తాడు? మరో వైపు – చుట్టూ చీకటి వుంది. చుట్టూ అంతులేని వేదన వుంది. ఎంతో మంది బలహీనులు, నిరాశ్రయులు, ఆకలి, దోపిడి... ఎందుకు? ఏమిటి? ఎలా? అన్న ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కుంటూ, తెలిసో, తెలియకో, తప్పో, ఒప్పో, .. జరిగిన ప్రయత్నాలు చరిత్రలో కొంత మంది ఆశావాదులు, భావకులు, స్వాప్నికులు చేశారు. చాలా వరకు విఫలం అయ్యారు. అవుతారు కూడా! ఎందుకంటే అలాంటి ప్రశ్నలకు ఏ ఒక్క సమాధానం లేదు. అవి ఒక్క ప్రయత్నంలో పరిష్కరించుకునేవి కూడా కాదు. భౌతిక ప్రపంచంలో ఇన్ని ప్రశ్నలు నన్ను వేధిస్తూ వుంటే నీవు అన్నీ వదిలేసి తపస్సులో, ధ్యానంలో విముక్తుడవై, మోక్షం పొందూ అంటే ఒప్పుకోని, పరిస్థితులకి ఎదురొడ్డిన వారెందరో?

అయితే చరిత్రలో ఎప్పుడైనా ఒక వ్యక్తి తన ముందు వారు చేసిన అన్నీ ప్రయత్నాలనూ సమన్వయం చేస్తాను, లేదా ప్రయత్నం చేస్తాను అన్నా అది ఆ వ్యక్తికి తలకు మించిన భారం కావచ్చును. అసలు కొన్ని వ్యతిరేకతలకు సమన్వయం కుదరదు. హింసా, అహింసా సత్యం, అసత్యం, కోర్కెలు, సన్యసించడం.. ఇలాంటి వాటి మధ్య సమన్వయం వుంటుందా? ఇలాంటి సమన్వయం ఒక్కోసారి ప్రాకృతిక నియమాలకే విరుద్ధం కావచ్చును. అయినా ప్రతి కొన్ని శతాబ్దాలకు మరో ప్రయత్నం, మరో వైఫల్యం. తాను కడుతూన్న గూడు నిలబడం లేదు అని తెలిసీ ఒక సాలీడే అంతా అవిశ్రాంత ప్రయత్నం చేస్తుంటే ఇక మనిషి ఎందుకు ప్రయత్నం విరమిస్తాడు. ముందే వేల ఏళ్ల తన ప్రయత్నంలో, సంఘర్షణలో అనేక ప్రకృతి శక్తులు విసరిన సవాళ్ళు ఎదుర్కొని నిలబడ్డ వాడు నరుడు! ప్రకృతి శక్తులను ప్రశ్నించి, నిలచి, జయించిన నరుడు! తన చుట్టూ వున్న అత్యంత బలమైన జీవాల మధ్య బ్రతికి బట్టకట్టే అవకాశం లేని నరుడు! నరుని ప్రాకృతిక స్వభావమే స్థిరత్వం లేక పోవడం. స్థిరత్వం స్వభావరీత్యా సత్యాన్ని అన్వేషించడంలో పెద్ద అవరోధం. అప్పటికే కనుక్కున్నది పరమ సత్యం అయితే ఇక ఆ తరువాత కనుక్కునేది ఏమీ ఉండదు! మిత్రులూ, శత్రువులూ, అనుయాయులూ, విమర్శకులూ .. అందరూ గాంధీ పై ఒక సాధారణ

ఆరోపణ చేసేవారు. మీలో "స్థిరత్వం" లేదూ అని. అంటే మీరు గతంలో చెప్పిన అభిప్రాయాలకు విరుద్ధంగా తరువాతి కాలంలో చాలాసార్లు మాట్లాడారు, ప్రవర్తించారు అని. మిత్రులూ, అనుయాయులు ఈ వైరుధ్యాలను గమనిస్తూ, ఏమీ అనలేక, అలాగని ఎదురించ లేక గొణుక్కుంటూ కలసి పనిచేసే వారు. శత్రువులూ, విమర్శకులూ ఆ వైరుధ్యాలను వాడుకుని ఆయనను బాగానే ఇబ్బంది పెట్టేవారు. ఒకసారి అలాంటి ఆరోపణలకు జవాబు ఇస్తూ గాంధీ సెప్టెంబర్ 28, 1934 నాటి "హరిజన్" పత్రికలో ఇలా రాశారు.–"ఈ "స్థిరత్వం" అనే భావన నాకెప్పుడూ ఆరాధ్యనీయం కాదు. నేను సత్యాన్వేషిని. గతంలో ఆ విషయంపై ఏమి చెప్పాను అనే దాంతో సంబంధం లేకుండా, ఆ క్షణాన నేను ఏమి అనుకుంటున్నాను, భావిస్తున్నాను అనేది చెప్పాలి. నా దృష్టి ప్రస్ఫుటం అయ్యే కొలదీ, నా దైనిక ఆచరణతో పాటు నా ఆలోచనలూ మరింత స్పష్టతతో పరిఢవిల్లాలి."

అందుకే గాంధీ లాంటి వ్యక్తులు నిరంతరం తమ అభిప్రాయాలని మార్చుకుంటూ పోయారు. చాలా మంది తెలిసో, తెలియకో చిన్నప్పుడు స్కూల్ లోనో, యవ్వనంలో కాలేజీలోనో, విశ్వవిద్యాలయాలలోనో నేర్చుకున్న విషయాలని పరమ పవిత్రంగా భావిస్తారు. జీవితానుభవం మన జ్ఞానం తప్పు అని చెబుతూన్నా తమ అనుభవాలను, ఆచరణను అనుమానిస్తారే కానీ జ్ఞానాన్ని కాదు. గాంధీ అనుభవానికి ఎక్కువ విలువ ఇవ్వడం వల్ల, అనుభవాలు నిరంతరం కొత్త పాఠాలు నేర్పడం వల్ల ఏ ఒక్క జ్ఞానానికి విశిష్ట స్థాయిని ఇవ్వలేదు. అనుభవాల ఆధారంగా తన ప్రతిపాదనలను సవరించు కుంటూ పోయాడు.

మనలో చాలా మందిమి స్థిరమైన ఆలోచనలూ, అభిప్రాయాలూ, ఆచరణ కలిగి వుండడం ఒక మనిషి జీవితంలో ఉన్నతమైన విలువగా భావిస్తాం. ముఖ్యంగా భారతీయ తత్త్వ చింతనలో "సత్యం" "సత్య దర్శనం" అనేవి ప్రధాన అంశాలు. సనాతనత్వం మారని, శాశ్వత విలువలపై ఆధార పడ్డ తాత్వికత. అందులో నిజం లేదు అనగలమా? కానీ మరో కోణం నుండి ఆలోచిస్తే అలాంటి స్థిరమైన ఆలోచనలూ, ఆచారణలూ ప్రగతికి, అభివృద్ధికీ ప్రతిబంధకాలు కూడా. చలన శీలత సామాజిక, చారిత్రక సత్యం. బుద్ధుడు అదే అన్నాడుగా. ఈ విశ్వం నిరంతర చలనశీలత్వం కలిగి వుంది అనే కదా బుద్ధ తాత్వికతలో ప్రధాన ప్రాతిపదిక? అదే కదా 'సనాతనత్వం' అనే ఆలోచనను ప్రశ్నించిన అంశం? గ్రీకు తత్వ శాస్త్రం లోనూ, ఓ రకంగా చెప్పాలంటే ప్రపంచంలోని అన్నీ ప్రముఖ తత్వ శాస్త్రాలలోనూ ఇదే ప్రధానమైన చర్చ. గ్రీకు తత్వ శాస్త్రంలో హీరాక్లీటస్ – పెర్మనైడ్స్ చర్చ అదే కదా? అయితే ఈ మార్పులేని సత్యాలు, నిరంతరం మారిపోయే సత్యాలు అనేవి ఫిలాసఫీలో అపరిష్కృత సమస్యలా?

కానీ గాంధీ విషయంలో సమస్య అక్కడ లేదు. గాంధీ తనని తాను "సనాతన" అని ప్రకటించుకున్నాడే? మరి గాంధీ సనాతనుడా? శాశ్వత విలువలను, శాశ్వత సత్యాలను ప్రశ్నించే, నిరంతర మార్పుకు అవకాశం వుందీ అని ఒప్పుకునే బౌద్ధుడా? భగవద్గీతకు తనదైన వ్యాఖ్యానం రాస్తూ, "జ్ఞానులు శాస్త్రాల నుండి తమకు తోచిన గంభీరమైన అర్థాలను తీసుకుని, తమను తాము తృప్తి పరచు కోవచ్చును. కానీ వారి నిజ జీవితంలో ఆ సత్యాలను ఆచరణలోకి తెచ్చిన వారే శాస్త్రాలకున్న నిజమైన అర్థాలను వివరించగలరు." అంటాడు. అలా అనడమే కాదు. నా అహింసకు భగవద్ గీతే ఆధారం అని కూడా అంటాడు. ఏ ఇతర సాంప్రదాయ సనాతన ఆచార్యుడు గీత కి ఇలాంటి వివరణ ఒప్పుకుంటాడా? ఒక వైపు కృష్ణుడు అర్జునుడిని యుద్ధోన్ముఖుడిని కమ్మని, ఆయుధం చేతిలోకి తీసుకుని శత్రు సంహారం చేయి, యుద్ధ భూమిలో తనా, మనా అంటూ ఏమీ లేదు అంటుంటే ఈయనకు అందులో తన అహింస సిద్ధాంతానికి బలం దొరకడం సమస్యాత్మకమే కదా? నిజానికి ఈ రోజు అనేక హిందూ సాంప్రదాయ సంఘాలూ, ఆచార్యులు గాంధీని ప్రశ్నించేది ఈ విషయంలోనే.

నిజానికి గాంధీ ఇలాంటి ప్రశ్నలను ఎదుర్కొంది, తన గురువులు చెప్పింది తిరస్కరించి స్వంత సత్యాలను వెదుక్కుంది మొదటి సారి కాదు. ఈ కథ 1888లో మొదలయ్యింది. తాను న్యాయశాస్త్రం చదువుకునేందుకు ఇంగ్లండ్ వెళ్లేందుకు చాలా కష్టబడి అమ్మను ఒప్పించాక, ఒక కొత్త సమస్య వస్తుంది. తన మోధ్ కుల వైశ్యులు ఒక కుల పరిషత్ పెట్టి, కుల ఆచారాల ప్రకారం ఎవ్వరూ సముద్ర ప్రయాణం చేయకూడదు అన్న విషయాన్ని ప్రస్తావిస్తూ గాంధీ విదేశీ ప్రయాణానికి అనుమతి నిరాకరిస్తారు. గాంధీ ఎదురిస్తాడు. "నీవు కుల పెద్దల ఆజ్ఞను ధిక్కరిస్తావా?" అని హూంకరిస్తారు ఆ పెద్దలు. అప్పుడు గాంధీ జవాబు ఏమిటి? ఒక వ్యక్తి తన విద్యా, వృత్తుల విషయంపై తీసుకునే నిర్ణయాలను నియంత్రించే హక్కు కుల పరిషత్తులకు లేదు అంటాడు. అయితే నీవు కుల భ్రష్టుడివి, నిన్ను కుల బహిష్కరణ చేస్తున్నాం అని కుల పరిషద్ తీర్మానిస్తుంది. అలా కుల బహిష్కారం అయిన ఈ పంతొమ్మిది ఏళ్ల కుర్రాడు సనాతనుడేనా?

ఒక బారిస్టరుగా స్వదేశం తిరిగి వచ్చి ఈయన చదువుకోసం చేసిన అప్పులతో, ఇతర కారణాల వల్ల కుదేలయిన ఇంటికీ, అన్నయ్యకు ఉపయోగ పడతాడు అనుకుంటే, న్యాయవాదిగా కోర్టులలో నోరు పెగలక, కాళ్ళు వణికి, గొంతు తడారిపోయి, బొంబాయి హైకోర్టు నుండి, రాజ్కోట్ జిల్లా కోర్టు, అక్కడ నుండి మునిసిఫ్ కోర్ట్ లకు పారిపోయి, అక్కడ కూడా లాభం లేక, ఎవరో ఒక వ్యాపారి ఒక చిన్న క్లర్క్ ఉద్యోగం ఇస్తే బ్రతుకు జీవుడా అని, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సౌత్ ఆఫ్రికా చేరుకున్న ఈ అసమర్థుని జీవనయానంలో అక్కడ జరిగిన కొన్ని అనుభవాలు అనేక ప్రశ్నలు లేవనెత్తుతాయి. "మనుటయా? మానుటయా? మాని సాధించునది?" లాంటి హ్యాంలెట్, దుర్యోధన, అర్జున ప్రశ్నలు చుట్టు ముట్టుతాయి. ముంబాయిలో గాంధీ న్యాయవాదిగా ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆ సమయంలోనే ఆయనకు రాయ్ చంద్ అనే ఒక వజ్రాల వ్యాపారి, జైన మత పండితుడితో పరిచయం అవుతుంది. ఆయనను తన తొలి ఆధ్యాత్మిక గురువుగా భావిస్తాడు. ఇప్పుడు సౌత్ ఆఫ్రికాలో తన ఆస్తి నాస్తి విచికిత్సకు అతనే సమాధానం చెప్పగలడు అనే విశ్వాసంతో 1894 లో రాయ్‌చంద్ భాయికి 27 ప్రశ్నలతో కూడిన ఉత్తరం రాస్తాడు. అందులో దాదాపు ఐదు ప్రశ్నలు "మోక్షం" అనే పదానికి సంబంధించినవి. అందులో నాల్గవ ప్రశ్న: పురుషార్థాలు అంటే ఏమిటి? అని. అంటే ఒక ఆదర్శ పురుషుని జీవిత ఉద్దేశ్యాలు ఏమిటి?

రాయ్ చంద్ అన్ని ప్రశ్నలకు ఓపిగ్గా జవాబులు ఇస్తూ, మోక్ష అంటే "అవిద్య"ను (అంటే సనాతన తాత్వికతలో భౌతిక విద్య) అధిగమించి, ఈ భౌతిక ప్రపంచపు బంధనాలను తెంచుకుని ఆత్మ విముక్తి చెందడం అని వివరిస్తాడు. అయితే గాంధీ అవిద్యను అధిగమించడం వరకూ అంగీకరిస్తూనే, భౌతిక ప్రపంచం నుండి దూరం తొలగడం అనే ప్రతిపాదనను ఒప్పుకోడు. నిజానికి గురువు చెప్పిన దానికి వ్యతిరేకంగా తరువాతి కాలంలో మరింతగా భౌతిక జీవితపు సుడులలోకి, ముఖ్యంగా అన్ని ఆధ్యాత్మికతల ఆలోచనలకు ఇబ్బందికరమైన దైనందిన "రాజకీయాల" లోకి పూర్తిగా దిగిపోతాడు. ఇది గురువు రాయ్ చంద్ భాయిని, అప్పటిదాకా ఆయన గురించి తెలిసిన బంధు, మిత్రులను కూడా విస్మయానికి గురిచేస్తుంది. అలా ఎలా జరిగింది? ఈ వైష్ణవ, జైన, వైశ్య సనాతనుడి మనస్సులో ఏ వ్యతిరేకాలు పనిచేశాయి? ఎందుకు ఈ సనాతనుడు ఇలా భౌతిక ప్రపంచంలోకి, అది కూడా రాజకీయాలలోకి దూకేశాడు?

ఈ ప్రశ్న ఆ నాటి నుండి ఆయన చనిపోయే దాకా, ఆ తరువాత కూడా ఎంతో మందిని వేధించింది. గాంధీ ఇండియా వచ్చేసి స్వాతంత్ర్య ఉద్యమంలో తల మునకలు అవుతూన్నప్పుడు కూడా ఈ ప్రశ్నలు ఆయన్ని వదల లేదు. 1920 లో లండన్ నుంచి వచ్చే "ఈస్ట్ అండ్ వెస్ట్" అనే పత్రిక, ఏప్రిల్ సంచికలో ఒక క్రైస్తవ మిషనరీ కూడా ఒక ఉత్తరం ద్వారా అదే ప్రశ్న వేస్తాడు. "నీవు సన్యాసివా? రాజకీయ నాయకుడివా? ముముక్షువువై మాకు మార్గదర్శనం చేస్తావనుకుంటే రాజకీయాలలో చేరి బ్రిటిష్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ మీ దేశానికి స్వాతంత్ర్యం కావాలి అంటావేమిటి? ఏసుక్రీస్తు లాగా, బుద్ధుడిలాగా, మనం మరింత విస్తృతమైన విశ్వ ప్రాతిపదికన పనిచేసి, ప్రపంచానికి మరింత ఉన్నతమైన మార్గాన్ని సూచించాలి కదా?" ఆ ఉత్తరాన్ని ముద్రిస్తూ గాంధీ తన "యంగ్ ఇండియా" 12.05.1920వ సంచికలో ఇలా రాస్తాడు: "యథా పిండే తథా బ్రహ్మండే." శరీరం లాగే, విశ్వం కూడా! ఈ మాట ఎవరో ఒక తెలియని మహర్షి అన్నాడు. ఈ మాట ఆ నాడు ఎంత వాస్తవమో, ఈనాడు కూడా అంటే వాస్తవం. నేను నా చుట్టూ వున్న సమూహంతో మమేకం కాకుండా ఈ విశ్వంతో మమేకం కాలేను. మనం మన శరీరం, మనం, మన చుట్టూతా వున్న పొరుగువారు .. ఇలా విస్తృత వలయాలుగా మాత్రమే, అవి సరైన దిశలో ఎదగడం తోనే ఆ చివరి వలయం విశ్వంతో ఏకీభావం చెందుతుంది." ఎంత పెద్ద వైరుధ్యం? మోక్షం కోరుకునే వాడు తన చుట్టూ వున్న సమాజంతో కలిసి వుండడం ఏమిటి?

నిజానికి దాదాపు అదే సమయంలో ఇలాంటి ప్రశ్నే బాల గంగాధర్ తిలక్ కూడా ఒకసారి గాంధీపై సంధిస్తాడు. సాధువులకు రాజకీయాలతో ఏమి పనీ? రాజకీయాలు ప్రాపంచీకమైన మనుషుల వ్యవహారం కదా, ఇక్కడ చెడుని చెడుతోనే ఎదుర్కోవాలి అంటే ఈ అహింసా, సత్యం లాంటి మాటలు రాజకీయాలలో కుదరవు అన్న అర్థంలో అని విసుక్కుంటూ అడుగుతాడు. గాంధీ దానికి జవాబు ఇస్తూ సాధువులను రాజకీయాల నుండి దూరంగా వుంచడం అంటే వారిని సోమరిపోతులను చేయడం అంటూ, ఇలాంటి మార్గం రాజకీయాలను కలుషితం చేస్తుంది అంటాడు. రాజకీయాలు ఆధ్యాత్మిక విషయాలకు దూరం అవ్వడం అంటే రాజకీయాలలో నైతిక విలువలు అక్కర లేదు అనడం అంటాడు. గాంధీ ఇంకో మాట కూడా అంటాడు: "అన్ని మతాల సారాంశం మానవుడికి

పురుషార్థాలు నిర్దేశించడమే. పురుషార్థ అంతిమ ధ్యేయం మోక్షగామిగా జీవించడం. అంటే అన్ని విధాలుగా ఉత్తమ మానవుడిగా జీవించడం." గాంధీ రచనా సర్వస్వం, 16: 490–91 ఈ భాష్యం, ఈ టిప్పణి ఏ సనాతనం?

ఇక్కడ మనం గాంధీ చెబుతూన్న మరో మాటను గమనించాలి. రాజకీయాలను గాంధీ పురుషార్థాలలో భాగం అంటున్నాడు! విచిత్రంగా వుంది కదా ఈ సనాతుడి వ్యవహారం? సనాతన జీవన విధానంలో ఒక ఉత్తమ పురుషుడు ధర్మ, అర్థ, కామ, మోక్షాలు అనే పురుషార్థాలు కలిగి, సంపూర్ణమైన జీవిత కాలచక్రపు నాలుగు ఆశ్రమ ధర్మాలు – బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస – అనుభవించాలి. కానీ కాల చక్రం తన నియమాలతో గిర్రున తిరుగుతూనే వుంది. అనేక నూతన అనుభవాల మధ్య భారత దేశం పంతొమ్మిదవ శతాబ్దంలోకి ఉలిక్కిపడి లేచింది. ఆ నాటి అద్భుత గ్రామీణ జీవితం, పశువుల మధ్య, అడవుల మధ్య, నదుల ఒడ్డున అర్ధనిమీలిత నేత్రాలతో హాయిగా ధ్యానం లోనో, తపస్సులోనో వుండి పోదాం అంటే కుదిరే రోజులు కావివి. అన్నింటిని మించి యాంత్రిక నాగరికత, ఆధునిక రాజ్యాలు, సైన్యం, విదేశీ ప్రభువులు, అధికార గణం, కోర్టులు .. మరి ఈ ఆధునిక కాలంలో ఆ పురుషార్థాలను, ఆశ్రమ ధర్మాలను ఎలా అర్థం చేసుకోవాలి? అవి సనాతన విలువలు కనుక వాటిని అలాగే వుంచేయాలా? లేదా పునర్ నిర్వచించుకోవాలా? ఆశ్రమ ధర్మాలు ఎలా నిర్వర్తించాలో ఆధునిక కాలంలోనూ కొంత అర్థం చేసుకోవచ్చును. కానీ వీటిని పురుషార్థాలతో ఎలా సమన్వయించుకోవాలి? ఇది యౌవ్వనం నుండి చివరి శ్వాస దాకా గాంధీని నిరంతరం వెంటాడిన ప్రశ్నలు.

ఇంతకీ ఆధునిక మానవుడి సమస్యలేమిటి? అతని పురుషార్థాలు ఏమిటి? అతని ఆదర్శ ఆశ్రమ జీవనం ఎలా వుండాలి? ఈ ప్రశ్నలకి గాంధీ చెప్పిన సమాధానాలు ఏమిటి? దానికి ముందు భారతీయ జీవన విధానంలోని ఈ విషయాలు మనం గుర్తు పెట్టుకోవాలి. కామన్ ఏరా (సి. ఇ) ఎనిమిదవ శతాబ్దానికి ముందు భారతదేశంలో ఋషులు, సాధువులు వారి, వారి ప్రాంత రాజకీయ జీవితంతో నిత్య సంబంధం కలిగి వున్న వాళ్ళే. కొంత మంది రాజు ఆస్థానంలోనే వుండి సలహాలు, సంప్రదింపులలో భాగస్వామ్యం అయితే, కొంత మంది రాజధానికి సమీప ప్రాంతాలలో ఆశ్రమాలలో వుంటూ రాజ కుమారులకు విద్య, రాజుకి సలహాలూ ఇచ్చిన వారే. ఎప్పుడు రాజ్యం సంక్షోభంలో వున్నా విశ్వ విద్యాలయాలలో ఆచార్యులుగా వున్న వారైనా సమాజం లోకి వచ్చి ఆ సమస్యలు పరిష్కరించి, తిరిగి విద్యాలయాలకు వెళ్ళి పోయిన వారే. కౌటిల్యుడు దీనికి చక్కని ఉదాహరణే. సన్యసించి, పూర్తిగా సమాజానికి దూరంగా వుంటూ, రాజకీయాలకు అతీతంగా మఠాలలో సాత్విక జీవనం గడిపిన వారు, దేశం, సమాజం ఎటు పోయినా నేనూ నా వ్యక్తిగత మోక్షం కోసం ముక్కు మూసుకిని తపస్సు చేసుకుంటాను అనే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది ఎనిమిది, తొమ్మిదవ శతాబ్దాల తరువాతే.

దాదాపు తొమ్మిది, పది శతాబ్దాల తరువాత విదేశీ దాడులు తీవ్రం అయ్యాయి. ఈ సుదీర్ఘ విదేశీ ప్రభుత్వాల క్రింద జీవించి పంతొమ్మిదవ శతాబ్దం నాటికి తాము ఏమిటి, తమ పూర్వ జీవన విధానం ఏమిటి అన్న స్పృహ కోల్పోయిన ఈ దేశం తిరిగి రాజా రామ్మోహన రాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, వివేకానందా తదితరులు వెలిగించిన సాంస్కృతిక పునరుజ్జీవనంతో కొత్త అన్వేషణ ప్రారంభం అయ్యింది. కొందరు గతం మహోన్నతం అంటే, కొందరు గతం మొత్తం అంధకారం అంటున్నారు. కానీ పాత విలువలను ఈ ఆధునిక నాగరికతతో సమన్వయించడం ఎలా, పాశ్చాత్య నాగరికత, రాజనీతిజ్ఞతల నేపథ్యంలో మనదైన కొత్త నాగరికత, రాజకీయ జీవన విధానం ఏమిటి అన్న ప్రశ్నలను తీసుకుని గాంధీ చేసిన ప్రయత్నం చాలా మందికి అర్థం కాలేదు. అందుకే ఆధునికులు అతన్ని సాంప్రదాయ వాది అని విసుక్కుంటే, సాంప్రదాయ వాదులు ఇతను మా విధ్వంసకుడు అనుకున్నారు. భారతీయ వైభవాన్ని తిరిగి తీసుకరావడం అంటే మానవ పరిణామ క్రమంలో కాలం చెల్లిన ఆలోచనలను పునరుద్ధరించడం కాదు. అలాగనే ఆధునికతను ఆహ్వానించడం అంటే ఒక జాతి తన గతాన్ని అసహ్యించుకోడం, పరిత్యజించడం కూడా కాదు. గతాన్ని, వర్తమానంతో అనుసంధానించడం. అందువల్ల ఆధునిక జీవితంలోకి బలంగా ప్రవేశించిన ఆధునిక రాజ్యం, ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రభుత్వం, స్వతంత్ర న్యాయ వ్యవస్థ, తనదైన విశిష్టమైన ఆర్థిక విధానం, విద్యావ్యవస్థ.. ఇలా ఎన్నింటినో మన సాంస్కృతిక వారసత్వాన్ని దృష్టిలో వుంచుకుని పునర్నిర్వచించాలి. సన్యాస, మఠ జీవితాలు రాజకీయాలని, ఆర్థిక శాస్త్రాన్ని విస్మరించాయి. గాంధీ పురుషార్థాల లోని "అర్థ" ఆధారంగా వాటిని తిరిగి కేంద్ర కక్ష్యలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తాడు. ఈ ప్రయత్నంలో భాగంగానే భవిష్యత్తులో భారత దేశానికి కావలసిన ఆర్థిక వ్యవస్థపై చర్చను మొదలుపెడతాడు. "అర్థ" అనేది వ్యక్తి, సమాజ జీవితానికి అవసరం, అది ఒక సగుణాత్మక విలువ అంటాడు. అదేమీ ఈసడించుకో తగ్గ విషయం కాదు.

ఇవి అర్థం కావాలి అంటే ఆధునిక పౌర సమాజం అర్థం కావాలి. అంటే "దేశం" "దేశీయత"లపై కొన్ని ఆలోచనలు చేయాలి. ఆ నాటి పాశ్చాత్య, ప్రాచ్య మేధావుల చర్చ "దేశం" అంటే సారూప్య జాతి, లేదా ఒకే మతం ఆచరించే సమూహం, ఒక భౌగోళిక నిర్దేశిత భూభాగం అని సాగుతోంది. కానీ అది ఈ దేశపు సనాతన ఆలోచన కాదు. అందువల్ల ఇలా జరుగుతున్న చర్చలో గాంధీ ఈ దేశపు సాంప్రదాయ తాత్వికత ఆధారంగా దేశం, జాతీయత అంటే "ప్రజా" అంటాడు. అంటే దేశ, జాతీయ నిర్వచనాలు ప్రజల ఆధారంగా నిర్వచించబడాలి, జాతి, మతం ఆధారంగా కాదు అంటాడు. మరి "ధర్మ" అంటే? గాంధీ ఈ మాటను కర్తవ్యం, మతం, నైతిక విలువలు అన్న మూడు భావనల సంయుక్త రూపంలో వాడతాడు. వ్యక్తికి-వ్యక్తికి, వ్యక్తికి- సమూహానికి, సమూహానికి- సమూహానికి, సంబంధాలను నిర్వచించే విలువగా ధర్మాన్ని వాడుతాడు. ఆ ప్రయాణంలో అంతిమంగా మనిషిని ఈ భౌతిక ప్రపంచపు బంధనాల ఆవలికి చేర్చే సాధనంగా ధర్మాని ఉపయోగిస్తాడు. ఆయితే ఈ "ధర్మ" అనే పదము చారిత్రికంగా ఈ దేశంలో వర్ణ, కుల వ్యవస్థలకు, తద్వారా ఒక భయంకరమైన, క్రూరమైన వివక్షకు కారణం అయ్యిందన్న విషయం అంగీకరిస్తూ, అహింసా, మానవ హక్కుల ఆధారంగా ఈ ధర్మాన్ని నిర్వచిస్తాడు.

మరి "కామ" అనే పురుషార్థాన్ని ఆధునికతతో ఎలా అనుసంధానం చేయడం? ఇక్కడే గాంధీ దీన్ని రెండు విభిన్న వ్యక్తీకరణలుగా చూస్తాడు. ఒకటి వ్యక్తి జీవితంలో బ్రహ్మచర్యం, శృంగారంలకు స్థానం ఇవ్వడం. రెండు మనిషిలోని మరో కోణమైన సౌందర్య ఆరాధన, కళలు, సమాజంతో వీటిని అనుసంధానం చేయడం. ఇందులో గాంధీ స్పృశించిన మరో అంశం: భారతీయ తత్వ చింతనలో కామం కేవలం స్త్రీ-పురుష సంబంధంగా ఎప్పుడూ లేదని, ఆ భూతిక, లౌకిక విలువలను అధిగమించి భక్తిగా, ఆరాధనగా, ఆశ్రయంగా భగవంతుని చేరడం అనే రూపంలోనూ వ్యక్తం అయ్యిందని గమనిస్తాడు. భక్తి కవులు ఈ శృంగారభావనను భగవంతుని ఆరాధనగా రూపాంతరం చేసే క్రమంలో వారిలోని అనేక భౌతిక వాంఛలు వున్నతమైన విలువలుగా పరిణామం చెందుతాయి. ఈ తన్మయత్వంతో కూడిన సమర్పణ భగవంతుడిని భర్తగా, ప్రియుడిగా, రక్షకుడిగా .. మార్చుకున్న తీరు గాంధీకి ప్రేరణ. అందుకే "ఒకటికంటే ఎక్కువగా వుండడం" అనేది గాంధీని అతి దగ్గరగా వర్ణించే వాక్యం అంటాడు ఆంథోనీ పేరెల్ అనే ఒక చరిత్రకారుడు తన "గాంధీస్ ఫిలాసఫీ అండ్ ది క్వెస్ట్ ఫర్ హార్మోనీ" అనే పుస్తకంలో. "పరస్పరం సంఘర్షించుకునే శక్తుల మధ్య చరిత్ర పుట్టింది" అని ఒక ఆధునిక తత్వ శాస్త్రం చెబితే నిజంగా అవి సంఘర్షించు కుంటున్నాయా లేక వాటి మధ్య అద్భుతమైన సమన్వయం వుందా అని వెతకడం గాంధీ తాత్వికత. అయితే భారతీయ వేదాంతి అనగానే కాషాయ వస్త్రాలు ధరించి, సమాజాన్ని త్యజించిన సన్యాసి కాదు గాంధీ ఊహాలలోని ఆధునిక సనాతన వేదాంతి. ఎవరయితే సమాజపు అన్ని సమస్యలను పట్టించుకొని, ముఖ్యంగా బాలహీనుడి తరఫున నిలబడతాడో అతను ఆధునిక వేదాంతి, సాధువు. ఎవరైతే తన చుట్టూ వున్న ఆధో జగత్ సహోదారుల, దరిద్ర నారాయణుల ఉన్నతికి నిలబడతాడో అతను ఆధునిక సన్యాసి, ఆధ్యాత్మిక గురువు. ఎవరాయితే తన మోక్షం సమాజపు సామూహిక మోక్షంతో ముడిపడి వుంది అని తెలుసుకుంటాడో అతనే ముముక్షువు.

ఇలా గాంధీ తన పంతొమ్మిది ఏళ్ల వయసునుండి చేసిన ప్రధాన ప్రయోగం ఏమిటంటే -అనేకానేక, పరస్పర విరుద్ధ, సనాతన - అధునాతన, ప్రాక్ - పశ్చిమ సత్యాలను సమన్వయం చేయడం. మతం అంటే ఏమిటి? ధర్మం అంటే ఏమిటి? లౌకిక, ఆధ్యాత్మికతల మధ్య సంబంధం ఏమిటి? సన్యసించడం అంటే ఏమిటి? మోక్షం అంటే ఏమిటి? మోక్షం వ్యక్తిగతమా? సామూహికమా? ఏది సత్యం? సత్యాన్ని కనుక్కోడానికి మార్గం ఏమిటి? మార్గానికి, అంతిమ లక్ష్యానికి వున్న సంబంధం ఏమిటి? సనాతనం అంటే ఏమిటి? ఆధునికం అంటే ఏమిటి? ఏకం సత్? అనేకానేకమా? ఈ ఆధునిక సమాజపు సమస్యలకు సనాతన ప్రతిపాదనలను ఎలా వర్తింప చేయాలి? సత్యాన్ని ఆవిష్కరించే, నిలబెట్టే, ముందుకు తీలుకెళ్ళ గలిగె మాధ్యమం ఏమిటి? ఎప్పుడైతే సత్యాన్ని రుజువు చేయడానికి ఆయుధం అవసరం అయ్యిందో అప్పుడు అంతిమంగా నిలబడేది ఆయుధ బలమా? సత్యపు బలమా? వ్యతిరేకతల సమన్వయానికి ఆయన పడ్డ ప్రయాస ఆయన జీవితం! గాంధీ తన ప్రయత్నంలో ఏ మాత్రం సాఫల్యం సాధించాడు? గాంధీ జీవితం నిరంతర వైఫల్యాల మధ్య ఒక సత్య శోధనా? అన్న ప్రశ్నలు కూడా తప్పువు. ఎందుకంటే ప్రశ్న లేనిది గాంధీ లేదు. ఆ ప్రశ్నల, సమాధానాల సమన్వయం లేనిది గాంధీ లేదు.

డా॥ అవధానం రఘుకుమార్
ఫోన్ : 9441015709

## మెట్రో సంస్కృతి

ఇటీవల రోజుల్లో ఒకటి గమనించాను. '**మిసిమి**'లో వరుసగా ఒక సంవత్సరకాలంపైగా 'మెట్రో' విశేషాలపై రాస్తున్న విషయాలు అధికారుల దృష్టిలో పడుతున్నాయి. దీనికి రుజువులు చాలానే కనిపించాయి. ముందుగా మేము 'ఫేస్‌బుక్'లో పెట్టిన ఉత్తరంలోని విషయాలపై అవగాహన కోసం ప్లాట్‌ఫారాల మీద ప్రకటనలు వినిపించాయి – కనిపించాయి– తరువాత ప్రయాణీకులు – ఎలా దిగాలి – ఎక్కేవారు దిగేవారికి దారి ఇవ్వాలి – స్త్రీల – వృద్ధుల కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమించవద్దని యువకులకు అభ్యర్థనలు – ప్రకటనలు తరుచూ వస్తున్నాయి. అయిదు లక్షలకు మించిన ప్రయాణికుల సంఖ్య – మెట్రోకు ఒకరకంగా ఆశావహంగా వున్నా – ప్రయాణీకులను అదుపు చేయటం (ఇక్కడ ప్రయాణీకుల పాత్ర చాలా వుంది) తలకు మించిన భారం అవుతుంది. సెల్ చూస్తూ ఎక్కటం–దిగటంతో ఎదుటవారిని గమనించకపోవటమే కాదు – వారికి వారే అపాయం కొని తెచ్చుకుంటున్నారు. దీనికీ ప్రకటనలు వస్తున్నాయి.

రద్దీ పెరగటంతో సీటుకోసం పోటీ పెరిగి – ముఖ్యంగా కుర్రకారు ఎగబడటం వెకిలిగా అన్పిస్తుంది.



అయిదు లక్షల మెట్రో!

మొన్ననే రాసిన 'మెట్రోమెట్లు' కు ఎంతోమంది స్పందన తెలియజేశారు. నిన్ననో మొన్ననో ఢిల్లీ మెట్రో ప్రేమికుల జంట ఉదంతం దుమారం లేపింది. అలాంటిది భాగ్యనగరంలోని మెట్రోలో జరగటానికి (అంటే మెట్లనుంచి–బోగీలోకి) ఎక్కువకాలం పట్టకపోవచ్చు. అంటే మనకు 'మెట్రోకల్చర్' అనేది ఒకటి ఆవిర్భవిస్తోంది అని విస్తుపోయి చూస్తుండాలా? అదుపు చేయడానికి మార్గాలు–అధికారులు– సామాన్యులు సమన్వయపరచుకుని జాగ్రత్త పడాలా?

ముప్పయి ఏళ్లక్రితం సింగపూర్ సంగతి చెప్తాను. అక్కడ కూడా అమెరికా విద్యార్థుల పుణ్యమా అని వికారపు శృంగారం రోడ్డెక్కింది. హొటల్ లాబీల్లో చేరింది. పార్కుల్లో చెప్పనవసరం లేదు. అప్పటి ప్రెసిడెంట్ (లీ) అమెరికా విద్యార్థి పిర్రలు పగలగొట్టాడు. దీనికి ఆ దేశపు అధ్యక్షుని అభ్యంతరాలను సహితం ఖాతరు చేయలేదు. తర్వాత పబ్లిక్ కిస్సింగ్ బాన్ చేశాడు. ఇవన్ని మనం గమనించాలి. ఇప్పటికైనా హెచ్చరిస్తున్నాము.

ప్రపంచంలో మెట్రో వంద సంవత్సరాలకు పైగా నడుస్తోంది. మనకు అయిదారేళ్ల పాటుగా తప్పటడుగులు వేస్తోంది. అవి 'తప్పు' అడుగులు కాకుండా జాగ్రత్త పడాల్సిందిగా అధికారులను – ప్రయాణీకులను అభ్యర్థించడంలో తప్పులేదుగా!

ఇక్కడే మరోవిషయం. విదేశీ చదువుల పేరిట దేశం వదలిపోతున్న విద్యార్థులకు శియాటిల్ పోలీసు కారు ప్రమాదం(?) ఒక పాఠం కాదా – వూరు దాటితే మన విలువ ఎంత? 11వేల డాలర్లా? జాగ్రత్త సుమా?

# అదృష్టం!! దురదృష్టం!!!

**– జయశ్రీ అట్లూరి**

ఈ రోజు మా ఇంట్లో పిల్లలు ఒక పాయింట్ లేవనెత్తారు. 'మన పెద్దవాళ్ళు మనకెంతవరకూ తెలుసు?' అని. అందరం కూర్చుని ఒక వంశవృక్షం లాంటిది తయారు చేశాము. ఒక రెండుతరాల వరకూ వెనక్కి వెళ్ళగలిగాము. ఆ తరువాత పెద్దవాళ్ళకి ఫోన్లు చేసి ఇంకొంచెం వంశవృక్షాన్ని వృద్ధి చేశాము. సాధారణంగా వృక్షాలు పైకి పెరుగుతాయి. మా వృక్ష మేమో వెనక్కి వెళ్ళిన కొద్దీ క్రిందికి పెరుగుతోంది. పైన కొమ్మలూ, రెమ్మలూ, ఆకులూ అందరూ పైకి వెళ్ళిన కొద్దీ వయసులో చిన్నవాళ్లు. వాళ్ళందరూ మాకు తెలుసు. కొందరితో కలసి తిరిగాము. పెరిగాము. కొందరు చిన్నప్పుడు మమ్మల్ని ఎత్తుకుని త్రిప్పితే, ఇంకొందర్ని మేము ఎత్తుకుని ఆడించాము. ఇష్టాఇష్టాలు పంచుకున్నాము. పుట్టినరోజులు, పెళ్ళిరోజులు..ఇలాంటివన్నీ కలసి జరుపుకునేవాళ్ళం. పిన్నిలూ, బాబాయ్‌లూ, అత్తయ్యలూ, మామయ్యలూ, వాళ్ళ పిల్లలూ, వాళ్ళ పిల్లలూ ఇలా శాఖోపశాఖలుగా విస్తరించింది మా వంశవృక్షం. దాదాపుగా వాళ్ళందరి ఫోటోలు, వీడియోలు కూడా మా దగ్గర ఉన్నాయి. ఎన్నో జ్ఞాపకాలు. ఒక్కొక్కరి పేరు వెనుక. ఒక పుట్టుక ఉంది. ఒక జీవితం ఉంది. ఎన్నో అనుబంధాలు. రాగ, ద్వేషాలకు అతీతంకాని బంధాలు. ఇప్పటికి ఇంకా భూమి మీద ఉన్నవాళ్ళంతా కొమ్మలు, రెమ్మలు, ఆకులూ అనుకుంటే.. కాలంలో క్రిందకు దిగిన కొద్దీ...మ్రాను, వ్రేళ్ళు వీళ్ళగురించి మనకెంత తక్కువ తెలుసు అనే బాధ మొదలయింది.

మట్టిలో కలసిపోయిన వాళ్ళ సంఖ్య ..నక్షత్రాల సంఖ్య ఒక్కటేనేమో. అయినా మనిషి చనిపోయాక, కాల్చేసి, పూడ్చేసి కాలక్రమేణా మరచిపోయి ముందుకు వెళ్ళటం మామూలే. రెండు కాళ్ళమీద నడవటం మొదలు పెట్టినప్పటినుండీ పుట్టి, గిట్టిన మన పెద్దవాళ్ళందరినీ గుర్తు పెట్టుకోలేంకదా. మరైతే ముందు తరాల వారు ఎంతో మంది మనకి తెలుసు. ఎలా జరిగింది ఇది. అలా భావితరాలవారికి కొంత మంది మాత్రమే ఎలా గుర్తున్నారు? గుర్తుండి పోయేందుకు వీళ్ళేమి చేసుండి ఉంటారు? ప్రాథమిక అవసరాలను తీర్చుకుంటూ తనకూ తన చుట్టూ ఉన్న వాళ్ళకూ ఉన్న బాధలను గుర్తించి, గమనించి వాటి గురించి ఆలోచించి పరిష్కారాల దిశగా ప్రయాణం చేస్తూ మనల్ని ఇంత దూరం తీసుకుని వచ్చారు. వీళ్ళల్లో అద్భుతమైన మేధావంతులు, శక్తిమంతులూ, ధీమంతులూ, సౌందర్య వంతులూ ఎంతో మంది ఉండే ఉంటారు. వీళ్ళ ఆకారాలూ, ఆలోచనలూ మనకు తెలుసా? ఎన్నో కాలగర్భంలో కలసి పోయాయి. ఏవో కొన్ని ఆలోచనలు మాత్రం రూపుదాల్చుకొని కాలంలో ముందుకు ప్రవహించాయి. చెట్లకు దాదాపు 12000 సం.ల క్రితమే, దొరికిన కాయలు, పండ్లు తింటూ బ్రతికిన వాళ్ళు విత్తనం ముఖ్యమనీ, నీళ్ళ ప్రక్కన ఉంటే మంచిదనీ, నిప్పుతో రక్షణ అనీ, నిలవాలంటే గెలవాలనీ ఇలా ఎన్నో ఆలోచనలు అనుశృతంగా భావితరాలకు అందించారు. అంది పుచ్చుకున్న ఆలోచనలూ, బాహ్య లక్షణాలు అన్నీ ఉత్తమమైనవీ, కాల పరీక్షకు నిలబడగలిగినవీ కాబట్టే మనం ఇంతవరకూ రాగలిగాం. కానీ ఎన్నో ఆలోచనలను ఆస్తులుగా తరువాత తరాలకు అంద చేయాలన్న ఆత్రంతో మాటలు పలికాయి. భాష భావాన్ని నీళ్ళమూటకట్టింది. కాని కాలంలో నిలపటంకోసం పడిన తపన సుమారు 5000 సం.ల క్రితం లిపికి శ్రీకారం చుట్టింది. తాటాకులొచ్చాయి. చెట్లనుంచి కాగితం పుట్టుకొచ్చింది. ఆలోచనలు పదునెక్కాయి. ఈతిబాధలు తీరాక చుక్కలూ, చంద్రుడూ, సూర్యుడూ, సృష్టి, సృష్టి కర్త అంటూ ఆరాలు కొన సాగాయి. ఎంతో మంది తత్వవేత్తల మనసుల్లో ఏముందో తరువాత వాళ్ళకు రిలే రేస్‌లో అందించే కరపత్రంలా అందించారు. ఈ రోజు గెలీలియో, పైధాగరస్, యూక్లిడ్, ఆర్కిమిడీస్, ఫిబనాచి లాంటి వాళ్ళు అందించిన సూత్రాలు మానవ జీవితానికి ఇరుసులై ఉంటే, అరిస్టాటిల్, సోక్రటీస్, హేగెల్, హెరాక్లిటస్ లాంటి వాళ్ళు అందించిన తత్వజ్ఞానం ఈ రోజుకూ 'ప్రశ్నించటాన్ని' ప్రశంసిస్తోంది. ఆఫ్రికాలో మొదలైన మనం.. ఊడలు పరుచుకున్న మహా మహా పెను వృక్షంలా నిలిచి ఉన్నాము. చరిత్ర నుంచి తత్వవేత్తలతో పాటు మహానాయకులు, వీరులు, నియంతలూ కూడా మనకు తెలుసు. పుస్తకాలద్వారా కొందరు ఎలా ఉండాలో చెవితే, కొందరు ఎలా ఉండకూడదో చూపారు. భావంతో పాటు, రూపాన్ని, గళాన్ని, చైతన్యాన్ని కూడా అజరామరం చేయగలగటంతో ఫోటోల ద్వారా పాటల ద్వారా వీడియోలద్వారా సినిమాల ద్వారా వేల మంది పూర్వీకులను మనతో పాటు, మన ఇంట్లో, మన కార్లలో, మన మనసుల్లో, మరణానంతరం కూడా మనతో ఉంచుకో గలుగుతున్నాము. ఇది ఒక రకంగా కాలంలో ప్రయాణమేకదా. ప్రయాణం అంటే ఒక చోటు నుండి మరో చోటికి గమనం. కదలిక, చలనం, స్థానభ్రంశం, వీటన్నిటి వలన వేరే ప్రాంతాన్ని చూడటం, వేరే మనుష్యులని చూడటం కలవటం అనేదాన్ని ఆశిస్తాము. కాలాన్ని బట్టి చివరకు ఆశించిన ఫలితాన్ని పొందటమే ముఖ్యం అనుకుంటే కదలిక, చలనం, స్థానభ్రంశం ఇవేమీ లేకుండానే మనః ప్రయాణం లేదా 'మనోయాత్ర' జరుగుతోంది ఎంత అదృష్టం!! మా వంశ వృక్షంలో మ్రానులుగా, వ్రేళ్ళుగా మిగిలిపోయి వాళ్ళ సంతానాన్ని, ఎన్నో కష్టనష్టాలను, సవాళ్ళను ఎదుర్కొంటూ ఏటికి ఎదురీదుతూ మమ్మల్ని వాళ్ళ భుజాల మీద మోసుకుని ఈ రోజుకి ఇంత మంది విద్యావంతులు, సంస్కార వంతులూ, భావ/భౌతిక సౌందర్య వంతులతో అందంగా, ఠీవిగా నిలబడిన వారిని ఇప్పటికీ పరోక్షంగా నిరంతరం సారం అందిస్తూనే ఉన్న వారిలో చాలామందిని మేము చూసింది లేదు. వారు కేవలం ఒక 100 సం. లు మాత్రమే మనకంటే ముందున్న వాళ్ళు. ఇంకా రాబోయే తరాలవారికి అసలు వాళ్ళున్నారనే తెలియదేమో? ఎంత దురదృష్టం!!!

**జయశ్రీ అట్లూరి, యునైటెడ్ కింగ్డమ్**



డా.కేదార్ నాథ్ సింగ్

# ఆత్మచిత్రం

*– అలజంగి మురళీధర రావు*




నేనిప్పుడు పరిచయం చెయ్యబోతున్నది "ఆత్మ చిత్రం" అనే కవితా సంపుటి. హిందీలో జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత డా.కేదార్ నాథ్ సింగ్ గారి నూరు కవితల తెలుగు అనువాద పుస్తకమిది. కిల్లాడ సత్య నారాయణ గారు దీనిని తెలుగు అనువాదం చేశారు. వీరిది అనకాపల్లి దరి ఒక పల్లెటూరు.కొన్నాళ్ళు ఉపాధ్యాయ వృత్తి నెరపి అనంతరం IPS కు ఎంపిక అయ్యి, ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్ లో IG కేడర్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరు స్వయానా కవి,రచయిత కూడా. ఉత్తరప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్న కాలంలో డా.కేదార్నాథ్ సింగ్ గురించి తెలుసుకోవడం, వారిని గురించి పరిశోధన చేయడం, వారి కవిత్వాన్ని ఎలాగైనా చదువుకోవాలన్న ఉబలాటంతో హిందీ నేర్చుకుని చదవడం, అనంతరం ఈ పరిణామాలన్నీ అతనిని కేదార్ నాథ్ సింగ్ కవితలను తెలుగులోకి అనువదించాలన్న బలమైన కోరికకు పునాది వేశాయి. అతని కోరిక, శ్రద్ధ, అధ్యయనాల ఫలితంగా ఇపుడు ఈ అందమైన ముఖ చిత్రంతో కల "ఆత్మచిత్రం" కవితల పుస్తకం మన ముందుకు వచ్చింది. అనువాదకులైన కిల్లాడ సత్యనారాయణ గారికి ముందుగా మనం ధన్యవాదాలు చెప్పుకోవాలి. ఎందుకంటే హిందీ కవిత్వం తెలుగులోకి అనువాదమైన సందర్భాలు 1960లు,70ల్లో కొన్ని ఉండవచ్చునేమో గాని, ఇటీవల కాలంలో ఇటువంటివి ఇంచుమించుగా లేదనే చెప్పాలి.ఈ సందర్భంలో హిందీ కవులైన డా.కేదార్ నాథ్ సింగ్ ఆత్మచిత్రం కవితా సంకలనం తెలుగులోకి రావడం ఎంతగానో ఆహ్వానించదగిన పరిణామం. కవితలన్నీ సరళమైన భాషలోనే సాగినప్పటికీ మొత్తం కవితలన్నీ చదువుకున్న పిమ్మట నాకు అర్థమైనదేమిటంటే ఒక శాస్త్రవేత్త ఎలా అయితే తనదైన పదజాలం, తనదైన శాస్త్ర జ్ఞానంతో ఒక నూతన ఆవిష్కరణ కావిస్తాడో, ఉన్న శాస్త్ర జ్ఞానానికి ఒక సొబగును అద్దుతాడో అలాంటి ఒక ప్రయత్నం, ఒక ఆవిష్కరణ డా.కేదార్ నాథ్ సింగ్ కవిత్వానిది. శాస్త్రీయ ఆవిష్కరణలన్నీ మనకు అర్థం కావు, కాకపోవొచ్చు, అయినంత మాత్రాన ఆ ఆవిష్కరణ యొక్క విలువ తగ్గదు కదా! అదే రీతిన మహాకవుల కవిత్వం మనకు సంపూర్ణంగా చిక్కకపోయినా దాని స్థానం పదిలమే అన్నది ఇక్కడ మనం గుర్తు పెట్టుకోవాల్సిన అంశం. కవిత్వాన్ని జీర్ణించుకోవడానికి దగ్గర దారులు (short cuts) ఉండవు. ఆ కవిలో పరకాయ ప్రవేశం చేసి కవి ఉపయోగించిన అలంకారాలను, ప్రతిమలను, పదచిత్రాలను కలల మాదిరిగా పొరలు పొరలుగా విప్పి చదవడం(DECIPHER) చెయ్యగలిగినప్పుడే ఆ కవిత్వంలోని తియ్యదనం తెలుస్తుంది. ఎంతో ధ్వని ప్రధానంగా సాగే ఈ అనువాద కవితల్లో కొన్నింటిని విశ్లేషిస్తూ పాఠకుల ముందు ఉంచడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. "ఒక గొలుసు భూమి అక్షాంశాల గుండా వెళుతూ/సూర్య మండలం వద్ద కనుమరుగైపోతుంది/అక్కడ నేను నిల్చున్నాను/మత్స్యకారుల వలనొకదాన్ని నది నుండి వెలుపలకు తీసి/నా ఈ చిరకాల ఆదిమ భుజాలపై మోస్తున్నాను/చిరునవ్వుల దండొకటి తారలపై వేలాడుతోంది/గాలి తోపుకి అది ఎటు మొగ్గితే ఆటే మా ఇల్లు/చిన్న ఇల్లు/ఆ చిన్న ఇంటిలో లెక్కలేనన్ని దిశలు/ప్రతి దిక్కు మిగిలిన దిక్కుల్ని ఎక్కడైతే వేగంగా కలుస్తుందో/ అక్కడ నేను జీవించి ఉన్నాను."

ఇవి "ఆత్మచిత్రం" అనే కవితలోని వాక్యాలు. ఎంతో లోతైన జీవన తాత్వికతను నింపుకున్న ఈ నర్మ గర్భిత కవిత కవి కేదార్ నాథ్ సింగ్ దృక్పథానికి ఒక మేలిమి మచ్చు తునకగా నిలుస్తుంది. "గింజలు" అన్న కవితలో వాణిజ్యమయం అయిపోయిన వ్యవసాయాన్ని గురించి చెబుతూ "వద్దు / 'మేము సంతకు వెళ్ళం'/కళ్ళం నుండి లేస్తూ అన్నాయి గింజలు! అంటూ ఎంతో హృదయ విదారకంగా ధ్వనింప చేస్తారు కవి. అమూర్తమైన వాటికి మానవ రూపాన్ని, గొంతును ఇస్తూ anthropomorphic ఎఫెక్ట్ ద్వారా ఒక విషాద చిత్రాన్ని మన ముందు ఉంచుతాడు. "గొర్రెల కాపరి ముఖం" కవితలో ఒకచోట

"అతని ముఖం ముడుతల్లో ఇంకా చోటుండటం నేను చూశాను/అక్కడ ఒక పక్షి గూడు కట్టుకోవచ్చు" అని చెబుతూ కష్ట జీవులలో సౌందర్య రాహిత్యానికి నిజాయితీగా చింతిస్తాడు కవి. "కోట్ల సంవత్సరాల పురాతనమైనది" కవిత నవ సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి ఉండాలని, ఉమ్మడిగా వ్యవస్థను మరమ్మత్తు చేసుకోవాలనే యజ్ఞానికి కవి చేస్తున్న ఒక విన్నపం, ఒక హెచ్చరిక. ఇక్కడ కవి అంటాడు కదా "బ్రహ్మాండమంతా వ్యాపించిన మిలియన్ల మిత్రులారా వినండి ఈ బ్రహ్మాండం కోట్ల సంవత్సరాల పురాతనమైన ఒక ఎడ్లబండి, దీని ఇరుసును మరమ్మత్తు చేయాల్సిన అవసరం వచ్చింది". నినాదమే కవిత్వంగా చెలామణి అవుతున్న నేటి సందర్భంలో నిజ కవిత్వం ఎలా ఉండాలో ఈ కవితలో మనం చూడవచ్చు.

మాతృ భాషాభిమానాన్ని చాటుకుంటూ ఎటువంటి పోలికలు (analogies) కవి చూపిస్తున్నాడో "మాతృభాష" కవితలో చూడొచ్చు: చీమలు పుట్టల్లోకి దూరినట్లు/వడ్రంగి పిట్ట బెరడు దగ్గరికి చేరినట్టు/ఎర్రని ఆకాశంలో రెక్కలు చాచిన విమానాలు ఒకదాని తర్వాత ఒకటి విమానా శ్రయంలో దిగినట్లు/ఓ నా భాషా నేను నీలోకి తిరిగి వస్తాను" అని అంటాడు కేదార్ నాథ్ సింగ్. ఇందులో మాతృ భాషాభిమానం అలా ఉంచితే కవిత్వాభిమానులుగా మనం గుర్తు పెట్టుకోవాల్సిన అంశం మనస్సులో ముద్ర పడేటట్లుగా ఉన్న ఆలంకారిక వ్యక్తీకరణ. "తిరుగుబాటు" అనే కవిత గమనంలో ఎదురుపడ్డ "ఆ వైపు అల్మారాలో బంధించబడ్డ పుస్తకాలు-'తెరువు,మమ్మల్ని తెరువు, మా వెదురు పొదల్లోకి వెళ్ళిపోవాలనుకుంటున్నాము" లాంటి వాక్యాలు తీవ్రంగా ఆలోచింప చేస్తాయి. మానవ విజ్ఞాన విస్ఫోటనం మూల ప్రకృతి విధ్వంసం పైననే జరిగిందన్న ఒక చురక తగులుతుంది ఈ కవితలో. "ముక్తి"అన్న కవితలోని ఈ పాదాలను చూడండి, "రాయడం వలన ఒరిగేది లేదని తెలిసి కూడా నేను రాయాలను కుంటున్నాను". తెలుసుకోవాలనుకుంటున్న వాళ్ళకి తెలుసుకోవాల్సినంత అర్థం ఉంది ఈ ధ్వనిలో. వ్యవస్థా గతంగా రావాల్సిన ఒక అనివార్యమైన మార్పును ఆశిస్తూ కవి ఎంత కవితాత్మకంగా,సాంకేతికంగా తన ఆకాంక్షను వెలిబుచ్చుతున్నాడో ఈ వాక్యాలను చూడండి; "మనిషి రోడ్డు దాటడం నాకు ఎప్పుడూ నచ్చుతుంది, ఎందుకంటే, ఇటువైపు ఉన్న ప్రపంచం కన్నా రోడ్డుకు అటువైపు కొంచెం మెరుగ్గా ఉండొచ్చునేమోనన్న ఒక ఆశ!!". "చెయ్యి" కవితలో కేదార్నాథ్ సింగ్ నిజమైన మానవుడు, నిజమైన ప్రేమికుడు కోరుకునేది తన ప్రేయసి ప్రేమనే కాదు యావత్ ప్రపంచం ప్రేమలోకం కావాలని కూడా కోరుకుంటూ ఇలా అంటాడు "ఆమె చేతిని నా చేతిలోకి తీసుకుంటూ అనుకున్నాను, ఈ చేతిలాగే లోకం కూడా వెచ్చగా, అందంగా ఉండాలి". మరో ఆలోచింపజేసే కవిత "చేతి పార". ఈ కవితలో ఇలా అంటాడు కవి, "అప్పుడు వంటగది వైపు నా దృష్టి మళ్ళింది/కాని తాజాగా శుభ్రం చేయబడిన పవిత్రత యొక్క తీవ్ర భీభత్సం ఉంది అక్కడ". సాంప్రదాయకతని కాపాడుకుంటూ పోవడంలోని కృత్రిమత్వాన్నీ యుగాయుగాల మూఢత్వాన్ని, మార్పులేని తనాన్ని కవి ఎంతో వ్యంగ్యం చేస్తూ చెబుతున్నారిక్కడ. మహాకవులకే సాధ్యమయ్యే ఈ వ్యంగ్యం ఒక అందమైన తూటా.

నాకు పాములనుండి భయం కలుగదు/చీకటి భయం కలుగదు/ముళ్ళ నుండి, ఆరిపోతున్న లాంతరు నుండి భయం కలుగదు/మంచి వాళ్ళారా మీరేమీ అనుకోకండి/నాకు మంచి తనం నుండి భయమేస్తోంది/ అని అంటాడు కవి ఒక కవిత పాదంలో. మంచి వాళ్ళు అనుకుంటున్న వాళ్ళలోని కపటత్వాన్ని చెబుతూ పాములకంటే చీకటి కంటే ముళ్ళ కంటే వారే సమాజానికి నిజమైన ప్రమాదకారులని ఇక్కడ కవి చేస్తున్న ఎద్దేవా!! వాడిగా గుచ్చుకున్న మెత్తని పదాలు!! మితి మీరిన విజ్ఞానాభివృద్ధి మానవ జీవితానికి అవశ్యమైన ప్రశాంతతను ఎలా ఛిద్రం చేస్తున్నాడో చెబుతూ "నేను రైల్లో కూర్చున్నప్పుడు విజ్ఞానానికి ధన్య వాదాలు చెబుతాను/ నేను పడుకోవడానికి మంచం మీద నడుం వాల్చినపుడు వెలుతురులో నిద్ర పట్టక లైట్లు ఆపివేస్తాను/ఆ తర్వాత నిద్రపోతాను/విజ్ఞానపు అంధకారంలో నిద్ర బాగా పడుతుంది అంటారు కేదార్నాథ్. ఈ కవితను చదువుతున్నప్పుడు విజ్ఞాన శోధన ఏదో ఒక దగ్గర ఆగాలనిపించక మానదు. ప్రశాంతత లేకుండా జీవితాన్ని మింగేసిన విజ్ఞానాభివృద్ధి వ్యర్థం అని చెప్పకనే చెబుతున్నాడు కవి. నేడు చేతులారా పర్యావరణాన్ని నాశనం చేసుకుంటూ అభివృద్ధి పేరిట పరుగులు పెడుతున్న మానవుడిని హెచ్చరిస్తూ "జైలులో లాంతరులా చంద్రుడు/ ఒక చెట్టు ఖాళీ కొమ్మనుండి ఊగుతున్నాడు/ఈ భూమ్మీద

ఖైదీలమైన మనమంతా సంతోషించాలి/ఎందుకంటే దాని కొద్దిపాటి వెలుతురులోనైనా మనం కనీసం ఒకరి ముఖాన్ని మరొకరు చూసుకోవచ్చు"అని అంటాడు. ఇందులో అర్థాన్ని అలా ఉంచితే, ఎటువంటి పదాలు, పదచిత్రాలు, ఎటువంటి దినుసులు వేయడం ద్వారా ఆశించిన ప్రయోజనాన్ని కవిత్వంలో రాబట్టవచ్చో, పతిత మనసులోకి ఎక్కించవచ్చో ఆ కవితా నిర్మాణ చాతుర్యానికి నమూనాగా ఈ కవిత నిలుస్తుంది.

మానవ అనుభవం ఏమి చెబుతుందంటే అప్పుడప్పుడు ఊహించని విషయాల నుండి కదిలించే సత్యాలు ఎదురౌతూ ఉంటాయి. కేదార్నాథ్ సింగ్ అట్లాంటి ఒక మధురమైన స్ఫూర్తివంతమైన అనుభవాన్ని అత్యాధునిక భాషా నిర్మితితో ఇలా వ్యక్తీకరిస్తున్నాడు, "నా ఎముకలు నా దేహంలో దాక్కున్న విద్యుత్ తరంగాలు/నా దేహం నా రక్తంలో వికసించిన కలం/ఒక రోజు నేను తులసిదాసును చదువుతున్నప్పుడు/అకస్మాత్తుగా ఇది నాకు తెలిసిందంటే మీరు నమ్ముతారా". "ఎముకలు విద్యుత్ తరంగాలు" ఎంత గొప్ప వ్యక్తీకరణ!!! "మౌనం" అన్న కవిత సమకాలికతను నిండా ఇముడ్చుకున్న కవిత, కవి అంటున్నాడు, "మౌనం పెరిగిపోతుంది/మాట్లాడాల్సిన అన్ని చోట్లలో అది పెరిగిపోతూ ఉంది జుట్టు పెరిగినట్టు/గోళ్ళు పెరిగినట్టు/ఆశ్చర్య మేమంటే ఇది ఎవరికీ ఇబ్బంది కల్గించడం లేదు" అని. ఈ కవితతో అసలు విభేదించేవారు ఎవరని!!? అందరం సిగ్గుతో తలవంచుకోవాల్సిందే !

"వాళ్ళు వచ్చారు/నా లోపల నిల్చున్నారు/నేను పచ్చని మైదానంలా వ్యాపిస్తున్నట్లు నాకనిపించింది". మైదానంలో పిల్లలు కవితలోని ఈ పంక్తులు పిల్లలు అందించే నులివెచ్చని ఆనందం ఎట్లా ఉంటుందో మెత్తగా విప్పి చెప్పినట్లైంది. మరో కవిత "భూమి ఉంటుంది" కవి ప్రకృతి ప్రేమకి పరాకాష్ట ఈ కవిత. ఇందులో కేదార్నాథ సింగ్ అంటాడు కదా "ఈ భూమి మరెక్కడా లేకుంటే/చెట్టు తొర్రలో చెద పురుగులు ఉన్నట్లు/గింజల్లో పురుగులున్నట్లు/అది నా ఎముకలలో తప్పక ఉంటుందని నా ప్రగాఢ విశ్వాసం". తనకి, ప్రకృతికి మధ్యన హద్దులను చెరిపేసి ఒక అద్వైత స్థితిని సాధించుకుంటున్నాడు కవి. ఈ కవిత చదివితే ప్రకృతి విధ్వంస కారులమైన మనం భుజాలు తడుముకోవాల్సిందే! "వెదురుతో చేటలు నేస్తారు/లేదా చీపుర్లు తయారు చేస్తారు/ప్రజలు బజారులో కోటు వేసుకుని చీపురు కోసం వెతుకుతారు/కోటు చీపురు ఈ రెంటిని కలపగలిగితే/ప్రపంచం మారిపోతుంది". సందేశం ఇది అని నేరుగా చెప్పకుండా ధ్వనితో దానిని పాఠకుల గుండెల్లో దూర్చి ఆలోచనల్లో పడవేయడమే అసలు సిసలు కవితా లక్షణం. అదే ఇక్కడ ఈ కవితలో ఉన్నది. చిందర వందర గందర గోళమైన ఈ మానవ జీవితంలో ఒక క్రమం తీసుకురావాల్సిన మానవుడే లోటస్ ఈటర్స్‌లా పడి ఉండడాన్ని ఎద్దేవా చేస్తూ "కుక్క ఐదు పిల్లలు పెట్టింది/ఐదు అందంగానూ, ఆరోగ్యంగానూ, మృదువుగానూ, లేలేత బొచ్చుతోనూ ఉన్నాయి/ఆ ఐదు సూర్యుడి వైపు ముఖం పెట్టి ఇప్పుడు మేము వచ్చేశాం ఈ ప్రపంచాన్ని ఏమి చేయాలో చెప్పు అని ఆశ్చర్యంగా అడుగుతున్నట్లు కూ కూ అంటూ నిలుచున్నాయి" అంటారు కేదార్నాథ్ సింగ్. ఇక్కడ ఎత్తి పొడుపు చురుక్కుమంటుంది మన గుండెలకు! ఇలా ఈ అనువాద సంపుటిలో ఎన్నో కవితలు కవి కేదార్నాథ్ సింగ్ వ్యక్తిత్వాన్ని పట్టిచ్చేవే అయినా "వీలునామా" అన్న కవితలో మాత్రం కవి ఆత్మచిత్రం సంపూర్ణంగా పరుచుకుని ఉంటుంది; "ఏదో ఒక పొలానికి నా చర్మాన్ని ఇచ్చేయండి/నా కుర్తాను ఏదో చెట్టుకు ఇచ్చేయండి/నా చొక్కాను ఏదో పొదకు ఇచ్చేయండి/నా పేరుకు బదులు వేరొకరి పేరు రాసెయ్యండి/ఏ మంచం లేని పొరుగువాళ్ళకు నా మంచం ఇచ్చేయండి" అంటూ సాగే వీలునామా కవిత కవి పలవరింత, కవి స్వప్నం కాక మరేమౌతుంది!! సంఘం కోసం తోటి మనిషి కోసం అన్ని వదులుకుంటున్నాడు, జన జాగృతియే తన చూపు అని ఎంతో నర్మ గర్భంగా వినిపిస్తున్నాడు.

ఇలా కేదార్నాథ్ సింగ్ కవితలన్నింటిలో ఒక ఉమ్మడి తనపు సంక్షేమ కాంక్ష ఉంది, కవిత్వమంతా ఒక మానవ ఐక్య సంఘటనా ఆవశ్యకతను ఇముడ్చుకుంది. మెత్తగా కర్తవ్య బోధ చేస్తూ కవి తానేమిటో, తన కవిత్వ లక్ష్యమేమిటో, స్పష్టంగా చెప్పుకుంటున్న కవి కేదార్నాథ్ సింగ్ స్వగతమే ఈ ఆత్మచిత్రం.

అలజంగి మురళీధర రావు
అర్థశాస్త్ర ఉపన్యాసకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాడేరు
ఫోన్ : 9440335461

# గిరిజన కథా 'భూషణం'

– సారిపల్లి నాగరాజు

తెలుగు సాహిత్యంలో సంస్కరణోద్యమ వ్యాప్తిలో భాగంగా ఇరవయ్యో శతాబ్దం మొదటి దశకంలో తెలుగు కథ ప్రారంభమైంది. తెలుగు కథ/ఉత్తరాంధ్ర కథ గురజాడ 'దిద్దుబాటు'తో శ్రీకారం చుట్టింది. దిద్దుబాటుతో మొదలైన ఉత్తరాంధ్ర కథ జాతీయోద్యమ, అభ్యుదయోద్యమాల భావజాలంతో అభివృద్ధి చెంది మధ్యతరగతి జీవన విధానాలను, జీవితసంస్కారాలను, గ్రామీణ జనజీవన సమస్యలను, మానవ మనస్తత్వంలోని వైచిత్రి, వైయుక్తిక ప్రత్యేకతలను, సమిష్టి ప్రయోజనాలను ఇతివృత్తంగా చేసుకొంటూ వికసించింది. విస్తరించింది. విస్తరిస్తూనే ఉంది. ఇవన్నీ ఒక ఎత్తు. 1967 తరువాత విప్లవోద్యమ ప్రభావంతో ఉత్తరాంధ్ర కథకు కొత్త మలుపు చేకూరింది. నక్సల్బరీ ఉద్యమానికి సమాంతరంగా ఉత్తరాంధ్ర ప్రాంత గిరిజనులు వ్యవస్థపై పోరాటం ప్రారంభించారు. ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంతాలలోని సవరులు, కోదులు, జాతాబు, కొండదొర వంటి గిరిజన తెగల మీద జరుగుతున్న దోపిడీ, దౌర్జన్యాలకు, అరాచకాలకు చలించిపోయి అక్షరబద్ధం చేసిన ఉత్తరాంధ్ర గిరిజన కథకులు నాటి భూషణం మాష్టారు నుండి నేటి మల్లిపురం జగదీశ్ మాష్టారు వరకు కనిపిస్తారు.

నిజానికి గిరిజన జీవితాల గురించి కథలు రావడం మొదలైంది 1967 తర్వాతనే అంటే ఆశ్చర్యం కలగకమానదు. అంతకు ముందు దాదాపు అరవై సంవత్సరాల నుండి కథలు వెలువడుతున్నా ఆయా రచయితలకు కూతవేటు దూరాలలోనే గిరిజన జీవితాలున్నా వారి గురించి, వారి జీవన్మరణ సమస్యల గురించి, వారు మైదాన ప్రజలచేతిలో మోసపోతున్న దుర్మార్గపు స్థితిని గురించి మొదటిసారిగా కథలు రాసింది మాత్రం భూషణం మాస్టారే. అందరూ 'భూషణం మాస్టారు'గా పిలుచుకొనే వీరి పూర్తి పేరు బోనం నాగభూషణరావు. పోరాటాల పురిటిగడ్డ విజయనగరం జిల్లా చినమేరంగి గ్రామంలో వెంకట నరసమ్మ, సోములు దంపతులకు జూలై 01, 1938న జన్మించారు. వీరి విద్యాభ్యాసమంతా స్థానికంగానే సాగింది. అనంతరం ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. ఉపాధ్యాయ వృత్తిలోని ఉంటుండంగానే రచనవైపు అడుగులు వేశారు. తొలినాళ్ళలో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సమస్యలను తన రచనల్లో పొందుపరుస్తూ సాగించారు. తదనానంతరం ఉద్యమ ప్రభావంతో గిరిజనులుపై దృష్టి మళ్ళించి ఆ దిశగా రచనలు చెయ్యడం ప్రారంభించి చివరివరకూ కొనసాగారు. *"పట్టణ ప్రాంత జీవితాన్ని పెద్ద గురువు రావిశాస్త్రిగారూ, (పల్లె) మైదాన ప్రాంత జీవితాన్ని చిన గురువు కాళీపట్నం రామారావుగారూ రాస్తున్నారు. నాకు మిగిలింది కొండ ప్రాంతమే (ఆదివాసీ ప్రాంతమే) అదే పట్టుకొని రాస్తున్నాను"* అని గిరిజన జీవితాన్ని అక్షరబద్ధం చేసిన తొలి తెలుగు ఉత్తరాంధ్ర గిరిజన కథా రచయిత భూషణం. వాస్తవానికి గిరిజన జీవితాల గురించి ఆలోచన రేకెత్తించిందీ, మన కథకులను తట్టిలేపిందీ 1960వ దశకంలో ప్రారంభమైన గిరిజన పోరాటాలే. అంతకుముందెప్పుడూ తెలుగు కథ దర్శించని నూతన కథా వస్తువుని 1967 పోరాటాలు ముందుకు తీసుకు వచ్చాయి. నాగరిక ప్రపంచానికి దూరంగా, తమ అమాయకత్వం ఇతరులకు పెట్టుబడికాగా, చావలేక బతకలేక జీవితం గడుపుతున్న గిరిజనుడు ఇవ్వాళ చావో రేవో తేల్చుకోదల్చుకున్నాడు. తనకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలను సహించిన గిరిజనుడు ఇవ్వాళ తిరగబడుతున్నాడు.

ఉత్తరాంధ్ర ప్రాంతంలో సవర, జాతాపు, గదబ, కొండదొర, కోందు, భగత మొదలైన గిరిజన తెగలు ప్రధానమైనవి. ఈ తెగల్లో కూడా ఎక్కువగా సవర, జాతాబు, గదబ ఈ మూడు కొండజాతుల గురించి ఎక్కువగా కథలు రాయబడ్డాయి. దానికి కారణం శ్రీకాకుళ గిరిజనోద్యమం. ఈ ఉద్యమం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల గిరిజన ప్రాంతాల్లో జరిగింది. ఈ రెండు జిల్లాలలో ప్రధానంగా

ఈ మూడు తెగలే నివసిస్తున్నారు. అంతేకాకుండా మరో ముఖ్యమైన కారణం శ్రీకాకుళ గిరిజనోద్యమంలో ఈ మూడు జాతుల ప్రజలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పాలుపంచుకున్నారు. అందుచేత ఉత్తరాంధ్ర గిరిజన కథల్లో చాలా వరకు సవర, జాతాబు, గదబ జాతుల జీవిత గాథలు, వెతలు, పోరాటాలు, ఆరాటాలు కనిపిస్తాయి.

భూషణం కథలు-గిరిజన జీవితం : అమాయకత్వం, అజ్ఞానంవల్ల గిరిజనులు నాటి నుంచి నేటి వరకు మైదాన ప్రాంత ప్రజలచేతిలో మోసపోతున్నారు. 1970 దశకంలో నిరక్షరాస్యత, అమాయకత్వం వల్ల దోపిడీకి గురైన గిరిజనులు, 2020 దశకంలో విద్యావంతులు అయినప్పటికీ దోపిడీకి గురవుతున్నారు. 1970 నుంచి 2020 వరకు గిరిజనులపై ఏదో ఒక రూపంలో దోపిడీ జరుగుతూనే వుంది. ఈ అర్ధశతాబ్ది కాలంలో దోపిడీలో రూపం మారింది కానీ గిరిజనులపై దోపిడీ మాత్రం జరుగుతూనే ఉంది.

భూషణం మాస్టారు సుమారుగా పద్నాలుగు గిరిజన కథల్ని రాశారు. ఈ గిరిజన కథల్ని రెండు దశలుగా చూడవచ్చు. 1971-80 వరకు మొదటిదశ, 1981-98 వరకు రెండవదశ. మొదటిదశలో వచ్చిన కథలు గిరిజన జీవన సంఘర్షణ, ఆరాట, పోరాటాలను చిత్రించాయి. ఉద్యమం ఫలితంగా గిరిజన జీవితాల్లో వచ్చిన మార్పులను రెండోదశ కథల్లో చూడవచ్చు. ఈ మూడు దశాబ్దాల కాలంలో వెలువడిన అతని గిరిజన కథలు ఎందరినో కదిలించాయి. తెలుగు కథాసాహిత్యంలో గొప్ప కథకునిగా నిలబెట్టాయి. సవరల గూడకి వ్యాపారం కోసం వచ్చి, సవరులను మోసంచేసి, వారి శ్రమను దోచుకుంటున్న షావుకారి నత్తియ్యపై సవరులు తిరుగుబాటు చెయ్యడమే 'అడివంటుకుంది' కథ. అదే విధంగా గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరిజన కార్పోరేషన్ సంస్థలే వారిని దోచుకుంటున్నాయనే వాస్తవ నిజాన్ని 'ఉద్ధరింపు' కథలో, గిరిజనేతరుల దోపిడీకి బలైపోయిన గిరిజనులు పేదరికంలోనే మగ్గిపోతున్న వాస్తవసంఘటనని 'ఊరు మీద కథ" అనే కథల్లో గిరిజనేతరులు గిరిజనుల్ని దోచుకున్న విధానాన్ని వివరించారు. శ్రీకాకుళ గిరిజన ఉద్యమం పుణ్యమా అని శ్రీకాకుళ ఆదివాసీ ప్రాంతాన గిరిజన సంఘాలు ఆవిర్భావం, గిరిజనులను చైతన్యపరచడం, రాత్రి పాఠశాలలు నడపడం, కొన్ని సమితిలలో ఆదివాసీలే ప్రెసిడెంట్లుగా ఎన్నిక కావడం, సహకార సంఘాలు నడవడం కంబారు (పాలేర్లు)లయిన ఆదివాసీలు కమ్యూనిస్టులుగా మారడం వడ్డీ వ్యాపారుల, రెవెన్యూ అధికార్లు, పోలీసు, ఫారెస్ట్ అధికార్ల దోపిడీ, దౌర్జన్యాలను సమ్మెలతో, ఆందోళనలతో, పోరాటాలతో ఆదివాసీలు ప్రజాతంత్ర జీవనాన్ని (Democratic Life) సాధించారు. ఇప్పుడు గిరిజనుల్లో మార్పు వచ్చింది. వాళ్ళ విశ్వాసాలను అడ్డుపెట్టుకొని గిరిజనేతరులు మోసం చేస్తున్నారనే స్పృహ కలిగింది. గిరిజనేతరుల చేతిలో గిరిజనులు మోస పోకుండా తెలివిగా తప్పించుకోవడం అలవరుచుకున్నారు. ఆ నేపథ్యంలో వెలువడిన మరి కొన్ని కథలు ఆదివాసీలను ఋణగ్రస్తుల్ని చేసి వారి పంటని, భూమిని దోచుకోవాలనే చూసే వ్యాపారుల మీద గిరిజనులు చేసే విప్లవ పోరాటమే 'ఇదేదారి' కథలోనూ, గిరిజనుల విశ్వాసాలను ఆశ్రయంగా చేసుకొని గిరిజనేతరులు మోసం చెయ్యాలని అనుకుంటే పొరపాటే, ఆదివాసీల జీవన విధానంలో మార్పులు సంతరించుకున్నాయని, గిరిజనులపై మైదాన గ్రామాల ప్రజల ఆగడాలు ఇక చెల్లవని 'విత్తనం' కథలో గిరిజన జీవితాల్లో వచ్చిన చైతన్య పోరాటాల కళ్ళకు కట్టినట్లుగా భూషణం చూపించారు.

మైదాన గ్రామాల నుంచి వచ్చిన వ్యక్తులు, అధికార్లు గిరిజనుల్ని మోసం చెయ్యడమే కనిపిస్తుంది కానీ, ఆదివాసీలు ఎప్పుడూ విశ్వసనీయతను కోల్పోలేదు. నమ్మే కొద్దీ నాగరిక సమాజం వాళ్ళను పీక్కుతింటూనే ఉంటుంది. నమ్మకానికే నమ్మకంగా కట్టబడి ఉన్న ఆదివాసీల తీరును 'నమ్మిక' కథలోనూ, ఒకవైపు గిరిజన శ్రామిక జీవుల ఔదార్యాన్ని, కృతజ్ఞతా తత్వాన్ని, విలువల్ని చూపుతూనే మరొకవైపు శ్రమజీవులు ఇచ్చే బహుమానానికి అధికారి డబ్బు అంచనా వేసే తత్వాన్ని 'విలువలు' కథలో గిరిజన మానవతావాద దృక్పథాన్ని చూడవచ్చు. నివసించే ఊరు, జీవనాధారమైన అడివి తప్ప, మరో లోకం తెలీని గిరిజనుల జీవితాల్లోకి, వారి పోడు వ్యవసాయంలోకి పట్నాల నుంచి, మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన బుగతలు, షావుకార్లు, పోలీసులు, ఫారెస్టు అధికార్లు దౌర్జన్యాలు చేసి వారిని కొల్లగొట్టారు. రాజ్యం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు స్థానిక గిరిజనులకు ఏ మాత్రమూ ఉపయోగపడకపోగా వారి ఆర్థిక స్థితిగతులను మరింత దిగజార్చిన సంఘటనలు కూడా లేకపోలేదు.

1970 దశకంలో జీవించిన గిరిజనులకు 2000 దశకంలో జీవనం సాగిస్తున్న గిరిజనులకు మధ్య వచ్చిన మార్పులకు రికార్డ్ చేసిన కథ 'కొత్తప్రశ్న'. ఈ మూడు దశాబ్దాల కాలంలో గిరిజనుల్లో వచ్చిన పెనుమార్పులకు ఈ కథ సాక్ష్యంగా నిలుస్తుంది. ఒకప్పటి గిరిజనుడు అమాయకుడు. అతడిని మోసం చెయ్యడం చాలా సులభం. ప్రపంచీకరణ ప్రభావంతో ఇప్పుడున్న గిరిజనుడు పట్నంతో స్నేహం చేసి లోకంపోకడ తెలుసుకున్నాడు. పాత మాయమాటలకి ఇక గిరిజనుడు లొంగడని తెలిపే కథలే భూషణం రాసిన 'కొత్తప్రశ్న'. *"మేరంగికి ఎగువ మాన్యాలలోను మేరంగి చుట్టూ మైదానాల్లోను జరిగిన గిరిజన పోరాటాలు ఆయన చేత యీ కథలను రాయించేయి. ఆ విధంగా ఒక గొప్ప వారసత్వంలో కలం పట్టిన భూషణం గారు యీ కథలు వ్రాసి ఇంకో కొత్త వారసత్వానికి మొదటి వారయ్యారు."* అని ప్రసిద్ధ కథకులు కాళీపట్నం రామారావు భూషణం గురించి ఇచ్చిన గొప్ప కితాబు. (కొండగాలి కొన్ని కథలు పుస్తకానికి కాళీపట్నం రామారావు 'మనవి' పేరుతో రాసిన ముందుమాట లోంచి...) తెలుగు సామాజిక, సాహిత్య చరిత్రలో శ్రీకాకుళ గిరిజన సాయుధ పోరాటం ఒక ముఖ్యమైన మైలురాయి. ఆ పోరాటం తర్వాత తెలుగు సమాజ చలనంలో గుణాత్మకమైన మార్పు వచ్చింది. ఆ పోరాటం తెలుగు సాహిత్యంపై ప్రసరించి వెలుగులోంచి కొత్త సాంప్రదాయాలు, రూపాలు, నిర్మాణాలు పుట్టుకొచ్చాయి. భూషణం మాస్టారు రాసిన ఈ కథలు మొత్తం సారాంశంగా చూసినప్పుడు ముప్పై ఏళ్ల కథా సాహిత్యంలో గిరిజనుల్ని మైదాన గ్రామాలు ఏ రీతిగా మోసంచేసి దోపిడీ చేసుకున్నాయో చెప్పారు. గిరిజనులు గోచిపాతలతో మిగిలిపోవడం, గిరిజన జీవనంలో పతనవిలువలు, కొండల్లో ఏదైనా అభివృద్ధి ఉంటే, అది గిరిజనుల అభివృద్ధి కాకుండా, ప్రజాధనం కొల్లగొట్టే ప్రజావిద్రోహ అభివృద్ధిగా ఉండడం, గిరిజన పంటలు, భూమి దోపిడీదారుల ఆస్తిగా ఉండిపోవడం, గిరిజనుల కష్టం పోలీసు, ఫారెస్ట్ అధికారుల జేబుల్లోకి వెళ్ళిపోవడం వంటి ఎన్నో విషయాలు భూషణం మాస్టారు కథల్లో ఒకవైపు చూడవచ్చు.

మరోవైపు నిరాడంబరంగా కనిపించే ఈ కథల వెనుక మూడు దశాబ్దాలపాటు శ్రీకాకుళం-పార్వతీపురం ఆదివాసీల జీవితాల్లో సంభవించిన విప్లవాత్మక పరిణామాల గురించి ఉంది. నగానికి పైగా తన జీవితకాలపు కృషినంతటిని గిరిజన శ్రేయస్సు కోసమే అంకితం చేసిన నిబద్ధ కథకునిగా భూషణం మాస్టారు ఎప్పటికీ నిలిచే ఉంటారు. గిరిజన జీవనంలో కనిపించే సంఘర్షణ, పోరాటాలు ప్రతిఫలింపజేసే ఇతివృత్తాలు భూషణం మాస్టారి కథల్లో ప్రత్యక్షమవుతాయి. ఆ తర్వాత వచ్చిన గిరిజన కథల పరిణామా వికాసంలో భాగంగా గిరిజనేతరులు గిరిజనుల్ని, గిరిజనులే గిరిజనులపై చేసిన దోపిడీ వ్యవస్థ కనిపిస్తుంది. ఈ కథల పరిణామమును రచయితల పరంగా ఇంకా పరిశీలించాల్సిన ఆవశ్యకత ఉంది.

**సొరిపల్లి నాగరాజు**
**పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.**

## అట్టమీద బొమ్మలు



జపనీస్ గార్డెన్ టెంపుల్
ఈ అపూర్వమైన బుద్ధ ప్రవచనాల గుడి గోపురం 33 దేశ ప్రభుత్వాల ప్రమేయంతో బుద్ధుని ప్రవచనాలతో నిర్మించబడింది. జపాన్ రాజు, అధ్యక్షుడు, ప్రధాని దీని నిర్మాణ వ్యవహారాలు పర్యవేక్షించారు.




భీష్ముడు
భీష్ముడు కురువంశ ప్రముఖుడు. కౌరవ సైన్యాధ్యక్షుడు. భీష్మ పితామహ బిరుదాంకితుడు.



అంబ, అంబిక, అంబాలిక
వీరి ముగ్గురు కాశీరాజు కుమార్తెలు. వీరిని భీష్ముడు కౌరవవంశ కోడళ్లుగా తీసుకువస్తాడు.



సిద్ధి వినాయకుడు
ఈ కాంశ్య విగ్రహం ఇండోనేషియాలో తయారైంది.

*2,3 చిత్రాలు ఖెమూర్ చిత్రకళకి సంబంధించినవి. మహాభారతంలోని అందరి వ్యక్తుల చిత్రాలను ధర్మ అనే చిత్రకారుడు చిత్రించాడు.*

# దళిత సాహిత్యం

– కొప్పరపు నారాయణ మూర్తి

తెలుగు సాహిత్యంలో 'దళిత సాహిత్యానికి 'ఒక విశిష్ట స్థానం ఉంది. తెలుగులో తొలి 'దళిత కావ్యం' 'నిరుద్ధ భారతం' ('అస్పృశ్యతా ఖండనం' అని కూడా అంటారు) అని ఆచార్య పులికొండ సుబ్బాచారి గారు నిర్ధారించారు (చూ. వివిధ, అక్టోబర్ 24, 2022). దీనిని రాసిన వారు మంగిపూడి వేంకట శర్మ. రచనా కాలం 1915. అదేవిధంగా నవలా సాహిత్యంలో ఉన్నవ లక్ష్మీ నారాయణ గారు రాసిన 'మాలపల్లి' తొలి దళిత నవల (1922) గా నిలుస్తున్నది. రెండూ గ్రామీణ జానపద నేపథ్యం కలిగినవే.

తొలి నాటి దళిత సాహిత్యం అగ్రవర్ణాల, భూస్వామ్య దోపిడీ వర్గాల చేతుల్లో దళితులు ఎంతటి దారుణ హింసకు గురయ్యారో కళ్ళకు కట్టినట్టుగా వివరిస్తుంది. నాడు భారత దేశంలో పట్టణాల కన్నా పల్లెలే ఎక్కువ ఉండేవి. కొన్ని విషయాలు మినహాయిస్తే నాటి పట్టణ జీవితాలకు, గ్రామీణ జీవితాలకు పెద్ద తేడా ఉండేది కాదు. ఈ కారణంగా దళితులు, దళితేతరుల మధ్య ద్వేష భావాలు తీవ్ర స్థాయిలో ఉండేవి. నేటికీ అవి కొనసాగు తున్నాయి. ఇది భారత జాతిలోని ఒకానొక మరచిపోలేని చీకటి అధ్యాయం. దీనికి ముగింపు ఎప్పుడో ఇంకా తేలని చీకటి కోణం. అయితే, ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే. ఈ చీకటి అంచున ఆకాలం లోనే ఒక వెండి జరీ వెలసింది. ఇక్కడ ఇరువర్గాలు (దళితులు, దళితేతరులు) తెలుసుకోవలసిన విషయం ఒకటి ఉంది. అదేమిటంటే బ్రాహ్మణేతరులు (దళితేతరులు, సబ్బండ వర్ణాలు) ఒకనాడు ఇదే నేల పైన అగ్రవర్ణాల చేతిమీదుగా హారతులు, అర్చనలు, జోహార్లు, పూజలు, గౌరవాలు అందుకొన్నారు. అదెప్పుడూ, ఎలా జరిగింది, ఎలా జరుగుతోంది? వివరించటమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం. ఇదే సమయంలో దళితేతరులు, అగ్రవర్ణేతరులు లేక సబ్బండ వర్ణాల సాహిత్యం మాటేమిటి? సాహిత్య చరిత్ర పరిశోధనలో వీరి గురించిన సాహిత్యం కూడా ఒక చర్చ జరపవలసి ఉంది. లేకపోతె బ్రాహ్మణేతరుల సాహిత్య చరిత్ర సమగ్రం కాదు. అతుకుల సాహిత్యం, గతుకుల చరిత్ర అవుతుంది. ప్రస్తుతం అలానే ఉంది. రాజకీయ బలం ఉన్నవైపు సాహిత్యంపై మాత్రము సాహిత్య శోధన జరుగుతున్నది

'కొన్ని ఘటనలు గ్రామీణ జీవనంలో జరిగినప్పుడు అవి కొంత కాలానికి చరిత్రగా మారతాయి. ఆ ఘటనలే జనపదుల నోళ్లలో నానుతూ కావ్య రచనకు ప్రేరణయినప్పుడు ఆ సాహిత్యం 'జానపదేతి' వృత్తంగా' రాసిన సాహిత్యం అవుతుంది' అంటారు ఆచార్య కొలకలూరి (కట్టమంచి) ఆశా జ్యోతి. సాహిత్యానికి, చరిత్రకు, వాస్తవఘటనలే ఊపిరన్నది నిర్వివాదంగా నిరూపించారు ఆమె తన 'ఆధునిక ఆంధ్ర కవిత్వంలో జానపదేతి ఇతివృత్తం 'పరిశోధనా గ్రంధంలో. పైగా ఆఘటనలు అగ్రవర్ణేతరులు, ప్రధానంగా సబ్బండ వర్గాలు, లేక దళితులే ప్రధాన పాత్రలుగా జరిగినప్పుడు ఆ సాహిత్యం జానపద 'అగ్రవర్ణేతరేతి' లేదా 'దళితేతరేతి' వృత్తంగా రాసిన సాహిత్యం కూడ అవుతుంది. 'దళితేతి' జానపద ఇతివృత్త సాహిత్యం గురించి ఈ వ్యాస ప్రారంభంలోనే చెప్పుకొన్నాం. ఈ సందర్భంగా కొలకలూరి ఆశాజ్యోతి తన పరిశోధనలో వెలుగులోకి తెచ్చిన 'ఆధునికాంధ్ర కవిత్వంలో 'జానపదేతి వృత్తం' నూతన సాంఘిక, సామాజిక సమీకరణ విశ్లేషణలకు దారులు తెరిచే పరిశోధనగా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంది .

దళిత సాహిత్యంలో కొలకలూరి ఇనాక్, వారి పుత్రిక ఆశాజ్యోతికి పేటెంట్లని తలపించే రచనలు ఉన్నాయి. ఉదాహరణకు ఆశాజ్యోతి గారు అనువదించిన మొదటి కన్నడ దళిత స్త్రీ ఆత్మకథ 'మాతంగి దివిటీ' (ద్రావిడ విశ్వవిద్యాలయం ముద్రణ) పాఠకుల కళ్ళెంబడి నీళ్లు రప్పిస్తుంది. అంటరాని తనమేగాక, సామాజికంగా ఒక దళిత స్త్రీ ఎన్ని రకాల హింసను, అవమానాన్ని ఎదుర్కొంటుందో ఈ ఆత్మ కథ వివరించిన తీరు హృదయం ద్రవింప జేస్తుంది. అలాగే, గీత నాగభూషణ గారి స్వీయచరిత్ర 'బతుకు ' (కేంద్ర సాహిత్య అకాడమీ

ప్రచురణ) కూడా. గీత నాగభూషణ బెంగళూరు విశ్వవిద్యాలయంలోనే ఆచార్యులుగా పనిచేస్తున్నారు. అయినా ఆవిడ బాల్యం నుంచీ ఎదుర్కొన్న వివక్ష మరిచిపోతగ్గది కాదు. కాబట్టే ఆవిడ తొలుత దానిని గ్రంథస్థం చేసింది కన్నడలో కూడా బహుభాషా కోవిదురాలైన ఆశాజ్యోతికి దానిని తెలుగులోకి తేవాలని తేవాలన్న సంకల్పానికి కారణం కూడా 'ఆ వివక్ష' ఎంత హీనమైందో, అమానవీయమైందో తెలుగు జాతికి తెలియ చెప్పటమే. ఇక 'జానపదేతి వృత్తం' పరిశోధనలో ఆశాజ్యోతి ఎన్నుకొన్న కథల ప్రాముఖ్యత నేటితరం పరిశోధకులను పాఠకులను ఆశ్చర్య చకితులను చేస్తుందని ఊహించి ఉండరు. ఆవిడ కేవలం ఈ వర్గాల ఘటనలను 'జానపద' ఇతి వృత్తంగానే దర్శించారు తన పరిశోధనలో. కానీ, ఈ పరిశోధన కొన్ని నూతన సామాజిక పరిణామాలను కూడా తెరపైకి తెస్తుందన్నది ఆవిడ అనుకోని ఉండరు. ఈ ఎంపిక వెనుక సాంఘిక, సామాజిక కోణాలు చాలానే ఉన్నాయి. ఇదేదో 'పరిశోధన' కోసం 'పరిశోధన' వంటిది కాదు. ఈ పరిశోధన 20వ శతాబ్ది ఆరంభంలో సాహిత్యంలో బహుముఖంగా వచ్చిన సామాజిక పరిణామక్రమానికి, ముఖ్యంగా బ్రాహ్మణేతరుల (దళితులూ, సబ్బండ వర్గాల జీవితాలు) జీవితాలు, త్యాగాలు సమాజంలోని అన్ని వర్గాలకూ ఎలా ఆదర్శప్రాయం అయ్యాయో, ఎలా అన్నివర్గాల ఆరాధన, పూజలు, జోహార్లు అందుకొన్నాయో ఒక్క చోటే ఒడిసిపట్టి విశదీకరిస్తుంది.

మొట్ట మొదటి విషయం ఏమిటంటే ఆవిడ ఎంచుకొన్న జానపద వాస్తవ ఘటనలు అటువంటివి. అవి: మునలమ్మ మరణం (1899), నలజారమ్మ (1917), ఒకనాడు (1965), నారాయణమ్మ (1966), మొహియారు (1972), మహాదాత (1973), స్వాతంత్ర్య వీరుడు (1977), పూర్ణాహుతి (1977), చివరగా గుండ్ల కమ్మ చెప్పిన కథ (1985). ఈ ఘటనలు ఎవరి పేరుమీద జరిగాయో అవే పేర్ల మీద ఖండ కావ్యాలు రాయటం జరిగింది. వీటిని రాసిన వారిలో ఇద్దరు మాత్రమే రెడ్డి కులస్తులు: కట్టమంచి రామలింగా రెడ్డి 'మునలమ్మ మరణం' రాయగా, దువ్వూరి రామిరెడ్డి 'నలజారమ్మ' ఖండ కావ్యం రాశారు. తక్కిన వాటిలో ఆరు ఖండ కావ్యాలను బ్రాహ్మణులయిన విద్వాన్ విశ్వం ('ఒక నాడు'), ముదివర్తి కొండ మాచార్యులు ('నారాయణమ్మ', 'పూర్ణాహుతి'), పోలూరి ఆంజనేయ ప్రసాద్ ('మోహియారు'), అందలం కృష్ణమూర్తి ('మహాదాత'), పాణ్యం నరసయ్య ('స్వాతంత్ర్య వీరుడు') రాశారు. నాగభైరవ కోటేశ్వరరావు (గుండ్లకమ్మ చెప్పిన కథ) ఒక్కరే కమ్మ వారు.

ఈ వ్యాసం ప్రారంభంలో తొలి దళిత కావ్యం 'నిరుద్ధ భారతం' (1915) రాసిన వారు మంగిపూడి వేంకట శర్మ గారని ఎందుకు పేర్కొనటం జరిగిందో ఈ పాటికి పాఠకులకు విదితం అయ్యే ఉంటుంది. ఇక ఈ ఖండ కావ్యాలలో ప్రధాన పాత్రలు ఎక్కువ శాతం రెడ్డి కులస్తులవే అయినప్పటికీ, 'ఒకనాడు' నాయకుడు హంపన్న 'బోయ' కులస్థుడు. 'మోహియారు'తురుష్కుడు. అతని నాయిక చంద్రవదన పద్మ నాయకుల కులస్తురాలు. అలాగే 'పూర్ణాహుతి'లో నాయుకుడు వేముల శెట్టి. ఇలా బ్రాహ్మణేతరులు బ్రాహ్మణ ఖండ కావ్యాలకు ప్రధాన నాయకులై నిలిచారు. బ్రాహ్మణేతరులైన కవుల ఖండ కావ్యాలకు కూడా బ్రాహ్మణేతరులే నాయకులై నిలిచారు. ఈ విషయంలో మంగిపూడి, ఉన్నవ (ప్రక్రియ పరంగా నవల అవటం మినహా) వారి పంథా కన్నా భిన్నమైన పంథాకు 1899-1917 మధ్యనే బీజం పడిందన్నది చరిత్ర చెబుతున్న సత్యం. ఈ మార్పు సమాజం నడకలో అప్పుడప్పుడే వస్తున్న పరిణామానికి అద్దం పడుతున్న దనటంలో సందేహం లేదు.

ఇంకా లోతుగా సమాజ చరిత్ర లోకి వెళ్లి పరికిస్తే సబ్బండ వర్ణాలకు చెందిన మొల్ల (కుమ్మరి కుటుంబానికి చెందిన వనితామణి) 16వ శతాబ్దానికే చక్కటి ఛందస్సులో రామాయణ రచన చేసింది. మొల్ల సాహిత్యం నిజానికి ఆనాటి అగ్రకులస్తుల, ముఖ్యంగా బ్రాహ్మల, అభిజాత్యానికి, అహంకారానికి ప్రతీకారంగానే వచ్చింది. మొల్ల కూర్చుని రాసిన రామాలయం నేటికీ గోపవరంలో ఉందని చరిత్ర చెబుతోంది. మొల్ల పేరున హైదరాబాద్ ట్యాంకుబండు పై విగ్రహ ప్రతిష్ట చేశారు. కృష్ణ దేవరాయలు ఆవిడ కవితను స్వయంగా ప్రశంసించారని చరిత్రలో ప్రచారంలో ఉంది. అంతకు పూర్వమే 13వ శతాబ్దంలో గోనబుద్ధారెడ్డి శ్రీ రంగనాథ రామాయణం (1270-1280) ద్విపద మీటర్లో రాసారని చారిత్రక ఆధారాలున్నాయి. మొల్ల తరువాత మరే తెలుగు (దళిత, సబ్బండ వర్గ వనితలు) వనిత రామాయణ రచన చేయలేదు. అలాగే గోనబుద్ధారెడ్డి

తరువాత రెడ్డి కులస్తులు, దళిత, సబ్బండ వర్గం వారు వాల్మీకి రామాయణం యధాతథ రచన చేయలేదు. ఈ రచయిత ఎరికలో లేని, రాని అన్య వర్ణాల వారి రామాయణ (భారత, భాగవత) అనుకరణలూ, అనుసరణలూ ఉంటే అవి వెలుగులోకి రావలసి ఉంది .

సామాజికంగా సాహిత్య చరిత్ర విశ్లేషణకు, జానపదేతి వృత్తాలకు అలాంటివి వెలుగులోకి రావటం చాలా అవసరం. ఆశాజ్యోతి జానపదేతి సాహిత్య శోధనకు ఇది పూర్వరంగం అయితే మధ్యలో ఖాళీలను డాట్స్ తో కలుపుకొంటూ పోలేము. సాహిత్య చరిత్ర శోధనలో దేనికైనా పూర్వ రంగం అంటూ ఒక గొలుసు ఏర్పడాలి. ఆ తర్వాతనే ఉత్తర రంగం ఆవిష్కరణ సులువు అవుతుంది. ఒకవేళ ఈనాటికి మనం పూర్వ రంగం టూకీగా కూడా ఏర్పరచు కోలేకపోయినా, ముందు తరాలు ఆపని చేసే దిశా నిర్దేశం చేయగలగాలి. ఈ విధంగా జానపదేతి వృత్తాలుగా ఆశాజ్యోతి ఎన్నుకొన్న కావ్యాలకు ఉత్తర పరిశోధనా ప్రాముఖ్యం (ముఖ్యంగా సాంఘిక, సామాజిక కోణంలో) ఉందనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

ఇక ఇతి వృత్త కథల విషయానికి వస్తే కట్టమంచి రామలింగా రెడ్డి రాసిన 'ముసలమ్మ మరణం' ముందుంది. ఈ కథలో పూజలందుకొంటున్న వారిలో ఒకరైన 'ముసలమ్మ' అనంతపురంకు చెందిన బుక్కరాయ సముద్రం గ్రామస్తురాలు. ఒకసారి ఈ బుక్కరాయ చెరువుకు గండిపడితే, ఆ చెరువులోని గంగమ్మ తల్లి ఆ ఉరి ప్రజలతో 'ఎవరినైనా ఒక స్త్రీని ఈ చెరువు లోకి తోసేస్తే, నేను మీ ఊరు ముంచకుండా ఆగిపోతాను', అని. అప్పుడు ఆ గ్రామ వాసి అయిన బసిరెడ్డి కోడలు ముసలమ్మ నీళ్ళలోకి దూకి ప్రాణ త్యాగం చేస్తుంది. అంతటితో గంగ శాంతించి ఆ ఊరును ముంచకుండా వదిలేస్తుంది. ముసలమ్మ చేసిన ఈ త్యాగం గుర్తుగా ఆ ఉరి ప్రజలు నాలుగు వేపచెట్లను ముసలమ్మ దూకిన చోట నాటారు. ఈ వృత్తాంతం మద్రాస్ గాజిటీర్ లో అచ్చయింది. అప్పటినుంచీ ఆ ఉరే గాక చుట్టు పక్కల వారు కూడ అక్కడికి వచ్చి ముసలమ్మకు పూజా, పునస్కారాలు, పోటేళ్లను బలిచ్చి మాసం నైవేద్యంగా సమర్పిస్తారు. ఇప్పుడు అక్కడ రెండు వేపచెట్లే ఉన్నాయి. అయినా పూజలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ముసలమ్మ మరణం గురించి అనంతపురం, బుక్కరాయ సముద్రం చెరువు నిర్మాణం తెలిపే కైఫీయత్తుల్లో వివరాలు ఉన్నాయి. ఈ కథలో 'ముసలమ్మ' నిజంగా ముసలిది కాదు. చిన్న వయస్కురాలైన బసిరెడ్డి ఏడో కోడలు. ఈ కావ్యం గురించి పింగళి లక్ష్మీ కాంతం గారు రాసిన మాటలు ఒక సారి ఆలకిస్తే ఇక్కడ నూతన సామాజిక కోణం ఏమిటో తెలుస్తుంది. 'తెనుగులో స్త్రీ పాత్రకు ప్రాధాన్యమిచ్చి రాసిన కావ్యములు చాలా తక్కువ. ఈ కావ్యములోని 'ముసలమ్మ' పాత్ర యతి నిపుణముగా జిత్రిత మైనదే గాని పూర్వ పద్ధతి ని వర్ణితమైనది కాదు'.

దువ్వూరి రామిరెడ్డి రాసిన నలజారమ్మ నెల్లూరు సీమకు చెందింది. గూడూరులో నివసించింది నలజారమ్మ. భర్తకు మరణ శిక్ష పడగా, భర్తతోనే సహగమనం చేసిన వనిత. నేలజారమ్మ పేరున గూడూరులో గుడి ఉంది. ఆ వీధి పేరు కూడా నలజారమ్మ వీధి. నెల్లూరు చుట్టూ పేరంటాళ్ళు నేజారమ్మ కథను విధిగా చెప్పుకొంటారు. నలజారమ్మ రెడ్డి కులస్తురాలు. భర్త వెంకటరెడ్డి పొరపాటున చేసిన చర్య దొంగతనంగా మారి నాటి తురుష్క రాజుల ఏలిలో మరణ శిక్షార్హమైనది. ఇక్కడ అన్ని కులాలవారు నలజారమ్మను దేవతగా, నమ్మిన వారిని ఆదుకొనే అమ్మగా కొలుస్తారు. విద్వాన్ విశ్వం రాసిన 'ఒకనాడు'లో హంపన్న నాయకుడు. రైల్వే గేట్ కాపలా దారు. ఒక చిన్న గదిలో గేట్‌కు దగ్గరగా ఉంటుంటాడు. ఇతను గుంతకల్లు –గుత్తి మధ్య ఉన్న రైల్వే గేటు వద్ద కాపలా దారుగా పనిచేస్తుంటాడు. బ్రిటిష్ వాళ్ళు పరిపాలిస్తున్న రోజులవి. అక్టోబర్ 4, 1893న బ్రిటిష్ సైన్యం గుంతకల్లులో అడుగుపెట్టింది. ఆ రోజు సాయంత్రం గుగ్గిళ్ళు అమ్ముకొనే కురుబ జాతి స్త్రీ ఒకరు,వ్యవసాయం చేసుకొని జీవించే లింగాయత్ కాపు కుటుంబానికి చెందిన మరో స్త్రీ కలిసి పొలం వైపు నుంచి వస్తుండగా, బ్రిటిష్ సైనికులు వారిని వెంబడించారు. వారు గూళ్ళపాలెం వద్ద ఉన్న హంపన్న ఇంటికి రక్షణ కోసం పరిగెత్తారు .

ఇది గమనించిన హంపన్న బ్రిటిష్ సైనికుల మనస్సులో ఉన్న దుర్మార్గపు ఆలోచన గ్రహించి వారిని తనఇంట్లో దాచి సైనికులను అడ్డుకున్నాడు. వారి మధ్యహెూరాహెూరీ పోరాటమే జరిగింది. హంపన్న మల్లెపందిరి వెదురు బొంగు పీకి వారిపైకి ఎగబడ్డాడు. వారిని చావ చితక బాదాడు. ఫలితంగా బ్రిటిష్ సైనికులు కాలికి బుద్ధి చెప్పారు. అయినా వారిలో ఒకడు వెనుకకు తిరిగి హంపన్నపై కాల్పులు జరపగా ఒక గుండు హంపన్న తొంటిలోకి దూసుకెళ్లింది. మూలుగుతూ నేలకొరిగిన

హంపన్నను వైద్యానికి తీసుకెళ్లారు. గుత్తిలో ఉన్న మిలిటరీ అసిస్టెంట్ సర్జన్, బ్రిటిష్ అధికారి కారాపిట్ వైద్య సహాయం చేసినా హంపన్న బ్రతకలేదు. నేటికీ గుత్తిలో బెంగళూరు -కర్నూలు హైవే పై మన్రో సత్రం దగ్గర హంపన్న సమాధి ఉంది. ఈ సంఘటన నాటి హిందూ దినపత్రికలో వచ్చింది. ప్రజలు, హిందూ దినపత్రిక సేకరించిన విరాళాలతో ఆయన సమాధిపై తొమ్మిది అడుగుల శిలాఫలకం వేయించారు ప్రజలు ముదువర్తి కొండమాచార్యులు సృష్టించిన మరో ఖండకావ్యం 'నారాయణమ్మ' తన భర్త పాపిరెడ్డి తురుష్క ప్రభువు దౌష్ట్యంవలన మరణించగా సహగమనం చేసిన మహా వనిత. నెల్లూరు సీమలో జరిగిన మరో పతివ్రతా శిరోమణి త్యాగం ఈ కావ్య వస్తువు. కందుకురమ్మ, కోరలి కళు గోళమ్మ, గూడూరు తాళ్ళమ్మ, సూళ్లూరు చెంగమ్మ, జొన్నవాడ కామాక్షమ్మ వంటి మహా వనితలు గ్రామ దేవతలై పూజ లందుకొంటున్న రోజులవి. నారాయణమ్మ గుండం పడిన చోటు కుప్పంచి పాడు. ఇది నెల్లూరులో ఈ నాటి నెహ్రూ నగర్లో ఉంది. ఇప్పటికీ సంక్రాతి నాడు పెరటోళ్లు నారాయణమ్మ జీవిత గాథను ఆనాడు గానం చేస్తే, నారాయణమ్మకు గ్రామోత్సవం జరుపుతారు.

నారాయణమ్మ కావ్యం విషాదాంతం కింద పరిగణించలేమని ఆ కావ్యానికి పీఠిక రాసిన వావిలాల రామమూర్తి గారు అభిప్రాయ పడ్డారు. ఆవిడలో దైవత్వం మరణం తర్వాత కూడా ప్రకటితం అవటాన్ని బట్టి ఆమెను శివ స్వరూపిణిగా వర్ణించారు వావిలాల రామమూర్తి. ఎందుకంటే దేవతల ఇతివృత్తాలలో దేవత విషాదాంతం ఉండదు. పైన పేర్కొన్న నెల్లూరు పరిసర గ్రామాల్లోని దేవతలందరూ వేరు వేరు కులములవారు. అయినా వీరు దేవతలై నిత్య పూజలు అందుకొంటున్నారు. ఈ రకమైన ఆలోచనకు నాడే ఆజ్యం పోసిన వారు పింగళి లక్ష్మీ కాంతం. వావిలాల రామమూర్తి అదే అభిప్రాయాన్ని నారాయణమ్మ కావ్యానికి ప్రకటించారు. పోలూరి ఆంజనేయ ప్రసాద్ రాసిన 'మొహియారు' ఒక మతాంతర విషాద ప్రేమ వృత్తాంతం. 14-15 శతాబ్దాల మధ్య రేచర్ల వంశస్థులైన పద్మ నాయకులు కదిరి కేంద్రంగా పాలించారు. రంగనాయకులు వారిలో ఒకరు. వారి కుమార్తె చంద్రవదన. మొహియారు పర్షియా దేశం నుంచి వచ్చిన అందగాడైన వజ్రాల వ్యాపారి. వీరిరువు కదిరి నరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలోనే తొలిసారి ప్రేమలో పడతారు. ఆవిషయం తెలిసి రాజు మొహియారును చంపిస్తాడు. తన తండ్రే మొహియారును చంపించాడని తెలిసి నిండు సభలో చంద్ర వదన ఆత్మార్పణ చేసుకొంటుంది. మొహియారు, చంద్రవదనల దేహాలను అప్పటి ప్రజలు కదిరిలోని ముస్లిముల శ్మశాన వాటికలో ఒకే చోట కలిపి ఖననం చేశారు. ఈ సమాధులు చాలా ఖరీదైనవిగా అందంగా ఉంటాయి. నేటికీ కదిరి వెళ్లిన వాళ్ళు వాటిని దర్శించవచ్చు. కదిరి దేవాలయం ఎంత ప్రాశస్త్యం గలదో, అక్కడికి వచ్చే వారికి ఈ సమాధులు కూడా అంతటి దర్శనీయ క్షేత్రమే.

అందలం కృష్ణమూర్తి సృజించిన ఖండకావ్యం 'మహాదాత'లో వెంగళ రెడ్డి దాన ధర్మాలతో జీవిస్తూ, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతూ ప్రాణం వదిలాడు. పాణ్యం నరసయ్య రాసిన 'స్వాతంత్ర్య వీరుడు' ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి ఆంగ్లేయులతో పోరాడి ప్రాణాలు అర్పించాడు. ముదువర్తి కొండమాచార్యులు రాసిన 'పూర్ణాహుతి' ఖండ కావ్యంలో వేమాల శెట్టి ప్రజల తాగునీటి అవసరాలకోసం బావి తవ్విస్తూ, బావిలో ఎంతకూ నీరు పడకపోవడంతో తన ప్రాణం అర్పిస్తాడు. ఆ వెంటనే బావిలో నీళ్లు ఉబికి పైకి వస్తాయి. నాగ భైరవ కోటేశ్వర రావు సృజించిన 'గుండ్ల కమ్మ' ఖండ కావ్యం కూడా ప్రేమాయణమే. ఇది అద్దడు, అంకి చెంచు జాతి కలహాల కారణంగా ఆత్మార్పణ చేసికొంటారు.

ఇక్కడ వీరందరూ దేవతలై పూజలు, హారతులు అందుకోవడానికి కారణం వారి చర్యలు దోష రహితం, మానవ సంక్షేమం అవటమే. అంటే గాని వారి కులాలు కాదు. అందువల్లనే వీరు బ్రాహ్మణులకు, బ్రాహ్మణేతరులుకు కావ్య వస్తువులు అయ్యారు. కులంతో గాక, గుణం, దోషారాహిత్యం, మానవ శ్రేయస్సు కోరే వారందరూ సమాజానికి ఆదర్శనీయులేనని నిరూపించే ఈ ఇతివృత్తాలతో వెలుగొందిన ఈ జానపదేతి ఆధునికాంధ్ర కవిత్వం కొత్త సామాజిక సాంఘిక విశ్లేషణలకు ముందు తరాలకు ముందు చూపు నిస్తుందనటంలో అతిశయోక్తి ఏమీ లేదు.

డా. కొప్పరపు నారాయణ మూర్తి
తెనాలి, ఫోన్ : 7671909759

# రెండు వంశాలు - రెండు జమీందారీలు

*- గార రంగనాథం*

పద్నాలుగుతరాల క్రిందట ప్రస్తుతం విజయనగరం జిల్లా రాజాంలో కాలూని, పిదప బొబ్బిలిలో కోటకట్టుకొని వర్ధిల్లిన బొబ్బిలిరాజవంశం ఓ వృక్షం అనుకుంటే, దానిని మొదటినుండీ చివరివరకూ అంటిపెట్టుకొని పెనవేసుకొన్న కుటుంబం ఇనుగంటివారిది. రావువంశీయులైన బొబ్బిలివారు కాలూనడంతో ఏర్పడిన లింగాలవలస, జమీందారీవ్యవస్థ ఏర్పడిన తరువాత వావిలవలస జమీందారీగా వైభవప్రాభవాలను సంతరించుకుంది. ఇనుగంటివారు బొబ్బిలిరాజులకు సన్నిహిత బంధువులై, వావిలవలస జమీందారులుగా పేరుబడడానికి తగిన కారణాలను, ఆనాటి పరిస్థితుల్ని ఈ వ్యాసంలో వరామర్శిద్దాం. కంటిఎదుట ఉన్న నది పుట్టు పూర్వోత్తరాలు, దాని పరిణామగతి తెలుసుకోవాలంటే అది పుట్టినవైపు పరిశీలనాదృష్టితో పయనించాల్సిందే! ఎంత వెనక్కినడిస్తే అంతచరిత్ర!

బొబ్బిలిరాజులు రాకముందు ఈ రాజాం ప్రాంతం హెచ్చుభాగం జయపురం సంస్థాన పాలనలో, పాలకొండ సవరరాజుల ఏలుబడిలో కొంత భాగం ఉండేదని చరిత్ర చెబుతోంది. చిన్నచిన్న చెట్లతో, డొంకలతో నిండిన ఆకులకట్టడవి లాంటి చిట్టడవి. పూర్తిగా వర్షాధార భూములు. అక్కడక్కడ చిన్న చిన్న పల్లెలు ఉన్నప్పటికీ, అవి అడవిమీద జీవించే గిరిజనులు, దళితులు, గొల్లలతో నిండి ఉండేవని అంచనా వేయవచ్చు. వారే ఈ ప్రాంతానికి మూలవాసులు. బొబ్బిలి పాలకులరాక తరువాత, పాలనావసరాలకోసం వారితోపాటు కాపులు (తూర్పు కాపులు), తెలంగాణ నుండి సైనికులుగా తెలగాలు, బ్రాహ్మణుల వంటివారు ఈ ప్రాంతానికి వచ్చి చేరారు. ఆవిధంగా ఈప్రాంతంలో రాజాంతోపాటు, లింగాల వలస, వావిలవలస, లక్ష్మణవలస, తోకలవలస మొదలైన పదులకొద్దీ వలసలు, ఊళ్ళు ఏర్పడ్డాయి.

**బొబ్బిలి రాజుల తొలి స్థావరం లింగాలవలస.**

వెంకటగిరి సంస్థానానికిచెందిన రాయడప్పు, అతని కొడుకు లింగప్పకు 1652లో గోల్కొండనవాబుల ఫౌజ్‌దార్ షేర్ మహమ్మద్‌ఖాన్ రాజాంహుండాను ఇచ్చాడు. ఆ ప్రాంతంలో ఓ మెరకమీద వారు ఓ వలసను నిర్మించుకున్నారు. లింగప్ప నిర్మించిన వలస లింగాల వలస అయింది. ఏరకమైన లింగాలు లేని గ్రామం కాబట్టి, లింగప్ప ఏర్పాటు చేసుకున్న వలస లింగాలవలస అనడం సబబు. రావువారితోపాటు, సన్నిహితులైన మరికొందరు బంధువులు కూడ వారివెంట వచ్చి ఆ లింగాలవలసలో వలస పక్షులై జీవించి ఉంటారు. వారిలో రావువారికి వియ్యంకులైన ఇనుగంటివారువచ్చి ఉంటారు. ఉత్తరోత్తరా రావువారు రాజాం, బొబ్బిలి పట్టణాలను నిర్మించుకొని రాజ్యాధిపతులుగా వెళ్ళారు. అలా బొబ్బిలి వరకూ ప్రయాణించినా, వారి పూర్వ స్థావరం లింగాల వలసను పూర్తిగావదలి పోలేదు. రావువారికి ఈ లింగాలవలస పూర్వస్థావరం అనడానికి మూడు కారణాలున్నాయి. ఒకటి రాజాం ప్రాంతంలో దాదాపు వది గ్రామాలలో వెలమదొరలు ఉన్నప్పటికీ, ఈ ఇనుగంటి, రావు అనే రెండువంశాల వారు ఉన్నఊరు ఇదే కావడం, రెండు ఈ లింగాలవలసలో గల వెలమలలో నేటికీ ఆవంశాలవారే అధికసంఖ్యాకంగా ఉండడం, మూడు ఇనుగంటివారు ఆ ప్రక్కనేగల వావిలవలస జమీందారులుగా ఉన్నతిని పొందడం కూడ ఈ ప్రాంతంలో పద్మనాయక వెలమలు తొలుత ఏర్పరచుకున్న వలసగ్రామం లింగాలవలసని చెప్పవచ్చు.

**బొబ్బిలి రాజుల అజ్ఞాత చరిత్ర**

రావువారు అక్కడ ఉంటూ అప్పటి అవసరాలకు తగ్గట్టు నాలుగైదేళ్ళలో రాజాంలో కోటను నిర్మించుకున్నారు అని చరిత్రను అంచనా వేయవచ్చు. రాజాంకోట అంటే పెద్ద ప్రహరీలో ఓ దర్బార్‌హాలు, కొన్ని నివాస భవనాలు మాత్రమే! ఆ కాలంలోనే పలాసదరి రంగవాక అనేచోట పితూరీదారులు బంధించిన షేర్‌మహమ్మద్ ఖాన్ కొడుకును సాహసంతో లింగప్ప విడిపించి తెచ్చాడు. ఆ ఆనందంతో ఖాన్ లింగప్పకు రాజాం, బొబ్బిలి పట్టణాల మధ్య 12 పోటుగ్రామాలను బహుమతిగా ఇచ్చాడు.

పోట్లాటలో విజయుడైనందుకు దక్కిన గ్రామాలు గనుక పోటుగ్రామాలు అయ్యాయి. ఆ తరువాతే రాజాందొరలు బొబ్బిలిలో కోటకట్టుకొని బొబ్బిలి చేరిపోయారు. (ఈ వ్యాసంలో దొరలు అంటే పద్మనాయకవెలమలని అర్థం. మన తెలుగునేలలో రాజులు బ్రిటిష్‌పాలనలో జమీందారులుగా మారారు)

బొబ్బిలియుద్ధం 1758 జనవరి 24న జరిగింది. పరాసు, మహమ్మదీయ, విజయనగర సైనికుల ధాటికి కోట, దానితోపాటు ముఖ్య వెలమసంతతి అంతా విధ్వంసానికి గురైంది. అందుచేత అంతకు ముందరి చరిత్రంతా యుద్ధాగ్నికి ఆహుతయింది. అనంతర కాలంలో, రావువారిపాలన పునరుజ్జీవం జరిగిన తరువాత, చరిత్రకారులు అక్కడక్కడ సేకరించి బొబ్బిలిచరిత్రను పునర్నిర్మించుకున్నారే తప్ప, స్పష్టమైన నిర్ద్వంద్వమైన చరిత్రలేదు. లభించినంత వరకూ బొబ్బిలియుద్ధం తరువాత దిట్టకవి నారాయణకవి రచించిన 'రంగరాయ చరిత్ర ప్రబంధం', ఉత్తరాంధ్రను ఆంగ్లేయులు హస్తగతం చేసుకున్న తరువాత ఆంగ్ల చరిత్రకారులు రాసిన చరిత్రలు, బొబ్బిలి యుద్ధగాథలోని వీరోచిత సన్నివేశాలను తెలుగు నేలంతా పాడుతూ వస్తున్న జముకులపాట (బుడబుక్కల పాట) వంటి జానపద కళాకారులవద్ద సేకరించిన విషయాలను క్రోడీకరించి బొబ్బిలిచరిత్ర నిర్మాణం జరిగింది. ఆయాచరిత్రలను బట్టి బొబ్బిలిసంస్థానంలో ఈ ఇనుగంటివారి ప్రాధాన్యతను తెలుసుకుందాం.

**బొబ్బిలి సంస్థానాధీశులైన రావు వారికి ఇనుగంటి వారికి ఉన్న వృక్షలతానుబంధం:-**

"బొబ్బిలి సంస్థానపు సరదారులలో ఇనుగంటి పెద లక్ష్మీనరసయ్యగారు, దామెర ధర్మారాయుడు గారు, రావు చిన్నయ్యగారు, తాండ్రపాపయ్యగారు ముఖ్యులు. ఇందు ఇనుగంటి నరసయ్యగారు రాజు రామకృష్ణ రంగారావుకు మేనమామ. చెలికాని వెంకయ్యగారు బావమరిది, మల్లమదేవి సోదరుడు. దామెర ధర్మారాయుడు మేనత్త భర్త. రావు చిన్నారాయణం గారు దాయాదులైన పాల్తేరు వాస్తవ్యులు"[1] 'ఇనుగంటి పెద లక్ష్మీనరసయ్యగారికి, సర్వసైన్యాధ్యక్ష బాధ్యతల నొప్పగింపబడెను'[2] 'ఇనుగంటి పెద లక్ష్మీనరసయ్యగారు బుస్సీ దేరాకు రాయబారమేగెను'[3]

అరకొరగా తెలుస్తున్న బొబ్బిలిచరిత్రలో ఇనుగంటి వారి ప్రస్తావన తొలిసారిగా ఇక్కడే కనబడుతుంది. పైవాక్యాల వలన బొబ్బిలియుద్ధ రాజు గోపాలకృష్ణ రంగ-రావుకు ఇనుగంటి లక్ష్మీ నరసయ్య మేనమామ, సర్వ సైన్యాధ్యక్షుడు, రావు వారి సామ్రాజ్యాన్ని తన భుజస్కంధాలమీద వోయ గల శక్తిమంతుడు, నమ్మకస్తుడు. కనుకనే బొబ్బిలిలో విడిదిచేసిన బుస్సీదేరాకు (ఆచోటే నేటి బూశాయవలస) రాయ బారిగా పంపబడతాడు దింపుడు కళ్ళం ఆశతో! అదే చివరి రాయబారం. 1758 సరికి ఇతడు రాజుకు మేనమామ అంటే రాజుకు తాతగారు ఇనుగంటివారు. అప్పటికి 50 సంవత్సరాలనుండైనా ఆ ఇరుకుటుంబాల మధ్య బంధుత్వం ఉందని చెప్పవచ్చు. రాజాం కోటనుండి, అంతకు ముందర 1652లో లింగాలవలసను నిర్మించి నప్పటి వీరు బంధువులు అని చెప్పుకున్నాం కదా! దానికి ఉపబలకంగా 'ఇనుగంటివారు పద్మనాయక ప్రముఖ సంస్థానములన్నిటి యందును రాజబంధువులుగా విలసిల్లిరి' [4] బుచ్చినాయన ఇలా రాస్తూ ఈ ఇనుగంటివారు తిరువూరుతాలూకా చీలపాడు, రేచర్ల (పశ్చిమగోదావరి), తిరుపాచూరులకు జమీందారులుగా చేశారు. ఇదే వంశంవారు వేంకటగిరి, నూజివీడు, జట్‌ప్రోలు సంస్థానాల (రావు వారికి) రాజబంధువులు. కొన్ని గ్రామాలకు మొఖాసాదారులు. అన్నవరం సత్యనారాయణస్వామి కోవెలకు ధర్మకర్తలు కూడ అని ఉటంకించారు. ఈ ఇనుగంటి పెదనరసయ్యతో పాటు యుద్ధచరిత్రలో ప్రముఖంగా వినిపించిన పేర్లు ఆ తరువాత కనుమరుగయ్యాయి. వారంతా యుద్ధంలో



వావిలవలస జమీందారుల నివాస భవనం

మరణించడమో, లేక క్షతగాత్రులయి బ్రతుకుజీవుడా అంటూ ఏమూలనో బంధువుల ఇళ్ళలో తలదాల్చు కోవడమో జరిగి ఉంటుంది. అంతమాత్రాన ఈ ఇనుగంటివారి బంధం బొబ్బిలిరాజులైన రావువారితో సమసిపోలేదు.

బొబ్బిలియుద్ధం జరిగిన మరునాడు, బుస్సీదొర పశ్చాత్తాపాన్నిపొంది చిన రంగారావును (బొబ్బిలి యుద్ధంలో మరణించిన రాజు గోపాలకృష్ణ రంగ-రావు కొడుకు) బొబ్బిలికి రాజుగా పట్టాభిషేకం చేశాడు. అదనంగా కొత్తపల్లి జాగీరును ఇచ్చాడు. రక్షకుడుగా అతని చిన్నాన్న వెంగళరావును ఉండమని చెప్పి వెనుదిరిగాడు. ఐతే బుస్సీ వెళ్ళిన తరువాత ఆ ప్రాంతాన్ని విజయనగరం రాజు వశంచేసుకున్నాడు. వెంగళరావు ఆప్రాంతంలో ఉండలేక చిన రంగారావును తీసుకొని రాజాంకోటకు చేరిపోయారు. రాజాం, సంతకవిటి పరగణాలను స్వాధీనం చేసుకొని పాలిస్తూ, ఇనుగంటి చిననరసయ్య సహకారంతో చిన రంగారావును రాజాంకోటలో ఎనిమిదేళ్ళపాటు పెంచాడు. 1765లో వెంగళరావు మరణించిన తరువాత అదే సంవత్సరం విజయనగరంరాజు ఆహ్వానం మేరకు చినరంగారావు విజయనగరం వెళ్ళి అక్కడ బంధింప బడ్డాడు. విజయనగర రాజుల పడగనీడ ఆరోజుల్లో బొబ్బిలి వారిపై నిరంతరం ఉండేది. దాని బారినుండి తప్పించడానికి ఆయనను రాజాంనుండి సీతారామపురం, ఇనుగంటివారుండే లింగాలవలసలకు తిప్పుతూ రక్షించేవారని ఇప్పటికీ రాజాం ప్రాంతవాసులు కథలుగా చెప్పుకుంటారు. రాకుమారుడి రక్షణ కోసం ఆ ఎనిమిదేళ్ళలోనే లింగాలవలస ప్రక్కనేగల వావిలవలసలో ఇనుగంటివారు ఓ అంతఃపురాన్ని నిర్మించుకొని ఉంటారు. కొన్ని సంవత్సరాలతరువాత చిన రంగారావు విజయనగరంనుండి తప్పించుకొని సామర్లకోటలో పిన్నమ్మ జగ్గమ్మ ఇంట్లో కొద్దిరోజులు ఉండి, అనుచరులతో హైదరాబాదు వెళ్ళాడు.- ఈ పేరాలోని విషయాలన్నిటినీ బొబ్బిలికి తొమ్మిదవ రాజైన శ్వేతాచలపతి రంగారావు కూర్చిన 'బొబ్బిలి జమీందారీ' అనే గ్రంథంనుండి గ్రహించాను.

ఈ రకంగా వియ్యంకులైన ఇనుగంటివారు రావువారిని అన్ని కష్టసమయాల్లోనూ ఆదుకుంటూ, వెన్నంటే ఉన్నారని చరిత్రచెబుతోంది. యుద్ధంలో క్షతగాత్రుడై మిగిలిన వెంగళరావు, యువరాజు చినరంగారావు రాజాం కోటలో తలదాచుకొన్నప్పుడు ఎనిమిదేళ్ళపాటు ఈ ఇనుగంటి చిననరసయ్యే అన్నీ చూసుకొని ఉంటాడు. కాబట్టే చరిత్రలో అంత ప్రాధాన్యతను సంపాదించుకున్నాడు. ఈ చిన నరసయ్య బహుశా యుద్ధసమయం నాటి రాజుకు మేనమామ అయిన ఇనుగంటి పెదనరసయ్యకు తమ్ముడో, కొడుకో అయి ఉంటాడు. రాజు శత్రువులకు చిక్కిపోవడం, రాజాం, సంతకవిటి పరగణాలనుకూడ విజయనగరం పూసపాటి వారు వశం చేసుకోవడం జరిగిన తరువాత ఈ చిన నరసయ్య రాజాంను వదలి వావిలవలసకు చేరిపోయుంటాడు. 1765 నుండి 1794లో పద్మనాభ యుద్ధం జరిగినంతవరకూ రాజాం ప్రాంతం విజయనగర సామ్రాజ్యంలో భాగమయింది. పద్మనాభ యుద్ధంలో విజయనగరరాజులు నిర్వీర్యులు కాగా ఉత్తరాంధ్ర అంతా బ్రిటిషువారి ఏలుబడిలోకి వచ్చింది. ఆసందర్భంగా నిజాంరాజు చిన రంగారావుకు, అతని వారసత్వమైన బొబ్బిలిని అప్పగించమని విశాఖపట్నం కలెక్టరుకు తాఖీదు ఇచ్చాడు. ఆ విధంగా బొబ్బిలిసంస్థానం తిరిగి ఏర్పడినతరువాత రాజాం ప్రాంతం బొబ్బిలివారి అధీనంలోకి చేరిపోయింది. బ్రిటిషువారి ఏలుబడిలో 1801లో రావువారు బొబ్బిలి జమీందారులయ్యారు. అప్పటినుండీ ఈరాజాం ప్రాంతానికి పూర్వవైభవం ఏర్పడి, వావిలవలసజమీందారీ ఏర్పాటుకు పరిస్థితులు అనుకూలించాయి.

**జమీందారీ వ్యవస్థ - వావిలవలస జమీందారీ**

బొబ్బిలియుద్ధం తరువాత ఎనిమిది తరాలపాటు బొబ్బిలిరాణుల పేర్లు తెలుస్తున్నాయి. వారిలో కనీసం ఐదుతరాలలో వావిలవలస ఇనుగంటివారి ఆడపిల్లలు రాణులుగా బొబ్బిలిరాజ్యానికి వచ్చారు. వీరిలో ఒకరు రాజమాతగా నాల్గుతరాలపాటు సంస్థానాన్ని నడిపించారు. మరొకరు బొబ్బిలికి రాణిగాను, తమ ఏజంట్‌గాను బ్రిటిషు వారిచే గుర్తింపబడ్డారు. ఈ చిన రంగారావుకు దత్తపుత్రుడు, బొబ్బిలి సంస్థానానికి ఎనిమిదవతరం రాజైన రాయడప్ప రంగారావు 1790-1830 మధ్య జీవించారు. బొబ్బిలి, రాజాంలలో సత్రవులను కట్టించాడు.'రాయుడప్ప రంగారావు గారు దానధర్మాలు చేస్తూ బాగా పాలించినా శిస్తులు మాత్రం చాలా కఠినంగా వసూలు చేసేవారు'(5)

ఈయన తనకు మూడవభార్యగా వావిలవలసకు చెందిన ఇనుగంటి లక్ష్మీనరసయ్యమ్మను వివాహమాడారు. భర్తమరణానంతరం ఈమె రాజమాతగా మనుమలను, మనుమల మనుమలను చూశారు. 90 ఏళ్ళు బతికి 1899లో మరణించారు. 'and then the Rajah married a lady, Lakshmi narasayyamma Garu, of Vavilavalsa Inuganti Family. She lived for about 90 years and died in 1899. This old lady was very virtuous and orthodox in her religion. Her life was one which few would probably be able to beat. She lived to see her grand-son's grand son'(6)

ఈ రాజమాతకు స్వయానా తమ్ముడే ఇనుగంటి సీతారామయ్య ఉరఫ్ సీతారామస్వామి. బహుశా వీరు రాజాంలో చినరంగారావుకు రక్షకుడైన ఇనుగంటి చిననరసయ్య బిడ్డలు కావచ్చు. ఈ విధంగా సీతారామస్వామి సంస్థానంలో రాజుగారి బామ్మర్దిగా అడుగుపెట్టాడు. "ఇనుగంటి చెల్లమాంబా సీతారామ చంద్రుల పెద్దకుమారుడైన రామరాయలు (1810-1870) మండలేముల వేంకటకవి రచించిన క్రియాయోగసార కృతికి ప్రేరకుడు. ఇనుగంటివారు పెంపాల గోత్రజులు. వీరిలో కేశవరాయలు ఆద్యుడు. సీతారామచంద్రప్రభువు ప్రఖ్యాతుడు'' 'ఈతడు బొబ్బిలిరాజైన రాయడప్ప రంగరాయల వియ్యంకుడు. రాజా శ్వేతాచలపతి రంగరాయలకు (9వతరం రాజు) ప్రపదన రీతిని ఉపదేశించిన విశిష్టాద్వైత సిద్ధాంత విజ్ఞాని. బొబ్బిలి సంస్థానం సర్వసేనాని, ముఖ్య ప్రధాని. సీతారామప్రభు కుమారుడు రామరాయలు. రాజా రాయడప్పరంగరాయల అల్లుడు. ఉంగరాడ, కింతలి, మంతెన ఎస్టేటు దారుడు. రాజారాయడప్ప రంగరాయలకు ఇనుగంటివారి ఆడపడుచైన బుచ్చమాంబిక వల్ల గలిగిన సీతయ్యమ్మ రామరాయల భార్య'(7) పై గ్రంథంలో ఉటంకించిన రెండుపేరాలవలన ఇనుగంటి సీతారామయ్యభార్య చెల్లమాంబ అని, అతని కుమారుడు రామరాయలని తెలుస్తోంది. ఈ రామరాయలకు రాయడప్పరంగరావు తన భార్య బుచ్చమ్మ వలన కలిగిన కుమార్తె సీతయ్యమ్మనిచ్చి పెళ్ళి చేశాడు. మరొక కుమార్తె గోపాయమ్మను తన మరొక మేనల్లుడైన ఇనుగంటి రాజగోపాల రాయనికిచ్చి వివాహం జరిపించాడు. రాయడప్ప మరణానంతరం పెదభార్య చెల్లయ్యమ్మ కొడుకు శ్వేతాచలపతి రంగారావు బొబ్బిలికి తొమ్మిదవతరం రాజుగా నియమితుడయ్యాడు. 1810-62 మధ్య జీవించాడు. వీరిదివాన్, సిరిపురం జమీందార్ ఇనుగంటి సీతారామయ్యతో కలిసి పాలకొండ సంస్థానానికి పూర్వదివాన్ కంబర వెంకటనాయుడు, అతని మేనల్లుడు అప్పారాయుడులను లొంగదీసుకున్నాడు. 1856లో మంతిన, 1857లో కింతలి అనే రెండుఎస్టేట్‌లను కలబరిగి భాస్కరనరసింగరావు పంతులునుండి కొన్నాడు.

'The Rajah bestowed the propritary estates of Wungarada, Kintali, and Mantina on Rajah Inuganti Rama Rayanin Garu, and the estates of Chidikada and Jagannadhapuram on Rajah Inuganti Rajagopala Rayanin Garu, both being his brothers-in-law, i.e., his sisters' husbands, and thus made them the proprietors of these estates respectively. The later dyieng without issue, Chidikada and Jagannadhapuram were taken back with the consent of his widow, Gopayyamma garu, sitster to the Rajah, and were given to Inuganti Sitaramaswami Garu, a nephew of the Rajah, i.e., another sister' son'(8)

పై పేరావలన ఈ శ్వేతాచలపతి రంగారావు తన సోదరి సీతయ్యమ్మ, రంగరాయల దంపతులకు వీరికి గతంలోఉన్న సిరిపురంఎస్టేట్‌తో పాటు అదనంగా ఉంగరాడ, మంతెన, కింతలి ఎస్టేట్‌లను అరణంగా ఇచ్చాడని తెలుస్తోంది. అప్పటినుండి వావిలవలస జమీ వైభవోపేతం అయిందని చెప్పవచ్చు. మరొక సోదరి గోపాయమ్మ భర్త ఇనుగంటి రాజగోపాల రాయనికి చీడికాడ, జగన్నాధపురం ఎస్టేట్‌లకు అధిపతిని చేశాడు. రాజగోపాల రాయనింగారు మరణించడంతో ఆ రెండు ఎస్టేట్‌లూ గోపాయమ్మ వెనుకకు ఇవ్వగా వాటిని మరొక మేనల్లుడు ఇనుగంటి చిన సీతారామస్వామికి అప్పజెప్పారు.

ఈవిధంగా ఇంచుమించు 1825 నుండి 1949 వరకూ దాదాపు 125 సంవత్సరాలపాటు జమీందారీ హోదాను వావిలవలస అనుభవించిందని చెప్పవచ్చు. ఇలాంటి వైభవోపేతమైన దశలోనే ఈ జమీందారులు లింగాలవలస వావిలవలసల మధ్య ఓ అందమైన మేడను కట్టుకున్నారు. దానిని దర్బారుహాలుగానూ వినియోగించుకొనేవారు. అందమైన బొమ్మలు ఉండి చిన్నపిల్లల్ని ఆకర్షించడం చేత పిల్లలు దానిని బొమ్మలమేడ అనేవారు.

'Vavilavalasa Zamindari is one of the Zamindari estates in madras Presidency during the British rule in india. It covered an area of 440.30 square miles and had a population of 33,006 in 1877' -chatgpt

1845-68 మధ్య జీవించిన బొబ్బిలి 10వ జమీందారు సీతారామకృష్ణ రాయడప్ప రంగారావు-ఐదేళ్ళేపాలించారు. ఇతనిభార్య వావిలవలస జమీందారుల ఆడపడుచు ఇనుగంటి లక్ష్మీచెల్లాయమ్మ. భర్తమరణం తరువాత రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నారు. దివాన్ మరియు సిరిపురం జమీందార్ ఇనుగంటి సీతారామస్వామి సంస్థాన బాధ్యతలన్నీ ఆమెతరపున చూసుకొనేవారు.

'His wife, Rani Lakshmi Cellayamma Bahadur Garu- After her husband's death, the management of the Zemindari devolved on her, she had, for her Dewan, Inuganti Sitarama swamy Garu, Proprietor of Siripuram, a man of ability, who had also been Dewan during the time of her father-in-law'(9)

భర్త చిన్నవయసునే మరణించడంచేత చెల్లాయమ్మ వేంకటగిరినుండి 11వ జమీందారుగా వేంకట శ్వేతాచలపతి రంగారావును దత్తత తీసుకున్నారు. ఈయన1862-1927 మధ్య జీవించారు. BOBBILI ZEMINDARI గ్రంథరచయిత ఈయనే! బ్రిటిష్ప్రభుత్వం కోరికమేరకు చెల్లాయమ్మ 1876లో బెంగాల్ కరువుకు సాయంగా వెయ్యిగరిసెల ధాన్యాన్ని (40వేల బెంగాల్ మౌండ్స్) పంపించారు. బస్తర్‌లో జరుగుతున్న తిరుగుబాట్లను అణచడానికి బ్రిటిషువారి కోరికమేరకు తనసైన్యాన్ని పంపించారు. తన తరపున ఈమె దివాన్ ఇనుగంటి సీతారామయ్యను ప్రిన్స్ వేల్ సందర్శన కోసం మద్రాసు పంపించారు. బ్రిటిషు ప్రభుత్వం బొబ్బిలి రాణిగాను, బ్రిటిషువారి తరపున సంస్థానపు ఏజంట్‌గాను ఈమెను గుర్తించారు. 1887లో మరణించారు. ఈమెను సీతారామస్వామికి కూతురని చెబుతారు. బొబ్బిలి యుద్ధంలో ఇనుగంటి పెద నరసయ్యకు ఎంతటి ప్రాధాన్యత కనిపిస్తుందో, బొబ్బిలి జమీందారీలో ఈ సీతారామయ్యకు అంతటి ప్రాధాన్యత కనిపిస్తుంటుంది. ఈయన బొబ్బిలి సంస్థానానికి దివాన్ మాత్రమే కాకుండా, సిరిపురం ఎస్టేట్‌కు జమీందారుగా, బొబ్బిలిజమీందారు శ్వేతాచలపతి రంగారావుకు ఆంతరంగికుడుగా, పాలకొండ తిరుగుబాటుదార్లను అణచే విషయంలో రాజుకు కుడిభుజంగా కనిపిస్తారు. రాయడప్పకు వియ్యంకుడుగా, శ్వేతాచలపతికి మామగా, రాజుకు సమఉజ్జీగా, కృష్ణదేవరాయలకు తిమ్మరుసుకంటే మిన్నగా జీవించాడు. బొబ్బిలి రాజమాత ఇనుగంటి లక్ష్మీనరసమ్మ నుండి, మూడుతరాలపాటు సంస్థాన బాధ్యతల్ని తన భుజస్కంధాలమీద మోశాడు. సిరిపురంఎస్టేట్ ప్రొప్రైటర్‌గా తొలినాళ్ళలో కనిపించిన ఈయన, తరువాతికాలంలో వావిలవలస జమీందారుగా చరిత్రలో ప్రస్ఫుటమౌతారు. రాజులతోపాటు సాహిత్యపోషణలోనూ పాలు పంచుకున్నాడు.

**వావిలవలస వారి సాహిత్య సేవ**

"రాయడప్ప రంగారావుగారికే కాక వారి దివానుగా, బావమరిదిగా, సంస్థానపు వ్యవహారాలలో ప్రముఖుడైన ఇనుగంటి సీతారామయ్యకుకూడ వెంకటకృష్ణయ్య గ్రంథాలు అంకితమిచ్చాడు. విజ్ఞానేశ్వరీయములోని వ్యవహారకాండను ఆయన ప్రోద్బలంవల్లనే అనువదించాడు. కాకతీయయుగంలోనే మూలఘటిక కేతన దీనిని తెనిగించాడు. అయినా బొబ్బిలిలో దాని ప్రతులు దొరకలేదేమో. అందుకే అనువాదం చేయవలసిన అవసరం వచ్చింది కాబోలు. ఇనుగంటి సీతారామయ్య గారు 'వ్యవహార కాండమైనన్ ప్రవిమల గతి' తెనుగు చేయమన్నారు. ప్రావీణ్యముమీరగా అనేక చమత్కారము లావిర్భవించేటట్టు రచించమని ఆయన చెప్పాడు. అయిదాశ్వాసాలలో కొటికలపూడి వెంకటకృష్ణయ్య (1764-1838) దానినిసాధించాడు"(10)

*'సుత నిరామయతకై సూర్యనారాయణ*
*స్వామిని గని హర్షవల్లినుండి*
*వావిలివలసకు వచ్చి యిన్గంటి సీ*
*తారామ విభుఁగాంచి తత్ప్రతిజ్ఞ*
*నఁటచి యా "తన్వంగి" యనెడు వసుచరిత్ర*
*లోని పద్యమునకు శ్లోక రచన*
*ప్రతిన నిన్నూట యేఁబది యూరు పద్యముల్*
*గలుగు షోడశ విధ కంద రచన*
*తత్త్వముల కన్న నెక్కుడు ధారగల్గి*
*వింత యగునట్టి యాశుకవిత్వ రచన*
*నాకు గల్గించి తెలిగించి నాఁడవౌరఁ!*

హరిహరేశ్వరదేవ! మహానుభావ!... ఈ పద్యం మండపాక పార్వతీశ్వరశాస్త్రి తన 'ఆత్మచర్య' లో రాశారు.



సీతారాముల ఆలయ
గాలి గోపురం,
గుళ్ళ సీతారాంపురం,
రాజాం

'ఆ వావిలవలస ప్రభువులే ఇన్నూటఏబదిఆరు విధాలుగా జదువదగిన కందపద్యాన్ని వ్రాయమని పార్వతీశ్వరశాస్త్రి గారిని అడుగగా ఆయన ఆశువుగా చెప్పిరట!'(11) ఇంతకు ముందరే చదివిన దానిని బట్టి ఇనుగంటి సీతారామస్వామి అతని కొడుకు రామారాయనిం గారు సాహిత్య పోషకులు, సాహితీ వేత్తలని తెలుస్తోంది. వీరు తప్పితే ఈ వావిలవలస జమీందారులలో సాహిత్యాభిలాష కలవారు లేరని తెలుస్తోంది.

**సీతారామస్వామి-సీతారామపురం**

రాజాంనుండి తూరుపుదిక్కునకు ఎనిమిదికిలోమీటర్ల దూరంలో గుళ్ళసీతారాంపురం ఉంది. ఆ గ్రామానికి ఉత్తరాన నాలుగైదు కిలోమీటర్ల దూరంలో వావిలవలస, లింగాలవలసలు ఉన్నాయి. లింగాలవలసకు ఐదు కిలోమీటర్ల ఉత్తరాన ఉంగరాడ ఉంది. ఇదే సీతారాంపురానికి ఆగ్నేయంగా పది కిలోమీటర్ల దూరంలో మంతెన ఉంది. అక్కడికి ఐదు కిలోమీటర్ల దూరంలో వావిలవలసవారి తొలితాణా సిరిపురం ఉంది. సిరిపురానికి ఆగ్నేయంగా 12 కిలోమీటర్ల దూరంలో కింతలి ఉంది. ఇవన్నీ వావిలవలస జమీందారీ ఎస్టేట్ గ్రామాలు కాగా, ఈదూరాలను ఉజ్జాయింపుగా వేయడమైనది. అన్నిగ్రామాలకూ గోర్జిలూ, చెఋవుగట్లు, పొలంగట్లే కాలిబాటలుగా అనుసంధానమైన రోజుల్లో ఈ రాజాం, సీతారాంపురంల మధ్య మెటల్‌రోడ్డు ఉండేది. దానిపై గతశతాబ్దం ఎనిమిదవదశకం వరకు జట్కాబళ్ళు తిరిగేవి. ఈ రోడ్డు బొబ్బిలిజమీందారులు వేయించింది కాగా, జట్కాలు రాచరికచిహ్నాలు. వీటన్నిటి మధ్య ఓపెద్ద ఆధ్యాత్మికనిలయంగా, రాజరిక కార్యక్రమాలన్నిటికీ కేంద్రంగా, సంస్థానానికి కూడలిగా ఈసీతారామపురం ఉండేది. ఒకప్పుడు ఇది రాజాంకంటే మిన్న అయిన క్షేత్రం. ప్రత్యేక నాగరికతగల గ్రామం.

షేర్ మహమ్మద్ ఖాన్ ఇచ్చిన హుండా కనుక, గోల్కొండ నవాబులు నమ్మినదేవుడు భద్రాచలరాముడు కాబట్టి, లింగప్ప అతని సంతతి వారు లింగాలవలసకు, రాజాంకు మధ్యన గల పల్లెలో రాముడిపేరన సీతారాముల ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడ మూలవిరాట్టు 'సీతారాములు' ఇద్దరూ ఏకశిలపైనే చెక్కబడ్డారు. అందుకే సీతారామాలయం అయింది. ఆ రాముడు పేరనకట్టిన ఆలయంవెలసిన ఊరుగనుక ఇది సీతారాంపురం అయింది. ఈ ప్రాంతంలో గుడులు ఎక్కువగా ఉన్నాయి గనుక గుళ్ళ సీతారామపురం అయిందని ఇప్పటికీ చెప్పుకుంటారు కానీ లింగాలవలసలో లింగాలు లేనట్టే గుళ్ళ సీతారామపురంలో గుళ్ళులేవు. ఈ దేవుని భక్తులుగా ఈ వావిలవలస జమీందారులు, ఈప్రాంతపు పద్మనాయక వెలమలు, ప్రజలు ఈ సీతారాముల పేర్లనే ఎక్కువగా పెట్టుకొనేవారు.

పాతపల్లెకు ఉత్తరాన రాజులు కట్టించిన సీతారాముల కోవెల, కోవెలకు ఇరుపక్కలా అర్చకుల, దేవదాసీల, ఇతరసేవకుల ఇళ్ళు ఉన్నాయి. దానికిముందర విశాలమైనస్థలం, రోడ్డుకు ఉత్తరాన డోలామంటపం, కోనేరు, దక్షిణాన వినియోగంలోలేని ఓపెద్దభవంతి ఉన్నాయి. సీతారాముల డోలోత్సవాన్ని బొబ్బిలి సంస్థానాధీశులు అంతఃపురకాంతలతో పాటు ఈ మేడమీద నుండే తిలకించేవారు. ఇవన్నీ రాజరికవ్యవస్థకు చిహ్నాలుగా నేటికీ పొడగడుతుంటాయి. ఈచోటుకు దక్షిణాన గొల్లలు, తూర్పున కొత్తగా కట్టుకున్న కాలనీలో దళితులు ఉన్నారు. వారే ఈ పల్లె మూలవాసులు. ఈ సీతారాముల కోవెలలో గర్భగుడి తలుపులమీద పెద్ద పెద్ద మీసాలతోడి రెండు ఇత్తడి మగబొమ్మలు ఉన్నాయి. అవి రెండూ ఒకేలా ఉండి చెరొక తలుపుమీద ఉంటాయి, వాటి వక్షస్థలాల దిగువ భాగాన ప్రమిదలు ఉండి, దీపాలు పెట్టుకోడానికి ఏర్పాటు చేసిన ఇత్తడిరేకుల బొమ్మలవి. వాటి గుండెలమీద ఐదుతావళాలు చెక్కబడి ఉంటాయి. ఒక బొమ్మమీద తావళామధ్య రెండవైపులకు వచ్చేటట్లు 'బొబ్బిలిరాజా శ్రీ శ్వేతాచలపతి రంగారావు దాసుడు' అని, మరొక బొమ్మమీద 'రాజా ఇనుగంటి సీతారామదాసుడు' అని రాయబడి ఉన్నాయి.

వీటిని పరిశీలిద్దాం. ఈ ఇద్దరు రాజులూ పుట్టడానికి వందేళ్ళ క్రిందటే, అనగా క్రీ.శ.1700 ఇటుఅటుగా బొబ్బిలిరాజులు రాజాంకోటలో పాలనసాగిస్తున్న రోజుల్లోనే

ఈ ఆలయాన్ని నిర్మించారన్నది చారిత్రక సత్యం. అప్పటికి పుట్టనివ్యక్తుల ఇత్తడిబొమ్మలు ఈతలుపులపైకి ఎలా వచ్చాయన్నది ప్రశ్న. ఐతే కోవెల కట్టిననాడే తలుపులమీద జయవిజయుల ఇత్తడిబొమ్మలను నాటి రాజులు ఏర్పరచారన్నది సత్యం. అందుకే వాటి వక్షస్థలాలక్రింద దీపారాధనకు ప్రమిదలఏర్పాటు. ఆరెండూ ఒకేలాంటి పోతబొమ్మలు. కనుక కోవెల కట్టించిన రాయుడప్పవి కాని, అతడి కొడుకు లింగప్పవి కాని అయిఉండవచ్చు. వందేళ్ళ తరువాత వావిలవలస జమీందారీ ఏర్పడి వైభవోపేతం అయిపుడు, బొబ్బిలిరాజు శ్వేతాచలపతి రంగారావు, వారి మేనమామ ఇనుగంటి సీతారామ స్వామి జమీందారులుగా ఈ ప్రాంతంలో అధికారాన్ని చలాయిస్తున్నప్పుడు, అప్పటి విగ్రహాలమీద తమ పేర్లను వ్రాయించుకున్నారనేది మరొక వాదన. ధర్మకర్తలుగా ఈకోవెల వైభవమంతా వారి చలవేకదా! అలా కాకుండా ఆ మామాఅల్లుళ్ళ హయాంలోనే, ఆ ఇత్తడి బొమ్మలను పెట్టించి, శ్రీరామదాసులుగా తమ పేర్లను రాయించు కున్నారన్నది ఇంకొక వాదన. అలా అయితే ముఖాలు వేర్వేరుగా ఉండాలికదా! ఏది ఏమైనా బొబ్బిలికి, రాజాందరి వావిలవలసకు విడదీయరాని బంధుత్వబంధం ఉందని, వావిలవలస జమీందారీ బొబ్బిలికి ఉపజమీందారీ అన్నది వాస్తవం. బొబ్బిలివారి అధికారదర్పానికి, వైభవానికి, విలాసాలకు వావిలవలస జమీందారీ ఎంతో సహకరించిందన్నది కూడ నిజం. సీ తారామపురం, ఉంగరాడలలో పెద్దపెద్ద మేడలు బొబ్బిలిరాజుల విహారపు విడుదులని నేటికీ గతకాలపు వారు చెప్పుకుంటారు.

"అటు పిమ్మట నుంగరాడ ప్రొప్రయిటరుగారి యాశ్రయమును బొంది, వారి దాబేదారుల పిల్లలకు విద్యగఱపుచు నాకాలముననే ప్రొప్రయిటరుగారి యాస్థానమున నున్న యొక పండితునియొద్ద నలంకార శాస్త్రమును జదివి కోవిదుడయ్యెను"(12) పైవాక్యం ఉంగరాడలో కొంతకాలం ఉండి అనంతరకాలంలో బొంతలకోడూరుజమీందారుల ఆశ్రయాన్ని పొంది విచిత్రరామాయణాన్ని తెలుగులో రాసిన కళ్ళేపల్లి వేంకట నరసింహామూర్తి (క్రీ.శ. 1864-1911) గురించి రాయబడింది. ఐతే పందొమ్మిదవ శతాబ్దపు చివరిలో జీవించిన ఈ ఉంగరాడ ప్రొప్రయిటరు ఎవరో ఇదమిత్థంగా చెప్పలేం. ఎందుచేతనంటే వావిలవలస జమీలోని ఇనుగంటివారి పిల్లలు, మనుమలు ఒకొక్కరూ జమీకి చెందిన ఒకొక్కఎస్టేట్‌లో అధిపతులుగా ఉండేవారు. వీరందరూ వావిలవలస జమీందారీ అనే గొడుగుకింద బతికేవారు. వావిలవలస జమీందారీ కూడ బొబ్బిలి జమీందారీ కనుసన్నలలోనే అధికార బాధ్యతల్ని నిర్వర్తించేది. అందుచేతనే ఈ జమీందారీలో అడుగడుగునా బొబ్బిలి వారి పాదముద్రలు కపిపిస్తూనే ఉంటాయి. బొబ్బిలిరాజులు అనే చెబుతారేగాని, ప్రత్యేకంగా వావిలవలసను గూర్చి అంతగా ఈప్రాంతం వారు చెప్పుకోరు. బొబ్బిలివారికి వీరు అత్యంతసన్నిహిత బంధువులై పెద్దగీతపక్క చిన్న గీతగా మిగిలిపోయారు.

ఇనుగంటి రామరాయనిం గారు, రాజగోపాల రాయనిం గారిని చిన్నప్పుడే దత్తత తీసుకోవడంవలన రాజగోపాల రాయనిం గారు మైనరుగారయ్యారు. వీరు చిన్ననాడే ఇంగ్లాండు వెళ్ళి చదువుకున్నారు. వావిలవలస గ్రామానికి పడమరన గల మామిడితోటలో మైనరుగారి శిధిలభవనాన్ని నేడూ చూడవచ్చు. ఈ మైనరుగారి ఇంట (తోటలోని దర్బార్ మహల్) కృష్ణునివిగ్రహం ఉండేదని, శ్రీకృష్ణతత్త్వంతో భజనలు, అర్చనలు జరిగేవని లింగాల వలసకు చెందిన దామెర భావనరావుగారి శ్రీమతి ఇనుగంటి సరోజ (మైనరుగారి మనుమరాలు) చెప్పారు. మైనరుగారి భవంతి నుండి బొబ్బిలివరకూ గోర్జితోవ ఉండేది. ఆ గోర్జిగుండానే అక్కడికి, ఇక్కడికీ రాకపోకలు సాగించేవారు. నాటుబళ్ళు, గుఱ్ఱాలు ప్రయాణించేవి. సిరిపురం, సంతకవిటి, సీతారాంపురం మొదలైన ఠాణాల నుండి సేకరించిన భూమిశిస్తులను, ఇతరసామగ్రిని ఆగోర్జి గుండానే బొబ్బిలిపంపేవారని ఇక్కడివారు చెప్పుకొంటారు. ప్రతి రెండు రోజులకు రెండుకావిళ్ళ మంచినీరు సంకిలి నుండి బొబ్బిలికోటకు వెళ్ళేదని అనువాదరచయిత, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, దామెర వెంకటరావు నాతోచెప్పారు.

వావిలవలసలో ఇంతకు ముందే అంతఃపురంగా చెప్పుకునే బంగ్లాను అనుసరించి రంగనాథస్వామి కోవెల ఉంది. వందేళ్ళక్రిందట శ్రీరంగం నుండి తెప్పించి,

ప్రతిష్ఠించిన రంగనాథస్వామి విగ్రహం అందులోఉంది. ఈ జమీందారులతో పాటు, పద్మనాయక వెలమలందరూ వైష్ణవమతావలంబులే! ఆ దేవుడికి బుడితిలోగల 14 ఎకరాలపొలం నుండి శిస్తు అందుతున్నట్టు తెలిసింది. రెండువందల ఏళ్ళకిందట ఈ జమీందారులు ఈ కోవెలకు సమకూర్చిన దాదాపు కిలో బరువుగల బంగారు విగ్రహాన్ని, కోవెలకు చెందిన ఏనుగును ఈ మైనరుగారు శ్రీరంగంలో గల రంగనాథునికి అప్పగించినట్టు ఇక్కడివారు చెప్పు కుంటారు. మైనరుగారికి ఏడుగురు భార్యలు ఉండేవారని, వారిని వావిలవలస, ఉంగరాడ, గుళ్ళపాడు తదితర ఏడుగ్రామాలలో గల ఒకొక్క భవనంలో ఒకొక్కరినీ ఉంచారని చెప్పుకుంటారు. మైనరుగారి ఒక కుమార్తెను రావువారికి ఇవ్వగా ఆమెకు 7గురు కుమారులు. జమీందారీ వ్యవస్థ అనంతరం మిగిలిన ఆస్తి వారి భోగాలకు కరిగిపోయిందని చెబుతారు.

**జమీందారీ రద్దు అనంతర పరిస్థితులు**

1949లో జమీందారీ రద్దుచట్టం అమలులోకి వచ్చింది. బొబ్బిలి జమీందారీతోపాటు వావిలవలస జమీందారీ కూడ రద్దయింది. భూభాగం అంతా భారత ప్రభుత్వ అధీనంలోకివెళ్ళింది. ఎవరు నివసిస్తున్న ఇళ్ళకు, స్థలాలకు వారే యజమానులయ్యారు. జమీందారీల, అగ్రహారాల, దేవాదాయ, మొఖాసాల భూముల్ని కౌలుకు దున్నుతున్న రైతులు భూమికి హక్కుదారులయ్యారు. ఇనాంభూములు ఇనాందారులకు చెందిపోయాయి. నామ మాత్రపు భూమిశిస్తు ప్రభుత్వానికే కట్టేవారు. రైతులమీద అజమాయిషీ, గ్రామకంతాలు, బంజరుభూములు జమీందారుల చెఱనుండి మునసబుకరణాల గుప్పిటిలోకి వెళ్ళాయి. వీరి పీడనకూడ అధికంకావడంతో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి. రామారావు మునసబు కరణాలు, పటేలుపట్వారీల వ్యవస్థను ఒక్క కలంపోటుతో రద్దుచేశారు. తిరిగి రాజాం నుండి బొబ్బిలి చేరిపోయిన రాజులు రాజాంకోటలోని దర్బార్‌హాలును 1865లోనే జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వానికి అందజేశారు. అనంతరం 1984లో ఇందులోనే సబ్ కోర్టును ప్రభుత్వం నెలకొల్పింది. జమీందారీ రద్దు తరువాత ఉంగరాడ, వావిలవలసలలో గల భవనాలను జమీందారుల వారసులు అమ్మేశారు. వావిలవలసలోని అంతఃపురాన్ని ప్రముఖవ్యాపారవేత్త, మిథునం చిత్రనిర్మాత, అదే ఊరికి చెందిన కీ,శే. ముయిద ఆనందరావు కొనుక్కున్నారు. లోపలి ప్రాసాదాన్ని తొలగించి ఒకభవనాన్ని ఆధునికహంగులతో నిర్మించు కున్నారు. అదేభవనంలో, అదే గ్రామంలో మిథునంసినీమా తీశారు. సిరిపురంతాణా భూస్థాపితంకాగా, గ్రామస్థులు ఆక్రమించుకొని కొత్తగా కాలనీ నిర్మించుకున్నారు. హక్కులు కోల్పోయిన జమీందారులు రాజకీయాలకు, పరిశ్రమలకు, వ్యాపారాలకు కుదురుకున్నారు. చదువరులు ఉద్యోగాలను అందుకున్నారు. వారినాశ్రయించి బ్రతికిన మధ్యతరగతి కుటుంబాలు వ్యవసాయం వంటి వివిధవృత్తులు చేసుకుంటూ బతుకుతున్నారు. పేదలు, పరిచారికాగణం చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లాచెదురయ్యారు.

జమీందారీ అనంతరం వారి బంధువులు రాజాంలో సత్రవును తొలగించి, శ్రీనివాసా టాకీసు నిర్మించారు. అది గతశతాబ్దం చివరివరకూ పనిచేసి, ఇటీవలే అమ్ముడు పోయి, షాపింగ్ కాంప్లెక్స్‌గా మారిపోయింది. పొనుగుటివలస, ఇజ్జిపేట, బిల్లాణి, తలతంపర గ్రామాల మధ్యగల దుప్పులబీడు ఉండేది. బీడుమీద బతికే వందలాది దుప్పుల్ని ప్రజలు వేటాడి చంపేశారు. ఆ బీడు నేడు రకరకాల వ్యక్తుల చేతిలోకి చేరిపోయింది. తాణావీధిలోని పాతతాణా నిన్నమొన్నటి వరకూ తహసీల్దార్ కార్యాలయంగా పనిచేసింది. దానిలో తాంద్రపాపా రాయుడిదిగా చెప్పుకుంటున్న ఏడువందల గ్రాముల ఐదుపేటల తావళం నేటికీ ఓ పెట్టెలో భద్రంగా ఉంది. గుఱ్ఱాల, ఏనుగులశాల ప్రభుత్వ ఆస్పత్రిగా మారిపోయిది. మరికొన్ని భవనాలు స్కూల్ భవనాలుగా, కార్యాలయాలుగా ఇంకా నిలిచి ఉన్నాయి. బొబ్బిలి జమీందారులు కట్టించిన జార్జి కారోనేషన్‌క్లబ్ ఆధునీకరణ చెంది నేటికీ వైభవోపేతంగా తనసేవల్ని అందిస్తోంది. ఈ రకంగా బొబ్బిలి, వావిలవలస జమీందారీలు కాలపరిణామానికి గురయ్యాయి. కాలచక్రం ముందుకే నడుస్తుంటుంది. దానిని ఆపడం ఎవరితరం కాదు. గతచరిత్ర పాదముద్రలను పుస్తకాలకు ఎక్కించడమే చరిత్రనిర్మాణం.

**గార రంగనాథం**
**రాజాం (విజయనగరం జిల్లా)**
**ఫోన్ : 98857 58123**

# బంగోరె - బ్రౌన్

ఎన్. ఎలిజబెత్ జయకుమారి

బంగోరె అంటే బండి గోపాల రెడ్డి. ఒక విశిష్ట వ్యక్తి. చారిత్రక పరిశోధకుడు. ఒక చిన్న ఆధారం దొరికితే చాలు దాన్ని పట్టుకుని దాని పుట్టు పూర్వోత్తరాలు తెలుసు కోనేదాక నిద్ర పోయే వాడు కాదు. చరిత్ర పట్ల చారిత్రకాంశాల పట్ల అతనికి ఉన్న శ్రద్ధ అలాంటిది. చరిత్రను కాపాడుకొనే విషయంలో మనకున్న నిర్లక్ష్యమే బంగోరెను ఇంతటి స్థాయికి చేర్చిందనటంలో సందేహం లేదు. బంగోరె లాంటి చారిత్రక పరిశోధక వ్యక్తులు మనకు ఎక్కువగా లేరు. కాని పరిశోధన చేసే టప్పుడు అంకిత భావం ఎంత ఉండాలో ఎంత త్యాగబుద్ధి అవసరమో లాంటివి మనకు నేర్పాడు.

బాల్యం : బంగోరె 12.10.1938 లో నెల్లూరు జిల్లా కోవూరు తాలుకా మినగల్లులో జన్మించాడు. విద్యాభ్యాసం కోవూరులో జరిగింది. ఇంటర్మీడియట్ నెల్లూరు వి.ఆర్ కాలేజిలో ముగించి బి.కామ్ (ఆనర్స్) ఆంధ్రాయూనివర్శిటీ వాల్తేరులో పూర్తి చేశాడు.

వ్యక్తిత్వం : బంగోరెకు స్నేహమంటే ప్రాణం. సంగీతమన్నా సాహిత్యమన్నా పిచ్చి. జర్నలిజం, సినిమాలు, చరిత్ర ఒకటేమిటి అభిరుచులు ఎన్నో మరెన్నెన్నో. 1954లో బంగోరె ఆంధ్రాయూనివర్శిటీలో చేరక ముందు ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది. కాని కామర్స్ ఇంకా మంచిదని బి.కామ్ (ఆనర్స్‌లో) చేరాడు. అయితే జీవితంలో ఏ మాత్రం కమర్షియలైజ్ కాలేదు. అన్యాయం అక్రమం ఎక్కడ కనిపించినా భగ్గుమనేవాడట. మల్లంపల్లి సోమశేఖరశర్మలాంటి గొప్ప చరిత్ర పరిశోధకుడు డిగ్రీలు లేని పాండిత్యంబు వన్నెకురాని ఈ పాడుకాలాన పుట్టినందున ప్రొఫెసర్ కాలేక పోయాడని ఉడికి పోయేవాడట దీన్ని బట్టే ఆయన వ్యక్తిత్వం అర్థమవుతంది. బంగోరె ప్రచురించిన పుస్తకాల ముందు మాటలు పీఠికలు చదివితే అతనికి పరిశోధన పట్ల ఉన్న ఆరాటం, పట్టుదల, కృషి అర్థమవుతోంది. చిన్న కొస కనిపిస్తే చాలు తీగలాగితే డొంకంతా కదిలిస్తాడు. ఏ విషయం తీసుకున్నా దాన్ని లోతుల్లోకి చిచ్చర పిడుగులా దూకి దాన్ని అంతు తేల్చేవాడు. పరిశోధనా రంగంలో అశ్రద్ధతో బద్ధంకంగా పనిచేసే వారినీ నిజాయితీ లేని వారినీ చీల్చి చెండాడటంలో చిన్నంతరం పెద్దంతరం పాటించేవాడు కాదట. అందుకే బంగోరె పేరు చెప్తే చాలా మందికి బెదురు కేవలం విషయాన్ని పరిశోధించడమే కాదు. దాన్ని వ్యక్తపరిచేటప్పుడు వర్తమాన పరిస్థితులతో జతచేసి మరీ చెప్పే వాడట. పైగా రాత్రింబవళ్ళు దెయ్యంలా తన దృష్టిని పరిశోధనపైనే కేంద్రీకరించేవాడు. తిండి మీద ధ్యాస తక్కువ. గంటల తరబడి పుస్త కాల్లో కూరుకుపోయేవాడట. చేసే ప్రతిపనిని చాలెంజ్‌గా తీసుకునేవాడట. ఇలా ఎంత చెప్పినా తీరదు. కామర్స్ చదువుతున్న రోజుల్లోనే మిత్రులతో కలసి స్రవంతి అనే పత్రికను నడిపాడు. కొద్దికాలమే నడిచినా సలసల కాగుతుండేదట ఆ పత్రిక. సి.ఆర్ రెడ్డి అంటే విపరీతమైన ప్రేమ. ఆయనపై 100 ఫైళ్ళుతయారు చేసి యూనివర్శిటీకి ఇచ్చాడట. డెప్త్ విడ్త్ వర్త్ వున్న మనుష్యులంటే గౌరవం. శ్రీశ్రీ కంటే ఆరుద్రకే ఈ మూడు గుణాలు ఉన్నాయట. అందుకే ఆరుద్ర అంటే ప్రాణం. ఈ గుణాలు లేని వాణ్ణి అసలు లెక్కచేయడట. జీవితం మీద ఆపేక్ష లేదు. సినిమాలు చూడడు. మాయా బజారు చూడలేదు. మాయాబజారు చూడని ఆంధ్రుడు ఉంటాడా..

వివాహం : 1966 లో సుమిత్రతో పెళ్లైంది. సుధీర్ సాగర్ పుట్టారు. కుటుంబ జీవితానికి (పరిమితం) కాలేక పోయేవాడట. సుమిత్ర లెక్చరర్‌గా పనిచేస్తూ సంసారాన్ని నెట్టుకొచ్చింది. తనకు కొండంత అండగా నిలిచేదని బంగోరె చాలా సార్లు చెప్పుకున్నాడు. బంగోరె మాత్రం తన పరిశోధనా రంగంలో మునిగి తేలుతూండేవాడట. అందుకే కాళోజి అసలే బంగోరె ఆ పైన పుస్తకం అని పరిహసించేవాడట. బంగోరెకు ఖలీల్ జిబ్రాన్ అంటే ప్రాణం.

వృత్తి : బంగోరె కొనాళ్ళు ఆంధ్రజ్యోతిలో నార్ల వెంకటేశ్వరరావు దగ్గర సబ్ ఎడిటర్‌గా పనిచేశాడు. ఈ లోపు కో ఆపరేటివ్ బ్యాంకులో సెక్రటరీగా ఉద్యోగం వచ్చింది. ఆ బ్యాంకు అధ్యక్షుడి నిరంకుశత్వానికి తట్టుకోలేక ఆ ఉద్యోగానికి రాజీనామా చేశాడట. ఆ రోజుల్లో కడపలోని రాచమల్లు రామచంద్రారెడ్డి మిత్రబృంద కావలి కెవి ఆర్ తోను సన్నిహిత్వం, శ్రీ పాదగోపాల కృష్ణ మూర్తి బుచ్చిబాబు, కాళోజి ఆచంట జానకిరావ్ వంటి సాహితీ కళావేత్తలతో నిత్య సంబంధాలు పెట్టుకునేవాడట. జమీన్ రైతులో ఉపసంపాదకత్వం నిర్వహించడం లోకలిస్టు

పేరుతో కూనిరాగాలు శీర్షిక నిర్వహించడం, తొలి కన్యాశుల్కం ఫుట్‌నోట్స్‌తో ప్రచురించడం, ఇలా చాలా పనులు చేశాడు. నిజమైన పరిశోధకుడు చిత్తశుద్ధితో ఎంత అవిరళ కృషి చేయాలో తెలుగు దేశానికి నేర్పాడు. తమిళనాడు ఆర్కైవ్స్‌లో కనబడే పరభాషల పరదేశాల చరిత్ర విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే తెలుగు చారిత్రాన్వేషకుల సంఖ్య స్వల్పమని బాధపడ్డాడు. మొదటి సారి ఆర్కైవ్స్‌లో బంగోరె ప్రవేశం నిరాకరిస్తూ నువ్వు రిసెర్చ్ స్కాలర్ వని సర్టిఫికెట్ తెమ్మన్నారు అధికారులు. తాను చదివిన యూనివర్శిటీ నుంచి ఆ సర్టిఫికెట్టు వచ్చే అవకాశం లేదు. ఆఖరికి బంగోరె తపన గుర్తించిన మద్రాస్ యూనివర్శిటి లైబ్రరీ సైన్స్ రీడర్ పర్వతనేని గంగాధరరావనే మిత్రుడి సర్టిఫికెట్‌తో ప్రవేశం సంపాదించాడు. ఆనాటి నుంచి బంగోరె దృష్టి వృత్తి వ్యసనంగా మారింది.

సాహిత్య సేవ : 1969లో ప్రచురించిన గురజాడ మొట్టమొదటి కన్యాశుల్కం బంగోరె మొదటి పుస్తకం మొదటి కన్యాశుల్కానికి రెండో కన్యాశుల్కానికి గల తేడాలు. గురజాడ దృక్పథంలో వచ్చిన మార్పులు పరిస్థితి మొదలైన విషయాలు తుల నాత్మకంగా పరిశీలించాడు. నాటకంలో ప్రస్తావించబడ్డ వివిధ విషయాలపై వివరణలూ వ్యాఖ్యానాలూ భాషకూ జాతీయాలకూ నుడికారాలకూ మాండలిక పదాలకూ సామెతలకూ సంబంధించిన వివరణలు చాలా వరకూ సమగ్రంగా పొందు పరిచాడు. కన్యాశుల్క నాటకంలో ప్రతి వాక్యాన్ని అర్థం చేసుకోటానికి ఉపయోగపడుతుంది. 1971లో ప్రచురించిన చంద్రిక కథ తమిళం నుంచి అనువాదం. తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్య భారతి తమిళంలో కందుకూరి వీరేశలింగం జీవితాన్ని ఈ నవలలో వ్రాసాడు. సమకాలిక వ్యక్తులకు గాదు సమకాలిక సమస్యలకు మన సాహిత్యం దూరంగా ఉంటూ వచ్చింది. ఆ దశలో వీరేశలింగం వంటి తెలుగు మహా పురుషుడు, తమిళ జాతీయ కవిగా ప్రఖ్యాతుడై సుబ్రహ్మణ్య భారతి నవలకు కథా వస్తువు కావడమే ఒక విచిత్రమైన సంగతి. ఈ ఒక్కగుణంవల్లే చంద్రిక కథకు మన దేశవాళి నవలల్లో ఒక ప్రత్యేక స్థానం ఏర్పడింది. ఇంతకీ బంగోరెకు ఈ నవల గురించి ఎలా తెలిసిందంటే. నార్ల ఇంగ్లీషులో వీరేశలింగంపై రాసిన పుస్తకాన్ని స్వరాజ్య అనే ఇంగ్లీషు పత్రికలో సమీక్షిస్తూ శ్రీమతి ప్రేమానంద కుమార్ వీరేశలింగం ఆయన భార్య పాత్రలుగా సుబ్రహ్మణ్య భారతి వ్రాసిన అసంపూర్ణ నవల చంద్రిక కథ గురించి ప్రస్తావించారు. అది చదివిన బంగోరె డొంకంతా లాగి ఆ తమిళ అసంపూర్ణ నవలను తానూ ఎన్.ఎస్.కృష్ణమూర్తి ఏ.ఎన్ రాఘవన్‌లు అనువదించారు.

1974లో బ్రౌన్ ప్రాజెక్టులో పనిచేసిన బంగోరె సి.పి బ్రౌన్ సేకరించిన 23 తాతాచార్ల కథలను ఎమెస్కో వారి చేత ప్రచురింపచేశారు. ఈ కథలు అప్పటి గ్రామీణ వ్యవస్థ వ్యవసాయవ్యవస్థ పనిచేసే తీరును గురించి కొంత వెలుగును ప్రసరింపచేశాయి. వ్యావహారిక భాషా వాదానికి బ్రౌన్ ఒక విధంగా వైతాళికుడని ఆఖరు దశలో గురజాడ గుర్తించినందున ఈ తాతాచార్ల కథలకు సంపాదకత్వం వహించి ఉండవచ్చు. 1915లోగురజాడ మరణించిన తరువాత ఆ పుస్తకాన్ని వావిళ్ళవారు 1916లో ప్రచురించారు. బ్రౌన్ ఈ కథల్లోని భాషా సారళ్యాన్ని సూటిదనాన్ని వీటితో పాటు చారిత్రకాంశాలు వున్నాయన్న స్పృహతో వీటినిసేకరించి ప్రచురించాడు.

1977లో బంగోరె బ్రౌన్ జాబుల్లో స్థానిక చరిత్ర శకలాలు కడప జిల్లా అనే పుస్తకాన్ని ప్రచురించాడు. కడప మండల స్థానిక చరిత్రావగాహనకు తెలుగు భాషా పరిణామ చరిత్రకూ మిక్కిలి ఉపకరించే ఉత్తరాలు ఈ సంకలనంలో ఉన్నాయి. వచన రూపంలో మనకు లభ్యమైన తొలి తెలుగు లేఖలు బ్రౌన్ సేకరించినవే. 19వ శతాబ్దంలోని తెలుగు భాషా స్వరూప లక్షణాలు సంప్రదాయ విశేషాలు వీటి ద్వారా తెలుస్తాయి. ఇవేకాక బంగోరె బ్రౌన్ లేఖలు ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర శకలాలు బ్రౌన్ జాబులు తెలుగు జర్నలిజం చరిత్ర 1832-1857 కూడా ప్రచురించాడు. 1979 ప్రచురించిన మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలుకు ముందు మాటలు వ్రాస్తూ మార్క్సు బోధించిన చారిత్రక దృష్టి మనలో త్వరగా పిల్లెత్తుకు పోతుందా అనిపించింది. అని బంగోరె నిశితంగా విమర్శించారు. మాలపల్లి ప్రజాతంత్ర దృష్టితో వాడుక భాషలో వ్రాయబడిన నవల అని తెలుగు నాట మార్క్సిస్టు భావ ప్రేరణకు నాంది పలికిన తొలి నవలని బంగోరె విమర్శించారు. యోగివేమన తెలుగు విజ్ఞాన కేంద్రం తరపున 1980 లో సి.పి బ్రౌన్ ప్రచురించిన వేమన పద్యాలు సంకలనం బంగోరె సంపాదకత్వాన పున:ప్రచురణ జరిగింది. వేమనను నిర్లక్ష్యం చేసిన సాహిత్య చరిత్రకారుల గురించి వివరించారు. గురజాడ శ్రీరామమూర్తి రాసిన ఆంధ్ర కవుల జీవితంలో వేమన లేదు. 1829లో కావలి వీరాస్వామి ఇంగ్లీషులో ప్రచురించిన దక్కన్ కవుల జీవితాల్లో ఉన్న 108 మందిలో 44 మంది తెలుగు కవులున్నారు వారిలో వేమన లేదు.

1899లోనే మద్రాసు కాలేజి తరపున ఇంగ్లీషు తెలుగులో సిపి బ్రౌన్ వేమన పద్యాలు క్రోడీకరించి 500 కాపీలు ముద్రించారు. బ్రౌన్‌కు 50 కాపీలు ఇచ్చారు. మిగిలిన కాపీలు మార్కెట్లోకి వెళ్ళకుండా మాయమై పోయాయి. ఈ తర్వాత పదేళ్ళకు బ్రౌన్‌కు తెలిసింది. ఆ కాపీలు కాలేజి బోర్డులో ఉండే సనాతన పండితులు పనికిరాని కాగితాల పుస్తకాల క్రింద స్టోర్ రూమ్‌లో పడేశారు.. పాఠ్య పుస్తకాల్లో వేమన పద్యాలు చేరిస్తే వాటిని చెప్పకుండా అయ్యవార్లు దాట వేశారట. ప్రాచీన కాలంలో లోకాయత చార్వాకుల గ్రంథాలను బయటకు రానీయ కుండా ధ్వంసం చేసిన వారి జీవ లక్ష ణమూ ఈ సనాతన పండితుల జీవలక్షణమూ ఒకటే.

1981వ సంవత్సరంలో వేమన సి.ఆర్ రెడ్డి అనే గ్రంథాన్ని సి.ఆర్. రెడ్డి కమిటి ప్రచురించింది. 1928లో ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు అనంతపురంలో వేమనోపన్యాసాలు ఏర్పాటు చేయడంలో గల నేపథ్యాన్ని వివరిస్తూ వేమన గురించి కట్టమంచి రామలింగా రెడ్డి చెప్పినవి రాసినవి సంకలించిన రచనయే ఇది. తెలుగు పండిత లోకం వేమన గురించి నోరు కట్టేసినట్లు ఒక రకమైన మూగతనం వహించిన దశలో ఆయన కవిత్వాన్ని సందేశాన్ని గుర్తించి అభిమానించే వర్గం ఒకటి ఆవిర్భవించటానికి షోషియాలజి తోడ్పడింది. ఆ క్రమంలో వ్యుత్పన్నమైన సాంఘిక సాహిత్య శక్తులను పరిశీలించటానికి ప్రయత్నం చేసింది బంగోరె పుస్తకం. తెలుగు భాషను ఇంకా సరళం చేయటానికి బంగోరె ఆలోచించాడు. ఒక చోట అంటాడు ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అనే పన్నెండు అచ్చులు తొలగించి వాటి స్థానంలో యి యీ వు వూ రు రూ యె యే అయి వొ వో అవు ఉపయోగిస్తే కొంప మునిగి పోతుందా అని ప్రశ్నించాడట. శ్రీ వేంకటేశ్వరా యూనివర్శిటీలో బ్రౌన్ ప్రాజెక్ట్ రీసెర్చి ఆఫీసర్‌గా చేయవలసిన పరిశోధనంతా తృప్తిగా చేసి, పుస్తకాలు ప్రచురించారు. ఆ కాల పరిమితి అయిపోయాక మాలపల్లి నిషేధాల మీద పని చేసి పుస్తకం పూర్తి చేశాడు. హైదరాబాదులో యోగి వేమన విజ్ఞాన కేంద్రం రీసెర్చి ఆఫీసరుగా చేరాడు. 1980 లో వేమనకి సంబంధించి మూడు చిక్కు ముడులున్నాయి. వాటిని ఎలాగైనా విప్పాలని కంకణం కట్టుకున్నాడు. వేమన ఎప్పటివాడు ఎక్కడివాడు అసలు సిసలు వేమనపద్యాలేవి. ఇవన్నీ పరి శోధించగల దీక్ష దక్షత ఓర్పు బంగోరెకు ఎక్కువగా ఉన్నాయి. దాని వల్లనే 141 సంవత్సరాల క్రితం (1839)లో అదృశ్యమై పోయిన వేమనపద్య ప్రతి (సి.పి బ్రౌన్ సంకలన) ఫోటో కాపీ లండన్ లైబ్రరీ నుంచి మిత్రుని సాయంతో సాధించాడు. వేమన పద్యాలు సి.పి బ్రౌన్ 1839 నాటి సంకలనంగా ప్రచురించాడు. తన దగ్గరున్న సమాచారంతో మరెన్నో వెలువరించాలని కలలు కన్నాడు. వేమన పద్యాలు వేయటానికి పథకం సిద్ధం చేసుకున్నాడు. కాని మన ఆంధ్రేతర ప్రభుత్వపు అవకతవక పనుల వల్ల ఆ ప్రాజెక్ట్ మూలబడింది. you are the most stupid IAS officer i have ever worked under అని వచ్చేశాడు. జీత బత్యాలు కూడా సరిగా ఇవ్వకుండా ఇంతటి పరిశోధకుణ్ణి తరిమేయ గలిగిన గొప్పవ్యవస్థ మనది. తిరుపతిలో బ్రౌన్ ప్రాజెక్ట్ హైదరాబాదులో వేమన కేంద్ర విశాఖలో జి.ఆర్ రెడ్డి ప్రాజెక్ట్ బ్రౌన్‌కు సంబంధించిన పని మాత్రం మనసారా తాననుకున్న రీతిలో చేయ గలిగాడు. చివరికి రెండూ బంగోరెను బలి తీసుకున్నాయి. ఎంతో చేద్దామనీ ఎన్నో సాధిద్దామనీ ఆత్మ విశ్వాసంతో అచంచల దీక్షతో ప్రయత్నాలు చేశాడు. కాని అడుగడుగునా ముళ్ళూ రాళ్ళూ ఎదురయ్యాయి.

బ్రౌన్ ఫోటో దొరికుంటే జీవితాశయం నెరవేరినట్లు భావించేవాడు. బ్రౌన్ కారణ జన్ముడనీ తెలుగు సాహిత్యానికి మహోపకారం చేశాడని అంటూండేవాడు. పనిలో రాక్షసుడు సమాచార సేకరణలో అతన్ని మించిన వాడు మరొకడు లేడు. తెలుగు డిగ్రీ లేకపోయినా తెలుగు సాహిత్యంపై పరిశోధనలు చేశాడు మిత్రులు విశాఖలో బంగోరెకి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అప్పుడందరి గుండెలు బరువెక్కాయి. సాగర తీరాన్నుంచి సెలవంటూ వెళ్ళిపోయాడు. నిజానికి అతనప్పటికే ఒక నిశ్చయాని కొచ్చాడేమో ఈ లోకం నుంచి శాశ్వతంగా సెలవు తీసుకుందామని ఈ సంగతి మిత్రులప్పుడు పసి గట్టక పోయినా వారి వీడ్కోలు కవితలన్నీ ఎలిజీలుగా మిగిలి పోయాయి.

బంగోరె పరిశోధక వ్యాసాలు : నాల్గేళ్ళ పిల్ల వాడొకడు దాదాపు 70 ఏళ్ళ క్రితం లెబనాన్ కొండ చరియల్లోని ఆరామంలో ఆడుకుంటూ చిరిగిన కాగితాల్ని పూడ్చి పెట్టి మొక్క రాదే అని ఎదురు చూశాడట.కాని పెద్ద వాడై కవితలు కథలు గేయాలు వ్రాసిన కాగితాలే అతను చనిపోయిన తర్వాత 10లక్షల డాలర్లకు పైగా సంపాదించి పెట్టా యట. చనిపోతూ ఒక వీలు నామా రాశాడట. అందులో అతని పుస్తకాలపై వచ్చే సొమ్మంతా తన స్వంత గ్రామమైన బషెరీకి చెందాలని ఉంది. ఈ

నాటికి ప్రతి సంవత్సరం అతని పేర ఒక ఉత్సవం గ్రామంలో జరుగుతూనే ఉండట. ఒక మ్యూజి యంను కూడా నిర్వహించారట. ఇంతకీ ఈ కవి ఎవరు అతని పేరు కలీల్ జిబ్రాన్. ప్రపంచంలో దాదాపు అన్ని భాషల్లో ఇతని కవిత్వం అనువాదమై ఉంది. తెలుగు భాషలో కూడా ఇతని అనువాద గ్రంథ మొకటి ఉంది. ఈ సందర్భాన్ని పుర స్కరించుకొని బంగోరె అతని కవిత్వాన్ని గూర్చి నాలుగు వాక్యాలు వ్రాశాడు. జిబ్రాన్ 19వ ఏట స్వదేశం నుండి తరిమి వేయబడ్డాడు. కారణం ద స్పిరిట్ ఆఫ్ రెబెలియస్ అనే పుస్తకం అంటే తిరగబడ్డ ఆత్మలు పుస్తకం రాసినందుకు. అందులో నాలుగు కథలు ఉన్నాయి. ఇవి విప్లవాత్మకాలైనవి వివాహ వ్యవస్థ మీద మత వ్యవస్థమీద అలనాటి అరబ్బు ప్రభుత్వం మత సోదరుల వ్యవస్థ. ఆ పుస్తకం కాల్చివేయబడి అతన్ని దేశ బహిష్కరణ చేసింది. పారిస్‌లో కొంత కాలం గడిపాడు. అతను రాసిన పుస్త కాలన్నింటిలో తలమానికమైంది ది ప్రాఫెట ప్రవక్త. మహాభారతాన్ని పంచమ వేదమని అంటారు. ఆ ప్రాఫెట్ అన్న పుస్తకానికి ది లిటిల్ బ్లాక్ బుక్ అని పేరు. బ్లాక్ బుక్ అంటే పాశ్చాత్య దేశాల్లో బైబిల్ అని అర్థం. జిబ్రాన్ ఈ పుస్తకాన్ని తన 12 ఏళ్ల ప్రాయంలో వ్రాశాడట. బాగానే ఉంది కాని ఇంకా పసిగా ఉంది అని తల్లి అందట. పదేపదే రాయటం తల్లికి వినిపించటం చివరకు ఏడోసారి తల్లి తృప్తి చెందటంతో ఆ గ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించాడు. అచ్చు వేస్తే దాదాపు 40 ముద్రణలు పొందాయట. అంటే కొన్ని లక్షల కాపీలు అమ్ముడు పోయాయట. ఇందులో ఏముందంటే. ఓ యువతి ఇలా అన్నదట. it is unique and just right for clearing cobwebs and refueling weary souls... టైంస్ పత్రికలో a consolation for those who think religion is a misty feeling..work is love made visible అంటాడు ఒక చోట your joy is your sorrow unmasked అంటాడు మరో చోట. ప్రేమ, వివాహం పిల్లలు సంతోషం దు:ఖం స్నేహం క్రయ విక్రయాలు నేరం శిక్ష విద్య వగైరా.. పిల్లల్ని గూర్చి పిల్లల పెంపకాన్ని గూర్చి జిబ్రాన్ ఇలా చెప్పాడట.

your children are not your children,They are the sons and daughters of lifeslonging for itself,They come through you  but not from you....

ఈ పుస్తకాన్ని నా గొడవ గేయాల ద్వారా పరిచయమైన కాళోజి తెలుగులో జీవన గీత అన్న పేరుతో అనువదించాడు. ఒక రకంగా కాళోజి తెలుగు దేశపు జిబ్రాన్ అనవచ్చు. నైజాం ఉద్యమాల రోజుల్లో కవిత్వం రాసి ప్రజోద్యమాలు నడిపి తెలంగాణా నుండి తరిమివెయ్యబడ్డవారు, కష్టాలుపడ్డవారు జైళ్ళలోనివాసం ఉన్నవారు కవిత్వమే ఊపిరిగా గల వారెందరో ఉన్నారు. యుద్ధంలో ఫ్రాన్స్‌దేశపు కవులంతా చెల్లా చెదు రయిపోతే లూయీఆరగాన్ ఒక్కడే దేశంలో నిలబడి మహాప్రజల విశ్వాసాన్ని వెల్లడించే గీతాలు రాశాడు. ఆ స్ఫూర్తితోనే కాళోజి ఉద్యమకారుడయ్యాడు.

చర్చిల్‌కు నెల్లూరుకు సంబంధం. చర్చిల్ పేరు వింటే మనకు గుర్తుకు వచ్చేది గొప్ప రచయిత అని, గొప్ప ప్రజాస్వామ్య పార్లమెంటేరియన్‌గా యంత్రాంగంలోను యుద్ధతంత్రాంగంలోను సవ్యసాచి అని మనకు తెలుసు. కాని చాలా మందికి చర్చిల్ పేరు వినగానే అంత మంచి అభిప్రాయముండదు. ఆయనకు భారతీయులన్నా భారతీయ నాయకులన్నా గిట్టదు. గాంధీని నేకెడ్ ఫకీర్ అన్నాడు. భారతీయ నాయకత్వం మరుగుజ్జుది అని విమర్శించాడు. మరి యిటువంటి నాయకునికి నెల్లూరుతో సంబంధం ఉందంటే విశేషం. చర్చిల్‌ను పోలో ఆటలో ఓడించిన ప్రజ్ఞా వంతులైన క్రీడాకారులు ఆ రోజుల్లో నెల్లూరులో ఉన్నారట. ఇండియాకు మిలటరీ ఆఫీసరుగా చర్చిల్ వచ్చాడు. చర్చిల్ మంచి పోలో ఆటగాడు. బెంగుళూరులో ఉన్నపుడు మన నెల్లూరు వారితో పోలో ఆట ఆడి ఓడిపోయాడట. ఆ రోజుల్లో వేంకట గిరిరాజులు పోలో ఆటలో మంచి ప్రజ్ఞావంతులట. రాజా వేణు గోపాలయాచేంద్ర రాజా వేంకటకృష్ణయాచేంద్ర బాలారెడ్డి రామనాథం వంటి వారు పోలో ఆటలో మంచి ఘటికులు. చర్చిల్ జట్టు ఈ వెంకటగిరి జట్టుతో పోలో ఆడింది. చర్చిల్ చర్చిల్ జట్టు ఓడిపోయింది. చర్చిల్ తన పోలో గుర్రాన్ని వెంకటగిరిరాజుకు అమ్మేశాడట. బాలారెడ్డి రామనాథంగారు హౌ టు ప్లే పోలో అనే పుస్తకంలో ఈ విషయాన్ని ప్రస్తావించినట్టు మనకు తెలుస్తోంది. ఈ విషయాన్ని బంగోరె దృష్టిలో పడటం మన అదృష్టం. ఇలా బంగోరె కూనిరాగాలు ఇతర రచనలు అనే పుస్తకంలో ఎన్నో పరిశోధక వ్యాసాలున్నాయి. నూరేళ్ళనాటి నెల్లూరు సంగతులు రచయితగా నెహ్రూ శ్రీహరికోట దీవులు షేక్స్పియర్ అర్థంకాని మోడ్రన్ ఆర్ట్ ఖలీల్ జిబ్రాన్ ఇలా ఎన్నో వ్యాసాలను శోధించిన మంచి పరిశోధకుడు బంగోరె.

డా.ఎన్. ఎలిజబెత్ జయకుమారి
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ప్రెసిడెన్సీ కాలేజ
చెన్నై - 600 005.

# అసమర్థుని జీవయాత్ర

- రామవరపు లక్ష్మీ సునీత

ఓ మనిషి సమర్థునిగా ఎదిగిన తీరుని స్ఫూర్తి మంతంగా మలచి అందించిన రచనలకి పాఠకలోకం నీరాజనాలు పట్టడంలో ఆశ్చర్యం లేదు. కానీ, ఎందుకూ కొరగాని ఒక అసమర్థుని జీవయాత్ర నేపథ్యంగా రాసిన నవలకి సాహితీలోకంలో చిరస్థాయిగా నిలిచిపోయే స్థానం కల్పించడం ఆశ్చర్యమే! అంతగా ఏముంది ఆ నవలలో? రచయిత ఎవరు?

తెలుగు నవలాసాహిత్యంలో ప్రత్యేకమైన స్థానం పొందిన 'అసమర్థుని 'జీవయాత్ర' ఒక మనోవైజ్ఞానిక నవలగా చెప్పవచ్చు. రచయిత త్రిపురనేని గోపీచంద్. ఈ నవల రచనాకాలం 1945-46. ఆంధ్రప్రభ దినపత్రికలో ఆదివారపు సాహిత్యానుబంధంలో సీరియల్ నవలగా వెలువడింది. ఈ నవలను తన తండ్రి, ప్రముఖ సంఘసంస్కర్త, హేతువాది అయిన త్రిపురనేని రామస్వామి చౌదరి గారికి అంకితమిస్తూ 'ఎందుకు? అన్న ప్రశ్న నేర్పినందుకు నాన్నగారికి!' అని అంటాడు రచయిత. తన చిన్నతనంలోనే తల్లి మరణించగా తండ్రి వెంటే తిరిగి అతని ఆదర్శాలను పుణికి పుచ్చుకున్నాడు రచయిత. తండ్రి నాస్తికోద్యమము అతనిని మొదట్లో ఎంతగానో ప్రభావితం చేసినా తర్వాత కాలంలో ఆస్తికుడిగా మారాడు. అనేక వాదాలు, తత్వాలు ప్రబలిన సమాజంలో వాటితో పోరాడుతూ, సంతృప్తిలోనూ - అసంతృప్తిలోనూ ఆనందాన్నే అనుభవిస్తూ తన జీవయాత్రను సాగించానని చెబుతారు గోపీచంద్. తన జీవితంలో చాలా సంఘర్షణ లను అనుభవించాడు గోపీచంద్. ఆ సంఘర్షణలను ఈ నవలలోని ప్రధాన పాత్ర ద్వారా సమాజానికి తెలియ జేశారు. ఈ నవలలోని ప్రధాన పాత్ర 'సీతారామారావు' ఆనాటి భూస్వామ్య - పెట్టుబడిదారీ వ్యవస్థల సంగమ కాలంలోని వ్యక్తి. ఈ దశలో వ్యక్తికీ, సమాజానికీ మధ్య సమన్వయం చాలా కష్టతరంగా ఉంటుందని, పరిస్థితులకు అనుగుణంగా వ్యక్తులు మానసికంగా సిద్ధం కాకపోతే ఆత్మన్యూనతాభావంతో కృంగిపోతారని అంటాడు రచయిత. సీతారామారావు అసమర్థుడనడానికి గల అనేకానేక కారణాలలో అదే ప్రధానమైనది. మారుతున్న సమాజాన్ని ప్రగతిశీల దృక్పథంతో అర్థం చేసుకోవటం అవసరమనీ, అలా కాని నాడు సమాజంలో పలువురు సీతారామారావులు తయారు కాగలరనీ హెచ్చరిస్తాడు రచయిత.

ఉన్నత శిఖరాగ్రమంటి వంశంలో పుట్టాడు సీతారామారావు. అతని ముత్తాత తాత ఊరికి చెరువు తవ్వించాడు, సత్రం కట్టించాడు. తాత గుడి కట్టించాడు. తండ్రి 'అడగనివారిదే పాపం!' అన్నట్లుగా దానం చేశాడు. చివరకు చావు మంచం మీద కూడా 'వంశం పేరు నిలబెట్టు' అని కొడుకైన సీతారామారావుతో అన్నాడే గానే ఆస్తి విషయం కానీ, వసూలు కావల్సిన బాకీల గురించి కానీ ఎత్తనైనా లేదు! 'అదీ ఆ వంశం గొప్పతనం!' అంటూ సమాజం వారి వంశాన్ని ఆకాశానికెత్తింది. ఆ ఎత్తు మత్తులో ఉన్న సీతారామారావు చర్యలు కూడా ఆ ఘనతను నిలుపుకోవటానికి అన్నట్లు ఉండేవి. 'ఆఁ! డబ్బుదేముంది? మనిషికి కావలసింది పేరు. డబ్బు మనల్ని సంపాయించిందా? మనం డబ్బును సంపాయించామా?' అనేవాడు. ఇచ్చిన వాళ్ళ దగ్గర ఇచ్చినంత బాకీ డబ్బు పుచ్చుకుని ఇవ్వని వాళ్ళను ఉదారంగా క్షమించివేసి 'నేను డబ్బుకోసం కోర్టుకు ఎక్కను' అనేవాడు. 'ఆహా! తండ్రికి మించిన కొడుకు' అని అన్నారంతా. 'సూర్యని తేజస్సుకు మల్లే, రత్నాలకాంతికి మల్లే దాతృత్వం అతని స్వభావం' అని కీర్తించింది సమాజం. అతి కొద్ది పాత్రలతో నడిచిన ఈ నవలలో సమాజానికి ప్రతిరూపాలుగా సీతారామారావు మేనమామ, మేనత్త పాత్రలు కన్పిస్తాయి. ఇచ్చేవారి నుండి ఎంతవరకూ వీలైతే అంతవరకు లబ్ది పొంది, వారిని అమాంతం ఆకాశానికి ఎత్తివేసే సమాజపు ధోరణిని కథలో అంతర్లీనంగా చూపించారు రచయిత. సీతారామారావుకి మంచి మాటలు చెప్పి సమాజం గురించి హెచ్చరించే శ్రేయోభిలాషి పాత్రలో వృద్ధుడైన రామయ్య తాత కనిపిస్తాడు. రామయ్య తాతకు సీతారామారావు

కుటుంబమంటే తగని అభిమానం. 'కుఱ్ఱవాడివి, ప్రపంచానుభవం తక్కువ. కొంచెం తెలిసి మెలగాలి. పశ్చాత్తాప పడవలసిన పనులేవీ చెయ్యకు బాబు. నువ్విప్పుడు మంచి పనులనుకున్నవన్నీ రేపు ఎదురు తిరుగుతై. ఇప్పుడు నీ వల్ల సహాయం పొందేవాళ్ళనే విరోధం చేసుకుంటావు. నీ మంచే నీ పతనానికి కారణమవుతుంది' అని సీతారామారావుకి ప్రభోదిస్తాడు. అయినా కీర్తి కండూతితో అతనికి ఈ మాటలు రుచించవు.

ఉన్నతమైన ఆశయాలు కలిగి, ఆదర్శవంతమైన జీవితం గడపాలని ఉవ్విళ్ళూరిన సీతారామారావు చివరకు జీవితం చేతులలో కీలుబొమ్మగా మారతాడు. అసలు వివాహమంటేనే గిట్టని వాడు ప్రేమించి మరీ పెళ్ళి చేసుకుంటాడు. పెళ్ళికి నూతనార్థం కల్పిస్తానని, భార్యకి వివాహబంధంలో స్వాతంత్ర్యం ఇస్తానని బీరాలు పలికినవాడు నిండు చూలాలైన భార్య మీద చేయి చేసుకునే స్థాయికి దిగజారిపోతాడు. ఆస్తి హరించుకుపోయి, కుటుంబ భారం మోయలేక, ఉద్యోగంలో ఇమడలేక, ఏం చేయాలో పాలుపోక అసమర్థునిగా తయారవుతాడు. 'ఉన్నన్నాళ్ళు కన్నుమిన్ను కానకుండా ఖర్చుపెట్టాడు. ఎవరి కోసం పెట్టాడు? మన కోసం పెట్టాడా? తన పేరు కోసం, పది మందితో మంచివాడనిపించుకోవటానికి పెట్టాడు! ఇప్పుడనుభవిస్తున్నాడు' అన్నారంతా! 'సహాయం చెయ్యటం నీ వ్యసనం' అని వేలెత్తి చూపింది సమాజం. అతనికిప్పుడు సమాజం మీద కోపం, కసి! ఆ కసికి భార్య గురవుతూ ఉండేది. ఎన్ని కష్టాలు పెట్టినా భర్తనే దేవుడిగా కొలిచే ఆనాటి సమాజపు స్త్రీలకి ప్రతిరూపంగా సీతారామారావు భార్య పాత్రని మలచాడు రచయిత. తన భర్త చాలా గొప్పవాడని, గొప్పవాళ్ళ జీవితాలను మామూలు మానవులను కొలచే బద్దతో కొలిస్తే అర్థం కాదని ఆమె అభిప్రాయం. 'ఆడవాళ్ళకు ఎంత తెలివి ఉండి ఏం లాభం? అది రాణింపుకు వచ్చే వీలేది? ఆ తెలివి బయటపడే అవకాశం భర్త ఇవ్వకపోతే అంతా బూడిదలో పోసిన పన్నీరు అవ్వవలసిందేగా' అని ఆమె ఒక సందర్భంలో అన్న మాటల ద్వారా ఆనాటి సమాజపు వైఖరిని చూపించారు రచయిత. ఇంటి పరువు బజారున పడకుండా, తన మంచితనంతో, మాటతీరుతో ఏ పూటకాపూట తిండికి ఏర్పాటు చేస్తూ కాపురాన్ని గట్టెక్కిస్తున్న సీతారామారావు భార్య పాత్ర చిత్రణ పాఠకుల గుండెల్ని కలచివేస్తుంది.

పరిస్థితులకు అనుగుణంగా మారలేక, సమాజంలో ఇమడలేక, గతవైభవపు సంకెళ్ళ బందీకానాలో మగ్గిపోతూ, ఇంటి నాలుగు గోడలే అతని జీవితానికి సరిహద్దులవగా ఒక అసమర్థుడిగా సీతారామారావు మన ముందు నిలబడతాడు. అయినప్పటికీ అతడి మస్తిష్కంలో వచ్చే ఆలోచనలు, ప్రశ్నలు జీవితసత్యాలని అన్వేషించేవిగా ఉంటాయి. 'సుఖమంటే ఏమిటి? సుఖం ఎక్కడుంది? తృప్తిపడడంలో ఉంటుంది. కూలివాడి కంటే ధనవంతుడు, సర్వసంగ పరిత్యాగి కన్నా భోగి, అజ్ఞాని కన్నా జ్ఞాని సుఖపడుతున్నారని ఎవరు చెప్పగలరు?' అని అనేవాడు. 'బ్రతకటానికి కావలసింది అన్నమే గదా! మరి దీనికి ఇన్ని గొడవలెందుకు? నలుగురం కూడబల్కుకొని బతకలేమా! పోయాకా ఎవరైనా కట్టుకుపోయేది ఏముందీ?' అంటూ ఉపన్యాసాలు ఇచ్చేవాడు. అతని హృదయసీమలో హఠాత్తుగా ఒక భావం విరిసేది. ఏదో ఒకటి చెయ్యాలను కోవటంలోనే ఈ చిక్కులన్నీ వస్తున్నాయి అని అంటూ మెదలకుండా కూర్చొనేవాడు. ఒకప్పుడు ఒక అభిప్రాయం మంచిదిగా మరుక్షణం దానికి వ్యతిరేకమైన అభిప్రాయం మంచిదిగా అతనికి తోచేది. ఇందులో ఏది తన అభిప్రాయమో తనకి తెలిసేది కాదు. తన కష్టాలన్నిటికీ తన మెత్తని హృదయమే కారణమని తీర్మానం చేస్తాడు. తాను ప్రయత్నించడు అన్నం దానంతట అది వచ్చి పడాలి, సుఖాలు వాటంతట అవి వచ్చి తన్ను ముసురుకోవాలి. కష్టాలు తన దగ్గరకు రాకూడదు. తాను ఊహించినవన్నీ జరగాలి. ఏ ప్రయత్నం లేకుండా జరిగిపోవాలి జీవయాత్ర. కష్టాలు పడి బ్రతకేకంటే చావటం నయం అన్నది అతని వైఖరి! 'చావటం' అనేది సీతారామారావు చెయ్యగలిగిన పనుల్లో ముఖ్యమైనది. అతడొక పాట రాశాడు.

*"పడగొట్టండోయ్ తాజ్‌మహల్*
*తవ్వండయ్యోయ్ తుగ్లక్ గోరీ*
*చిదిమెయ్యండోయ్ స్త్రీ సౌందర్యం*
*నలిపెయ్యండోయ్ పువ్వుల మొవ్వలు*
*దోచెయ్యండోయ్ ధనవంతుల*
*చంపెయ్యండోయ్ క్షుధార్తుల*
*రుధిరం రక్తం చిందాలోయ్!*
*పుర్రెలు ఎముకలు నవ్వాలోయ్!"*

ఇవన్నీ పరిశీలించి చూస్తే సీతారామారావులో 'నార్సిజం' అనే మానసిక రుగ్మత లక్షణాలు ప్రస్ఫుటంగా

కన్పిస్తాయి. స్వీయారాధన, స్వాతిశయం, ఆభిజాత్యం, అహంకారం, ఆత్మహత్య రుగ్మత, కీర్తి కండూతి వంటి నార్సిజం లక్షణాలు అతనిలో పుష్కలంగా నిండి ఉన్నాయి. బారెడు పొద్దెక్కాక నిద్ర నుంచీ లేవటం, తినటం, చీటికీమాటికీ భార్యని అమానుషంగా దూషించడం, ఆలోచనల అంతర్మథనంలో అల్లాడిపోవటం, నిద్రలో జోగడం – ఇవే అతని నిత్యజీవితపు అలవాట్లుగా మారగ 'అసమర్థుడు' అనే నామకరణం అతనికి అతికినట్లుగా సరిపోయింది అనటంలో ఏ సందేహం లేదు. అతడి పౌరుష ప్రతాపాలు భార్యబిడ్డల మీదనే! కూడదని వారించిన రామయ్య తాతతో కూడా గొడవపడతాడు. అతడి వైఖరిని చూసి విసిగిపోయిన రామయ్య తాత ఒకానొక సందర్భంలో జనాలతో అతడికి దేహశుద్ధి చేయిస్తాడు. తిరిగి అతని మీద జాలి పడి మంచిమాటలను ఉపదేశిస్తాడు రామయ్య తాత. 'జ్ఞానం కావలసిందే బాబు! కానీ జ్ఞాన భాండారాన్ని ఎప్పటికప్పుడు నింపుకుంటూ ఉంటేనే మానవుని అభివృద్ధికి ఉపయోగపడుతుంది. దానికి నిత్య నైవేద్యం అవసరం. లేకపోతే ఎదురుతిరిగి తనను సృష్టించిన మానవజాతినే సర్వనాశనం చేస్తుంది. నీకున్న జ్ఞానంతో సమస్యలు పరిష్కారం కావని తెలుసుకుని కొత్త మార్గాలను అన్వేషించక, కొత్త విషయాలను తెలుసుకొని జ్ఞానాన్ని నింపుకోవాలని ప్రయత్నించక విఫలమైయ్యావు. అంతేకాక, జ్ఞానం ఒకటే మానవుని అభివృద్ధికి సహాయ పడదు. దానిని సంఘశ్రేయస్సుకు ఉపయోగపడేటట్టు చేసే మనస్తత్వం కూడా ఉండాలి' అని ఉద్బోధిస్తాడు.

సమాజం గురించి చెబుతూ 'జ్ఞానానికి తగిన మనస్తత్వం లేకపోవటం వల్ల ఇంత దారుణమైన సంఘర్షణ, పతనం, బీభత్సం జరుగుతుంది గనుకనే సంఘాన్ని మెట్టు తర్వాత మెట్టు పైకి తీసుకువెళుతున్నాం, పరిణామం కప్పదాట్లు వెయ్యదు' అన్న రామయ్య తాత మాటలుకు ఆంగ్లంలోని ప్రముఖ రష్యన్–అమెరికన్ రచయిత్రి అయాన్ ర్యాండ 1943 లో వ్రాసిన 'ద ఫౌంటెన్ హెడ్' అనే సుప్రసిద్ధ నవలలోని 'ఎల్స్‌వర్త్ టూహే' అనే పాత్ర సమాజం గురించి చెప్పిన లక్షణాలకు, సంభాషణలకు సారూప్యత కనిపిస్తుంది. 'Great minds think alike' అన్న ఆంగ్ల సామెతకు ఇది ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.

రామయ్యతాత ప్రబోధంతో తనకేదో నూతన దృష్టి ఏర్పడుతూ ఉన్నట్లుగా అన్పిస్తుంది సీతారామారావుకి. అలా నడచుకుంటూ శ్మశానం వైపు వెళ్ళిపోతాడు. కోలాహలంగా ఉన్న ప్రపంచాన్ని, ప్రశాంతంగా ఉన్న శ్మశానాన్ని పోల్చి చూసుకుంటే అతని మనసు చల్లబడుతుంది. తన ఇన్నాళ్ళ ఆలోచనల మర్మం, అన్వేషణ ఈ శ్మశానం కోసమేనని, ఇదే అతనికి సరిపోయే చోటని, అతని స్వగృహమని అతనికి అన్పిస్తుంది. శ్మశానానికి పాక్షిక బుద్ధి లేదు. అందర్నీ సమానంగా చూస్తుంది. అందరూ చివరకు చేరవలసింది ఇక్కడికే. అతడికి శ్మశానం చాలా ఆకర్షవంతంగా కన్పిస్తుంది. అతడిలో గూడు కట్టుకున్న ఆభిజాత్యపు కోటలు కూలిపోతాయి. బంగారం లాంటి జీవితాన్ని బుద్ధి లేని ఆలోచనలతో నలిపి నలిపి నాశనం చేసుకున్నాడని గ్రహిస్తాడు. చనిపోయి అదే శ్మశానంలో సమాధి చేయబడ్డ తండ్రి అతడిని 'వంశం పరువు పతిష్ఠలు నాశనం చేశావ్!' అని నిలదీసినట్లుగా అన్పిస్తుంది. అక్కడే ఉన్న తల్లి సమాధి మీద పడి భోరున ఏడుస్తాడు. తల్లి గొంతు విన్పిస్తుంది. శ్మశానఘట్టంలోని పతాక సన్నివేశాన్ని చాలా అద్భుతంగా మలచాడు రచయిత గోపీచంద్. భావోద్వేగాల కలబోత పాఠకుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. తన భార్య ముసలిది అయినట్టు, పిల్లలు పెరిగి పెద్దవారైనట్టు మంచంలో జబ్బుతో పడి ఉన్న తనను అసహ్యించుకుంటున్నట్లు ఊహించుకుంటాడు. తన ఆకారం తన ఎదుటే నిలచి తన మీద దాడి చేస్తున్నట్లు భ్రమపడతాడు. ఆ ఆకారాన్ని తుదముట్టించాలన్న ప్రయత్నంలో అతనిలోని రాక్షసత్వం ప్రకోపించగ తన గొంతును తానే నులిమి వేసుకుంటాడు. తనను తానే హత్య చేసుకుంటాడు. అసమర్థునిగానే జీవించి అసమర్థునిగానే తన జీవయాత్రను ముగిస్తాడు.

గోపీచంద్ రాసిన ఈ నవల ఇప్పటికీ జనాదరణ కలిగి ఉన్నదంటే దానికి కారణం ఈ కథలోని వైవిధ్యం; కథ నడిచే తీరు కన్నా ఇందులోని అసమర్థుని పాత్ర చిత్రణ, అసమర్థుని ఆలోచనలు ఈ నవలకి అంతటి ప్రాముఖ్యతను కలిగించాయని అనటంలో సందేహం లేదు. పరిస్థితులకు అనుగుణంగా మానసికంగా తనను తాను మలచుకోని వ్యక్తి సంఘంలో అసమర్థుడిగా ఎలా నిలిచిపోతాడో తెలియజెప్పే దర్పణమే ఈ నవల. అదే ఈ నవలకు బీజం మరియు బలం!

రామవరపు లక్ష్మీ సునీత
ఫోన్ : 8085564765



అట్టాడ అప్పల్నాయుడు

# అట్టాడ అప్పల్నాయుడు కథలు - దోపిడి నివారణ హక్కు

- మునకాల ధనలక్ష్మి

పరిచయం:మన భారతదేశంలో భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ప్రతి మనిషికి సమానంగా హక్కులు ఉండాలనే భావనతో ప్రాథమిక హక్కులను అంబేద్కర్ రూపకల్పన చేశారు. ప్రాథమిక హక్కులను గురించి భారతరాజ్యాంగంలో మూడవ భాగంలో అధికరణ 12 నుంచి 35 నిబంధనలలో ఉంది. ప్రాథమిక హక్కులు 7 రకాలు.

1."ప్రాథమిక హక్కులలో మూడవ హక్కు దోపిడిని నివారించే హక్కు. అధికరణ 23 ప్రకారం".1 మానవులతో వ్యాపారం, బలవంతపు వెట్టి చాకిరిని ఈ అధికరణ నిషేధించినట్లు తెలుస్తుంది. కుల, మత, జాతి, వర్గ బేధాలకు అతీతంగా ఉండాలి. కనీస వేతనాలు కూడా చెల్లించకుండా పనులు, సేవలను పొందడాన్ని వెట్టిచాకిరీగా చెప్పవచ్చు. ఈ ఆర్టికల్‌కు అనుగుణంగా వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం 1976లో వచ్చింది. కట్టు బానిసత్వం, విధానంలో భూస్వాములు లేదా పెత్తందార్లు మానవ హక్కులకు విఘాతాలు కలుగజేసేవారు. మానవులను కట్టు బానిసలుగా ఉంచుకొని తరతరాల స్వాతంత్ర్యాన్ని హరించివేసేవారు. ఈ దురాగతాన్ని మాన్పించడానికే ఈ హక్కు కల్పించబడింది.

2. మనిషిలోని నిద్రాణమై ఉన్న నిజమైన మనిషిని తట్టిలేపుతూ, తన రచనలతో చైతన్యం వైపు అట్టాడ అప్పల్నాయుడుగారు నడిపించిన వ్యక్తి విశిష్ట కథారచయిత, నవలాకారుడు అప్పల్నాయుడుగారు. వలస పాలన కాలంలోను, ఆతదనంతర కాలంలోనూ ఆదివాసులు తమపై సాగుతున్న అణచివేతను ఎదుర్కొన్నారు. తల్లిలాంటి అడవి రాజ్యం ఆస్థిగా మారిపోయిన విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూ వచ్చారు. ఈ పోరాటంలో సుదీర్ఘంగానూ, స్పష్టమైన లక్ష్యప్రకటనతో సాగిన ఉద్యమం శ్రీకాకుళ గిరిజనోద్యమం. ఈ ప్రభావంతో సాహిత్యం వైపు దృష్టి సారించిన అట్టాడ అప్పల్నాయుడుగారికి ఈ ఉద్యమమే కథా వస్తువు అయ్యింది. అందుకనే అట్టాడ అప్పల్నానాయుడుగారు తొలి కథాసంపుటి "పోడు-పోరు" అయింది. పోడును దక్కించుకోవడానికి పోరు అనివార్యం అన్న స్థితిని ఈ సంపుటి తెలియజేస్తుంది. ఈ గిరిజనపోరాటానికి, గిరిజన జీవితానికి ఉన్న ప్రత్యక్ష సంబంధాన్ని తెలియజేస్తూ అట్టాడ అప్పల్నాయుడు గారు కథల్లో "ఖండగుత్త", "పంట", "పోడు- పోరు", "అరణ్య పర్వం", "ప్రజాకోర్టు" కథలు సాగాయి. ఈ కథలు శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం నేపథ్యంగా గిరిజనుల జీవితాన్ని వారిని దోచుకుంటున్న మైదాన ప్రాంత వడ్డీ వ్యాపారుల, భూస్వాముల నిజ స్వరూపాన్ని, గిరిజనుల ఐక్యకార్యాచరణను ఈ కథల్లో రచయిత చిత్రించారు.

1."ఖండగుత్త" అనే కథ పోరాటానికి, గిరిజన జీవితానికి మధ్య ఉన్న సంబంధాన్ని సంఘకాప్రేడ్‌ల అశయానికి ప్రతీకగా నిలుస్తుంది. ఏజెన్సీలో భూమి బదలాయింపులో జరిగే దోపిడియే ఈ కథ ప్రధాన అంశం. ఖండ గుత్తలగా జిరాయితీ (గవర్నమెంటు పట్టా ఉన్న భూములు). భూములనీ, పట్టాలనీ, చట్టాలనీ గిరిజనుల భూముల్ని పల్లం షావుకార్లు, బుగతలూ దురాక్రమించిన సందర్భాన్ని అప్పల్నాయుడు గారు కథా వస్తువుగా మార్చారు. ఈ కథలో షావుకారు తిరుపతయ్య, ఉయ్యిక భీముడు పాత్రల మధ్య జరిగిన ఖండగుత్త ఒప్పందంలోని లొసుగులను రచయిత చాలా వివరంగా (పట్టికతో సహా) ఈ కథలో చెప్పారనడానికి ఇది ఉదాహరణ."ఉయ్యికోడా! ఖండగుత్త మీద యిస్తేనే మీ కోదోళ్ళ అప్పు తీర్సగల్రు....సొమ్ముకి సొమ్మెక్కడ తేగల్రు? యిదిగో నువ్వు పట్టుకెల్తున్న వందరూపాయలకి చింతపండు సీజన్ల కింట్లామున్నర పండు యిచ్చుకోవాలి అలాగైతే, నీకూ, నాకూ బాకీ చెల్లిపొద్ది. ఒకేల నువ్వప్పుడు పండు తక్కువజేత్తే ఎంత తక్కువయితే అంతటికీ అప్పుడు పండురేట్టుగట్టి లెక్కగట్టి ఆ డబ్బుకి ఈ ఖండన మీదే

నోటు రాసుకుంటాను ఏటీ? అదీ షరతు. నీ కిష్టమయితేనే వొట్టికెల్లు సుమ్మీ. ఇష్టం లేకపోతే మానెయ్యి పర్లేదు." (పు.ట75) అన్నాడు. బలవంతం కాదు సుమా? అన్నట్లుగా పైకి మాట్లాడినా, చాలా తెలివిగా భీముని అవసరాన్ని ఆసరాగా తీసుకొని ఖండగుత్త (బాకీ) వలలోకి లాగేశాడు. అలా బాకీ పడినందుకుగాను భీముడు తిరుపతయ్య పొలాలకు దమ్ముపట్టడం, నూర్పులకాలంలో రాత్రిపగలు పనిచేయాలి. అంతేకాదు వెట్టికి పోడు మీద పండిన కందులు కావిడేసి ఇవ్వాలి. అరటిగెల, పనస పండ్లు ఇవ్వాల. 'షావుకారి తిరుపతయ్య వలసకు వచ్చినప్పుడు బియ్యం, పప్పు, ఉప్పు, మిరపకాయ, బత్తెం ఇవ్వాలి. వెళ్ళి పోయేటప్పుడు కోడిపెట్ట వెంట పంపాల, అంతేకాదు ఎన్నికల సమయంలో తిరుపతయ్య చేప్పిన వాళ్ళకే ఓటెయ్యాలి. ఇవన్నీ చేసన్తా కూడా 'షావుకారికి వచ్చినప్పుడల్లా "అడిగినప్పుడు తీర్సలేనోడు, ఎడమ్మ మొగుడిదని ఓడీసుకున్నాడో? ఎవడి పెల్లం రంకు మొగుడి సొమ్మే ఎగమెడ్డీడానికి?" (పు.ట77) అనే తిట్లు, వేదింపులు కూడా భరించాల్సిన గిరిజనుల దైన్యం అప్పల్నాయుడు గారు "ఖండగుత్త" కథలో వ్యక్తమవుతుంది.

ఈ కథ పోరాటానికి, గిరిజన జీవితానికి మధ్య ఉన్న సంబంధాన్ని ఏజెన్సీలో గిరిజనుల మీద సాగిన షావుకార్ల దోపిడిని అమాయకులైన అడవి బిడ్డలపై క్రూరజంతువుల్లా పడి వాళ్ళ కష్టాన్ని సంపదను, భూమిని లాక్కుంటున్న బుగతల వైనాన్ని ''ఖండగుత్త'' కథ వివరిస్తుంది. ఈ కథ ప్రధానమైన దోపిడి రూపంగా వుంది. బట్టొలసలో భీముడు ఎద్దుపై పులిపడి చిత్రహింసకు గురిచేసింది. ఎద్దును కోల్పోయిన భీముడు సావుకారి దగ్గర అప్పు తీసుకొని సావుకారి అనే పులి చేతిలో చిత్రహింసలకు గురయిన తీరు కనిపిస్తుంది. గిరిజన సంఘాలు ఏర్పడి, సంఘం నాయకులు విచారించి ఇలాంటి అన్యాయపు వసూళ్ళను ఆపు చేశారు. ఖండగుత్తల్ని ఆరికట్టేందుకు గిరిజనోద్యమ నాయకులు నిర్వహించిన ప్రజాకోర్టుల ద్వారానే గిరిజనులకు న్యాయం జరిగింది. తీరని అప్పుకు తమ భూముల్ని కోల్పోయిన గిరిజనులు సావుకార్ల, వడ్డీవ్యాపారుల, కాంట్రాక్టర్లు వద్ద వెట్టిచాకిరీ చేయాల్సి వస్తుంది. ఆ సమయంలో గిరిజనేతరుల నుండి గిరిజనులను కాపాడడానికి కనీసమయిన చర్యలయినా చేపట్టకపోతే శాంతి భద్రతలు శాశ్వతంగా కరువవుతాయని ప్రభుత్వం గ్రహించి 1917లో మొట్టమొదట గిరిజన సంక్షేమ చట్టం వచ్చింది. దానిపేరు "ఏజెన్సీ ప్రాంతాల వడ్డీ మరియు భూమి బదలాయింపు చట్టం."2 గిరిజనుల నుండి 'షావుకార్లు వసూలు చేసే వడ్డీ 12 శాతానికి మించకూడదనీ, గిరిజనేతరులు జిల్లా అధికారుల అనుమతి లేకుండా గిరిజనుల భూములను కొనుగోలు చేయకూడదనీ ఈ చట్టం చెబుతుంది. ఆ విధంగా రాజ్యం, గిరిజనులకు రక్షణ ఇచ్చింది. ఈ విధంగా గిరిజనోద్యమ నాయకులు పోరాటాల ద్వారానే ఖండగుత్త (బాకీ)నుండి విముక్తమై అన్యాయంగా గిరిజనేతరులు దోచుకున్న భూముల్ని దోపిడి నివారించే హక్కుద్వారా గిరిజనులు తమ భూముల్ని స్వాధీనం చేసుకొన్నారు.

2. మరోకథ "పంట" పెత్తందార్ల చేతిలో పడిన ఆదివాసీల భూమిని తిరిగి దక్కించుకొన్న క్రమానికి అక్షరరూపం "పంట" కథ.పార్వతీ పురం ఏజెన్సీలోని సావుకార్లతో బుగతబాబు అన్న మాటల్ని గమనిస్తే తెలుస్తుంది. "ఎవుడి నౌకరాడు చేసుకోడంకి, ఎవుడి సంపదాదు అనుభవించడంకీ గాంధీగారు స్వాతంత్ర్యం తెచ్చారు గానీ" (పుట.70) అని బుగతబాబు అనడంతో, పెత్తనాన్ని చెలాయిస్తున్న వాళ్ళకు ప్రభుత్వం పట్ల ప్రభుత్వం దాన్ని అమలు చేస్తున్న తీరుపట్ల ఉన్న భావం స్పష్టం అవుతుంది. ప్రభుత్వం గిరిజన రైతులపట్ల అవలంభించే నిర్లక్ష్య ధోరణి వల్ల తమ చేతుల్లో వున్న భూమి గిరిజనుల నుంచి చేజారిపోయింది. మైదాన ప్రాంతాల నుంచి వలస వచ్చిన బుగతలు, 'షావుకార్లు గిరిజనుల నిరక్షరాస్యతను నిజాయితీని ఆసరాగా తీసుకొని వాళ్ళ భూముల్ని సొంతం చేసుకున్న తీరును "పంటకథ"లో చిత్రించాడు రచయిత.

బిక్కం భూమిని కరణం సాయంతో దురాక్రమించాడు. రెవిన్యూ చట్టాల ద్వారా ప్రభుత్వ యంత్రాంగ సహాయంతో షావుకార్లు చేసిన అక్రమాల వల్ల అటవీ భూములపైన గిరిజనులు తమ హక్కును కోల్పోయారు. గిరిజనులు అడవిని నరికి భూమిని సాగులోకి తీసుకు వస్తే కరణాలు, భూస్వాములు ఆ భూములు నుండి వారిని దూరం చేసి ఆక్రమించుకొనే పన్నాగాలు పన్నారు. దీని వల్ల శ్రమతప్ప సంపద మిగలని జీవితాలయ్యాయి గిరిజనులవి. గిరిజనులు వేసుకున్న పంటలను రక్షించుకోవడమే కాకుండా గిరిజన ప్రజల్ని ముందుకు నడిపే గిరిజనోద్యమ నాయకులను రక్షించుకోవడానికి చేయిచేయి కలిపి ముందుకు కదిలిన విధానాన్ని రచయిత ఈ కథలో చిత్రీకరించారు. భ్వాముల భూములలో వ్యవసాయపు పనుల కూలీకి పెంపుదలకు,

భూస్వాముల నుండి గిరిజనుల భూమిని కాపాడడానికి సంఘం కార్యక్రమాలు చేపట్టింది. వ్యాపారాలు, దోపిడీల పేరుతో బుగత గిరిజనుల భూమంతా ఆక్రమించు కొంటాడు. అలా ఆక్రమించు కొన్న పంటను గిరిజనుల సంఘం కోసి, పంటను స్వాధీనం చేసుకొంటుంది.. గిరిజనులపై దోపిడి నివారణలో కామ్రేడ్లు అండకావటాన్ని రచయిత స్పష్టపరిచాడు.

3. మరోకథ "పోడు- పోరు". కొండ ప్రాంతాల్లో బతికే కొండ ప్రజల జీవన విధానానికి ఉద్యమ పోరాటానికి అద్దం పడుతుంది. గిరిజనులు రక్షణకోసం రాజ్యాంగం పక్షాన చేసిన చట్టాలు, ప్రభుత్వ సంస్థలు, సంక్షేమ పథకాలు ఏవీ గిరిజనుల సంరక్షణకు అభివృద్ధికి ఉపయోగపడలేదు. ప్రభుత్వం అడవి రక్షణ కోసం చేసిన అటవీ చట్టం అమలు చేయాల్సిన అధికార సంఘాలు యంత్రాంగం, దొంగ సారాను అరికట్టే పోలీసు యంత్రాంగం, గిరిజనుల భూమీలో శిస్తు వసూలు చేసే రెవిన్యూ యంత్రాంగం, బ్యాంకులు, గిరిజనుల జీవితాలను అల్లకల్లోలం చేశాయి. ప్రభుత్వ యంత్రాంగం పక్షాన గిరిజనులపై అధికారాన్ని చెలాయిస్తే మైదాన ప్రాంతం నుంచి వచ్చిన పెత్తందారి భూస్వామ్య వర్గం వడ్డి వ్యాపారులైన 'షావుకాళ్ళు, సొండీలు ప్రైవేటు కంట్రాక్టర్లకు ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభుత్వ సహకారం వీళ్లకే అందిస్తున్న క్రమం తెలుస్తుంది.

ఈ కథలో బిడ్డికోడు సవర్రాజు బాకి కింద పది వంటల కాలంల (ఐదు సంవత్సరాలు) నుంచి చింతపండు, కందివప్పులాంటి అటవీ ఉత్పత్తులను అప్పజెప్పుకొన్నాడు. వచ్చినప్పుడల్లా జీలుగు కల్లు ఇప్పసారా కోడిపెట్టలతో సహా తీసుకెళ్తున్నా అతని అప్పు తీరలేదంటాడు. తీరని అప్పు వసూలుకు వచ్చిన 'షావుకారుతో విసుగెత్తిన బిడ్డికోడు ఇలా అన్నాడు. "యేటా పీక మీద గూకుంతావు వొట్టి సేతుల్తో టెల్లవు. యేదోవొకటి కొలిసికెలిపోతావు యింకా బాకీ అంతావు" (పు.ట35) అన్నాడు. ఆ మాత్రానికే 'షావుకారు పోలీసుల్ని బిడ్డికోడి ఇంటిపైకి పంపించాడు. బలహీనుల పక్షాన నిలబడాల్సిన పోలీసులు అతని ఇంట్లో చొరబడి, బెదిరించి వీరంగం చేసిన తీరును అప్పల్నాయుడు గారు ఇలా కళ్ళకు కట్టినట్టుగా చూపించగలిగారు. "యేట్రా బిడ్డకోడా? కొవ్వు బలిసిందేట్రా? సవర్రాజు నెదిరిత్తావటరా? సంగపోలిని పిలుత్తావటరా? మీటింగు లెడ్తావట? యెవుడ్రా.....ఆ మేస్ట్రు? యేడిరా?" (పు.ట40) ఓరే మీకింకా బుద్ది రాలేదురా."పెద్దోలితోటి తగువు లొద్దర్రా అంటే యిన్రుకదా! పెద్దోలితోటి తగువంటే ఆళ్ల తరుపు ప్రభుత్వం దిగుతాది. ప్రభుత్వం తోటి యుద్ధం చెయ్యడానికి నీకాడ యేటున్నాయి? ఏటంబాంబులున్నాయా? మిషన్ గన్నులున్నాయా? మిల్ట్రీ వున్నాదా? యేటేలేదు. యీ వొలసల మాకుగానీ, సవర్రాజుకీ గానీ, గవర్నమెంటు గ్గానీ ఎదురు పలకకూడదు. ఎప్పుడూ సంగం కవుర్లాడగూడదు కుక్కిన పేనుల్లాగ నోర్మూసుకుండాల! లేకపోతే మీ తల్లోని జేజెమ్మలు గూడ హడలెత్తి ఛస్తారు, జేగర్త!" (పుట40) అని యేడుస్తున్న సుక్కినీ, బిడ్డికోడిని, వాళ్ళను జాలీగాచూసే వలస ప్రజలను హెచ్చరించి, బిడ్డికోడిని తీసుకుపోయారు. ఆ హెచ్చరికలో పోలీసులు ఏపక్షంలో నిలబడ్డారో ఎవరికి అండదండగా నిలిచారో, ఎవరిని భయపెడుతున్నారో ఈకథలో స్పష్టంగా కనబడింది. ఈ కథలో తులసి వలసలోని అమాయక గిరిజనులకు అండగా నిలవాల్సిన పోలీసులు, ఆర్థికబలం, అండబలం కలిగిన సావుకారు మాటలనే నమ్మారు. పోలీసులు దౌర్జన్యంగా బిడ్డిక మంగయ్యను చావబాదారు. సావుకారు బిడ్డక మంగయ్య పంటలను దోపిడి చేసి దోచుకొన్నాడు. గిరిజన కార్పొరేషన్ వాళ్ళు బిడ్డక మంగయ్య చింతపండు లాక్కొని తడిగా వుందని ఎండితే తూకం తగ్గిపోతుందని చెప్పి, ఇరవై రూపాయలు ఇచ్చారు. గిరిజనుల దోపిడి విధానాల్లో యిదొకటి. గిరిజనులు అడవిలో సేకరించిన ఆహారపంటలల్ని గిరిజన కార్పోరేషన్ పేరుతో తక్కువ డబ్బుకు వారి నుండి దోచుకొన్నారు.

గిరిజనుల ఆర్థిక పరిస్థితి, అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని సావుకార్లు వారిపై చలాయించే ఆధిపత్యానికి, దోపిడికి విరుగుడు ఎర్రజెండానే అని తన జెండాను దాచిన ఉద్యమకారుల స్ఫూర్తి, పోరాటం ఈ కథలో రచయిత చిత్రీకరించారు. సావుకార్లు దోపిడి తనానికి వ్యతిరేకంగా పిడికిలి బిగించి ఆయుధం పట్టిన నాడే కొండ ప్రజలకి "పోడు భూమి" మిగిలి మంచి బతుకులు వస్తాయని రచయిత తెల్పారు.

4. మరో కథ"అరణ్యపర్వం" బూర్జగూడ వలసలోని సవరబొంతు, కొయ్యం, ఇస్రూలు ముగ్గురు అప్పు కట్టనందుకు కోర్టుకు హాజరు కమ్మని పంపిన కోర్టు నోటీసులు అందుకొన్నారు. ప్రభుత్వ అధికారులు, రాజకీయా నాయకులు కామధేను పథకం కింద గిరిజనులకు బ్యాంకులోను సౌకర్యాన్ని కల్పిస్తూ గూడెం వాళ్ళతో ఆ పథకాన్ని అమలు చేయాలనుకొంటారు. కానీ షావుకారు బాకీలతో విసిగిపోయిన గిరిజనులు "అప్పులు ఎలాగ ముంచుతాయో సావుకార్ల పున్నేన అనుబగించినాం వదొద్దు బావో... ఈ కొత్తప్పులు.."(పుట.86) అని బ్యాంకు ఋణాల్ని తిరస్కరించినా సబ్సిడీలు వస్తాయి. మీరు అప్పు

తీర్చాల్సిన పని లేదు అని రాజకీయ నాయకులు వాళ్ళను బలవంతంగా, ఒప్పించే ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వ పథకాల్లోని డొల్లతనాన్ని "కందగుత్తల మీద పల్లం సావుకార్ల కాడ అప్పులోడీసి సెడిపోయిందానికో గవర్నమెంటు సబ్సిడీ మీద బ్యాంకు లోన్లుకీ తేడాలేదురా? బోల్డు తేడా....! గవర్నమెంటు లక్షలు, లక్షలు దేనికిన్తుంది? మిమ్ముల్నుద్ధరించడానికే ఈ జీపులూ, ఆఫీసులూ, ఆఫీసర్లూ దేనికోసం? మీకోసమే! మిమ్ముల్నుద్ధరించడానికే గవర్నమెంటు పంపింది". (పు.ట86) అని ఎమ్మెల్యేదొర మాటలు వ్యక్తం అవుతాయి. కానీ గిరిజన వలసలలోని నిజమైన పరిస్థితులను గుర్తించకుండా ప్రభుత్వ పథకాలను అమలుపరచడం వల్ల బ్యాంకు, కోర్టు నోటీసులు పంపి గిరిజన వలసలను లక్ష్యముగా చేసుకొంది. ప్రజలు అవసరాలకు అనుగుణంగా లోన్లు మంజూరు ఉండాలి. వాళ్ళుకోరుకోని, అలవాటు లేని వనుల కోసం అప్పులివ్వడం వల్ల వాళ్ళు మరింత దారిద్ర్యంలోకి నెట్టబడతారేగాని ఆర్థికాభివృద్ధి అందుకోలేరన్న వాస్తవం అట్టాడఅప్పల్నాయుడుగారు ఈ కథలో చిత్రించారు.

5. అధికార యంత్రాంగపు దొంతరలవారీ వ్యవస్థలో అట్టడుగున ఉన్నవారిపై ఉద్యమం ప్రవచిస్తున్న ప్రజారాజకీయాలు ఎలా వ్యవహరించాలో తెలిపే కథ'ప్రజాకోర్టు' షావుకార్లు అప్పుల నెపంతో దోచుకొంటున్నారు. మామూళ్ళ నెపంతో దోచుకొనే పోలీసుల దౌర్జన్యం గిరిజన జీవితాలను మరింత దుర్భరం చేసింది. సారా కాచే సోండోడి దగ్గర మాములు వసూలు చేసుకోవటానికి పోలీసు జగ్గారావు వెళ్తున్నాడు. పనిలో పనిగా దారిలో ఎదురైన అరిక పగడాలు చేతిలోని రెండు ఎర్రపుంజులు కన్పించాయి. జవాను జగ్గారావు రెండు ఎర్రపుంజులను దౌర్జన్యంతో లాక్కొని సైకిల్ హేండిల్‌కి కట్టుకొన్నాడు. పగడాలు చేతిలోని ఎర్రపుంజులు రెండు దోపిడి, దౌర్జన్యంగానే పోలీసు హస్తగతమైయాయి. "పోలేరమ్మ తల్లికీ పోలీసోడికీ అడ్డేటి?"(పుట44) అన్న సోండోడి భార్య కాంతమ్మ మాట ప్రజా జీవితంలో పోలీసుల ఎదురులేని అధికారపు చలాయింపునే సూచిస్తుంది. కానిస్టేబుల్‌కి న్యాయమూర్తి ఎలాంటి శిక్ష విధించకుండానే ప్రజాకోర్టు ముగిసింది. గిరిజన సంక్షేమాన్ని అమలు పరచాల్సిన ప్రభుత్వమే తన కర్తవ్యాలను చేయలేకపోయింది. అనుకొని పరిస్థితులలో గిరిజన సంఘం ఏకం అయ్యింది. చట్ట విరుద్ధంగా ఖండగుత్తల పేరుతో వడ్డీ వ్యాపారస్థులు ఆక్రమించుకొన్న భూమిల్ని సాధించు కొన్నారు. దారుణమైన వడ్డీరేటుతో పెరిగిపోయిన అప్పులను తీర్చలేని గిరిజనులను వెట్టిచాకిరి నుండి ఉద్యమ నాయకులు విముక్తి చేశారు, కార్పోరేషన్ ద్వారా వీలైన కేంద్రాలలో గిరిజనులకు కావాల్సిన సరుకులు, వీరు అమ్మే ఏజెన్సీ సంపదకు సరియైన రేటుకోసం సక్రమ తూకాల కోసం పోరాడి అమలు జరిపారు. పోలీసుల దోపిడి , దౌర్జన్యాలు, ఫారెస్ట్ ఉద్యోగుల అక్రమాలను అణచివేశారు. మైదాన ప్రాంతపు వలసదారుల అక్రమాలను, దోపిడీ! దౌర్జన్యాలను గిరిజనుల సంఘం సహాయంతో గిరిజనులు ప్రశ్నించగలిగే చైతన్యం పొందారు.

ముగింపు::- ఖండగుత్త వలలో చిక్కుకున్న భీముడు గిరిజన నాయకులతో కలిసి సావుకారి తిరుపతయ్య దోపిడిని ఎదుర్కొని, హక్కులను సాధించుకున్నాడు. 'పంట' కథలో బుగతబాబు, బిక్కుం భూమిని కరణం సాయంతో దోపిడి, దౌర్జన్యానికి పాల్పడ్డాడు. అలా గురైన భూమిని తిరిగి స్వాధీనం పరుచుకునే క్రమంలో బిక్కుం గిరిజనోద్యమ నాయకుల అండతో తాము వేసుకున్న పంటల్ని తిరిగి స్వాధీనం చేసుకొని, దోపిడి నివారించి హక్కులను సాధించుకొన్నాడు. "పోడు -పోరు" కథలో బాకీ వలలో చిక్కుకున్న బిడ్డక మంగయ్య కామ్రేడ్‌ల అండతో సావుకారి సవర్రాజు దోపిడీని, పోలీసుల దుర్మార్గాల్ని తరిమి కొట్టి పోడు కోసం పోరాటం చేసి తమ హక్కులను తిరగి దక్కించుకొన్నాడు. 'ప్రజాకోర్టు' కథలో అరిక పగడాలు దగ్గర దోపిడీ చేసి గుంజుకున్న కోడిపుంజులు, గతంలో చేసిన దుర్మార్గాలకు గిరిజన సంఘం బలంతో కామ్రేడ్‌ల అండతో ప్రజాకోర్టులో ప్రవేశ పెట్టబడిన పోలీసు జగ్గారావును పేదవర్గానికి చెందిన వాడు అని తెలుసుకొని, మంచి మార్గానికి మారి ప్రజలకు మిత్రుడిగా ఉండమని ప్రజాకోర్టు హెచ్చరించి ప్రాణభిక్ష పెట్టింది. 'అరణ్యపర్వం' కథలో ప్రభుత్వం వారు కామధేను పథకం కింద ఇచ్చిన సబ్సీడీలు, లోన్లు పేరుతో సవర దొంతు సవర కొయ్యం, ఇస్రూలు బాకీ వలలో చిక్కుకుపోవడం, ఆఫీసర్లు, దళ్ళారోడు ధరఖాస్తులు, ఖర్చుల రూపంలో దోచుకున్న తీరు కనిపిస్తుంది. పాల కంపెనీ వాళ్ళు మోసానికి గురికాబడిన వీళ్ళు కోర్టు వారి ముందు భయంతో గడిపే జీవన పరిస్థితులను ఎదుర్కొని వాళ్ళు దౌర్జన్యాలను ప్రశ్నించగలిగే చైతన్యాన్ని పొందారు.

మునకాల ధనలక్ష్మి
(పరిశోధకురాలు), తెలుగు అధ్యయనశాఖ
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.
ఫోన్ : 8074242248



వంగపండు

# వంగపండు ప్రసాదరావు జీవితం – సాహిత్యం

– బద్రి కూర్మారావు

ఉత్తరాంధ్ర ప్రజలకు తూర్పువారని కూడా అంటారు. ఈ తూర్పున ఉదయించి తెలుగు జాతికి ఆదర్శంగా నిలిచిన ఆధునిక కథకు ఆద్యుడు గురజాడ, కవిత్వానికి శ్రీశ్రీ, సాహిత్యానికి పురిపండ, వ్యావహారిక భాషకు గిడుగు, హరికథకు ఆదిభట్ల, విప్లవోద్యమ పాటలకు సుబ్బారావు పాణిగ్రాహి, అదే విధంగా పాటకు ముఖ్యంగా జానపద ఉద్యమ పాటలకు వారసుడు వంగపండు ప్రసాదరావు. ఒకప్పటి శ్రీకాకుళం జిల్లా (నేటి విజయనగరం జిల్లా) పార్వతీపురం దరి పెదబొండపల్లిలో 1943 జూన్ పదిన జగన్నాథం, చిన్నమ్మలకు జన్మించారు. వంగపండు తండ్రి కొద్దిపాటి చదువుతో అప్పడప్పుడు భారత, రామాయణ గాథలను చెప్పేవారు. ప్రసాదరావు పదవతరగతి వరకు చదివి ఐ.టి.ఐ. చేసి కొద్దికాలం షిప్‌యార్డ్‌లో ఉద్యోగం చేసారు. పెదబొండపల్లి గ్రామం కళాకారులకు నిలయం. పల్లెప్రజల ఆచారసాంప్రదాయాలు, పెళ్ళిల్లు, పండుగలు, గైరమ్మ పండుగలు, ఉడుపులు (నాట్లు), కోతలు సమయంలో గ్రామీణ స్త్రీలు పాడుకొనే పదాలు, జానపదకళాకారుల ప్రదర్శనలు వంగపండు పై ప్రభావాన్ని చూపాయి. 8వ తరగతి నుండే చిన్న చిన్న కవితలు, పాటలు రాసేవాడు. శ్రీకాకుళం ఉద్యమం, గిరిజన పోరాటాలు ఇవన్నీ ప్రసాదరావుపై కొంత ప్రభావితం చేసాయి. తరువాత కార్మిక సంఘాలలో చిన్న చిన్న పాటలు రాసి పాడుతుండగా రా.వి. శాస్త్రి, కా.రా. మాష్టారు, శ్రీశ్రీ వంటి వారితో పరిచయం ఏర్పడింది. తన గ్రామాలలో జానపద కళాకారులుచే ప్రభావితుడైన వంగపండు గ్రామీణ భాషలో అసలు తెలుగుపాట 1969లోనే రాసారు. తరువాత 1972లో ఏర్పడిన జననాట్యమండలితో పరిచయం అయింది.

ఉత్తరాంధ్ర ప్రజల యాస, భాషలతో జానపదాలను చొప్పించి అనేక పాటలు వ్రాసారు. తన బాణీలన్నింటినికి ఉత్తరాంధ్ర జానపద బాణీలే ఆధారం అంటారాయన. ప్రజల భాషలో పాటలు వ్రాస్తూ పాటనే తూటాగా మలిచారు. గద్దర్‌తో సమానంగా ఆంధ్ర రాష్ట్రమంతాటా పర్యటించి వందలాది ప్రదర్శనలిచ్చారు. పరిస్థితులకు అనుగుణంగా అప్పటికప్పుడు పాటవ్రాసి బాణీ కట్టడం వంగపండుకు వెన్నతో పెట్టిన విద్య.

ఉదా : పిన్నీసుపై పాట.....

*అందో పిన్నీసు*
*లబ్బరు పిన్నీసు*
*లాగుతుంటె సాగుతుంది*
*లబ్బరు పిన్నీసు*

ఒకసారి గ్రామంలో పెళ్ళి జరుగుతుంది. డప్పులు మ్రోగుతున్నాయి. డప్పులు మ్రోతకు అనుగుణంగా

*జజ్జనకరి జనారే*
*జనకు జనాజనారే*
*జజ్జనకరి జజ్జనకరి*
*జజ్జనకరి జనారే* అనే పాట వ్రాసారు.

కూలీల కోసం వ్రాసిన పాట....

*కూడూ గుడులేని కూలోళ్ళము*
*కొట్టాలి కొడవలికి కక్కులు*
*కొయ్యాలి వరిచేనుదుబ్బులు*
*అలాగే రండిరో కూలన్నో*
*రండిరో రండిరోరి ॥ర॥*
*సంఘం పెడదాం*
*సంగతేంటో చూద్దాం ॥ర॥*

ఎంతో మంది శ్రామికులు నిర్మించిన ఓడ పరాయి దేశ వ్యాపారస్థులు తీసుకు పోతున్నప్పుడు

*ఓడా... నువ్వెలిపోకే*
*మాకండలన్ని పిండిచేసి*
*నీటిలోను కోటలాగ*
*ఎముకులోంచి కట్టినాము ॥ఓడ॥*

అనే పాట రాసారు.

*భూస్వామ్యులు ఆడగాలను, దౌర్జన్యాలను .......*
*వత్తన్నాడు వత్తాన్నాడు*

*ఆ భూములున్న బుగతోడు*
*పోలీసుల తోడు తోడు ॥వత్తన్నాడు॥*

అనే పాట వ్రాసారు.

ఒక యంత్రంను తయారుచేసి దానిని నడపాలంటే కార్మికశక్తి ఎంత అవసరమో ఈపాట ద్వారా తెలియ జేసారు.

*యంత్ర మెట్టానడుత్తు ఉందంటే ఓ రన్నోలమ్మీ*
*రైలు లారీ కారు బస్సు*
*మిల్లు మిషను మోట్టారు సైకిలు ॥యంత్ర॥*
*ఇంజను గదిలో ఇరుకిరుకున్న*
*గిరిగిరా తిరుగే మరల మద్దెన*
*కష్టజీవులు కార్మికులంతా.....*

అదే విధంగా రైతు దేశానికి ఎంత అవసరమో ఈ పాట ద్వారా తెలియజేసారు.

భూమి దున్నవయ్యా ॥రైతు॥
భూమి దున్నవయ్యా
భూమిదున్ని ఈ పేద ప్రజలకు
కూడుపెట్టవయ్య ॥రైతు॥

హరిజన (దళిత) కులాలను గ్రామాలకు దూరంగా పెట్టడాన్ని చూసి అంటరాని తనంపై....

*ఉందర్రా మాలపేట*
ఆ చివర ఉన్న కాష్టాలున్న చోట
ఆ ఊరు చివర కాష్టాలు ఉన్నచోట ......

అనే పాట వ్రాసారు

చదువుకోలేని ఆడపిల్లలు కూలీ పనులు చేస్తుంటారు. చదువుకోలేక బాధపడవద్దని, చదువుకున్న వారికంటె నీవే గొప్పదానివనే పాట

*చదువు లేదని నీవు*
*కలత చెందకు పిల్ల*
*ఎన్ని చదువులున్నా*
*ఎన్ని సోకులు ఉన్నా*
*నినుమించరు పిల్లో*
*నాకూలోల పిల్ల*

విశాఖపట్నం అప్పడప్పుడే అభివృద్ధి చెందుతుంది. వలస కార్మికులందరు పనులు కోసం విశాఖ చేరు కుంటున్నారు. ఒకపల్లె పడుచుని భర్త విశాఖ బయలు దేరమంటారు. విశాఖపట్నంలో అన్నీ చూపిస్తానంటాడు. కాని ఆపట్నంలో నేను బ్రతకలేనని పడుచు అంటుంది.

*బయలు దేరవేపిల్ల*
*రైలు బండి ఎక్కిల్దాం*
*అబ్బానేను రాను*
*పట్నంలో బ్రతకలేను ॥బయలు॥*
*పట్నమంటే పట్నం - విశాఖపట్నం*
*ఓడలున్న పట్నం*
*మేడలున్న పట్నం ॥బయలు॥*

శ్రీ వంగపండు మరో ప్రముఖ రచన 1977లో రాసిన "భూమి భాగోతం" ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి భూస్వామ్య వ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థలో నాయుదు, కరణం, మునసబు, తెలంగాణాలో పటిల్, పట్వారి అవినీతి వ్యవస్థలను ఎండగడుతూ రాసిన రచన వందలాది ప్రదర్శలిచ్చింది. అంతే కాకుండా గ్రామగ్రామాన భూమి భాగోతం బృందాలు ఏర్పడ్డాయి. 20 నుండి 25 మంది వరకు కళాకారులు, నేపద్య గాయకులు, వాయిద్య కారులతో వందల బృందాలతో సంచలనం సృష్టించిన కళారూపం మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు.

1977 నుండి సుమారు 1982 5ఏళ్ళ పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగిన ఈ కళారూపం ప్రజలపై ఎంతో ప్రభావాన్ని చూపింది. ఈ రోజువరకు 45-50 సం॥ల పైబడిన వారికి ఈ పాటలు ఇంకా గుర్తున్నాయి. వంగపండు ప్రసాదరావు వ్రాసి పాడిన అనేక పాటలతో పాటు "భూమి భాగోతం" బాగా ప్రసిద్ధి పొందింది. ఆంధ్రరాష్ట్రంలో వందలాది ప్రదర్శన లిచ్చింది. ఉత్తరాంధ్ర భూమి భాగోతం ప్రదర్శన లేని గ్రామంలేదంటే అతిశయోక్తికాదు. అయితే ఈ భూమి భాగోతానికి ప్రేరణ తన అత్తవారి గ్రామంలో ప్రదర్శితమైన 'జాలరి భాగోతం' (జానపద ప్రదర్శన)

*జాతి చెప్పగ మేము జాలారి వాళ్ళం*
*చేపాజల్లాలమ్ము కుందుం*

అనే బాణీలను తీసుకొని ఆనాటి నాయుడు, మునసబు, కరణం రెవెన్యు, పోలీసు వ్యవస్థపై వ్రాసి ప్రదర్శించిన భూమి భాగోతం ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకు వచ్చింది.

*కలం రాతగాడిని*
*ఈ ఊరుకు కరణం నేను ॥కలం॥*
*మూడూళ్ళకు మునసబుని*
*ఏడూళ్ళకు నాయుడుని నేను ॥కలం॥*
*నేనురాసే రాతకు ఎదురు లేదురా*
*గీసేగీతకు తిరుగు లేదురా ॥కలం॥*

ఇది అందులో కరణం పాత్ర యొక్క పాట. ఇలా మూడు నాలుగు గంటలపాటు ప్రదర్శితమైన భూమి భాగోతం చూడడానికి ప్రజలు తండోపతండాలుగా వెళ్ళేవారు. వీటిని ప్రదర్శించడానికి ఎన్నో బృందాలు తయారయ్యాయి. ఎంతో మంది కళాకారులు తయారయ్యారు. 1982లో ఎన్టీరామారావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యాక నాయుడు, కరణం, మునసబు వ్యవస్థను రద్దు చేసారు. భూమి భాగోతం లాంటిదే సిక్కోలు యుద్ధం, ఏరువాక, పాలికేక వంటి రచనలు, శ్రీకాకుళం నక్సల్బరీ, ఉద్యమనేపథ్యాలు గిరిజనుల సమస్యలపై 'సిక్కోలు యుద్ధం'లో వంగపండు మధ్య పాటపాడగా విశాఖకు చెందిన కె.పి.సుబ్బారావు రాజకీయం చెప్పగా, హరి హాస్యం చెప్పేవాడు. ప్రపంచీకరణపై డంకెల్ భాగోతం, పాలికేక, దుబేలు-దబేలు కార్యక్రమాలు నిర్వహించారు. 300 విప్లవగీతాలు, సుమారు 30 సినిమాలకు పాటలు రాసారు. శ్రీకాకుళం పోరాటంపై 'సిక్కోలు యుద్ధం' ఈయన రచనే. ఢిల్లీ నుంచి హైదరాబాద్ వరకు వందలాది ప్రదర్శనలిచ్చింది.

గిరిజనుల పోరాటం గూర్చి వ్రాస్తూ.....

*ఆకు చిక్కితే వాళ్ళ రత్తము*
*అక్కడ కారుద్దోయ్ నాయన*
*మొక్క పీకితే చిక్కని చెమట*
*చుక్కలు పడతాయో ॥నాయన॥*

తరువాత టి.కృష్ణ, ఆర్.నారాయణమూర్తి గార్లు తీసిన అర్ధరాత్రి స్వతంత్రం, ఎర్రసైన్యం, చీమలదండు, అడవిదిమిటీ వంటి సినిమాలకు సామాజిక నేపథ్యంతో పాటు వంగపండు "ఏం పిల్లో వెల్దమొస్తావ" వంటి పాటలతో సినిమాలు విజయవంతం కావడానికి వంగపండు ఉపయోగించిన ప్రజా భాష, యాస కారణం. అందుకే వంగపండు, ఆయన పాటలు తెలుగునేలపై చిరస్మరణీయం. వంగపండు కొన్ని సినిమాలకు పాటలు వ్రాసారు. అందులో ప్రసిద్ధి చెందిన పాట 'అర్ధరాత్రి స్వతంత్రం' లో ఏంపిల్లడో వెల్దమొస్తవా ఈ పాటకు ఆధారం 1960 ప్రాంతంలో ఉత్తరాంధ్ర వాసులు కరువుతో భిలాయి వలసపోయారు. ఆరోజులలో "రారపిల్లడో భిలాయి వెల్దమ" అనే పాట పుట్టింది. ఆ బాణీలను ఆధారంగా చేసుకొని

*ఏంపిల్లడో వెల్దమొస్తవ*
*ఏంపిల్లో వెల్దమొస్తవా*
*శ్రీకాకుళం ఆసీముకొండకు ॥ఏం పిల్లడో॥*

అనే పాట ఈ రోజుకీ సంచలనం సృష్టిస్తుంది ఏరువాకలో....

*తుపాకి రాజ్యంలో అన్నో*
*నువ్వు తుఫానువై లేవరన్నా*
*అన్న మాయన్న కంపెనీ కూలన్న*
*ఎన్నాలు ఈ బతుకు ఎదిరించురారన్న ॥తుపాకీ॥*

*జాలరి బతుకులు గూర్చి....*

*సంకురాత్రి-సొరగం మన్నదు జాలరన్న ॥జాలరన్న॥*
*చిన్ననాటి సేప్పామన్నదు జాలరన్న ॥జాలరన్న॥*
*పండుగచీర తెత్తనని ॥జాలరన్న॥*
*పడవేసి బయల్లెదు ॥జాలరన్న॥*

ఉత్తరాంధ్ర కళలు, సంస్కృతి ఎలా అంతరించి పోతున్నాయో తెలుపుతూ.....

*తెల్ల తెల్ల వారే మన పల్లెలు ఏమాయో*
*ఉత్తరాంధ్రలోను మన ఊరులు ఏమాయే*

*ఉత్తరాంధ్ర వెనుకుబాటు తనం గూర్చి వ్రాస్తూ....*

*కనండి తల్లి - ఇనండి నాయన*
*కష్టాలబతుకు - మన ఉత్తరాంధ్రబతుకు*
*ముందుకు బండి - వెనుకకు గుర్రం*
*ముఖ్యమంత్రి కొరడా ॥మన ఉత్తరాంధ్రబతుకు॥*

వంటిపాటలు వ్రాసారు, ఇటీవల ప్రపంచీకరణ నేపథ్యంలో డంకెల్ భాగోతం రాసి ప్రదర్శించారు. ఆయన పాటలు కొన్ని ఇంగ్లీషు, బెంగాలీ, హిందీ భాషలలోకి అనువందించబడ్డాయి. వందలాది పాటలు వ్రాసిన ఈయన సాహిత్యం యం.ఫిల్., పిహెచ్.డి పరిశోధనలకు దారి చూపాయి. మరణించే వరకు వంగపండు తన పాట-మాట, ఆట ద్వారా ప్రజలను ఉత్తేజితులు చేస్తునే ఉన్నారు. ఉత్తరాంధ్ర జానపద సంస్కృతికి వంగపండు ప్రసాదరావు ప్రతి బింబం.

**వంగపండుకు సన్మానాలు**

వంగపండు చాలా కాలం సన్మానాలకు దూరంగా ఉన్నారు. ప్రజల ఆదరాభిమానాలే సన్మానాలుగా భావించే వారు. ఒక సభలో ఓ ముసలమ్మ ఆయన పాటలన్ని ఆలకించి నాయనా నావద్ద ఏమిలేదు. ఈ అర్థరూపాయి (50పైసలు) అభిమానంతో ఇవ్వడం వంగపండు ఇప్పటికి మరచిపోలేదు. 2005లో పార్టీ రాజకీయాలకు స్వస్తిపలికారు. విశ్వవిద్యాలయాలు పెద్దగా గుర్తించినది లేదు. అక్టోబర్ 2008లో హైదరాబాద్ రవీంద్రభారతిలో

సంతరవి దాస్ ట్రస్ట్ ఛైర్మన్ డా॥ మల్లు రవి, రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారి శ్రీ కాకి మాధవరావు గార్ల చేతులమీదగా గండపెండేరం తొడిగారు. 2008లో బొల్లి ముంత శివరామకృష్ణ మెమెరియల్ అవార్డు అందుకున్నారు. 2009 జనవరి లో స్వంత గ్రామం పెదబొండపల్లిలో గ్రామస్థులు ముఖ్యంగా మహిళలు హారతిలిస్తూ గ్రామస్థులు పల్లకీపై వంగపండును వేదిక వరకు మోసుకొని తీసుకొచ్చి సన్మానించడం వంగపండు మరువలేని దినం. సుద్దాల హనుమంతు, జానకమ్మల జాతీయ పురస్కారం (వ్యవస్థాపకులు సుద్దాల అశోక్ తేజ) అవార్డు అందుకున్నారు. తానా సభలో అక్కినేని ఫౌండేషన్ వారిచ్చిన రంగస్థల అవార్డు, 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమిచ్చిన కళారత్న అవార్డు ముఖ్యమైనవి. ఎన్ని పురస్కారాలు అందుకున్నా ప్రజలిచ్చే పురస్కారాలు, ఈయన సభలకు ప్రజలు తండోపతండాలుగా విచ్చేయడం నిజమైన పురస్కారాలుగా చెప్పుకోవచ్చు.

ఐదుఏళ్ళ క్రిందట నుండి ఆంధ్ర విశ్వవిద్యాలయం థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ విభాగంలో గౌరవ వేతనంతో విద్యార్థులకు జానపదాలుపై శిక్షణ నిచ్చారు.

కర్షకుడిగా, కార్మికుడిగా పడిన పాట్లు అన్ని పాటలుగా మార్చి జానపదుల గుండె చప్పుడను ఊరూరా ప్రతిధ్వనించిన ప్రజాకవి వంగపండు ప్రసాదరావు 2020 ఆగష్టు 4, 78వ ఏట పార్వతీపురంలో తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ లాంచనాలతో వంగపండు అంత్యక్రియలు జరిపించింది. మంత్రులు, శాసనసభ్యులు, జిల్లా అధికారులు, కళాకారులు, సామాన్య ప్రజలు హాజరయ్యారు. వంగపండు కాంస్య విగ్రహాన్ని విశాఖ సముద్రతీరంలో ప్రభుత్వం నెలకొల్పింది. ఆయన పేర రెండులక్షల రూపాయిలు అవార్డు నెలకొల్పి ప్రముఖ జానపద కళాకారులకిచ్చింది. మొదటి అవార్డును శ్రీకాకుళం జిల్లా మందస మండలం భైరి సారంగపురం గంగిరెడ్డుల కులస్తుడు, జానపద గాయకుడు పాత తరంలో భూమి భాగోతంలో పాత్రదారి, ఇటీవల అలవైకుంఠపురం సినిమాలో 'సిత్తరాల సిరపడు' పాట పాడిన శ్రీ బాడ నూరన్నకిచ్చి గౌరవించింది. కడసారి వరకు పార్వతీపురంలో వై.కె.యం. కాలనీలో తాను కొనుకున్న చిన్న ఇంటిలో నివసించారు. తన వారసత్వాన్ని తన కుమార్తె వంగపండు ఉష కొనసాగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక మరియు సృజనాత్మక శాఖ కార్యదర్శిగా ఉన్నారు. కుమారుడు దుష్యంత్ కూడా తండ్రిలాగనే పాడగలరు. గద్దర్‌తో సమానంగా ఆడిపాడి ఉమ్మడి రాష్ట్రంలో ప్రజాకవిగా, ప్రజావాగ్గేయకారుడుగా పేరుతెచ్చుకున్నాడు. గద్దర్ రాజకీయవిశ్లేషణ బాగాచేస్తే, వంగపండు అప్పటికప్పుడు ఆసువుగా కవిత్వం చెప్పగలడు. వీరిద్దరు బావ, బావమరుదులుగా పిలుచుకొనేవారు.

వైవాహిక జీవితం

పక్క ఊరు వీరభద్రపురం అత్తవారు 1967లో విజయలక్ష్మిని జీవిత భాగస్వామిగా చేసుకున్నారు. యస్.యస్.ఎల్.సి వరకు చదువుకున్న విజయలక్ష్మి గారు భర్తకు ఎల్లవేళల చేదోడు వాదోడుగా ఉన్నారు. సాధ్యమైనంత వరకు ప్రసాదరావు గారితోనే ప్రయాణం సాగించారు. ఏ క్షణంలో ఫోన్ వచ్చి హఠాత్తుగా ప్రసాదరావు భుజాన సంచి వేసుకొని వెళ్ళేవారు. ఆయనతో పాటు విజయలక్ష్మి గారు కూడా వెళ్ళేవారు. ప్రజలు కూడా తనను గౌరవించేవారు ప్రస్తుతం ప్రసాదరావు గారు చనిపోయారనే దిగులుగానే ఉన్నా కుటుంబ సభ్యుల ఆదరణ, వంగపండు ప్రసాదరావు అభిమానుల ఆదరణ మెండుగానే ఉన్నాయి. వంగపండు ఉష, దుష్యంత్, చక్రపాణి వీరి పిల్లలు. ఈ విధంగా వంగపండు ప్రసాదరావు జానపదంతో ప్రజాకవిగా సృజించని అంశం లేదు. కార్మికులు, కర్షకులు, హరిజన, గిరిజన, బడుగు బలహీనవర్గాలు, స్త్రీల సమస్యలు, బహుజన సమస్యలను, జాలర్ల సమస్యలను తన పాట ద్వారా సమాజంలో చైతన్యం తెచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజల కష్టాలు, వలసలు, వెనుబాటు తనం గూర్చి పాడారు. ఆంగ్ల విద్యపై మోజు, పట్టణాలపై మోజు, డబ్బు మీద ప్రేమ వంటి వాటిపై పాటలు రాసారు. జానపద అకాడమీ స్థాపించాలని పదే పదే చెప్పేవారు. కళ ఆధునికరణ జరగాలని చెప్పేవారు. కళ కళ కోసం కాసుల కోసం కాదని నమ్మేవారు. ఇంతటి ఘనచరిత్ర కలిగిన వంగపండు ప్రసాదరావు గారి పూర్తి సాహిత్యం, రచనలతో, సమగ్ర పుస్తకం తేవలసిన అవసరమెంతో ఉన్నది.

బద్రి కూర్మారావు
విజయనగరం - 535 002
సెల్ : 97047 98643, 83090 77607

# జనపదుల యాస పలుకులే పాటలు గజ్జకట్టి చిందేసే ఆటలు

– దాసరి కృష్ణారెడ్డి

పవిత్రమైన, ప్రశస్తమైన, వింటే, ధ్యానిస్తే, కులీనుల చెవులలో సీసం పోసే కర్కశ మేధావులు, సమస్త శాస్త్రోపాంగ పండితులు, ఛాదస్తం నిండుగా తలకెక్కిన పండితులు సైతం కులీనులను పరమఛాదస్త పరాయణులుగా, ఈ దేశ సంస్కృతిని, అసభ్యకర హేతువులతో, పరమపవిత్రమైన గోమాతల ప్రాణాలకు ఎసరుపెట్టే ఈ అనాగరికులను ప్రోత్సహించడమా?! శివశివ, హరిహరి స్తోత్రముక్తావళితో వారి నీడను కూడా పొడగట్టే, అసమతుల్య సమాజంలో బ్రాహ్మణులంటే కలియుగ దేవతలుగా ప్రసిద్ధిపొందిన బ్రాహ్మణులు, వారి సరిసమానమైన మతాధిక్యుల వంశపారంపర్య ఆధిక్యత రాజులు, మహారాజులు, చక్రవర్తులను సైతం ఆ కులాధిక్యత కట్టిపడవేసింది.



పట్టణ ప్రాంతాలకు రాజాస్థానాలకు పరిమితమై వారిచే పోషింపబడే పండితులు, సాహిత్య విశారదులు, కవిశ్రేష్ఠుల సాహిత్య, కవిత్వ కళావిధానాలు తప్పితే, జాన పదుల కళావైధూష్యాన్ని రాజుల ఆస్థానంలోకి చేరనీయకుండా తమ స్వతస్సిద్ధ సాహిత్యానికి, కవితా సంస్తుతికి ఆనాడు ప్రాధాన్యత ఇచ్చేవారు కళాప్రియులు, సాహిత్య రసబ్ధురంలో తేలి కేళివిలాసాల సంస్తుతికే ప్రాధాన్యతనిచ్చే రాజుల, మహారాజులకు జానపదీయుల రసవత్తర, రమణీయమైన, ప్రకృతిసిద్ధమైన పంట పొలాలలో (యాసభాషలో) మాండలికాల్లో మణిమయ వజ్రవైఢూర్యాలకు అతీతమైన, మనోజ్ఞ జానపదాల ఆటాపాట, చిందులను తిలకించే సమయం ఎక్కడిది?! ఎంతసేపు రమణీ పరిష్వంగంలో, కుచపీడనా సౌశీల్యంబుధిలో తేలిపోయే ప్రభువులకు, మట్టి పిసికి పగలంతా పొలం సేద్యంలో ఇంటిల్లిపాది కాయకష్టంతో స్వేదాన్ని చిందించే రైతాంగం గురించి కానీ, చేతి వృత్తులతో రోజంతా వళ్ళు గుల్లచేసుకొన్న కృషికారులను ఆనాడు ఎవరూ గుర్తించలేదు. భారత, రామాయణ, భాగవతాది గ్రంథాలలోని కథలను విని, జానపదులు మేధోమథనంతో అల్లుకొన్న పాటలు విన్న కథలను, కావ్యాలను, పద్య, గద్యాలను మనస్సులోనే మననం చేసుకొని తమ యాస భాషలో ఇతివృత్తం చెడకుండా జానపదులు సృష్టించుకొన్న గీతాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. బలరామ, కృష్ణుల మేనమామ కంసునికి చెల్లెలు దేవకీవసుదేవులకు అష్టమగర్భంలో పుట్టిన వాడి చేతిలో మరణం తప్పదని అశరీరవాణి పలుకులు ములుకుల్లా తగిలిన కంసుడు అపాయానికి ఉపాయాన్ని ఆలోచించి అష్టమగర్భ శిశువునే హరిస్తే ఆపై తనకు ఎదురెవరని కంసుడు అందుకు అనువైన ఏర్పాట్లు ముమ్మరంగా చేయించాడు.

శ్రీ కృష్ణ జననం

(ఆయా ప్రాంతాలవారు తమకు అనువైన సమయంలో పాడుకొనే బృందగీతం)

జోలాలీ జోలాలి ఉయ్యాల నాయనా/ఒకటాయె రెండాయె ఉయ్యాల నాయనా/ రెండు, మూడు మాసాలాయె ఉయ్యాల... నాయనా/మూడు మాసాలయె ఉయ్యాలా... నాయనా/మడికట్టు బిగువాయె ఉయ్యాలా... నాయనా/ మూడాయే, నాల్గాయే ఉయ్యాలా... నాయనా/నాల్గు అయిదు మాసములాయే ఉయ్యాలా... నాయనా/ఐదు మాసములాయే ఉయ్యాలా నాయనా/ నడికట్లు దిగజారె బిగువాయే ఉయ్యాలా... నాయనా/ అయిదాయే ఆరాయే ఉయ్యాలా... నాయనా/ఆరు, ఏడు మాసములాయే ఉయ్యాలా... నాయనా/ఏగిల్లు లావాయే ఉయ్యాలా... నాయనా / ఏడాయే ఎనిమిదాయే ఉయ్యాలా... నాయనా/ ఎనిమిది తొమ్మిది మాసాలాయే ఉయ్యాలా... నాయనా/ నిండా తొమ్మిది మాసాలు కొడకా నాయనా/ శ్రీకృష్ణ జన్మమురా ఉయ్యాలా కొడకా/ నువ్వు

పుట్టిన రోజు ఉయ్యాల కొడకా/ అన్ని కార్తి కష్టములు ఉయ్యాల కొడకా / పాపకారి కష్టములు ఉయ్యాల కొడకా/ పాపకారి కష్టాలు ఉయ్యాల కొడకా/నీకు ఎదురయ్యేనా ఉయ్యాలా కొడకా / నీకు ఎదురయేనా ఉయ్యాలా/ఏల పుట్టావురా కొడకా ఉయ్యాలా కొడుకా / నీకన్న ముందునురా ఉయ్యాలా నేను /ఏడుగురు కొడుకులును ఉయ్యాల నేను/ హార మిచ్చినానురా ఉయ్యాల వాడు/ అన్నకాని కంసుడురా ఉయ్యాలా వాడు. భయపడకు భయపడకు మా అమ్మ దేవకి/ దేవకి గర్భమునదేవుడై జన్మించితి/దేవకి గర్భమున బాలుడై జన్మించితీ! (దేవకి అంతర్మథనాన్ని పల్లీయులు తమ ఇంటి ఆడపడుచుకష్టంగా భావించి చూలంత బాహ్య అంతర్గతులను ఇంచుకపొల్లు పోకుండా సరళాతి సరళ పదాలతో పాటును కూర్చడమే కాకుండా పుట్టబోయే అష్టమ శిశువు మగపిల్లవాడేనని నిక్కచ్చిగా నిర్ధారించి శ్రీకృష్ణ ప్రసవోదయానికి అంజలి ఘటిస్తారు. అమాయకులైన జనపదులకు అబ్బిన క్రాంతదర్శకతకు జోహార్లు అర్పించాల్సిందే. జానపదుల పల్లె గీతిక అయిన ఈ పాటను ఒక చలనచిత్రంలో వాడుకోవడం పల్లీయుల ప్రతిభకు నిదర్శనం.

గణనాథుని నాయకుల గుంజీలతో వేడుకోలు
*శివ! శివమూర్తివి గణన్నాథ!*
*నీవు శివునికుమారుడయ్య గణన్నాథ!*
*ఒక్కసారి మంత్రిని చేసి గణన్నాథ!*
*కాదంటే ముఖ్యమంత్రినే చేయి గణన్నాథ!*
*వొంగి వొంగి గుంజీలు వరసమరి పెడతాము*
*పడి పడి పొర్లు దండాలు పెడతాము*
*నీ దయమాకుంటే చాలు గణన్నాథ*
*గద్దెనెక్కి కులుకుతాము గణన్నాథ*
*ప్రజలతో మమేకమయ్యి ప్రజాసేవ చేస్తాము*
*పల్లెలంతా పట్నాల రీతిలో ఉండాలని*
*భువిని దివిగా మార్చే అవధిలేని పథకాలను*
*ఆమలుపరచే అధునాతన రాజకీయ చతురతతో*
*నీ చెంతకు వచ్చాము విఘ్నరాజా!*
*ఒక్కసారి మంత్రిచేయ గణన్నాథ*
*కొండంత లడ్డుతో కోరినన్ని ఉండ్రాళ్ళు*
*కుడుముల నైవేద్యంతో కొలుచుతాము*
*నీపైనే కొండంత ఆశలు నిలుపినాము*
*పాలముంచినా నీవే పరమేష్ఠి పుత్రుడా*
*నీళ్ల ముంచినా నీవే గజాననా! గణాధిపా"* – అంటూ ఎన్నికల ముందు అర్థిస్తారు, ప్రార్థిస్తారు, పదే గుజ్జిల్లు పెట్టి, వినాయకుడవు నీవు నాయకత్వం కోసం, ప్రజాపదవికోసం, ప్రజలకు సేవచేయాలనే తపనతో నిండు మనస్సుతో ప్రార్థిస్తున్నాము. అంటూ జనపదల పాట రాయలసీమ ప్రాంతాల్లో కోలాటంలో ఎలుగెత్తి పాడుతూ కోలుకోయ్యలను తాడిస్తూ ఆడతారు, పాడతారు, అత్యుత్సాహంతో చిందులు వేస్తారు. పానములలోకెల్లా పరమపావనం, రుచి, శుచీయే కాదు, ముక్తిప్రదము, మోక్షదాయకం 'శ్రీరామ, నామమే చింతలనుబాపి, చిన్నయమై, సత్–చిత్ను ప్రసాదించే అపర సంజీవినీ, ఆశ్రితులకు చేయూతనిస్తూ, భక్త జన రంజకము, భాను ప్రకాశంలాంటి రామ నామం మధురాతి మధురం – ఆస్వాధించే భక్తులకు అమృతభాండం ఈ శ్రీరామనామ ఆవిర్భావపు నీడ అమృతరసం. భక్తుల అంతర్మథనంలో "రామనామం రసరమ్యమైనది, సేవించే సాధు సత్పురుషులకు అమృతఫలమైనది. రామ శబ్దంలోనే రసాత్మక, కరుణాత్మక, ఫలభరిత సేవితరసరమ్యం. రామజోగి మధుర పానీయం, రమ్యం, రసరమ్యం. జనులు త్రాగిన, జన్మఫలం, సాధువులకిదే స్వర్గతుల్యం. మునిజన సంతతికి ముక్తిదాయకం, పామరజనులకు పరమపావనం. శ్రీరామనామంలోనే, నమ్మిన ముక్తి, రామజపంలో రాజిలు మోక్షం. శ్రీరామ నామం జనులకు ముక్తి, ఆనామ జపమే ఆర్తులకు స్వర్గధామం

పలుకరా శ్రీరామానామాన్ని, ప్రతిఫలించే మోక్ష ధామాన్ని"–అంటూ శ్రీరామభక్తులు, మానవ లోకానికే ఆదిపురుషుడు, తండ్రి ఆ నాతిని, కైకేయ కోర్కెకు ఏలాంటి భగం కలగకుండా, అతిశయించిన మానతా మూర్తి శ్రీరామచంద్రుడు.జానపదులు భక్తి యుక్తమైన ఆధ్యాత్మిక అంశాలనే కాకుండ శృంగారపరమైన ఆసక్తిని, అనురాగానికి ప్రాధాన్యమిస్తారు. మామవరసైన అందగాడు చంద్రయ్య మరదలు మణెమ్మను ప్రేమిస్తాడు. నవ యవ్వనంలో వుండే జంట నరసాలకు ఆకాశమే హద్దు. చంద్రన్న పాటందుకొంటాడు.

చంద్రన్న: *ముక్కరెక్కడే? నీ ముక్కరెక్కడే?!*
*మణెగాళ్ళ మణెమ్మ మరులు గొన్న మణెమ్మ*
మణెమ్మ: *నొక్కుల చెక్కులోడు! జంగరుల జుట్టువాడ*
*ఇంకెక్కడ ముక్కర ముద్దు మీద, ముద్దుపెట్టి*
*సంపెంగ ముక్కున నీదంటూ నీ ముక్కుపెట్టి*
*కెలికితే*
*ముక్కరూడి రివ్వుమని నింగిచుక్కల్లో చేరింది*
*తారలతో సయ్యాటలాడి వెన్నెలా వెలుగుతోంది.*

చంద్రన్న: మణిమాణిక్యాలకంటే మణెమ్మ ముక్కరే నా ప్రాణం
ఆకాశానికి నిచ్చెనేసి అరనిముషంలో దోచుకొస్తా
అడ్డుపడితే తారలైన తారలు ప్రియుణ్ణి అయినా
గెలిచి తేస్తా.

మణెమ్మ: ఆ... మా తెస్తి విఅలే?! అప్పుడాలకర్ర
దోసిట్లో ముక్కరుంది నవ్వుతాలుకలాగంటి
నామామా! ఓ మామా! నివు పెట్టిన ముక్కర్ని
దొబ్బుకెళ్ళి దోచుకొనే మగాడెవడు
నా సంపెంగ ముక్కనా సర్ది పెట్టరా మామా!"

– అంటూ సరసాల నవరసాల్ని పండిస్తూ చంద్రయ్య ముక్కుపై సుతారంగా పిండుతుంది మణెమ్మ.

ఇక పల్లె సీమలకు పండుగలలో తెలుగువారి సంబరాలు, అంబరాన్ని అంటే పెద్దపండుగ సంక్రాంతి. ముఖ్యంగా ఈ పద్యం సామాజిక సర్వబంధుమిత్రులను ఒక చోట చేర్చే ముచ్చటకు మారుపేరయిన సంబరాల సంక్రాంతి. జనపదాలలో పడుచుల ఆనందోత్సాహాల రసకేళి. ఇండ్లముందు పశువుల పేడతో అలికిన సంబరం ఒకవేపు, అందులో సప్త వర్ణాల రంగవల్లులు, నవధాన్యాలపై గొబ్బెమ్మను కొలువతీర్చి గుమ్మడి, తంగేడు, వివిధ రకాల సువాసనల్ని వెదజల్లె విరులను అలంకరించి కనెన ప్రాయపు పడుచులు గొబ్బి, ఆట ఆడే పారవశ్యం పరమానందభరితం. ఇక పాటలోకి వెళదాం.

*గొబ్బి! గొబ్బెమ్మ! గొబ్బెడ్ని వవే*
*గురుగుపూల చిన్నదిమెచ్చే కోకనియ్యవే*
*మొగిలిపూల గుత్తి లాంటి మొగుడ్నీయవే*
*బంతిపూవుల్లాంటి బావల్నివవే*
*తోకమల్లివంటి తోడునివ్వవే*
*గుమ్మడి పువ్వంటి కొడుకునివ్వవే*
*అనపకాయవంటి అమ్మనియ్యవే*
*తంగేడిపువ్వంటి తమ్ముణ్నియ్యవే*
*అష్టైశ్వరములనిచ్చి ఆడుకోతల్లీ*
*మాంగళ్యభాగ్యంబు మంచిగా ఈతల్లీ"* అంటూ గొబ్బెమ్మను కొలువు తీర్చిన చోట ఆడపడుచులు తప్పెట్లు కొడుతూ వలయాకారంగా "గొబ్బిని" లక్ష్మీదేవిని అంగ రంగవైభవంగా ఆడుతూ పాడుతు కొల్వడం తెలుగు సంస్కృతికి, సాంప్రదాయాలకు ప్రతీక.

*అగ్గికొస్తివా పిల్ల సియ్యల పులుసుకొస్తివా*

ఇదో వ్యంగమైన నర్మగర్భమైన అత్తవరుసైన రంగమ్మ కోడలి (కాబోయే) పిల్లపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తుంది.

*అత్త: కోడలు పిల్లా! కోడలు పిల్లా! నిజంగా అగ్గికొస్తివా*
*అరకోడి ఉడుకుతుంటే చియ్యల పులుసు కొస్తివా*
*అమ్మ ఇంట్లో లేదని అందాల నా కొడుకుతో*
*సరసాలడవస్తివా, మయ్యాటలాడ వస్తివా?!*

*చిన్నది: అబ్బె! అందుకు కాదత్తా! లేగదూడ పలుపు తెంచుకొని*
*ఏ దారిన వెళ్ళిందో వెతుకులాట కొస్తిని,*
*కనబడలేదత్తా*
*కంచెలో దూరి పంట పొలం మీ పడిందో*
*ఆలమందలో దూరి తరుపుల వెంటపడిందో నని*
*ఆదర బాదర నొస్తిని, అగ్గి వొద్దు, చియ్యా వద్దు*
*పలుపు తాడు, తెంపుకొన్న జాడ చూడ వస్తినే*
*అందులా నీ కొడుకుని దుప్పటేసి దాచుకో"*

– అంటూ మాటకు మాట బదులిస్తుంది. అమ్మో! ఏమోననుకొంటి ఎంత గడుసుపిల్లవే? అంటూ నోటిమీద చేయేసుకొంటుంది అత్త. జానపద వాఙ్మయం జాతి జనుల మనుగడ, ఉనికి, వాగ్రూపంలో, వారసత్వంగా మౌఖికంగా గుర్తుంచు కొని ముందుతరాల వారికి అందించిన ఘనత జానపదులదే. ఇందులో రామాయణ, భారత, భాగవతాది సంక్షిప్త కథలను పల్లీయులు, తమ తెలివిమేర పాటలు గాను, కథలుగాను చెప్పుకొన్నారు. ఇందులో దైవభక్తి, తమ మనుగడలో ఆచార వ్యవహారాలకు సంబంధించిన పెండ్లి వేడుకలు, అల్లుడి అలకాపన్ను, హారతిపాటలు, శోభనపు గదిలోకి వరుడు, వధువు ప్రవేశాలపై చిత్తడి వానలో పెండ్లి కుమార్తె తడిసి ముద్దవుతుందని ఒక వైపు వరుడు వానలో ఆసాంతం తడిసి పోతున్నాడనే మరోవైపు గిలిగింతలు పెట్టే శోభనపు రాత్రిపాటలు, పొలంపనులలో ప్రతి సందర్భాన్ని పాటలుగా అల్లుకొన్నారు. సందర్భాల ననుసరించి సవ్యంగా, దివ్యంగా జానపదులు జాణతనం, అంతకుమించి శృంగారపదాలను ఏర్చికూర్చి పాడు కొన్నారు, పాత్రోచితంగా ఆడుతూ చిందులేశారు. వారు అమాయకంగా పాడింది ఆడింది జనహృదయాలను రంజింపజేయడానికే. వ్రాసుకొంటూ పోతే అదోగుదిగుచ్చిన గ్రంథం అవుతుంది. క్లుప్తతకోసం మరెన్నో జానపద పాటలను ఈ వ్యాసంలో రాయలేకపోయాను. మున్ముందు మరిన్ని వ్యాసాలను పాఠకులు ఆశీర్వదిస్తే పదిలంగా మీముందుకు తీసుకువచ్చే హామీతో సెలవు తీసుకొంటున్నాను.

దాసరి కృష్ణారెడ్డి
కవి, రచయిత, జానపద పరిశోధకుడు,
సీనియర్ పాత్రికేయుడు, చరవాణి: 93925 82015
E-mail : dasarikrishnareddy1947@gmail.com

## చిత్రగీతాలు

# హిందూస్థానీ బాణీలు

– ఎమ్. పురుషోత్తమాచార్య

**రాజశేఖరా నీపై**




చిత్రం : అనార్కలి (1955)
రచన : సముద్రాల
సంగీతం : పి.ఆదినారాయణరావు
గానం : ఘంటసాల,జిక్కి

<u>మిశ్ర మాల్‌కౌంస్–దాద్రా</u>

*సాకీ॥ మదనమనోహర సుందరనారీ*
*మధురదరస్మిత నయనచకోరీ*
*మందగమనజిత రాజమరాళీ*
*నాట్యమయూరీ,అనార్కలీ.....*

*పాట॥ రాజశేఖరా నీపై మోజు తీరలేదురా*
*రాజసాన ఏలరా ॥రాజ॥*

*1. మనసు నిలువనీదురా*
*మమత మాసిపోదురా*
*మధురమైన బాధరా*
*మఱపు రాదు ॥రాజ॥*

*2. కానిదాన కానురా కనులనైన కానరా*
*జాగుసేయనేలరా వేగరావదేలరా*
*వేగ రారా వేగ రారా చేర రారా*

అనార్‌కలి అంటే,దానిమ్మ పూమొగ్గ. ఆమె అందచందాలు ఎలా ఉన్నాయో సాకీలో చక్కగా వర్ణించారు కవిగారు. మదననారీ అంటే, రతీదేవి. మన్మథుడిని కాని, రతీదేవిని కాని మనమెవ్వరమూ చూడలేదు. అమృతాన్నీ రుచిచూడ లేదు. రాజహంసల్నీ చూడలేదు. కాని సర్వోత్కృష్టమైన లక్షణాలను ఆపాదించేటప్పుడు వీటన్నిటితో వర్ణిస్తాం. అంటే, ఇంక అంతకంటె అందం,ఆనందం, ఇంకెక్కడా లేవు అని అతిశయోక్తిగా చెప్పేటప్పుడు ఈ పోలికలన్నీ చెబుతాం. అదైనా రసికదృష్టి రీత్యా చెప్పడమే. అయితే అనార్కలి అంజలీదేవి) కంటె ఎంతో అందమైనవాళ్ళు లేరా? ఉన్నారని చెప్పకూడదు. లేరని చెప్పలేము. ఇది మహారాజు, యువరాజుల దృష్టి నుండి చూడడమే జరిగిందికదా!

చిరునవ్వులు విసురుతున్న కన్నులు చకోరంలాగ యువరాజు అనుగ్రహపు వెన్నెల కోసం ఎదురు చూస్తున్నాయి. రాజహంసలను సైతం ధిక్కరించే ఒయ్యారపు నడక గలది, నాట్యం చేసే మయూరం లాంటిది. నిజానికి మయూరం అంటే మగనెమలి మాత్రమే నర్తిస్తుంది కాని మయూరి అంటే, ఆడనెమలి నృత్యం చేయదని ప్రకృతి శాస్త్రవేత్తల అభిప్రాయం. అది ప్రకృతిధర్మం, నెమలి జాతినియమం. కాని 'మయూరి' అని నృత్యం చేసే ఆడవాళ్ళను సంభావించడం లోకంలో స్థిరపడిపోయింది. బిరుదులు, పోలికలు అన్నీ ఆడవాళ్ళకే పరిమితమయ్యాయి. 'నాట్యమయూర' అని మగవాడికి బిరుదిస్తే ఎబ్బెట్టు అనిపించే పరిస్థితులను అధిగమించవలసియున్నది. అయితే చమత్కారకవులు కొందరు దీన్ని వ్యాఖ్యానిస్తూ, మానవజాతిలో మయూర లక్షణాన్ని ఆడవాళ్ళకు ఆరోపించి వర్ణిస్తున్నాం, ఇది కవుల హక్కు అన్నారు. ఇంకేం? 'నిరంకుశాః కవయః' అని సర్దుకుపోవలసిందే. అంతేకాదు, పక్షిజాతికున్న నియమం మానవజాతికి వర్తించదు, మయూర లక్షణం కలిగిన వయారి నర్తిస్తున్నది. కనుక వ్యాకరణసూత్రాల కనుగుణంగా స్త్రీవాచకస్వరూపమైన ఆ వనిత మయూరియే అని కూడా తీర్మానించారు.

ఈ పాటలోని రాజశేఖరుడు ఎవరు? అనార్కలికి యువరాజు సలీం; మిగతావారికి మహారాజు అక్బర్. ఇద్దరికీ కలిపి 'రాజశేఖరా' పదాన్ని సముద్రాలవారు ఉపయోగించడం ఒక చక్కని గుంభనపదప్రయోగం. 'మోజు' (మౌజ్) అనే ఒక్క హిందీ పదం తప్ప మిగతా పాటంతా తెలుగు, సంస్కృతంలతో కలిసిన శయ్యతో సాగింది. మొదటి చరణం మహారాజుకు కూడా వర్తిస్తుంది. కాని,రెండో చరణంలో ఉన్న ప్రేమతత్త్వపు లోతు యువరాజుకు మాత్రమే చెందేట్లు రూపొందించారు. దీన్ని పాడుతున్నప్పుడే మహారాజుకు కొద్దిగా అనుమానం కలుగుతుంది. అది కథకు అవసరం. 'కానిదాన కానురా' అంటే, పరాయిదాన్ని కాను, నీదాన్నే అనే భావం చెబుతుంది. ఇంత మోజున్న నువ్వు కలలోనైనా నన్ను దర్శించమంటూ, ఇకనైనా ఆలస్యం చేయకుండా రమ్మంటున్న ఆమె సందేశం యువరాజుకు జంకును, మహారాజుకు అనుమానాన్ని కలిగిస్తుంది. "చకోరి, మరాళి, మయూరి" పదాలతో నాయికను వర్ణించడం వల్ల దానిమ్మ కుసుమానికున్న సౌందర్య, సౌకుమార్యాలను మరింత సున్నితంగా తీర్చిదిద్దినట్లయింది.ఈ పాటను సినిమాలో అభినయించినవారు కథానాయిక అనార్కలి పాత్రధారిణి అంజలీదేవి. ఆమెతోబాటు నృత్యాచార్యులుగా నటించిన

వారు గాదిరాజు కేశవరావుగారు. వీరు చిత్రదర్శకులు వేదాంతం రాఘవయ్యగారికి సహాయకులు, గొప్ప స్నేహితులు. "ఇంటిగుట్టు, భలే అమ్మాయిలు" మొదలైన చిత్రాలకు పనిచేశారు. విశేషించి వీరు అనార్కలి చిత్రానికి సహనిర్మాత కూడా. మాల్‌కౌంస్ రాగాన్నే ప్రధానంగా చేసుకుని ఈ పాటను బాణీ చేస్తూ మరో రెండు రాగాలను కూడా స్ఫురించేట్లుగా రూపొందించారు స్వరకర్త ఆదినారాయణరావుగారు. ఆరు అక్షరాల నడకతో జాగుగా నడిచే ఈ పాట తాళాన్ని 'దాద్రా' అని చెప్పవచ్చు. ఈ నడకను వేగవంతం చేసే లోక్‌గీత్‌లలో ఈ తాళాన్ని దాద్రా రేకా అని వ్యవహరిస్తారు. ఈ పాటలో ఒకచోట వాద్య సంగీతంలో ఈ రేకా వినిపిస్తుంది. మాల్‌కౌంస్ రాగం కర్ణాటకసంగీతంలో 'హిందోళం' కు సమాంతరంగా ఉంటుంది.

తంబుర శ్రుతితో పాట ప్రారంభమవుతుంది. తంబురలో షడ్జమాన్ని, మధ్యమాన్ని ఏర్పరచారు. సాధారణంగా తంబురలో షడ్జపంచమాలుంటాయి. కాని, ఈ రాగంలో పంచమం ఉండదు కనుక న్యాసస్వరమైన మధ్యమాన్ని కుదిరించారు. సాకీలో దైవత, మధ్యమాలను అందంగా కలిపారు. ఎందుకంటే, సాహిత్యంలో 'మదన' అంటూ మధ్యమ, దైవతాలు వినిపిస్తాయి. ఇది సాభిప్రాయ ప్రయోగం. ఘంటసాల మాత్రమే పాడే ఈ సాకీలో 'నారీ' దగ్గర వీణను,'చకోరి' దగ్గర బాన్సురిని,'మరాళి' దగ్గర సితార్‌ను అందంగా బిట్స్‌తో వినిపించారు. 'నాట్య మయూరి'ని మాస్టారు 'దనిసగమా'అనే స్వరాలలో నృత్య స్ఫూర్తిని కల్పిస్తూ మధురమనోహరంగా పాడారు. దానికి సహకారంగా, పై మధ్యమం నుండి అవరోహణాగమకంతో సమస్థాయి మధ్యమం దాకా ఆలాపన చేయడం ఇంకా మనోహరంగా ఉంది. 'అనార్కలి'ని మూడు స్థాయిల్లో పాడుతున్నప్పుడు వయొలిన్స్ అనుసరిస్తూ బిట్టునిచ్చాయి. తరువాత తబల, పఖ్వాజ్, స్వరతబలాల వాద్యాలతో నాలుగు ఆవర్తాలు కహర్వా తాళాన్ని సంచారం చేయించారు. ఆ పిదప సితార్, రుద్రవీణ, వయొలిన్స్ బిట్లకు తబలా వాదనను కలిపి కహర్వాతాళాన్ని, అంటే చతురశ్రగతిని కొనసాగించి, ఏడు ఆవర్తాలలో వినిపించారు. అప్పుడు మాస్టారు తనకు బాగా అలవాటైన ధోరణిలో చిన్న ఆలాపన చేశారు. దీని తర్వాతనే దాద్రా నడకతో పియానో స్వరాలను రెండు ఆవర్తాలలో వినిపించాక ఒక అక్షరం జాగా వదిలి మాస్టారు పల్లవిని అందుకున్నారు. ఎత్తుగడలోని చివరి 'రా' అక్షరాన్ని 'గమదపమా' అంటూ పంచమస్వరస్పర్శతో పలకరించారు.

పల్లవిలోని రెండు పాదాలను పాడాక స్వల్పమైన ఆలాపన చేసి మళ్ళీ ఎత్తుకున్న 'రాజశేఖరా' లోని చివరి 'రా' మీదుగా ఓవర్లాప్ చేస్తూ జిక్కి ఆలాపనను అందుకున్నారు. ఆమె ఆలాపనలో రెండు భాగాలు కనిపిస్తాయి. ఆరోహణాగమకం పూర్తయ్యాక అవరోహణా గమకాన్ని ప్రారంభించడంలో జాగా తక్కువ ఉండడం వల్ల ఆలాపన తరువాత ఆ జాగాను తబల, ముక్తాయితో పూర్తిచేసింది. తరువాతనే జిక్కి పల్లవిని అందుకున్నారు. ఆమె కంఠంలోని సన్నని వణుకు కూడా పాటకు క్రొత్త అందాన్ని తెచ్చింది. పల్లవిని మొత్తం పాడి 'రాజశేఖరా' దగ్గర వదిలేశారు. రెండు చరణాలకు ముందు ఒకే రకమైప బిట్‌వర్క్ వినిపించారు. వయొలిన్స్ 'సనిదా' అని ఎత్తుకుని గమ్మత్తుగా ఆహిర్‌భైరవ్ రాగలక్షణంతో అవరోహణ సంగతిని వినిపించి షడ్జమం దగ్గర వదిలేశారు. అక్కడినుండి వీణ మాల్‌కౌంస్ రాగాన్ని లింకుబిట్టుగా అందించింది. అప్పుడు చరణాలు ప్రారంభమవుతాయి.

'మనసునిలువదురా' అనే మొదటి చరణాన్ని మధ్యమం నుండి జిక్కి పాడడం అయ్యాక మాస్టారితో కలిసి పల్లవిని అందుకుని పూర్తిగా ఆలపించారు. రెండో చరణం 'కానిదాన కానురా' అంటూ జిక్కి, మాల్‌కౌంస్ కాని రాగంలో అంటే, సింధుభైరవిరాగంలో ప్రారంభించారు. దీన్ని తారస్థాయి గాంధారంనుండి ప్రారంభించి, కోమల్, శుద్ధ రిషభాలు రెంటినీ కలుపుకుంటూ పాడారు. 'కానరా' దగ్గర రుద్రవీణపై, దాద్రారేకా నడకతో బిట్టును వేగవంతంగా ఇచ్చారు. రెండోసారి ఆమె 'కానరా' అన్న పదంలో 'కా' కాగానే మాస్టారు ఆ పదాన్ని ఓవర్లాప్ చేస్తూ ఆలాపన అందుకుని 'జాగుసేయ' అని పాడారు. నేటి పిల్లఘంటసాలలకు ఈ ఎత్తుగడ జాగా సరిగా అర్థం కాక తికమకపడి సర్దుబాటుగా పాడుతున్నారు చాలామంది. రెండోసారి జిక్కి కూడా 'జాగుసేయ' అందుకుని మాస్టారితో కలిసి పాడారు. చివరలో 'రారా' ను మూడు స్థాయిలలో ఇద్దరూ పాడి ఒకేసారి వదిలేశాక వాద్యసంగీతం ప్రారంభమైంది. ఇది పూర్తిగా నృత్యానికి అనుగుణంగా రూపొందింపబడింది. వయొలిన్స్, రుద్రవీణతో బాటు తబల, పఖ్వాజ్‌ల అనుసరణతో కహర్వాతాళాన్ని 12 ఆవర్తాలలో అందంగా రూపొందించి చివరి ఆవర్తంలో చక్కని ముక్తాయింపును వినిపించారు. ఈ విధంగా దాద్రాను, కహర్వాను కలిపి పాటను నిర్వహించడం ఒక మనోహరమైన ప్రక్రియ. అలాగే మాల్‌కౌంస్‌తో ఆహిర్‌భైరవ్, సింధుభైరవ్ రాగాలను అనుసంధించడం కూడా చక్కని ప్రయోగం. రాగమాలిక అనిపించకుండా,

అంతా మాల్‌కౌంసే అని అనిపించేట్లుగా బాణీ చేసిన తీరు ఆకర్షణీయంగా ఉంది. ఈ పాటలో వాద్యసహకారం ప్రధానం కావడం వల్ల వేదికలమీద అంతగా ఈ పాటను మనం వినడంలేదు.

**హాయిహాయిగా ఆమనిసాగె**

**చిత్రం : సువర్ణసుందరి (1957)**

**రచన : సముద్రాల**

**సంగీతం : పి.ఆదినారాయణరావు**

**గానం : ఘంటసాల, జిక్కి**



**రాగమాలిక-కహర్వా**

**సోహని**

*హాయిహాయిగా ఆమని సాగె*
*సోయగాల గనవోయి సఖా హాయి సఖా ॥హాయి॥*

1. *లీలగా పువులు గాలికి ఊగ*
*సనిదమ దనిస గమగమ దనిస*
*రిసనిదని సరిసని సరిసని*
*దనిని దనిని దని మదద మదద మద*
*గరిగమదని ॥లీల॥*
*కలిగిన తలపుల వలపులు రేగ*
*ఊగిపోవు మది ఉయ్యాలగా జంపాలగా ॥హాయి॥*

2. *బహార్*
*ఏమో తటిల్లతిక మేమెఱుపో*
*మైమఱపేమో మొయిలురాజు దరి*
*మురిసినదేమో*
*వలపు కౌగిళుల వాలి సోలి ।ఊగి। ॥హాయి॥*

3. **దర్బారీకానడ**
*చూడుమా చందమామా అటు*
*కనుమా వయ్యారి*
*శారదయామిని కవ్వించే ప్రేమ*
*వగల తూలే విరహిణుల*
*మనసున మోహము రేపు నగవుల ।ఊగి। ॥హాయి॥*

4. **యమన్**
*కనుగవ తనియగా ప్రియతమా*
*కలువలు విరిసెనుగా*
*చెలువము కనుగొన మన*
*సానందనాట్యాలు సేయునోయి*
*నిరిగమదనిసా దనిసా*
*సని సగ రిగ సరి నిరినిరి దనిదని*
*మదమద గమగమ*
*గమదనిసా గమదనిసా దనిసా*

ఇది పూర్తిగా నాయికానాయకుల మీదనే చిత్రింపబడిన పాట. 'ఆమని' శబ్దంతో ప్రారంభించారు. ఆమని అంటే వసంతఋతువు. మూడు చరణాలలో మూడు కాలాలను, అంటే ఎండ, వాన, చలి కాలాలను సూచిస్తూ అన్ని ఋతువులు ఆ ప్రేమికులకు వసంతంగానే కనిపించి నిత్యవసంతులుగా విహరించడాన్ని నిరూపించారు కవిగారు. పూవులు విరిసిన తీగలు పిల్లగాలికి హాయిగా కదిలే దృశ్యం వసంతఋతుశోభను సూచిస్తున్నది. పూవు, పరిమళం సమైక్యతాచిహ్నం. మేని మెఱుపు, మెరుపుతీగెగా అయి మబ్బుల రాజైన శ్రావణమేఘుడిని దరిజేరి మురిసిపోయింది. మెరుపు, మేఘం ఐక్యతాభావప్రతీక. చందమామ స్వచ్ఛంగా పండువెన్నెల కురిపించేది శారద యామినిలోనే, అంటే శరత్కాలపు రాత్రివేళలోనే. చంద్రుడెలా ఉన్నాడు? విరహబాధలో ఉన్న కాంతల మనస్సులు మోహాన్ని రేకెత్తించే నవ్వులాగా ఉన్నాడట. చంద్రుడు, వెన్నెల విడదీయరాని ఏకస్వరూపులు అనేది ప్రేమికుల ప్రేమ బంధాన్ని వ్యాఖ్యానిస్తున్నది.

ఇట్లా అన్ని కాలాలలోనూ రసానందాన్ని పొందుతున్న ఆ ప్రేమికుల అనురాగవిహారాన్ని, దానిలోని ఆనందాన్ని చివరి చరణంలో వివరించారు. కనురెప్పలకు, కనుగవకు ఉండే బంధుత్వమే ప్రేమికుల అనుబంధానికి ఆనవాలు అన్న సంగతిని సూచనప్రాయంగా చెప్పారు. ఆమని సోయగాలు, మేమెరుపు, మొయిలురాజు, మైమరపు, కనుగవ, తనియగ మొదలైన సమ్మోహనకరమైన, కమ్మని తేట తెలుగుపదాలను ఉపయోగించి, భాషామాధుర్యాన్ని దోసిళ్ళతో పంచిపెట్టారు సముద్రాలవారు. అది సముద్రం కనుక ఎన్ని దోసిళ్ళెత్తిపోసినా తరిగేది కాదు.

ఈ పాట సోహనిరాగంతో ప్రారంభమవుతుంది. ఈ రాగం మార్వా థాట్‌కు చెందినది. కర్ణాటకసంగీతంలోని హంసానందికి సమాంతరంగా ఉంటుంది. సోహనిరాగానికి నాలుగు రకాల మూర్ఛనలు ప్రచారంలో ఉన్నా,వాటిలో ప్రధానమైనదానినే చెప్పుకొందాం.

ఆరో : సగమదనిసరిస

అవ : సనిదగమగరిస

ఈ రాగంలో స్వాతితిరునాళ్ గారి "శంకరశ్రీగిరి" కృతి; ముత్తయ్యభాగవతార్ గారి 'నీదు మహిమ' కృతి; 'బోలన్ బిన్ కబహు' అనే సాంప్రదాయిక రచన ఎంతో ప్రసిద్ధి పొందాయి. పాట ప్రారంభంలో వయొలిన్స్, సితార్, వేణువులతో 5 ఆవర్తాలలో బిట్ అందించాక జిక్కి ఆలాపనను అందుకున్నారు. ఒకటిన్నర ఆవర్తాలలో ఆలాపన ముగించగా మిగిలిన అర ఆవర్తంలో సితార్ బిట్టునిచ్చారు.

ఆమె పల్లవిని అందుకున్నారు. మొదటి పాదం కాగానే సితార్ మీద 'నిదమగరిసా' అనే బిట్టు, సినిమా విడుదలైన తొలిరోజుల్లో వినిపించేది. తరువాత నిడివి సమస్య వచ్చిందేమో! ఆ బిట్‌ను తొలగించారు. అటు సినిమాలోనూ. ఇటు రికార్డులోనూ అది మాయమైపోయింది. అందుకే తారస్థాయిలో 'సాగె' కాగానే చప్పున ఆధారషడ్జమంలో పల్లవిని అందుకోవాల్సివచ్చింది. తరువాత సోహని రాగంలోనే సితార్ బిట్ ఒక ఆవర్తం సాగింది. వెంటనే ఘంటసాల మాస్టారు 'లీలగా' అనే మొదటి చరణాన్ని అందుకున్నారు. 'ఊగ' తర్వాత ఘంటసాల సుశ్రావ్యమైన రెండు ఆలాప్‌లను రెండు ఆవర్తాలలో పాడి రాగస్వరూపాన్ని సుందరంగా ఆవిష్కరించారు. తరువాత ఒక అక్షరం వదలి స్వరం ఎత్తుకున్నారు. తరువాత జిక్కి తోపాటు ఇద్దరు కలిసి రెండు ఆవర్తాలలో స్వరకల్పనను ఆలపించారు.

రెండవ చరణానికి ముందు పల్లవిని పాడి వదిలేశాక 'నిదమగరిసా' అనే అరబిట్టును వీణపైన వినిపించారు. ఈ అర ఆవర్తాన్ని లెక్కలోకి తీసుకోకుండా తరువాత వచ్చే వయొలిన్స్ బిట్ నుంచి ఎనిమిది అక్షరాల కాలాన్ని పాటిస్తే తాళంలో రెండు మాత్రల కాలం లోటు వస్తున్నది. పై అర ఆవర్తాన్ని తీసుకుంటే ఈ లోటు మరింత పెరుగుతున్నది. నాలుగు అక్షరాల లెక్కను పాటించినా తాళం సమం లోకి రావడంలేదు. అందువలన రెండు మాత్రల కాలం సినిమాలోనో, రికార్డులోనో, రికార్డు ఎడిటింగులోనో దాటుకునిపోయి వుంటుందని తోచింది. ఈ అంశాన్ని సుదీర్ఘంగా పరిశీలించాల్సి వచ్చింది. 'నిదమగరిసా' తరువాత సోహనిరాగస్వరాలను రెండు ఆవర్తాలలో వినిపించారు. వెంటనే బహార్ రాగపు బిట్టు 'సరినిసమా' స్వరాలతో ప్రారంభమైంది. అనాగతపద్ధతిలో 'మా' నుండి తాళం ప్రారంభమైంది. ఈ స్వరాలు మెరుపులను స్ఫురింపజేసే బ్రాస్‌ప్లేట్స్ ధ్వనులతో కలిసి వినిపిస్తాయి. ఈ ధ్వనులను కలిపే హడావుడిలో బిట్‌వర్క్ ఒక అక్షరం (అంటే,రెండు మాత్రలు) వెనక్కి జరిగింది. నిజానికి 'సరినిసమా' బిట్వర్క్ సమం నుంచి ప్రారంభం కావాలి. ధ్వని ముద్రాపకుల( సౌండ్ ఎడిటర్)కు సరియైన తాళజ్ఞానం, శాస్త్రం తెలుసునో లేదో,ఏ హడావుడిలో ఉన్నారో కాని ఈ పొరపాటును గమనించలేదు. అందుకే ఎడిటింగులో ఒక అక్షరం వెనక్కి జరిగింది. అంతేకాని, స్వరకర్తను, వాద్యకళాకారులను శంకించడానికి వీలులేదు. అయితే, ఈ లోపాన్ని హిందీలో 'కుహూకుహూ బోలే' పాటలో తలెత్తనీయకుండా రికార్డింగులో చాలా జాగ్రత్త పడ్డారు. తమిళంలో కూడా ఇదే జాగ్రత్తను తీసుకున్నారు. ఆ రెండు భాషల్లో రికార్డు కరెక్టుగా జరిగింది. శ్రోతలు వాటిని విని చూస్తే విషయం తెలుస్తుంది.

బహార్ రాగం కాఫీ ధాట్‌కు చెందినది. హిందీపదమైన 'బహార్' అంటే,వసంతఋతువు అని అర్థం. ఈ భావాన్ని పల్లవిలో 'ఆమని' శబ్దంతో కవి సూచించియున్నారు. దాన్ని గమనించిన స్వరకర్త ఈ రాగాన్ని ఎన్నుకుని యుండవచ్చు.

ఆరో : సమపగమదానిస

అవ : రినిసద నిపని పమ పగమరిస

దీనిలో శుద్ధనిషాద్ అన్యస్వరంగా ప్రయోగింపబడుతుంది. ఈ రాగంలో 'నైరితు నైపూరి' 'ఫూల్‌వాలే కంత' మొదలైన రచనలు ప్రసిద్ధిని పొందాయి. ఈ రాగంలో 'గుడ్డీ' అనే హిందీసినిమాలోని 'బోల్‌రే పపీహరా' పాట చాలా పేరు తెచ్చుకున్నది. 'రాజమకుటం' (1960) సినిమాలోని ఒక నృత్యసన్నివేశంలో 'జయజయ మనోజ మంగళమూర్తీ' అనే పల్లవి మాత్రమే ఆవృత్తాలుగా సాగుతుంది. ఇది బహార్ రాగానికి సంబంధించినదే. అలాగే, జగదేకవీరునికథ' (1961) సినిమాలో మొట్టమొదటి పాట 'జయహో జగదేకప్రతాప' అనే నృత్యగీతం కూడా ఈ రాగంలోనిదే.

ఉరుములు, మెరుపుల శబ్దాడంబరం తరువాత వినిపించే వేణునాదం చెవులకు సోకినప్పుడు మనస్సు అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతుంది. ఈ వేణువు పలికిన స్వరాలలో అన్యస్వరమైన శుద్ధనిషాద్ ప్రముఖంగా వినిపించి హాయిని సమకూరుస్తుంది. ఈ బిట్టు తరువాత జిక్కి 'ఏమో...'అని రెండవ చరణాన్ని ప్రారంభిస్తారు. 'మేమెరుపో' ను 'నిదనినిసా' సంగతిని శుద్ధనిషాద్ తో కలిపి అందంగా వినిపించారు. మళ్లీ అంతే అందంగా ఘంటసాల పాడిన పంక్తిలో 'మురిసినదేమో' సంగతి గొప్పగా ప్రకాశించింది. ఇద్దరూ పాడిన 'వాలి, సోలి' కూడా ఈ రంజకస్వరాలలోనే రాణించాయి.

ఈ చరణంలో 'కౌగిళుల' పదాన్ని పలికేప్పుడు జిక్కిగారిది నాసల్‌వాయిస్ కనుక 'ళు' అనేది 'ణు' గా వినవస్తుంది. ఔత్సాహికగాయనీమణులు చాలామంది వేదికలమీద 'కౌగిణులు' అనే పాడుతున్నారు. శరచ్చంద్ర గారి పాటల పుస్తకంలో (3-13) కూడా 'కౌగిణుల' అనే అచ్చయింది. దీన్ని అందరూ గమనించాలి. 'వాలి సోలి' తరువాత తారషడ్జమం నుండే మెల్లగా సోహనీరాగంలోకి వస్తూ 'ఊగిపోవు' పంక్తిని ఇద్దరూ అందుకున్నారు. పల్లవిని పాడి 'సాగె' దగ్గర వదిలేయగా ఇంతకుముందు లాగానే సోహని రాగస్వరాల బిట్టునే కొనసాగించారు.

తరువాత వయొలిన్స్ దర్బారీకానడ రాగంలోకి మారుతూ 'సాదనీపమప' సంపుటిని అందుకున్నాయి. ఇది రెండు ఆవర్తాలుగా సాగినాక వేణువు,క్లారియోనెటులు సంయుక్తంగా రెండు ఆవర్తాల బిట్టును అందించాయి. అప్పుడు జిక్కిగారు రెండు ఆవర్తాల ఆలాపన చేయగా చివరలో వీణపై 'సనిదపా' అని లింకు బిట్టును ఇచ్చాయి. వెంటనే మూడవ చరణం 'చూడుమా చందమామ' ను 'పసనిసా' సంపుటితో అల్లంత దూరాన ఉన్న చంద్రుడిని చూడమని ఎలుగెత్తి పిలుస్తున్న ధోరణిలో జిక్కి పాడారు. ఘంటసాల పాడిన పంక్తిలో 'శారదయామిని' లో కోమల్ దైవత్‌ను స్పృశిస్తున్న తీరు రాగస్వరూపాన్ని చూపగా 'ప్రేమ' దగ్గర ఆలాపన మరింతగా రాగరంజితం చేసింది. అలాగే ఈ రాగంలో క్రొత్త ప్రయోగపు కోణం 'వగలా తూలే' దగ్గర 'రినిసా దదసా' అంటూ అపురూపంగా వినిపిస్తుంది. 'మనసున మోహం'దగ్గర కానడ చక్కగా స్ఫురిస్తుంది. తరువాత మళ్లీ సోహనిలోకి వెళ్లి 'ఊగిపోవు మది'ని పాడి 'సాగె' దగ్గర వదిలేశారు.

దర్బారీకానడ రాగం అసావరీ ధాట్‌కు చెందింది. ఇది హిందూస్తానీ శాస్త్రీయసంగీతరంగంలో ప్రముఖస్థానాన్ని వహించింది. అక్బర్ ఆస్థానంలో తాన్‌సేన్ అనే మహాగాయకుడు అసావరీరాగాన్ని కానడకు చెందిన అనేక సంగతులను కలిపి పాడితే పాదుషా మెచ్చి పదేపదే దాన్నే తన దర్బారులో పాడించుకునేవాడట. అందుకని ఈ రాగానికి 'దర్బారీకానడ' అనే పేరు వచ్చిందని,దీన్ని తాన్‌సేన్ సృష్టించాడనీ ప్రతీతి వచ్చింది.

ఆరో : నిసరిగారిస మపదానిస

అవ : సదానీపమ పగమారిస

దీన్ని మంద్ర,మధ్యమస్థాయిలలో ఎక్కువగా ఆలపిస్తారు. జగదేకవీరునికథ సినిమాలో 'శివశంకరీ'; భలేమొనగాడు సినిమాలో 'మనిషి తలుచుకుంటే'; గృహప్రవేశం సినిమాలో 'దారి చూపిన దేవతా'; పాటలు ఈ రాగంలోనివే. పై చరణాలలాగానే సోహని బిట్టు కొనసాగించిన తరువాత 'యమన్' రాగంలోకి వాద్యాలు ప్రవేశించాయి. ఇక్కడ కూడా సాంకేతికలోపం కనిపిస్తున్నది. మిగతా చరణాలకున్నట్లుగానే సోహని రాగసంచారం వినిపించాక యమన్ రాగపు బిట్టు అనాగతంగా 'సనిరిసనీ' అని సాగుతూ 'నీ' మీద తాళం ప్రారంభమవుతున్నది. ఇది రికార్డులో ఉన్నది. కాని సోహని రాగపు బిట్టును సినిమాలో తీసేసి నేరుగా యమన్ బిట్టుకి వెళ్లిపోయారు. దానివల్ల తాళం అస్తవ్యస్తమైపోయింది. ఇది సినిమావాళ్లకు అవసరంలేదు కదా!

యమన్ రాగపు బిట్ వర్కును ఒక్క ఆవర్తంలో క్లుప్తంగా సమకూర్చారు. దీని తరువాత అంతే క్లుప్తంగా ఘంటసాల చిన్న రాగాలాపన చేశారు. చివరలో 'పగరిసా' అని వీణ అందించింది. 'కనుగవ తనియగా' ను ఘంటసాల ప్రారంభించారు. ఆయనకిష్టమైన రాగమని స్వరకర్తకు తెలుసు కనుక అవకాశం అలా వచ్చిందేమో! 'విరిసెనుగా' దగ్గర తనకు బాగా ఇష్టమైన ఆలాపన సంగతిని మురిపెంగా పలికించారు. 'చెలువము కనుగొన' నుంచి జిక్కి అందుకున్నారు. 'మనసానంద' నుంచి ఇద్దరూ కలిసి పాడి చివరలో స్వరసంపుటిని కూడా సంపన్నం చేసి ముగించారు. చివరలో పియానో మీద 'సా గా గా మా దా నీ గమదనిసా' అంటూ పాటనంతటినీ అందంగా ముగించారు. ఈ పాటను హిందీలో లతామంగేష్కర్,రఫీ పాడారు. లతగారికి ఘంటసాలతో పాడాలన్న కోరిక తీరనేలేదు. సుశీలగారికి ఆ ముచ్చట తమిళచిత్రంలో లభించింది. తమిళంలో తీసిన 'సువర్ణసుందరి' సినిమాలో మాస్టారుతో కలిసి సుశీలగారు కమ్మగా పాడారు.

**శివశంకరీ శివానందలహరి**




**చిత్రం : జగదేకవీరునికథ (1961)**
**రచన : పింగళి**
**సంగీతం : పెండ్యాల**
**గానం : ఘంటసాల**

**<u>దర్బారీకానడ–తీన్‌తాల్</u>**

*శివశంకరీ శివానందలహరి*

*చ॥ చంద్రకళాధరీ ఈశ్వరీ*
*కరుణామృతమును కురియజేయుమా*
*మనసు కరుగదా మహిమ జూపవా*
*దీనపాలనము సేయవే ॥శివ॥*

*స్వరం: 1. ,నిరిసనిదనిసా ,మపదనిసా*
*దనిసా దనిసా దనిసా ॥చంద్ర॥*
*2. ,నిరిసని పమగా రిసదా నీరీనినిసా*
*రిమపదా మపనిరినిసదప ॥చంద్ర॥*
*3. ,దనిసా మపదనిసా సరిమగరిమపనిదనిసా*
*,మపనిరిసరి నిసదనిపా మపనిసరీ సనిసరి గారిస*
*రిరిస నిసని పనిప మపమ గమరిసనిస*
*సరిమపనిదానిసా ॥3॥ ॥చంద్ర॥*

*తరానా: తోం తోం తోం దిరిదిరితోం దిరిదిరితోం*
*దిరదిరితోం దిరిదిరితోం దిత్రియ్యాన తరితోం*
*దిరిదిరితోం దిరిదిరితోం దిరిదిరితోం తాధీయాన*
*దిరిదిరితోం తోం దిరిదిరితోం తోం*

*దిరిదిరితోం దిరిదిరితోం దిరిదిరితానా దీరీతోం*
*దిరి దిరి దిరి దిరి దిరి దిరి దిరి దిరి*
*నాదిరి దిరి దిరి దిరి దిరి దిరి దిరి నా దిరి*
*దిరి దిరి తోం*

*స్వరం: 1. నినినినినినిని దనిని దనిని దప*
*పసస నిససనిద నిరిరి సరిరి సని*
*2. సగగ రిగగరిస సరిరి సరిరి సని*
*3. నిసస నిసస నిద దనిని దనిని దప*
*4. నినిదద ససనిని రిరిసస గగరిరి*
*గగసస రిరినిని సనిరిరి సససస*
*5. రీరిరీరిరిరి నినిని రీరి రిరి*
*నినిని గాగగగ నినిని రీరి గరిమా*
*రిమరి సరిస నిసని పనిప మపమరిగా*
*సరిసస మపమమ సరిసస సససస*
*సరిసస పనిపప సరిసస సససస మపమమ*
*పనిదద*
*మపమ పనిద మపమ పనిద పదపప సరిసస*
*పదప సరిస పదప సరిస*
*మమమ పపప దదద నినిని ససస రిరిరి*
*గరిసనిసరిమా............*

ఇది ఒక అపూర్వస్వరసృష్టి. దర్శకులు కె.వి.రెడ్డి; రచయిత పింగళి; స్వరకర్త పెండ్యాల; గాయకులు ఘంటసాల నలుగురు నాలుగు స్తంభాలతో కీర్తిగోపుర శిఖరాన్ని నిర్మించారు. వీరికి సహకరించిన ఛాయా గ్రాహకులు, ధ్వనిముద్రాపకులు వంటి సాంకేతిక నిపుణులెందరో ఎంతో గొప్పగా శ్రమించి,ఈ పాటను మహత్తరకళాఖండంగా రూపుదిద్దారు. వాద్యకళాకారులు దానికి రంగులద్దారు.

దీనిలో పల్లవి, చరణం మాత్రమే కనిపిస్తాయి. వీటిని హిందూస్తానీ సంప్రదాయంలో అస్తాయి,అంతరా అని పిలుస్తారు. అనుపల్లవి ఉండదు. సంగీతానికి రాళ్ళు సైతం కరుగుతాయనే భారతీయవిశ్వాసాన్ని రుజువు చేసినట్లుగా రూపొందింది. రాతిగుండు రూపం కరిగిపోయి శాపనివృత్తి కావడం అనే నెపంతో ఈ పాటను అజరామరంగా చిత్రించారు. పాటంతా అయిపోయాక గుండే కాదు, గుండె కూడా కరిగిపోతుంది. రాతిగుండులో కనిపించిన దేవతా స్వరూపునిగా ఎ.వి.సుబ్బారావు అనే నటుడు షూటింగయ్యాక కూడా పారవశ్యంలోంచి తేరుకోలేదని విజ్ఞులు చెబుతారు. అంతటి మహిమ ఈ పాటలో నిక్షిప్తమై ఉన్నది. చూస్తున్న ప్రేక్షకులు కూడా కరిగి నీరైపోతారు. కనుకనే ఇప్పటికీ నిత్యనూతనంగా ఈ పాట నిలిచి పోయింది. ఎన్‌టీఆర్‌ను అయిదు రూపాల్లో చిత్రించిన ఛాయాగ్రాహకుని వైదుష్యం ఈ సన్నివేశానికి ఆయువు పట్టు. ఐదుగురు పాడుతున్నట్లు భ్రమింపజేసిన ధ్వని ముద్రాపకులు మరో ప్రాణం ఈ సినిమాకు. చాలామంది అనుకుంటున్నట్లుగా ఈ పాటను మరో ఇద్దరు, ముగ్గురు కలిసి పాడలేదు. ఘంటసాల మాస్టారు గారి వాయిస్‌నే డబుల్ ట్రాకులుగా తీసుకుని ఆ ఎఫెక్టును సాధించారు. ఇది ఆనాటి కాలపు గొప్ప సాంకేతికదిగ్విజయం.

'శివశంకరీ' పదంలోనే శివపార్వతులిద్దరినీ స్మరించుకునే వీలు కలగడానికి పింగళివారు మంచి ఎత్తుగడను ప్రయోగించారు. అలాగే పాటలో ఎక్కడ కూడా పార్వతికి విడిగా శైలసుతా అనో, గౌరి అనో ఏ ప్రత్యేక పర్యాయపదమూ ఉపయోగించక ప్రతిపదాన్ని శివునితో సంయుక్తంగా ఉండే రీతిన ప్రయోగించారు. "శివశంకరి, శివానందలహరి, చంద్రకళాధరి, ఈశ్వరి" ఈ పదాలలో శివునితో సంలీనతే తప్ప వ్యష్టి సంబోధన ఎక్కడా కనిపించక పోవడం గొప్ప విశేషం. అయితే,దృశ్యంలో "కరగడం" ప్రముఖమైనది కనుక 'మనసు కరుగదా' అన్నారు. ఆ కరగడం అయ్యవల్ల,అమ్మ వల్ల ఇద్దరివల్ల అయితే తొందరగా పనవుతుందని సూచన ఈ రచనావిధానంలో ఉంది. ఇది ఒక్క అయ్యవల్ల కాదు,అమ్మ జతకూడాలన్న పురుషకారవైభవాన్ని కవి హృద్యంగా చెప్పారు.

నేరుగా మొదటిసారికే పాడినపాట టేకయిపోవడం అందరినీ ఆశ్చర్యపరచింది. ఆ గొప్పదనం అంతా ఘంటసాల మాస్టారుదే. దీన్ని ఎంతో చాతుర్యంతో రికార్డింగును నిర్వహించినవారు వల్లభజోశ్యుల శివరాంగారు. ఆయన ట్రాక్ విధానంతో ఐదుగురు పాడుతున్న ఎఫెక్టును విజయవంతంగా తీసుకువచ్చారు. ఈ సినిమా తీయడానికి ముందు 1944లో 'జగదల ప్రతాపనే' అనే పేరుతో తమిళంలో కె.వి.రెడ్డిగారు సినిమా తీశారు. దానిలో నాయకునిగా, గాయకునిగా పి.వి.చిన్నప్ప వ్యవహరించారు. ఈ పాటను 'తాయై పనివెన్' అనే పల్లవితో పాపనాశనశివన్ పాట రాశారు. స్వరకర్త జి.రామనాథన్ ఆ పాటను చక్కని కర్ణాటకసంగీతధోరణిలో బాణీ చేశారు. అది 11నిముషాలలో ఉంది. మళ్ళీ ఆ సంప్రదాయంలోనే ఎందుకని పెండ్యాలవారు హిందూస్తానీ బాణీని తెలుగులో అనుసరించారు. ఎన్నో బాణీలు వినిపించి చివరకు దర్బారీకానడరాగంలో వినిపిస్తే కె.వి.రెడ్డి గారు ఒప్పుకున్నారు. అయితే పింగళివారు రాసిన పాట 13 నిమిషాలు సాగుతున్నది. దాన్ని కె.వి.రెడ్డి ఆరున్నర ని॥లకు కుదించారు. పెండ్యాల ఆరునిముషాలకు దించి

ఇక తనవల్ల కాదన్నారు. అప్పుడు చివరగా ఘంటసాల దాన్ని 5 నిముషాలకు కుదించగలిగారు. ఎన్టీఆర్ గారు దీన్ని పెను సవాలుగా స్వీకరించి 5 రకాల వైవిధ్యమైన అభినయాన్ని,పెదవుల కదలికను, గాత్రధర్మాన్ని చక్కగా నిర్వహించారు. ఈ పాట షూటింగ్ కు రమ్మని దర్శకులు పిలువగా పెండ్యాల వచ్చి సెట్లో తగిన సూచనలిచ్చారు. ప్రముఖఛాయాగ్రాహకులు మార్కస్ బార్ట్లే స్పెషల్ ఎఫెక్టులను హర్‌భజన్‌సింగ్ ఎంతో కృషిచేసి విజువలైజ్ చేశారు. అయితే సంగీతాభిమానులకు ఒక అనుమానం వస్తుంది. ఇలాంటి పరీక్షాసన్నివేశంలో సంగీతంతో మెప్పించడానికి కర్ణాటక సంగీతం పనికిరాదా? హిందూస్తానీ సంగీతమే కావాలా? అని ఆ సందేహం.  నిజమే. 'సప్తస్వరాలు' లో 'హాయిగా పాడనా'; 'జయదేవ' లో 'నీ మధుమురళీ'; 'సంగీతలక్ష్మి'లో 'రాసక్రీడ' లాంటి పరీక్షాసన్నివేశాలలో హిందూస్తానీ బాణీలే ఎక్కువగా వినిపించాయి. దీన్ని కర్ణాటక సంగీతం పట్ల చిన్నచూపు అనలేం, కర్ణాటక సంగీత సామర్థ్యం లేకపోవడం అని కూడా భావించలేము. ఆయా పాటలకు ఏవో ఏవో కారణాలుంటాయి. కొన్ని చూద్దాం.

'భక్త జయదేవ' లోని 'నీ మధు మురళీ' పాటకు ముందు సవాలు చేయడానికి వచ్చిన గాయకులు 'హరహరా జయకరా' ను ఎక్కువభాగం కర్ణాటక సంగీతం ఆధారంగానే వినిపించారు. మళ్ళీ వెంటనే అదే పద్ధతి వినిపిస్తే ప్రేక్షకులు ఇష్టపడరని అనిపించి వుంటుంది. ఇదే పరిస్థితి 'శివ శంకరి'కి కూడా ఉంది. తమిళంలో కర్ణాటక సంగీత ధోరణిలో ఉంది కనుక మారుద్దామనుకున్నారేమో! 'నర్తనశాల' లో 'జయగణనాయక' కర్ణాటక పద్ధతిలో ఉంది. కనుక 'సలలితరాగసుధ' ను హిందూస్తానీలోకి మార్చారంటారు. ఈ రెంటిలోనూ ఎన్టీఆరే నటించడం విశేషం. ఒక సంగీత పద్ధతిలో పోటీ జరిగినప్పుడు పాల్గొనే వారంతా ఆ పద్ధతిలోనే పోటీ పడతారు. అంతేగాని, కర్ణాటక సంగీతంలోని వర్ణాల పోటీ జరుగుతుంటే హిందీ భజన్స్ ఎవరూ పాడరు. ఇది సామాజికన్యాయం. అది సినిమా వ్యాపారం. అంతే అనుకోవాలి, సర్దుకోవాలి.

'శివశంకరీ' పాటకు బాణీ సమకూర్చడంలో పెండ్యాల గారికి పూర్తి స్వేచ్ఛ లభించింది. 'రసికరాజ' పాటకు అలా కాదు, కవిగారి నిబంధన అనివార్యమైంది. రెండు సంబంధం లేని రాగాలను కలపడం పెండ్యాలకు ఇష్టం లేకపోయినా తప్పనిసరైంది. అంత సంప్రదాయగాఢతను ప్రేక్షకులు స్వీకరించలేకపోయారు. కాని 'శివశంకరీ'ని కళ్ళకద్దుకుని, గుండెలకు హత్తుకున్నారు, దాచుకున్నారు. కవికి, స్వరకర్తకు, గాయకునికి అంతకంటే కావలసినదేమీ లేదు. కర్ణాటక 'కానడ' కు, దర్బారీ కానడకు దైవత్ ఒకటే తేడా. ఈ రాగాన్ని మంద్ర. మధ్యమ. తారస్థాయిలలో చక్కగా తీర్చి దిద్దారు. మంద్రస్థాయి దైవతం నుండి తారస్థాయి మధ్యమందాకా ఈ పాట బాణీ ఎన్నో ఒంపుసొంపులతో సంచారం చేసింది. ఆది తాళాన్ని హిందూస్తానీ పద్ధతిలో తీన్‌తాల్ అని వ్యవహరిస్తారు. ఇది 16 మాత్రలకాల వ్యవధిలో విలంబిత్‌లో నడిస్తే 'తిల్‌వాడ' అంటారు. దీన్ని కర్ణాటకలో చౌకకాలం అనిపిలుస్తారు. దీన్ని కహర్వాలోకి తీసుకుంటే, ఎనిమిది మాత్రల కాలవ్యవధిలో నడుస్తుంది.దీన్ని ఆదితాళం అంటారు. రేకాలోకి తీసుకుంటే నాలుగు మాత్రల కాలంలో నడుస్తుంది. దీన్నే కర్ణాటకలో ఏకతాళం అంటారు. 'శివశంకరీ' పాట ఖచ్చితమైన 8 మాత్రల నడకతో తీన్‌తాల్‌లో సాగింది. కనుక దీన్ని వేదికలమీద పాడే నేటి గాయకులు కూడా ఆదితాళం పోకడలోనే పాడాలి. కాని చాలమంది అక్షరకాలాన్ని పాటించకుండా పాడుతున్నారు. ఇదేమిటని అడిగితే 'సినిమాపాటకు అక్షరకాలమెందుకు?' అని నిర్లక్ష్యంగా చప్పరించేస్తున్నారు. కాని ఈ పాట మామూలు సినిమాపాట కాదు. సలక్షణమైన శాస్త్రీయగీతం. తాళబద్ధంగా పాడలేని దద్దమ్మల సమాధానమంతే అని అనుకోవాల్సిందే.

త్యాగయ్యగారి కృతిలాగ ఆగతవిధానంలో మూడు మాత్రల జాగా వదలి పల్లవి ప్రారంభం కావడం ఈ పాటకున్న గొప్ప పవిత్రత. ప్రారంభంలో చిన్న ఆలాప్‌ను ఎత్తుకోవడంలోనే హిందూస్తానీ ధోరణి లీలామాత్రంగా వినిపిస్తుంది. 'నా' అంటూ మంద్రదైవతం దగ్గరికి చేరడమే హిందూస్తానీ ముద్రను పట్టిచూపుతుంది. అస్తాయిని ఆగతంగా ప్రారంభించారు. 'రీ' మీదుగా తబల నడక ప్రారంభమైంది. 'శివానందలహరి' ని మూడు సార్లు మూడు రకాల సంగతులతో పాడాక 'శివశంకరి' అందుకున్నప్పుడు ఒకటిన్నర ఆవర్తాలలో సితార్ బిట్ వినిపిస్తుంది. తరువాత ఒక మాత్ర జాగతో 'చంద్రకళాధరి' అనే అంతరాను ఎత్తుకున్నారు. 'ఈశ్వరీ' దగ్గ నాలుగు ఆవర్తాల కాలంలో ఆలాప్‌ను నింపాదిగా వినిపించారు. ఇలా ఆలాప్‌ను మధ్యమధ్య కూడా వినిపించారు. దీన్నే తాన్ అని కూడా పిలుస్తారు. తరువాత అంతరాను మొత్తం పాడారు. 'మనసు కరుగదా' ను 'మపనిస రిసగా' అనే బాణీలో సాభిప్రాయంగా ఎత్తుకుని 'రిసగా' ను జాలిగా 'కరుగదా' అని అడుగుతున్నట్లు స్ఫురింపజేశారు.  'సేయవే' దగ్గర రాగముద్రను తన మధుర గాత్రంలో వినిపించి

సుసంపన్నం చేశారు. దీని తరువాత అస్తాయినంతటిని మూడు రకాల వైవిధ్యమైన సంగతులలో, సంగీత ప్రాధాన్యతతో పాడారు. దీన్ని కర్ణాటక సంగీతంలో 'నెఱవల్' అని పిలుస్తారు. హిందూస్తానీలో దీన్ని 'బోల్‌తాన్'గా వ్యవహరిస్తారు. ఈ బోల్‌తాన్‌లో కంపితం, మూర్ఛన, ఆందోళం వంటి గమకాలను ఆరు ఆవర్తాలలో వినిపించారు మాస్టారు. తరువాత అర ఆవర్తంలో తబలపై ముక్తాయిని ఇచ్చాక అంతరాను ఎత్తుకుని మనోధర్మ స్వరాలను ప్రారంభించారు. మొదటి వరుసను ఒక మాత్ర వదలి ఎత్తుకుని ఒక ఆవర్తంలో సుశ్రావ్యంగా పాడారు.

రెండో వరుసను కూడా ఒక మాత్ర జాగా వదిలి ఎత్తుకుని రెండు ఆవర్తాలలో పాడారు. మూడవ వరుసను కూడా ఒక మాత్ర జాగా వదిలి ఎత్తుకుని మూడు ఆవర్తాలలో పాడి నాలుగవ ఆవర్తంలో ముక్తాయి స్వరాలను పాడారు. ఈ ముక్తాయిస్వరాల 8వ అక్షరం తరువాత అంతరాను అయిదుగురు పాడుతున్న ఎఫెక్టును తెచ్చారు. సితార్ బిట్‌వర్క్‌లో కంపితగమకం ప్రధానంగా చేస్తూ రెండు ఆవర్తాలు చక్కని స్వరాలు వినిపించి చివరలో, గాత్రంలో వినిపించిన 'సరిమపనిదానిసా' అనే ముక్తాయి స్వరాలనే సమం నుంచి ఎత్తుకుని వాయించారు. మాస్టారు అస్తాయిని ఎత్తుకున్నారు. తరువాత అకారప్రస్తారాన్ని అంటే, తాన్‌ను సమం నుంచి ఎత్తుకుని 5 ఆవర్తాలలో ఆలపించారు. ఈ తాన్ మధ్యననుండి మిగతావాళ్ళు కూడా పాడుతున్న ఎఫెక్టును తీసుకువచ్చారు. దీనిలో స్ఫురితం, ఆందోళం గమకాలు ధ్వనించాయి. మరో ఆలాపనను మూడు ఆవర్తాలతో తారస్థాయి స్వరాలను కలుపుకుని అవరోహణాగమకంతో ముగించారు. పిదప సితార్ బిట్‌వర్క్ ఆరవ అక్షరం నుండి ప్రారంభమై రెండున్నర ఆవర్తాలలో ముక్తాయిని కలుపుకుని సాగి అస్తాయిని ఆలపించింది. వెంటనే 5వ అక్షరం మీద ద్రుతగతిలో అంటే,పైకాలంలో పఖ్‌వాజ్ వాద్య విన్యాసం ప్రారంభమై రెండున్నర ఆవర్తాలలో సాగింది. ఈ వాద్యం కర్ణాటక సంగీతంలో మృదంగవాద్యం లాంటిది. దీన్ని శాస్త్రీయ సంగీత సభల్లోనే ఎక్కువగా ఉపయోగిస్తారు. దీని తరువాత మాస్టారు సమం నుంచి జతులను అందుకున్నారు. ఈ ప్రక్రియను కర్ణాటక సంగీతంలో కొనగోలు అంటారుకదా! దీన్ని హిందూస్తానీలో తరానా అని పిలుస్తారు. ఇక్కడినుంచి గానం,సితార్ బిట్ మిశ్రమంగా మొత్తం పది ఆవర్తాలలో సాగింది. సితార్ బిట్ తరువాత నడక అతిద్రుత్‌లోకి మారింది. అంటే నాలుగవ కాలం లాంటిదన్నమాట. మళ్ళీ స్వరసంచారాన్ని కంపితగమకంలో ప్రారంభించారు. స్ఫురితం, త్రిపుచ్ఛం గమకాలను ఉపయోగిస్తూ, దాటుస్వరాలను కలుపుకుని మహావేగంతో 14 ఆవర్తాలలో పాటను ముగించారు. చివరలో త్రిపుచ్ఛం (నినిని ససస రిరిరి) అనే గమకంతో వినిపిస్తూ 'సరిమా' ను మధ్యమ్ నుండి పంచమ్‌లోకి జారుస్తూ తారస్థాయిలో స్వరాలను పలికారు. 'మా' అని శుద్ధమధ్యమ్‌లో వదిలేయడంలో గల ఉద్దేశ్యం సాభిప్రాయమే. ప్రార్థించేది అమ్మను గురించే కనుక 'మా' అన్నారు. 'మా' శబ్దం మాతకు సంక్షిప్తరూపం. హిందీభాషలో మాఁ అంటే అమ్మే కదా! మధ్యమ్‌ను పంచమ్ మీదికి లాగి చంక్రమణ సంగతిలో ఆరుసార్లు పలికించి ముగించడం చెప్పుకోదగ్గ విశేషం.

హిందూస్తానీలో గాయకులు ఎవరూ చేతితో తాళం వేయరు. అంటే అంగక్రియలను కర్ణాటకసంగీతంలో వలె ప్రదర్శించరు. లెక్క అంతా మెదడులోనే భద్రంగా ఉంటుంది. ఈ పాట చిత్రీకరణలో దర్శకులు దీన్ని సక్రమంగా పాటించారు. ఎన్‌టీఆర్ ఎప్పుడూ తాళం వేయలేదు. కుడివైపు తబల, సితార్‌లు; ఎడం వైపు తంబుర, పఖ్‌వాజ్‌లు ఉన్నట్లుగా చిత్రించడం కూడా ఒక కచేరీసంప్రదాయం. అంతేకాదు, సితార్‌ను ఎడం వైపు ఉంచితే డిజైను సరిగా ఉండదని భావించియుండవచ్చు. కాని వాద్యకళాకారులు పాడడం కచ్చేరీల్లో జరగదు. చిత్రంలో అందరూ పాడినట్లు చూపారు. అయితే ఇక్కడ కథకు అవసరం. కథానాయకుని బహుముఖప్రజ్ఞను ప్రదర్శించడం చాల అవసరం కనుక అందరూ పాడినట్లు చూపాలి. అప్పుడే అతడు గెలుస్తాడు, దేవతలు కరుణిస్తారు.

వేదికమీద పాడే చాలామంది గాయకులు ఇప్పుడు ఈ పాటలో మనం చెప్పుకున్న లెక్కలను సరిగా పాటించడం లేదు. ప్రేక్షకులు కొట్టే చప్పట్ల కోసం ఎదురుచూడడం తప్ప పాటను భక్తిగా పాడి రక్తి కట్టించలేకపోతున్నారు. ఇలాంటి పాటల్ని విని ఆనందించడం తప్ప పాడడానికి ప్రయత్నించడం అంత సులభం కాదని చెప్పవచ్చు. పాడాలనుకుంటే అక్షరకాలాన్ని అనుసరిస్తూ తూచినట్లు పాడాలి. లేకపోతే విని ఆనందించాలి. ఇదే ఈ పాటకు మనమిచ్చే గౌరవం. ఘంటసాలగారు ఈ పాటను ఎంతో సాధన చేసి భక్తిశ్రద్ధలతో పాడారని గమనించాలి. ఆయన చేసిన నాదసాధనలో సగభాగమైనా చేసినవారికే ఈ పాట సక్రమంగా లొంగి చరితార్థులను చేస్తుంది.

**జాతీయ పురస్కార గ్రహీత**
డా. ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

# సూక్తి సురభి

- రెంటాల సాంబశివరావు

*యస్యాఽస్తి విత్తం స నరః కులీనః*
*స పండిత స్స శ్రుతవాన్ గుణజ్ఞః।*
*స ఏవ వక్తా స చ దర్శనీయః*
*సర్వే గుణాః కాంచన మాశ్రయంతి॥*

యస్య-ఎవ్వనికైతే, విత్తం-ధనము, అస్తి-ఉందో, సః నరః-అలాంటి వ్యక్తి, కులీనః-ఉత్తమకులములో పుట్టినవాడును, సః-అతడే, పండితః-గొప్ప జ్ఞానియును, సః-అతడే, శ్రుతవాన్-విద్యావంతుడును, గుణజ్ఞః-గుణసంబంధి జ్ఞానము గలవాడును, సః ఏవ-వాడే, వక్తా-చక్కని ఉపన్యాసకుడును, చ-ఇంకనూ, దర్శనీయః-చూడదగిన అందగాడును? ఈవిధంగా-సర్వే-అన్నివిధాలైన, గుణాః సద్గుణాలును, కాంచనం-బంగారాన్ని/సంపదను, ఆశ్రయంతి-ఆశ్రయించి యుంటాయి॥

మిక్కిలి సంపన్నుడైన వ్యక్తి-లోకంలో గొప్ప కులములో జన్మించిన వాడును, గొప్ప విశిష్టమైన జ్ఞానసంపన్నుడును, మహావిద్యావంతుడును, గుణగణాల విశేషలక్షణాలు గలవాడును, అతడే చక్కని ఉపన్యాసకుడును, పదే పదే చూడదగిన సుందరుడును ఐయుంటాడు॥ ఏమంటే సద్గుణాలన్నీ లోకంలో సంపద నాశ్రయించియే యుంటాయి॥

*యస్యాఽర్థా స్తస్య మిత్రాణి*
*యస్యాఽర్థా స్తస్య బాంధవాః।*
*యస్యాఽర్థా స్స పుమాంల్లోకే*
*యస్యాఽర్థా స్స చ పండితః॥*

లోకే-ఈలోకంలో, అర్థాః-సంపదలు, యస్య-ఎవ్వనికైతే ఉంటాయో, తస్య-వానికి, మిత్రాణి-మిత్రులు। అర్థాః-సంపదలు, యస్య ఎవ్వనికైతే ఉంటాయో, తస్య-వానికి, బాంధవాః-బంధువులు। అర్థాః-సంపదలు, యస్య-ఎవ్వనికైతే ఉంటాయో, సః-వాడే, పుమాన్ పురుషుడు। చ-మరియును, అర్థాః-సంపదలు, యస్య-ఎవ్వనికైతే ఉంటాయో, సః-వాడే, పండితః-పండితుడు॥ "ధనమూల మిదం జగత్"

ఈలోకంలో సంపన్నునికే మిత్రులును, బంధువులును ఉంటారు। ధనవంతుడే నిజమైన పురుషుడు, ఆ ధనవంతుడే మహాపండితుడు॥

*స్వగృహే ప్రాక్శిరాః కుర్యాత్*
*శ్వాశురే దక్షిణాశ్శిరాః।*
*ప్రత్యక్శిరాః ప్రవాసేషు*
*న కదాచిదుదక్శిరాః॥*

స్వగృహే-సొంత యింటియందు, ప్రాక్-తూర్పుదిక్కునను, శ్వాశురే-అత్తవారింట, దక్షిణాః-దక్షిణ దిక్కునను, ప్రవాసేషు-వేరుచోట్ల (ప్రయాణాదికాలలో), ప్రత్యక్-పడమటి దిక్కునను, శిరాః-తలపెట్టుకొని, కుర్యాత్-నిద్రించవలెను. కదాచిత్-ఎప్పుడూ కూడా, ఉదక్-ఉత్తర దిక్కున, శిరాః-తలపెట్టుకొని, న(కుర్యాత్) నిద్రించరాదు॥

మనము నిద్రించు విధి నియమాలు తన సొంత యింటిలో తూర్పుదిక్కునను, అత్తవారింట దక్షిణదిక్కునను, వేరే చోట్ల యెక్కడైనా పడమటిదిక్కునను- తలపెట్టుకొని నిద్రించవలెను. కానీ, ఉత్తర దిక్కున తల పెట్టి యెక్కడైనా సరే నిద్రించుట తగదు॥

*సంధ్యాకాలే తు సంప్రాప్తే*
*పంచ కర్మాణి వర్జయేత్।*
*భోజనం సంగమో నిద్రా*
*స్వాధ్యాయో దాన మేవ చ॥*

సంధ్యాకాలే -సంధ్యాకాలము, సంప్రాప్తే తు-రాగానే, భోజనం-భుజించుటయును, సంగమః-సంయోగమును, నిద్రా-నిద్రయును, స్వాధ్యాయః-చదువుటయును, చ-మరియును, దానం ఏవ-దాన మిచ్చుటయును(అనే), పంచ కర్మాణి -ఐదు పనులను, వర్జయేత్-విడువవలెను॥ సంధ్యాకాలమందు చేయుదగని ఐదు పనులు 1.భోజనమును, 2.స్త్రీపురుష సంయోగమును, 3.నిద్రించుటయును, 4.చదువుటయును, 5.దాన మిచ్చుటయును॥

*అక్రోధవైరాగ్యజితేంద్రియత్వం*
*క్షమా దయా సర్వజనప్రియత్వమ్।*

*నిర్లోభదాతా భయశోకహర్తా*
*జ్ఞానస్య చిహ్నని దశలక్షణాని॥*

అక్రోధ-కోపము లేకుండుటయును, వైరాగ్య-విరక్తియును, జితేంద్రియత్వం-ఇంద్రియనిగ్రహమును, క్షమా-ఓర్పును, దయా-దయాగుణమును, సర్వజన-అందరికినీ, ప్రియత్వమ్-ఇష్టుడగుటయును, నిర్లోభ-పిసినారితనము లేకుండుటయును, దాతా-దానగుణమును, భయ-భయాన్ని, శోక-దుఃఖాన్ని, హర్తా-తొలగించుటయును అను, దశ-ఈ పది, లక్షణాని-లక్షణాలును, జ్ఞానస్య-జ్ఞానానికి, చిహ్నని-గుర్తులు॥

జ్ఞానికి ఉండే పది లక్షణాలు ఇక్కడ పేర్కొన్నారు- 1.కోపము లేకుండుట, 2.వైరాగ్యము, 3.ఇంద్రియ నిగ్రహము, 4.ఓరిమి, 5.భూతదయ, 6.అందరిచేత గౌరవింపబడుట, 7.లోభిత్వము లేకుండుట, 8.దానగుణము కలిగి యుండుట, 9.(ఇతరుల) భయాన్ని తొలగించుట, 10.(ఇతరుల) శోకాన్ని తొలగించుట॥

*యథా నద్య స్స్యందమానా స్సముద్రే*
*అస్తంగచ్ఛంతి నామరూపే విహాయ।*
*తథా విద్వాన్ నామరూపా ద్విముక్తః*
*పరాత్పరం పురుష ముపైతి దివ్యమ్॥*

స్యందమానాః-ప్రవహించే గుణము గల, నద్యః-నదులు, నామ-పేర్లు, రూపే-ఆకారాలను, విహాయ-విడిచిపెట్టి, సముద్రే-సముద్రమునందు, యథా-ఏవిధంగానైతే, అస్తంగచ్ఛంతి-లీనమైపోతాయో, తథా-అదే విధంగా, విద్వాన్-పండితుడు, నామరూపాత్-పేరునుండి, ఆకారాన్నుండి కూడా, విముక్తః- విడివడినవాడై (లేనివాడై), పరాత్పరం-పరాత్పరుడైన, దివ్యం-దైవసంబంధమైన, పురుషం-పురుషుని, ఉపైతి-పొందుతాడు॥

నదులు ప్రవహించి చివరికి తమ నామరూపాలు వదిలి సముద్రములో లీనమై పోతాయి, అలాగే పండితుడు కూడా తమ నామరూపాలు వదిలి దివ్యస్వరూపుడైన పరాత్పరునిలో లీనమై పోతాడు॥

*క్షుధాం దేహవ్యథాం త్యక్త్వా*
*బాలః క్రీడతి వస్తుభిః।*
*తథైవ విద్వాన్ రమతే*
*నిర్మమో నిరహ స్సుఖీ॥*

క్షుధాం-ఆకలినీ, దేహవ్యథాం-అలసటనీ, త్యక్త్వా-విడిచి, బాలః-బాలుడు, వస్తుభిః-ఆట వస్తువులతో, క్రీడతి-ఆడుకుంటాడు, నిర్మమః-మమకారము లేనివాడును, నిరహః-అహంకారము లేని వాడును, సుఖీ-సుఖవంతుడైన, విద్వాన్-పండితుడు(జ్ఞాని), తథైవ-అలాగే, రమతే-ఆనందాన్ని పొందుతాడు॥

*గుణా స్సర్వత్ర పూజ్యంతే*
*పితృవంశో నిరర్థకః।*
*వాసుదేవం నమస్యంతి*
*వసుదేవం న మానవాః॥*

సర్వత్ర-అన్నిచోట్లా, గుణాః-గుణములే, పూజ్యంతే-పూజింపబడతాయి. పితృ వంశః-తండ్రి గారి వంశము, నిరర్థకః- (ఈ పూజార్హత విషయంలో) నిరుపయోగమైనది. (అది ఎలాగంటే) మానవాః-జనులు, వాసుదేవం-వసుదేవుని కుమారుడైన శ్రీ కృష్ణుని, నమస్యంతి-నమస్కరిస్తారు గానీ, వసుదేవం-తండ్రి వసుదేవుని, న (నమస్యంతి)-నమస్కరించరు గదా॥

ఈలోకంలో అన్ని చోట్లా గుణాలను గౌరవిస్తాము గానీ వంశాన్ని గౌరవించాలని లేదు. అది ఎలాగంటే లోకులు వాసుదేవుడైన శ్రీ కృష్ణుని నమస్కరిస్తారు గానీ, వాని తండ్రియైన వసుదేవుని నమస్కరించరు గదా॥

*అరక్షితం తిష్ఠతి దైవ రక్షితం*
*సురక్షితం దైవహతం వినశ్యతి।*
*జీవ త్యనాథో?పి వనే విసర్జితః*
*కృతప్రయత్నో?పి గృహే వినశ్యతి॥*

అరక్షితం-ఏవిధమైన రక్షణ కూడా లేనిది, దైవ రక్షితం-దేవుడే రక్షించినట్లైతే, తిష్ఠతి-స్థిరంగానే ఉంటుంది. సురక్షితం-బాగా రక్షించబడినది కూడా, దైవహతం దైవముచేత శిక్షింపబడేదైతే, వినశ్యతి-నశించేపోతుంది. వనే-అడవిలో, విసర్జితః-వదిలివేయబడిన, ఆనాథః అపి-ఏదిక్కూ లేని వాడు కూడా, జీవతి-బతికే వస్తాడు. గృహే-ఇంటియందే, కృత ప్రయత్నః అపి-ఎంత ప్రయత్నించినా కూడా, వినశ్యతి-నశించియే పోతాడు॥

దేవుని దయయే ఉంటే ఏరక్షణా లేక వదలివేయబడినది స్థిరంగానే ఉంటుంది.ఎంత బాగా రక్షించినా కూడా దేవుని దయయే లేకపోతే నశించే పోతుంది. ఏ దిక్కూ లేక అడవిలోవదిలివేయబడిన వాడు కూడా బతికే ఉంటాడు.అలాకాక ఎంతగా ప్రయత్నించినా, యింట్లోనే ఉన్నా కూడా నశించే పోతాడు॥

రెంటాల సాంబశివరావు
కొవ్వూరు, ఫోన్ : 7893855174

# దీపావళి రాజస్థాన్ -03

**- యన్. లక్ష్మి అయ్యర్**

**భా**రతదేశంలో కంటే ఉత్తర భారత దేశంలో జరుపుకునే దీపావళి సంబరాలు ఎక్కువ. రాజస్థాన్‌లో దీపావళి మొత్తం ఐదు రోజులు జరుపుకుంటారు. మనం ఎలా సంక్రాంతి జరుపుకుంటామో అలా వీళ్ళు ఇక్కడ దీపావళిని ఘనంగా అతి వైభవంగా జరుపుకుంటారు. ఇది వీళ్ళ అతి పెద్ద పండుగ. దీపావళి పండుగ మొత్తము ఐదు రోజుల సంబరాలతో కూడినది. రాజస్థాన్లో దీపావళి ఎలా జరుపు కుంటారు ఇక్కడ ఈ వ్యాసంలో చూడవచ్చు



దక్షిణ భారతదేశంలో దీపావళి కథ ద్వాపరయుగపు శ్రీకృష్ణ లీల కు సంబంధించిన కథ. శ్రీకృష్ణుడు సత్యభామ సమేతుడై రాక్షసుడైన నరకాసురునితో యుద్ధం చేస్తాడని, అప్పుడు నరకాసురుని బాణం వల్ల శ్రీకృష్ణుడు మూర్ఛబోతే సత్యభామ విల్లు తీసి బాణం ఎక్కుపెట్టి నరకాసురున్ని వధించిందని పురాణం చెబుతున్నది దీని వెనుక ఒక కథ వుంది. పూర్వ జన్మలో భూదేవి నరకాసురుని తల్లి అని చెప్పబడుచున్నది. విష్ణుమూర్తి వరాహావతారంలో క్రోధంగా ఉన్నప్పుడు అతన్ని మోహించిందని అప్పుడు విష్ణుమూర్తి తనను పరిణయం ఆడవద్దని పుట్టబోయే కొడుకు రాక్షస ప్రవృత్తితో ఉంటాడని హెచ్చరించినా వినలేదని అప్పుడు శ్రీహరి అతని చంపే బాధ్యత తల్లే తీసుకుంటుందని చెబుతాడు. అది విన్న భూదేవి తల్లిగా తన ఎప్పుడూ కుమారుని చంపదని హామీ ఇస్తుంది. దానికి విష్ణుమూర్తి ద్వాపరయుగ శ్రీ కృష్ణావతారంలో ఆమె సత్యభామగా జన్మించి లోక కంటకుడైన నరకాసురుని వధిస్తుందని చెబుతాడు. ఇలా నరకాసురుని సంహరించిన రోజు అహం గర్వం తామసం క్రోధం లాంటి తామస గుణాలనబడే అంధకారం సత్యమనే సూర్యకాంతి వల్ల తొలగింప బడి జ్ఞానజ్యోతి వెలిగింప బడిందని దాన్నే దీపావళిగా జరుపుకుంటున్నామని దక్షిణ దేశపు భక్తి సాహిత్యం చెబుతున్నది,

ఇక ఉత్తర భారత దేశానికి వస్తే దీపావళి శ్రీరామ కథతో ముడి వడి ఉన్నది. దీపావళికి ముందు వచ్చే










దీపావళి దీపాలు

నవరాత్రులలో తొమ్మిది రోజులు దుర్గాదేవి ఉపాసన చేసి రాముడు రావణుని సంహరించి సీతా సమేతుడై అయోధ్యకు బయలుదేరాడని పుష్పక విమానం దిగి అయోధ్య సమీపించినప్పుడు అది అమావాస్య రోజయినందువల్ల అక్కడ ఉన్న ప్రజలు తమ సంతోషాన్ని దీపాలు చేతిలో గొని రామునికి స్వాగతం పలికారని తమ సంతోషాన్ని వ్యక్తం చేసేందుకై నగరమంతా దీపాలతో అలంకరించి దీపోత్సవాన్ని జరుపుకున్నారని చెప్పబడుచున్నది. దీపావళిని "దీపాలి" దీవాలి కూడా అని పిలుస్తారు. తొమ్మిది రోజుల నవరాత్రులు జరుపుకొని పదవరోజు అంటే విజయదశమి నాడు రావణ సంహారం చేసిన శ్రీ రామ చంద్రుడు సరిగ్గా దానికి 20వ రోజు రాముడు అయోధ్యకు చేరా డని అదే రోజు దీపావళి అని ఇక్కడ చెప్పబడు చున్నది. దీపావళి ఐదు రోజుల పండుగ.

మొదటి రోజు : అంటే త్రయోదశి రోజు ధన్వంతరి పుట్టిన రోజు. లక్ష్మీ ధన్వంతరి విగ్రహాన్ని ప్రతిష్టించి ఒక మట్టి హుండీని కొని దానిలో డబ్బులు వేసి దేవుని ముందు ఉంచుతారు. మట్టితో చేసిన లక్ష్మీ గణేష్ విగ్రహాలు లేదా లక్ష్మీ కుబేర గణేశ విగ్రహాలు దాని చుట్టూ ఐదు దీపాలు ఉండేటట్లు ఆ మట్టి విగ్రహాన్ని తీసుకొచ్చి నెయ్యి దీపం వెలిగిస్తారు. ఈ మొదటి రోజు ఇంటికి ముందు వెనకాల చుట్టుపక్కల విద్యుత్ దీపాలతో అలంకరించి దీపాలు పెట్టి సాయంత్రము అందరూ బంధువులు స్నేహితులను పిలిచి లేదా వాళ్ళ ఇంటికి వెళ్ళి మిఠాయిలు



పండుగ సందడి

పంచి టపా కాయలు వెలిగిస్తారు. ఈరోజు ధన్వంతరి జయంతి అని పిలవ బడుతుంది. విష్ణు భగవానుని యొక్క వైద్యుని రూపమే ధన్వంతరి. ఆ రోజు ధన్వంతరి అష్టోత్తరాన్ని చదువుతారు .

ఇక రెండవ రోజు: నరక చతుర్దశి రోజు. దీనిని చోటి దీవాలి అని కూడా పిలుస్తారు దీన్ని కాళీ చౌదరి అని కూడా అంటారు. శ్రీరాముని, లక్ష్మీని పూజిస్తారు. సాయంత్రం కొంతమంది దసరాలో విజయ దశమి రోజు రావణ సంహారం మిగిలి వుంటే కాలనిలోని అందరూ చేయి రావణ వెదురు బొమ్మను టపాకాయలు దానిపై వేసి తగుల బెడతారు .

ఇక మూడవ రోజు దీపావళి లేదా బడీ దీపావళి అంటే పెద్ద పండుగ. ఇది పెద్ద దీపావళి ఇక్కడ రాముడు అయోధ్యకు సీతా లక్ష్మణ హనుమంతుడితో సమేతంగా వచ్చిన అమావాస్య రోజు. రఘు కులానికి చెందిన రామచంద్రుడు సూర్యవంశానికి చెందిన వాడు కాబట్టి అతనిని దీపాలతో వచ్చి ప్రజలు ఆహ్వానించారని అదే పెద్ద దీపావళి అని చెప్పబడుచున్నది. ఆరోజు సాయంత్రం వినాయకుడికి, లక్ష్మి కుబేర పూజ చాలా వైభవంగా జరుగుతుంది .

ఇక నాలుగో రోజు గోవర్ధన్ పూజ పడువ అని కూడా చెప్తారు. ఈరోజు శ్రీ కృష్ణ పరమాత్మ గోవర్ధన్ గిరిని తన చిన్నబుల్లి వేలితో ఎత్తి పట్టుకుని అందరినీ రక్షించి గ్రామాన్ని కాపాడిన రోజు. ఇంద్రునితో





పిండి వంటలు

యుద్ధం చేసి గెలిచిన రోజు సాక్షాత్ బ్రహ్మ దేవుడు శ్రీ కృష్ణుని పాదాలు కడిగిన పుణ్య పర్వ దినం (బ్రహ్మ కడిగిన పాదము, బ్రహ్మము తానైనా పాదము –వాగ్గేయ కారులు అన్నమయ్య) ఈ రోజు కృష్ణ మందిరంలో అందరూ కలిసి అన్నకూట్ అనే ప్రసాదాన్ని తయారు చేసుకుని పంచి పెడతారు.

ఇక ఐదవ రోజు: భాయి దూజ్ అని పిలువ బడే అన్నదమ్ముల అన్నచెళ్ళల పండుగ రోజు. అక్కా చెల్లెలు తమ అన్నదమ్ము లకు తిలకం పెట్టి దీర్ఘా యుష్మంగా ఉండాలని దేవుణ్ణి ప్రార్థించి వాళ్ళు సుఖసంతోషాలతో వర్ధి ల్లాలని ప్రార్థిస్తారు. అన్న లేదా తమ్ముడు తన అక్కచెల్లెళ్లకు బహు మతులను బహు కరిస్తాడు. ఇది రాఖీ లాంటి పండుగ. ఇంకొక విశేషం ఏంటంటే దీపావళి రోజు అంటే ఐదు రోజులు తెల్లవార్లు రాత్రి పగలు విద్యుత్ దీపాలు వెలుగుతూనే వుంటుంది. జైపూర్ జిగేల్ మని దేదీప్యమానంగా దర్శనమిస్తుంది. దీపావళి ఐదు రోజులలో అమావాస్య రోజు తెల్లవారి ఒక గదిలో పట్టు వస్త్రాన్ని పరిచి అన్నీ మిఠాయిలలో కొంచెం కొంచెం తీసి పెట్టి ఒక గ్లాసులో పాయసం పెట్టి ఆ గది తలుపు మాత్రం తెరిచి పెడతారు. ఒకవేళ పిల్లి వచ్చి ఆ ప్రసాదాన్ని ఆరగిస్తే లక్ష్మీదేవి స్వయంగా వచ్చిందని ఆమె దూతగా అనుకొని పిల్లి లక్ష్మీదేవి యొక్క వాహనంగా తలచి ఆ వచ్చే దీపావళి వరకు ఆ సంవత్సరం అంతా సంతోషంగా ఉంటుందని అనుకుంటారు. భారతదేశంలో ఏ రాష్ట్రమైనా సరే దుష్ట శక్తుల భారీ నుండి బయటపడాలంటే దేవుడి శరణంలో వెళ్లాలని అద్భుతమైన ఆధ్యాత్మికం, నమ్మకంతో చేసే పూజలు కోకొల్లలు ప్రేమ, బంధుత్వం భాతృత్వం ఐకమత్యం మానవతా దృక్పథంతో కూడిన మన భారతీయ సమాజాన్ని భారతీయ సంస్కృతిని చాటి చెప్పే పండుగ దీపావళి. నా భాష నా రాజ్యం నా పండుగ అని కూపస్థ మండూక ఆలోచనలను మరచి మన భారత దేశం మన భారతీయ సనాతన సంస్కృతిని చాటిచెప్పి మనమందరము గర్వంగా జరుపు కునే పండుగలలో దీపావళిది అగ్రస్థానం.



రావణ సంహారం

శుభం కరోతి కళ్యాణం ఆరోగ్య ధన సంపదః
శత్రు బుద్ధి వినాశాయ దీపం జ్యోతి నమోస్తుతే

మీ అందరికీ దీపావళి శుభాకాంక్షలు.

ప్రొ. లక్ష్మీ అయ్యర్
జైపూర్, రాజస్థాన్, ఫోన్ : 9680276038

# మనస్సాక్షి

**– పాలకోడేటి సత్యన్నారాయణ రావు**

పాలకోడేటి సత్యన్నారాయణ రావు నాకన్నా మూడేళ్ళు చిన్న. అంటే తన వయస్సిప్పుడు డెబ్భైనాలుగు. మా స్నేహానికి యాభై ఏళ్ళు. అప్పటికే మా పరిచయం నాటికే కొన్ని రచనలు చేశాడు. కథా, నవలా రచయిత. అంతేకాక వివిధ పత్రికలలో టి.వి. ఛానల్స్‌లో పలురకాల రచనలు చెయ్యటమేకాక, వివిధ హోదాల్లో పనిచేశాడు. అసలు ఎ.జి. ఆఫీసు ఉద్యోగి. దానితో ఈ మిగిలిన వ్యాసంగమంతా ఎంతో నేర్పుగా, చాలా శ్రమతో నడుపుకొచ్చాడు. ఈనాడు పత్రికలో 'భూభ్రమణం', జ్ఞాననేత్రం, కంప్యూటర్ చిట్‌చాట్, 'సిరిసిరి కబుర్లు', 'ప్రగతిపథం', అనే శీర్షికలు ఈనాడు ఆదివారం అనుబంధంలో సైన్స్, హెల్త్ వివిధ శీర్షికలు చాలా ఏళ్ళు రాశాడు. 'ఉదయం' వారపత్రిక, 'దిక్సూచి' సైన్స్ మాస పత్రికకి సంపాదకుడిగా ఉన్నాడు. ప్రభుత్వ, ప్రభుత్వేతర పలు పురస్కారాలు పొందాడు. టి.వి.5 ఛానల్‌కి తొలి క్రియేటివ్ డైరక్టర్. 'సితార వారపత్రికలో బాలివుడ్ క్లాసిక్స్ గురించి రాశాడు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ తీసుకున్నాడు. ఇప్పుడు ఈటివి ఛానల్‌లో 'అపురూప చిత్రాలు' 'సినీకథ' కార్యక్రమాలకి కొన్నేళ్ళుగా రచన చేస్తున్నాడు.

తను రాసిన నవలే 'మనస్సాక్షి'. ఆంధ్రప్రభ వారపత్రిక నిర్వహించిన, 1973 ఉగాది నవలల పోటీలో మూడో బహుమతి పొందింది. ఈ పోటీలో మొదటి బహుమతి శ్రీధర 'రాగవిపంచి' రెండో బహుమతి రామవరపు వేణుగోపాలరావు 'పడగమీద మణి' అందుకున్నాయి. రాగవిపంచి పాఠకులని ఆకట్టుకున్న ప్రేమ, కుటుంబ కథ. 'పడగమీద మణి' మంచి శృంగారం ఉన్న నవల. ఇక ఈ మూడో నవల ఎలా ఉంటుందోనని పాఠకులు ఆతృతగా ఎదురు చూశారు. ఈ ఉగాది పోటీకో ప్రత్యేకత ఉంది. ఎక్కువగా రచయిత్రుల నవలలకే పెద్ద పీట వేసిన ఆంధ్రప్రభ, ఆ సంవత్సరం మూడు బహుమతులు మగ రచయితలకే ఇచ్చింది.

'మనస్సాక్షి' చిత్రమైన నవల. ఇది ప్రధానంగా సీత అనే యువతి కథ. సీత పెళ్ళికాకుండానే, నాటకాల రాయుడు సీతాపతి వల్ల గర్భవతి అయింది. సీతగర్భం సంగతి తెలిసి, తల్లీ తండ్రి ఇంటికి రప్పించి, మంత్రసాని ద్వారా కడుపు తీయించారు. అంతేకాదు, మరో పదిరోజుల్లో ప్రభాకరం కిచ్చి పెళ్ళి చేశారు. కార్యం నాడే సీత ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. అతి కష్టంమీద హాస్పిటల్‌లో కోలుకుంది. సీత హాస్పిటల్ మంచం పక్కనే ఉండి ప్రభాకరం ఎంతో అభిమానంగా చూసుకున్నాడు. సీత కోలుకున్నాక, ప్రభాకరంతో కాపరానికి పంపుతున్నారు. ఇక్కడ ఆరంభమైంది 'మనస్సాక్షి' నవల. సీత కాపరం ఏమైంది, అసలు సీత జీవితం ఏరకంగా మారింది అన్న కుతూహలం పాఠకుల్లో సహజం. ఇక్కడ నుంచి రచయిత సీత గత కథ చెప్పాడు. రామారావు, విశాలాక్షి దంపతుల కూతురు. పుట్టిన పిల్లకి 'సీత' అని పేరు పెట్టాలని రామారావు. వద్దు, సీత అంటే అన్నీ కష్టాలు, బాధలే అని ఆయన భార్య. రామారావు వినిపించుకోకుండా సీతనే పేరు పెట్టాడు. విశాలాక్షి అన్నట్టు సీత జీవితంలో చిన్నతనం నుంచీ కష్టాలే. ఆ పేరే మంచిది కాదని, తల్లీ తండ్రీ వాదులాడుకోటం సీత ఎన్నోసార్లు వింది. ఆమెని ఒకరకం నైరాశ్యం, నిర్లిప్తత పట్టుకున్నాయి. తనకెవరు లేరు, తనెవరికీ అఖ్ఖర్లేదన్న ఒంటరి భావనకి బానిసైంది. ఓ రకం మొండితనం అలవాటు చేసుకుంది.

సీత చదువు హైస్కూలుతో ఆగిపోవల్సిందే. ఆమె మాస్టారు పూనుకోటంతో పట్నంలో కాలేజీలో చేర్చారు. హాస్టల్లో మకాం. రూమ్‌మేట్ కావేరి. దగ్గరి స్నేహం క్లారెన్‌తో. క్లారెన్ అనాథ. నాటకాలని వృత్తిగా చేసుకుని, నటిగా సంపాదించుకుంటూ తన చదువుని సాగిస్తోంది. ఆమె వ్యక్తిత్వం సీతకు నచ్చింది. అలా ఆమెకు దగ్గరైంది. ఆమె ద్వారానే నాటకాలకి దగ్గరైంది. రకరకాల నాటకీయ పరిణామాల తర్వాత సీతాపతి ద్వారా గర్భవతైంది.

సీత భర్త ప్రభాకరం గతం సరైంది కాదు. పైకి ఎంతో సౌమ్యంగా ఉన్నా, తాగుబోతు, జులాయి. అతని

గురించి తెలుసుకున్న చాలా సంబంధాలు చెడిపోయాయి. పరస్పర అవసరంతో సీతా, ప్రభాకరం పెళ్ళి జరిగింది. ప్రభాకరంతో సవ్యంగా కాపరం చెయ్యాలనే అనుకుంది సీత. కానీ అలా జరగలేదు. సీతాపతి, ప్రభాకరం క్లోజ్ ఫ్రెండ్. సీతాపతిని అతనే దగ్గరుండి ఇంటికి తీసుకొచ్చాడు. ఆ తర్వాత మరో డ్రామా.

సీతాపతి, సీత గత వ్యవహారమంతా ప్రభాకరానికి తెలిసిపోయింది. సీతని హింసించటం మొదలెట్టాడు. ఆ హింస భరించలేక, కాపరం తెగతెంపులు చేసుకుని చివరికి క్లారెన్ దగ్గరకి చేరింది. తాత్కాలికంగా ఆమె దగ్గర ఉన్నా, ఎవరిమీద ఆధారపడకుండా స్వతంత్రంగా బతకాలని బతగ్గలని సీత దృఢంగా నిశ్చయించుకోటం నవల ముగింపు.

కథలో కొత్తదనం, సీతపాత్ర చిత్రణ, రకరకాల మలుపులు, వీటన్నింటికన్నా, ఆడది... కష్టాలెదురైనా, స్వతంత్రంగా, ధైర్యంగా బతకాలన్న సందేశం, ఆ కాలానికి చాలామందికి నచ్చింది. సీతతో చాలామంది యువతులు ఐడెంటిఫై అయ్యారు. ఆ రకంగా ఈ నవలని పాఠకులు ఆదరించారు. రైటర్స్ వాయిస్ కొంచెం ఎక్కువ. అయినా పాఠకులు పట్టించుకోలేదు.

నవలల పోటీలో మూడు బహుమతులు మగవారికే ఇవ్వటం, అది భిన్నమైన నవలలని పేరు పొందటం ఆ సంవత్సరం ప్రత్యేకత.

వి. రాజా రామమోహన రావు
ఫోన్ : 9394738805

## కొయ్యగుర్రం

ధనజాడ్యంతో రూపుధరించుకొని
అధికారశృంఖలంతో జడత్వాన్ని సాధించుకున్న
కొయ్యగుర్రాన్ని నిత్యమూ ఊరేగిస్తూ
జన స్వామ్యాన్ని కాలరాస్తూ తమ
పబ్బం గుడుపుకుంటున్న మూఢాంధులు
మఠాధిపతులు - ముఠా పిఏస్‌లు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు
ప్రజా తంత్రంగా ఏర్పడ్డ చట్ట సభల్లో
నిత్యమూ జూదక్రీడ సాగిస్తూనే ఉన్నారు...
వస్త్రాపహరణ నీడలు ప్రజాస్వామ్య సూర్యుణ్ణి
కమ్ముతూనే ఉన్నాయి...
కొయ్యగుర్రం ఇనపడెక్కల విలయతాండవం -
భీభత్సపు సకలింపులు దానివి కావు...
దానిని ప్రజల మీద ప్రయోగించే
నియో సమాజానిది - దుష్టసమూహాలవి!
నాగలి మోసే జీసస్,
బుద్ధుని వదలివచ్చిన కంటక కంటినీరు,
ప్రజాస్వామ్యానికి ప్రతీకలే.
రాజ్యాంగం సాక్షిగా హత్యలు చేస్తున్న ఎయిర్ గన్‌లు
ఉత్సవ విగ్రహాలు!
ఈ కొయ్య గుర్రపు మోసపు ఆనవాళ్లు -
ట్రాయ్‌ని నిప్పులు పాలు చేసిన ట్రోజెన్ హార్స్
ఉదరంలోనే దాగి ఉన్నాయి.
ఉదారత వేరు - ఉదాశీనత వేరు.
లక్ష్యం వేరు - నిర్లక్ష్యం వేరు.
ఈ వేరులన్నీ




చెక్క గుర్రపు ఇనుపనాడాల్లోంచి మొలచినవే....
ఏం చేద్దాం? అజంతా గుహల్లోకి నిజంగా
వెళ్లిపోదామా?
రావణ కాష్టం నుంచి నిప్పు తెద్దామా?

# గ్రామ నామానురక్తికి మేలిమి అభివ్యక్తి

**– జంధ్యాల శరత్‌బాబు**




గ్రామనామాలు. ఇదీ పుస్తకం పేరు. వాండ్రంగి కొండలరావు. దీని రచయిత. గ్రామం అంటే ఊరు, సమూహం, కదంబం, బృందం అనే అర్థాలు ఉన్నాయి. ఒక గ్రామం గురించి రాస్తున్నారంటే – సామూహిక బృంద వివరాలన్నీ అందిస్తున్నట్లు. నామం అనేది లక్ష్యం, లక్షణం, సంకేతం, సంభావన. గ్రామ నామ సమాచారం చెప్తున్నారంటే – నామధేయం పేరిట సమస్తాన్నీ విశదీకరిస్తున్నట్లు. ఇంతటి బాధ్యతను, భారాన్ని నమంగా భరినన్తూ రాని చదువరులందరికీ ప్రసాదించిన పరిశోధక మేరువు మన కొండలరావు మాస్టారు. మేరుపర్వతం వంటి జిజ్ఞాస ఆయనది. నిత్య యౌవనానికి కారణమూ అదే!

ఎంత జిజ్ఞాస లేకపోతే తాను ఇటువంటి రచనలు చేస్తారు? పల్లెలు ఆ చేతిలో మల్లెలయ్యాయి, బస్తీలైతే బంతి పూలలా మారాయి. పేరు, ఊరు... ఈ రెండూ ఎవరికైనా ప్రాణప్రదాలే. ప్రథమంగా, ప్రధానంగా వారు ప్రేమించేదీ ఈ రెండింటినే. అందుకే 'ఊరికి ఆ పేరు ఎలా వచ్చింది' అంటూ అధ్యయనం, పరిశీలన, శోధన సాగించి ఫలితాన్ని సాధించి మరీ అక్షరరూపమిచ్చారు మాస్టారుగారు. తన నాదం, తనదైన జీవన వేదం 'ఊరు'. మనందరికీ తెలుసు – సదా కొత్తదనానికి పరితపించే పత్రికారంగ ప్రసిద్ధులు కాబట్టే, మునుపు 'ఊరు–పేరు' పుస్తకాన్ని తానే వెలువరించారు. ఆంధ్రప్రదేశ్ లోని ఎన్నెన్నో గ్రామాల చారిత్రకతను తన కలం బలంతో సుసంపన్నం చేశారు. 'నీ పేరేమిటి' అంటే చెప్తాం. ఊరి పేరునూ సగర్వంగా చాటుతాం. 'మరి మీ ఊరికి ఆ పేరు ఎలా వచ్చింది' అని అడిగితే మాత్రం, కాస్తంత తటపటాయిస్తాం. అదిగో ఆ తరహా తటపటాయింపులకు ఎటువంటి చోటూ ఇవ్వకుండా ఊరి చరిత్రను పదిమందికీ చెప్పగలిగేంత పరిజ్ఞానాన్ని మనకు కలిగించారు వాండ్రంగివారు. ఎంతైనా నామ విజ్ఞానవేత్త కనుక మొదట తాను తెలుసుకొని ఆ తర్వాత మనందరికీ తెలిపి ఎంత సహాయం చేశారంటే, అక్షరాలా కొండంత ! కొండలరావు మాస్టారుగారూ! మీరు వెల్లడించిన వివరాల్లో చరిత్రతో పాటు సంస్కృతి, భాషాభిమానం, ప్రతిభాసంపత్తి అన్నీ కలగలిసి ఉన్నాయి. పర్యవసానంగా, తెలుగు ప్రాంతాలకు తోడు దేశవిదేశాల్లో ఉన్న తెలుగు వారందరికీ మీ పరిశోధక కావ్యాలు ఆదరణీయాలుగా నిలుస్తున్నాయి ఈ నాటికీ. కావ్యం అనడానికి కారణం... ప్రతీ వ్యక్తికీ ఆనందం పెంచే, సంశయ నివారణ చేసే, సమగ్రతను విస్తరించే రచనల్ని మీరు వెలయించడం! సామాన్యమైన పనేనా? ఒక ఊరి పూర్వాపరాలు తెలుసుకోవడం. నాటి గ్రంథాలను పరిశీలించాలి, మేటి వ్యక్తుల నుంచి నిర్ధారణ చేసుకోవాలి, 'ఇలా కాదు, అలా' అనే మాట ఎదురవకుండా సంపూర్ణ ప్రామాణికతను అనుసరించాలి. పూర్వాన్ని ప్రస్తుతంలోకి తేవడానికి అన్ని విధాలుగానూ పరిశ్రమించాలి. మాటలతో కాదు, చేతల ద్వారా ఊరి నామాన్ని సుస్థిరపరచాలి. వీటన్నింటినీ చాలా ఇష్టంగా, ఆసక్తి పూర్వకంగా, శక్తి పూరితంగా చేసినందుకే మీకు అందరి అక్షరాభినందన, గౌరవ భరిత సమర్పణ. ఎన్నెన్నో ఊళ్లకి వెళ్లివచ్చారు. ఎందరెందరితోనో ముచ్చటించారు. సమీకరణ కృషికి శాస్త్రీయతను దీటుగా జోడించారు. ఈ పెద్ద వయసులో ఇంత యువ మనసు మీకెలా లభించిందో మాకైతే తెలియదు. మా అందరికీ తెలిసింది ఒక్కటే... బోధన, శోధన, సాధనలే మీ ఆరోగ్య రహస్యాలని! అనుకున్నది సాధించేదాకా మీరు విశ్రమించరని! విశాఖలో ఎప్పుడో ఏడేళ్ల క్రితమే 'వ్యక్తి నామ విజ్ఞానం' శీర్షికన విహంగ వీక్షణం సాగించిన సదానుభవశీలత మీదని! స్ఫూర్తి దీప్తి దాయకం అనీ!

అదే సందర్భంలో మీరే అన్నట్లు, నామకరణం అత్యంత కీలకం. జీవితంలో అంతకు మించి మరేదీ లేదు, ఉండదు. వీటి మూలంగానే గ్రామనామాల మీద పరిపూర్ణంగా శక్తియుక్తులన్నింటినీ కేంద్రీకరించారు. ముఖచిత్రంలో 'తెలుగురావుపాలెం' కనిపిస్తుంది, ఊరికి ఆ పేరు ఎలా ఎందుకు వచ్చిందన్న ఉత్సుకతను అంతటా రగిలిస్తుంది. రచన, సేకరణ అన్నారు కానీ విశదీకరణ అని రాస్తే మరింత శోభించేది. స్థల నామ విజ్ఞాన క్రోడీకరణ అంతటి శక్తివంతం, యుక్తిమయం. నాటిని నేటిని సమన్వయించాలన్నా, అనుదినానుబంధాన్ని అక్షరీకరించాలన్నా, పేర్ల – పదాల సామీప్యతను ప్రస్ఫుటీకరించాలన్నా ఓర్పు నేర్పులు అత్యవసరాలు. వీటిని

పుణికిపుచ్చుకున్న యోధుడిగా మీరు చిర యశస్సుకు పర్యాయపదమై నిలిచారు, గెలిచారు. ఆంధ్రదేశాన ఉన్న వేలాది గ్రామాల నామాల శోధన యజ్ఞం ధన్యుడిని చేసింది. జాతీయ సంస్కృతికి నిలువుటద్దం పట్టి, 'అహో' అనిపించింది అందరితోనూ. గ్రామ నామాలను చదువుతుంటే - మేఘవరం అందుతుంది. కిన్నెరవాడ కనువిందు చేస్తుంది. జమ్మి కాలక్రమంలో జమ్ముగా మారిన వైనం అంతుపడుతుంది. చోద్యం అనే గ్రామం ఉందన్న సంగతీ బోధపడుతుంది. జిల్లెళ్లమూడిని తలపించే తంగెళ్లమూడి సాక్షాత్కరిస్తుంది. గుండ్లమడుగు తిమ్మసముద్రం ఎలా అయిందో తెలియవస్తుంది. తెలుగురాయపురం ఎక్కడ నెలకొందో కానవస్తుంది. నాడు కలిమి గుడులు నేడు కొలిమి గుండ్లు (గుండ్ల) ఎందుకైందో అవగతమవుతుంది. సేకర్త వాంఛ్రంగిలోని వందలాది రచనా కర్తృత్వం, ఉపన్యాస చాతుర్యం, వేలకొద్దీ పుస్తకాల ప్రియత్వం, మాతృ భాషాభిమాన అగ్రగామిత్వం సాటి లేనివి, దీటు రానివి. తెలుగు ప్రేమికులు ప్రతి ఒక్కరూ కొని చదివి తీరాల్సిన పుస్తక రాజం 'గ్రామనామాలు'. మాస్టారూ! మీకు జేజేలు. మీ సేవకు నమస్సుమాలు.

జంధ్యాల శరత్‌బాబు
అరసవల్లి, ఫోన్ :99483 45013
ప్రతులకు : 9490528730

---

## నిర్మల్ బొమ్మలు, చిత్రకళ

*- పంతంగి శ్రీనివాస రావు.*

నిర్మల్..గతంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో వున్న సుమారు లక్ష జనాభా కలిగిన ఈ పట్టణం, తెలంగాణా జిల్లాల పునర్విభజనలో నిర్మల్ జిల్లాగా 2016 అక్టోబర్, 11 నుంచి పరిగణింప బడుతోంది. ఈ పట్టణం కొయ్యబొమ్మల తయారీకి, పెయింటింగ్స్ కు అంతర్జాతీయ ఖ్యాతి గడించింది. ఈ పరిశ్రమ కార్మికులను 'నక్కాష్' కళాకారులుగా పరిగణిస్తారు. ఒక విధమైన ప్రత్యేక 'పానికర్ర' తో ఈ కొయ్యబొమ్మలను తయారు చేస్తారు. ఆ తర్వాత చింతగింజల పిండితో తయారు చేసిన జిగురుతో విడిగా చేసిన భాగాలను అతికిస్తారు. నిర్మల్ సంస్థానాన్ని పరిపాలించిన నిమ్మనాయుడు దేశం నలుమూలల నుంచి కళాకారులను రప్పించి చేతి కళలను అభివృద్ధి పరిచాడు. ఈ విధంగా నిర్మల్ లో 17వ శతాబ్దం నుండి కొయ్యబొమ్మల పరిశ్రమ అభివృద్ధి చెందుతోంది. 1830లో యాత్రా చరిత్రకారుడు 'ఏనుగుల వీరాస్వామయ్య' నిర్మల్ బొమ్మల గురించి ఒక గ్రంథంలో ప్రస్తావించారు. నిర్మల్ కళ కాకతీయ రాజవంశం నుంచే అభివృద్ధి పథంలో పయనించడం మొదలు పెట్టింది అని చెప్పాలి. ఇక్కడ, 1955 లో నిర్మల్ కొయ్యబొమ్మల సహకార సంస్థను ఏర్పరచారు. ఈ కళ రాష్ట్రపతి అవార్డ్‌కు నోచుకుంది. మేము కుంతాల' జలపాత సందర్శనకు వెళ్ళినప్పుడు, మార్గమధ్యంలో ఆగి, కొయ్యబొమ్మల, పెయింటింగ్స్ ఎంపోరియంను చూడటమే కాకుండా, వర్క్ షాప్‌ను, అందులో పనిచేసే కళాకారుల ఓపికను, వారి పనితనాన్ని గమనించి మెచ్చుకోకుండా ఉండలేక పోయాము. నిర్మల్ కొయ్యబొమ్మల తయారీకే కాకుండా,



పెయింటింగ్స్ కళకు కూడా ప్రఖ్యాతి చెందింది. నిర్మల్ పెయింటింగ్స్ అంటే అంతర్జాతీయంగా కూడా ఖ్యాతినే! సంప్రదాయ పెయింటింగ్స్‌కు 400 సం.ల చరిత్ర ఉంది. చెక్క ఉపరితలాన్ని 'లక్క' చేసి, దానిపై ఖచ్చితమైన డిజైన్‌ను పెయింట్ చేస్తారు. వాటర్ పెయింట్, ఎనామిల్ కలర్ ను ఉపయోగిస్తారు. అందమైన ఈ పెయింటింగ్స్ గృహాల్లో ఉంటే ఎంతో శోభ కలుగుతుంది. ఎంత ధరకయినా, నచ్చిన పెయింటింగ్‌ను కొనుగోలు చేయాలని పిస్తుంది. సంవత్సరానికి 40 లక్షలకు పైగా అమ్మకాలు జరుగుతాయి. ఈ పరిశ్రమ ఎందరో కళాకారులకు ఉపాధి కలిగిస్తోంది. హైదరాబాద్ లోని 'లేపాక్షి ఎంపోరియం' ద్వారా ఈ కొయ్య బొమ్మలు, పెయింటింగ్స్ కళాకృతులు అంతర్జాతీయంగా అనేక దేశాలకు ఎగుమతులు జరుగుతాయి. ఈ బొమ్మల ఆధారంగా తెలుగులో 'రాధాకృష్ణ' పేరుతో చలన చిత్రం నిర్మించ బడింది. ఈ నిర్మల్ కళాకృతులు 'అమెజాన్' ద్వారా కూడా లభ్యమవుతాయి. ప్రతి ఇంటినీ అందంగా మలచు కోవాలంటే కనీసం రెండు, మూడు నిర్మల్ కొయ్యబొమ్మలు, పెయింటింగ్స్ అలంకరించు కోవాలి ఈ కళాకారుల చేతి ద్వారా రూపు దిద్దుకున్న ఈ కళాకృతులు చూపరులను విస్మయ పరుస్తాయి.

పంతంగి శ్రీనివాస రావు,
హైదరాబాద్. ఫోన్: 9182203351.

# తాళ్లపాకను సందర్శించిన సాళువ నరసింహరాయలు

*– గూడూరు యానాదిరాజు*

విజయనగర సామ్రాజ్య పాలకవంశాలైన సంగమ, సాళువ, తుళువ, ఆరవీటి వంశాలలో నరసింహరాయలు సాళువ వంశానికి చెందినవాడు. నరసింహరాయలు పూర్వుల్లో కొందరికి కటారి సాళువ, ప్రతిపక్ష సాళువ అనే బిరుదులున్నాయి. ఈ బిరుదు నామం వంశ నామం అయింది. సాళువ నరసింహరాయలు శ్రీవేంకటేశ్వరస్వామి భక్తుడు. అన్నమయ్య తల్లిదండ్రులు నారాయణ సూరి, లక్కమాంబ సొంతూరు తాళ్లపాక గ్రామంలో నివసించారు. ఇంటిలో తల్లి సంగీతం, తండ్రి పాండిత్య ఛాయలలో అన్నమయ్య పెరిగాడు. అందువల్ల అన్నమయ్య బాల్యంలోనే అన్ని విద్యలు అభ్యసించగలిగాడు. అన్నమయ్య ఆడిన మాటెల్లా అమృత కావ్యంగా, పాడిన పాటెల్ల పరమ గానంగా భాసించేది. శ్రీవేంకటేశ్వరస్వామి మీద భక్తితో, ప్రపత్తితో సంకీర్తనలు ఆలపించేవాడు. చిన్నతనం నుండి అన్నమయ్యకు వాక్శుద్ధి కలిగి ఆయన మాటలకు దివ్యత్వమబ్బింది.

అన్నమయ్య వంశీయులు తరతరాలుగా తాళ్లపాకలో కొలువైవున్న చెన్నకేశవస్వామిని సేవించి, తరించారు. అన్నమయ్య ఆ స్వామిని కీర్తిస్తూ ఆలపించే కీర్తనలను విని తాళ్లపాక ప్రజలు బాగుబాగని ఆయన గానాన్ని మెచ్చుకుంటూ ఆనందించేవారు. తాళ్లపాకకు సమీపంలోనే టంగుటూరు ఉంది. ఈ రెండు ఊర్లు కూడా బాహుదానది ఒడ్డున ఉన్నాయి. ఈ ప్రాంతమంతా ఆనాడు పొత్తపినాటి సీమగా ప్రసిద్ధికెక్కింది. అన్నమయ్య కాలంలోనే ఈ ప్రాంతమంతా విజయనగర సామ్రాజ్యంలో భాగమై సంగమవంశపాలకుల పాలనతో ఉంది. వీరి పాలనలో పరాక్రమవంతులైన సాళువ వంశీయులు దండనాథులుగా సేనాపతులుగా, సామంతులుగా ఉన్నారు. అలా సంగమ వంశమునకు దండనాథుడుగా సాళువ నరసింహరాయలు టంగుటూరును కేంద్రంగా చేసుకొని పాలన చేశాడు. శ్రీ వేంకటేశ్వరస్వామిని కొలుస్తూ, సంకీర్తిస్తూ ఉండడం వల్ల తన దివ్యవాక్కులతో అన్నమయ్య ఎన్నోమార్లు, ఎందరినో ఆశీర్వదించి వాళ్లను కృతార్థులను చేసినట్లుంది. అందువల్ల అన్నమయ్య అంటే నరసింహరాయలకు భక్తి గౌరవ మర్యాదలు ఏర్పడి ఉంటాయి. ఆ రోజుల్లో తిరువీధులలో, పురవీధులలో అన్నమయ్య పాడుతూ ఉండిన సంకీర్తనల జగన్మోహనత్వానికి పరవశుడై ఉంటాడు నరసింహ రాయలు. ఆ సమయంలోనే సమవయస్కుడైన అన్నమయ్యతో రాయలకు పరిచయం ఏర్పడి స్నేహంగా మారింది. సాళువ నరసింహరాయలకు మొదటినుండి కవులన్నా, సాహిత్యమన్నా, కళలన్నా ప్రీతి. స్వయంగా ఆయన కవి కూడా. అందువల్ల రాయలు కవులను, పండితులను ఆదరించాడు. అన్నమయ్య రామాయణ కథను పాటలుగా పాడి వినిపించేవాడు. ఆయన గానం ప్రజలను ఆనందపరవశులను చేస్తుందన్న వృత్తాంతం చాల రోజులుగా విని రాయలు ఆయనను కలుసుకోవాలి అనుకున్నాడు. ఆ విషయాన్ని చిన్నన్న రచించిన అన్నమాచార్య చరిత్ర ద్విపదలల్లో 'నాళీక బాంధవాన్వయుడ జేయుండు / సాళువ నరసింహ జనపాలు డొకడు / పరివార వాద్య సంభ్రమము రెట్టింప / గరవొప్ప జేకానికలు గొనివచ్చి / యా తాళ్లపాకాన్నమయ్యకు సాగి / చేతులు మొగిచి మచ్చిక బూజచేసి' అని చెప్పేడు.

రాజపరివారం వెంటరాగా విలువైన కానుకలు తీసుకొని సాళువ నరసింహరాయలు తాళ్లపాకకు బయలుదేరినాడు. నరసింహరాయలు వస్తున్నాడన్న విషయం చాటడానికన్నట్లు వివిధరకాల వాద్యాలు మ్రోగిస్తూ తాళ్లపాకలో ప్రవేశించాడు. ఆ వాద్యాల ధ్వనులు మిన్నుమిట్టుతున్నాయి. తాళ్లపాకలో అన్నమయ్య నివాసమునకు వెళ్లి గౌరవ పురస్సరంగా నమస్కారం చేశాడు. అన్నమయ్య ఆశీస్సులు పొందాడు. ఆ తరువాత అన్నమయ్యను టంగుటూరు పిలుచుకొని వెళ్లడానికి విన్నపం చేస్తూ రాయలు ఇలా అన్నాడు. 'శ్రీకృష్ణ మన్నన గ్రీడి భూచక్ర / మేకచక్రంబుగా నేలిన పగిది / నాలాగు మీ సహాయము నాకు గలుగ / నేలుదుధరయెల్ల నేకచక్రముగ / అని చిన్నన్న ద్విపదలు రాయడం... ఎలా

ఉందంటే... శ్రీకృష్ణుని సహాయంతో అర్జునుడు భూమిని పాలించాడని చెప్పినట్లుంది. కానీ భారతంలో భూమిని పాలించింది ధర్మంరాజు. అర్జునుని పరాక్రమంతోనే ధర్మరాజు రాజ్యాన్ని సాధించాడన్న ఉద్దేశం యిందులో దాగి ఉన్నట్లు భావించవచ్చు. ధర్మరాజుకు అర్జునుడితో సహా మిగిలిన సోదరులు విధేయులైనట్లు అప్పటి విజయనగర సామ్రాజ్యంలో సంగమవంశమునకు విధేయులుగా దండనాయకులుగా, సామంతులుగా సాళువ వంశస్థులు రాజ్యపాలనలో భాగస్వాములై ఉన్నారు.

కావున భారతంలో అర్జునుడిలా సాళువ నరసింహరాయలు విజయనగర సామ్రాజ్యంలో ప్రధాన భూమికను పోషించాడని అర్థం చేసుకొంటే సరిపోతుంది. నరసింహరాయలకు భారతం ఇష్టమైన గ్రంథం. అందుకే ఇతని ఆస్థానకవి పిల్లలమర్రి పినవీరభద్రుడు జైమిని భారతం రచించి రాయలకు అంకితం యిచ్చాడు. సాళువ నరసింహరాయలది అర్జునుని పరాక్రమం వంటి పరాక్రమమని జైమిని భారతం సాళువాభ్యుదయంలో వర్ణించబడింది.

విజయనగర చరిత్రలో నరసింహరాయలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. సాళువ నరసింహరాయలు 'పరిపంథి బలముల'ను ఓడించినట్లు చిన్నన్న చెప్పడంలో ఆనాటి దండయాత్రలు స్ఫురిస్తున్నాయి. అటు గజపతులు, ఇటు బహమనీ సుల్తానుల దండయాత్రలను నిలువరించి, శత్రు సేనలను తరిమి కొట్టిన పరాక్రమవంతుడు నరసింహరాయలు. అందుకే కాబోలు చిన్నన్న ఈ రాజును 'రాచమూకలలో పరాక్రమశాలి' అన్నాడు. సమకాలీన దేశరాజకీయ చరిత్ర కూడా ఈ విషయానికి బలం చేకూర్చింది. సాళువ నరసింహరాయలు – అన్నమయ్య ముందు యిలా అన్నాడు. నా బలానికి మీ ఆశీస్సులు, సహాయం తోడైతే నేను కూడా ఈ భూమి నంతటిని ఏకచక్రంగా ఏలుతాను. నన్ను అనుగ్రహించి, నా మనవిని ఆలకించి టంగుటూరికి దయచేయండి. మాకు అవసరమైన నీతులు బోధించండి. మా సపర్యలు స్వీకరించండి. మమ్మల్ని రక్షించండి అని కోరిన మీదట... అన్నమయ్యకు గీత... పురుషోత్తమ ప్రాప్తి యోగములో శ్రీకృష్ణుడు గావించిన ఉపదేశము స్ఫురించినట్లుంది. వెంటనే... 'అని యానతిచ్చె గృష్ణుడర్జునితో / వినియాతని భజించు వివేకమా / భూమిలోను చొచ్చి సర్వభూత ప్రాణులనెల్ల /దీమసాననే మోచేటి దేవుడ నేను' అంటూ కీర్తన ఆలపించాడు. అలా శ్రీవేంకటేశ్వర స్వామిపై భక్తిని ప్రకటిస్తూ, స్వామి తత్త్వం, గీత పరమార్థం ఎలా ఉంటుందో స్పష్టం చేశాడు అన్నమయ్య. అందుకు కారణం భూమి యందలి ఆధారకత్వశక్తి భగవంతునిదే అని భగవద్గీతలో చెప్పబడి ఉండుటయే. సాళువ నరసింహరాయలది సహజ వైష్ణవ భక్తి. అప్పటికే వైష్ణవ మత ప్రచారమధికమై ప్రభువుల కడనుండి ప్రజాబాహుళ్యము వరకును, కవులు మొదలుకొని గాయకుల వరకును సర్వత్ర వైష్ణవ ప్రభావం వ్యాప్తిచెందింది. దానికి తిరుమల వేంకటేశ్వరుని దివ్య ప్రభావమును, తాళ్లపాక కవుల భక్తి ప్రపత్తులును మూలమై నిలిచినవి. వైష్ణవ భక్తి గల రాయలతో స్నేహం చేయడం తప్పు కాదని భావించాడన్నమయ్య. సాళువ నరసింహ రాయలు ఏర్పాటు చేసిన పల్లకీలో ఎక్కి, రాయలు సేవిస్తూ వెంట రాగా అన్నమయ్య టంగుటూరు వెళ్లాడు. టంగుటూరులో ఉన్న చెన్నకేశవస్వామిని దర్శించి పూజించాడు. రాయలు ఏర్పాటు చేయించిన రాజభవనంలో అన్నమయ్య విడిది చేశాడు. ఆనాటి నుండి రాయలు ప్రతిరోజు ఎలాంటి భేదభావం లేకుండా అన్నమయ్యతో చనువు గల్గి మెలగుతూ ఆలోచనలు పంచుకుంటున్నాడు. రాయలకు మేలుగోరే హితుడు, ఉపదేశం చేయగల గురువు అన్నమయ్య అన్న విశ్వాసంతో రాయలు ప్రవర్తించ సాగాడు. అలా తాళ్లపాక అన్నమయ్య ఆశీర్వాదంతో రాయలు అభ్యుదయం పొందుతూ ఉన్నాడు.

విజయనగర సామ్రాజ్యం సంగం వంశ పాలన చివరిదశలో దేశం సుస్థిరతకు భంగం వాటిల్లినది. ఈ సందర్భంలో సాళువ నరసింహరాయలు సామ్రాజ్య ప్రతిష్ట కాపాడవలసిన చారిత్రక అవసరం ఏర్పడింది. ఉన్నట్టుండి ఇంత పెద్ద బాధ్యత నెత్తిమీద పడడంతో దైవసహాయం, అన్నమయ్య ఆశీర్వాదం రాయలకు అవసరమయ్యాయి.

సంకీర్తనాచార్యుడుగా, వేంకటేశ్వర స్వామి పరమ భక్తుడుగా పేరు ప్రతిష్టలున్న అన్నమయ్య ఆశీర్వాదానికి దివ్యత్వముంటుందని విశ్వసించి రాయలు ఆయన దీవెనలు కోరాడు. వేంకటేశ్వర స్వామి కృపతో అన్నమాచార్య ఆశీస్సులు పొందిన నరసింహరాయలు విజయనగర సామ్రాజ్యానికి అధిపతి కాగలిగాడు. సాళు వ నరసింహరాయలు పెనుగొండ కేంద్రంగా తన సేనాని తుళువ నరసనాయకుని సహాయంతో విజయనగర సామ్రాజ్యాన్ని క్రీ.శ.1485-1491 వరకు సమర్థవంతంగా పరిపాలించాడు.

గూడూరు యానాదిరాజు
షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, సెల్‌నెం : 9701857260

# సీరపాణి 'ప్రకృతి సందేశం'

– పిళ్లా తిరుపతిరావు



భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం అనే ఈ ఐదింటిని పంచభూతాలు అంటాం. వీటి సమాహార రూపమే ప్రకృతి. సృష్టిలోని ప్రతి వస్తువూ పంచభూతాత్మకమైనదే. మానవుడు పంచభూతాల చేత నిర్మింప బడిన ఒకానొక ఆకృతి మాత్రమే. పంచభూతాత్మకంగా సృష్టింపబడి, వాటి చేతనే వృద్ధి చెంది, పరిమిత కాలం జీవనం సాగించి, మళ్లీ ఆ పంచభూతాల చేతనే క్రమేణ కృశించి మరణిస్తాడు. కాల గమనంలో మానవ జీవితం చాలా స్వల్పమైనది. అందుకే బుధులు జీవనం బుద్బుదప్రాయం అన్నారు. అంటే నీటి బుడగ వంటిదని అర్థం. ప్రకృతికి సంక్షిప్త రూపంగా పుట్టిన మానవుడు ప్రకృతి నుండి బలాన్ని పుంజుకొని శక్తిమంతుడౌవుతాడు. అయితే అంతటితో ఆగక ఆ ప్రకృతి రహస్యాలను తెలుసుకోవడానికి నిరంతరం పరిశోధిస్తాడు. అలా పరిశోధిస్తూ ప్రకృతి శక్తుల్ని తన వశం చేసుకునేందుకు విశేషంగా ప్రయత్నిస్తాడు. అంతేకాక సాధ్యపడితే చివరకు ప్రకృతి పై విజయాన్ని సాధించడానికి కూడా సిద్ధపడతాడు. అదే ఈనాటి విజ్ఞాన శాస్త్ర పురోగతి–నూతన ఆవిష్కరణలూను. అయితే ఈ పురోగతి ఒకనాటిది కాదు. యుగయుగాలుగా, తరతరాలుగా ఆదిమ మానవ దశ నుండి నాగరిక మానవుని దశ వరకు సాగుతున్న నిరంతర జీవన విజ్ఞాన యాత్ర. ఈ విషయాన్ని ప్రముఖ అభ్యుదయ కవి సీరపాణి 'ప్రకృతి సందేశం' గేయ కవిత ద్వారా అద్భుతంగా ఆవిష్కరిస్తారు.

*'ఏమన్నది? ఏమన్నది? / ప్రకృతి మాత ఏమన్నది?*
*యుగయుగాల నాదు / తపః ఫలమే మానవు డన్నది'*

ప్రకృతి నుండి పుట్టి ప్రకృతి వల్ల పెరిగిన మానవుడికి ప్రకృతి తల్లి ఔతుంది కదా! అందుచేతనే కవి 'ప్రకృతి మాత' అన్నాడు. ఆ తల్లి ఏమంటున్నదంటే, యుగయుగాలుగా తాను చేసిన తపస్సుకు ఫలితమే మానవుడు అంటున్నది. అంటే మానవుడు ఆటవిక జానపద దశలను దాటుకుని నాగరిక దశకు వచ్చాడు. అలా రావడానికి ఎన్నో యుగాలు పట్టింది కదా! అందుకే ప్రకృతి మాత మనిషిని తన యుగయుగాల తపఃఫలం అన్నది. అక్కడితో ఆగిపోలేదు.

*'అంతర్యం అంతులేని అంభోనిధి ఏమన్నది?*
*నాకంటే నరుని గుండె పరశ్శతము లోతన్నది'*

ఒక స్వల్ప కాలికమైన జీవపరిణామం కలిగిన మానవుణ్ణి ప్రకృతి శక్తుల కంటే అతీతమైన వానిగా చెప్పబోతున్నాడు కవి. పంచభూతాలలో నీరు ఒకటి కదా! లోతు తెలియని సముద్రం ఏమంటున్నదంటే, నాకంటే మనిషి అంతరంగం వంద రెట్లు లోతైనది అంటోందట. అంటే ప్రయత్నిస్తే సముద్రం లోతు తెలుసుకోవచ్చును. కానీ ఎంత ప్రయత్నించినా మనిషి మనసులో ఏముందో తెలుసుకోలేము కదా!

*అంబరమును చుంబించే / ఆ హిమగిరి ఏమన్నది?*
*నాకంటే ఉన్నతాలు / నరుని ఆశయాలన్నది'*

పంచభూతాల్లో భూమి ఒకటి. ఆకాశాన్ని తాకుతున్న హిమాలయ పర్వతం ఏమంటున్నదంటే, నాకంటే నరుని ఆశయాలే ఉన్నతమైనవి అని. పర్వతం ఎత్తు కొలిచి తెలుసుకోవచ్చు. కానీ మనిషి ఆశయాల ఔన్నత్యం తెలుసుకోలేమని భావం.

*'గహన జాల దహన శీలి / దావానల మేమన్నది?*
*నాకంటే పదునైనది / నర కోపానల మన్నది'*

పంచభూతాలలో అగ్ని కూడా ఒకటి. దావానలం అంటే అడవిలో పుట్టే కార్చిచ్చు. గహనజాలం అంటే అడవుల సమూహం. ఒక్కొక్కసారి ప్రపంచంలోని ఒక్కొక్క దేశంలోని అరణ్య ప్రాంతంలో కార్చిచ్చు అంటుకుంటే వందల కిలోమీటర్ల విస్తీర్ణం వరకు అడవులు భస్మీపటలం కావడం మనం ఎరిగిన విషయమే. ఉదాహరణకు అమెజాన్ అడవుల్లో పుట్టే కార్చిచ్చు ప్రపంచానికే కాలుష్య కారకమౌతున్నది కదా! అంతటి భయంకరమైన కార్చిచ్చు ఏమంటోందంటే, మనిషి కోపాగ్ని నాకంటే ప్రమాదకరం అంటోంది. అంటే నేను ప్రకోపిస్తే అడవులను మాత్రమే తగలబెడతాను. కానీ మనిషికి కోపం వస్తే యుద్ధాల పేరుతో దేశాలకు దేశాలనే దగ్ధం చేస్తాడని భావం.

*'శరవేగమ్మున గమించు / ఝుంఝూనిల మేమన్నది?*
*నాకంటే శీఘ్రగామి / నరుని మనస్సే నన్నది'*

గాలి కూడా పంచభూతాలలో ఒకటి. 'ఝుంఝు' అంటే తుఫాను. తుఫాను గాలిని ఝుంఝూమారుతం అంటాం. ఆ ఝుంఝూమారుతం ఏమంటోందంటే, నరుని మనస్సు నాకంటే వేగవంతమైనది అని. అంటే మనం ఉన్న చోట నుండి మరో దేశం లోని ఒక ప్రాంతాన్ని ఒక సెకెను కాలములో మనస్సు ద్వారా సందర్శించవచ్చు. అంటే వాయువేగం కంటే మనోవేగం గొప్పదని భావం.

*'చల్లని వెన్నెల కురిసే / చందమామ ఏమన్నది?*
*నాకంటే చల్లనిది / నరుని మమతయే నన్నది'*

పసిపాపలను సైతం ఆనందములోనూ, ఆహ్లాదము లోనూ ముంచి వేసే చల్లని కౌముదిని కురిపించే చందమామ కూడా మనిషి మమత నాకంటే చల్లనిది అని మనిషి ఆధిక్యతను ఒప్పుకుంటోంది.

*'భువనమ్ముల వెలుగు నింపు / రవి మండల మేమన్నది?*
*నాకంటే నరుడు నయం / జ్ఞాన కిరణ్మయు డన్నది'*

లోకాన్నంతటినీ తన ప్రకాశంతో తేజోవంతం చేసే సూర్యుడు సైతం తనకంటే మనిషి గొప్పవాడని ప్రశంసిస్తున్నాడు. ఎలా? నావి వేడి వెలుతురు గల కిరణాలు మాత్రమే. మనిషివి విజ్ఞాన కిరణాలు. జ్ఞానం కంటే గొప్పది మరొకటి ఏదీ లేదని భగవద్గీత చెబుతోంది కదా! పంచభూతాల కంటే మానవుడు శక్తిమంతుడని కవి నేరుగా చెప్పడం లేదు. ఆయా ప్రకృతి శక్తుల చేతనే ఒప్పించి చెప్పిస్తున్నాడు. ఈ 'ప్రకృతి సందేశం' గేయం కేవలం కవిత్వమే ప్రయోజనంగా కలిగింది కాదు. ఇది కవిత్వం స్థాయిని మించి ప్రకృతిలో మానవుని యొక్క మహోన్నత స్థానాన్ని గుర్తింపజేసే గొప్ప పరిశోధన వంటిది. సాధారణంగా ఆధునిక కవులు చాలా మంది పాశ్చాత్య కవిత్వాన్ని ముఖ్యంగా ఆంగ్ల కవిత్వాన్ని చదివి ఎంతో కొంత దాని ప్రభావానికి లోనై రాసినవారే. సీరపాణి విషయంలో అలా కనబడదు. ఈయన ఓరియంటల్ కాలేజీ విద్యార్థి. సంస్కృతాంధ్రాలు చదువుతున్న రోజుల్లో రాసిందే ఈ కవిత. ఇది 1971 అక్టోబర్ లో అంటే, భాషాప్రవీణ ప్రిలిమినరీ చదువుతున్న రోజుల్లో రాసినది. అంటే అప్పటికి తనకు 22 సంవత్సరాల వయస్సు మాత్రమే. కవి ఏ ఇతర భాషా కవిత్వాల ప్రభావం లేకుండానే ఒరిజినల్ గా ఇంతటి మహోన్నత భావాలు రాయగలగడం ప్రశంసనీయం. ఈ కవిత సీరపాణి రచించిన 'డమరుధ్వని' కవితా సంపుటలోనిది. ఇందులో అభ్యుదయ దృక్పథంతో కూడిన కవితలే ఎక్కువగా ఉన్నప్పటికీ, 'కాలం, జీవన .వసంతం, ఆకలి, స్వాతివాన' వంటి ఎక్కువగా ఎవరూ స్పృశించని అంశాలు గల రచనలు కొన్ని ఉన్నాయి. ఇవి కవి ప్రత్యేకతకు నిదర్శనాలు. 'ప్రకృతి సందేశం' కవిత చిన్న చిన్న పదాలతో అతి తక్కువ నిడివి గల పాదాలతో కూడిన చక్కని చిక్కని రచన. 'గహన జాల దహన శీలి' అంటూ అల్పాక్షరాల్లో అనాల్పార్థాలను నిబిడీకృతం చెయ్యగల రచన. స్వీయ ఛందస్సులను సృష్టించుకోవడమే గాక, ధారాశుద్ధిని కలిగి ఉండడమే సీరపాణి కవితల ప్రత్యేకత. క్లుప్తత, గ్లుప్తత ఈయన సొత్తు. మనిషిని ఇంతటి మహోన్నత స్థాయిలో నిలబెట్టిన ఈ 'ప్రకృతి సందేశం' గీతం విశ్వ మానవుడికి మణిమకుటం వంటిది. ఈ కవిత ఆంగ్లభాషలో రచింపబడి ఉంటే, దీనికి ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చి ఉండేది. అర్థ శతాబ్దం కిందటి ఇంత గొప్ప కవిత్వం రాసిన సీరపాణి రచనలపై ఇంతవరకు పరిశోధనలు జరగకపోవడం శోచనీయం.

సీరపాణిని ఎరగని వాళ్లు కొందరు ఆయన జీవిత వివరాలు అడుగుతున్నారు. సీరపాణి అసలు పేరు బుడితి బలరామునాయుడు. పార్వతీపురం మన్యం జిల్లా, సీతానగరం మండలం, కామందొర వలస గ్రామం ఆయన జన్మస్థలం. 70వ దశకంలో విజయనగరంలో ఆయన విద్యార్థిగా ఉండగానే ఈ 'డమరుధ్వని' రాయడం, అభ్యుదయ రచయితగా విశేషమైన గుర్తింపు పొందారు. ప్రముఖ కథా రచయిత చాగంటి సోమయాజులతో కలసి సాహిత్యసేవ చెయ్యడం జరిగింది. వీరిరువురూ అభ్యుదయ రచయితల సంఘం, విజయనగరం శాఖకు ఆనాడు ప్రధాన బాధ్యతలు నిర్వహించారు. పూర్వపు శ్రీకాకుళం జిల్లా, వీరఘట్టం మరియు పాలకొండ ప్రాంతాలలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్ వన్ తెలుగు పండితునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండ పట్టణంలో విశ్రాంత జీవనం గడుపుతున్నారు. అవిశ్రాంతంగా సాహిత్య సేవ చేస్తున్నారు. వెనుదిరిగి చూస్తే సుమారు ఐదు దశాబ్దాలుగా గేయ కవిత్వం మరుగున పడిపోయిందన్న నగ్న సత్యాన్ని గుర్తించి 2017 లోనే 'గేయ కవితా ప్రస్థానం' పేరుతో ఒక కవిత్వ ఉద్యమాన్ని విజయనగరం పట్టణంలో ప్రారంభించారు. ఈ నేపథ్యంలో 2018 లో రెండు రాష్ట్రాలకు చెందిన శతాధిక కవులతో 'పాటశారులు' అనే పేరుతో ఒక గేయ కవితా సంకలనాన్ని వెలువరించారు కూడా.

పిల్లా తిరుపతిరావు
ఫోన్ : 7095184846

# స్త్రీలకు విద్య - దేశానికి ముక్తి

*– శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ గారు*

ముఖ్యంగా స్త్రీలకే విద్య ఎంతేని అవసరము. స్త్రీ అజ్ఞానురాలయిన బిడ్డలును అజ్ఞానులగుదురు. దేశమునకు స్వాతంత్ర్యము రావలెనన్న స్త్రీలు, యువకులు యెంతేని అవసరమని మన నాయకులు గగ్గోలు పెట్టుచున్నారు. కాని స్త్రీలే మూఢులయిన బిడ్డలెట్లు స్వాతంత్ర్య పోరాటమందు పాల్గొనగలరు? ఇది అసంభవము. కాన ముందుగా స్త్రీలకు విజ్ఞానావకాశములున్న తమ బిడ్డలను వీరులనుగా తయారుచేసుకొందురు. కనుక ముందుగ స్త్రీ విద్యను గూర్చి నాయకులు, ప్రభుత్వము ప్రయత్నించవలెను. మనకు యీరోజున పత్రికా స్వాతంత్ర్యము, వాక్స్వాతంత్రము మరి యితర ప్రజాస్వామిక హక్కులు లేవు. వాని కొరకై తీవ్రమైన ఆందోళన అవసరము. యింతటితో సంతృప్తిపడక ప్రత్యేకముగా స్త్రీ విద్యాలయము లధికమగునట్లు ప్రయత్నములు చేయవలెను. స్త్రీలను వనిముట్లవలెను, కుక్కర్లవలెను, ఆటవస్తువులవలెను ఉపయోగించనీయ కుండునట్లు, తప్పని సరిగా విద్యనభ్యసించుట కవకాశము కలుగునట్లు ఒత్తిడి చేయవలెను.



**స్వతంత్ర సంఘములు స్థాపింప వలెను**

ఎవరో చదువులు చెప్పించి స్త్రీలను స్వతంత్రులను చేసెదరని అనుకొనుటకంటె తమంత తామే సంఘముల నిర్మించుకొని, తమ శక్తి మీదనే ఆధారపడినచో ఎంతేని పని జరుగగలదు. ఇప్పటినుండి ప్రయత్నించి మహిళా సంఘములు స్థాపించి వాటిద్వారా స్త్రీ స్వాతంత్ర్యము, స్త్రీవిద్య, బాల్యవివాహ నిషేధములు, పునర్వివాహములు మొదలగు సాంఘిక సంస్కరణలను ప్రభోధమొనర్చి సంఘములను బలవత్తరపరచి దేశకల్యాణమునకు, స్వాతంత్ర్యముకొరకు పోరాడు తదితర సంఘములకు చేదోడుగానుండి పురుషులతోపాటు స్త్రీలును శక్తికొలది జాతీయసేవయందు నిమగ్నము కావలెను.

**స్త్రీ స్వాతంత్ర్య నిరోధము**

యీనాడు సంఘములలో స్త్రీకి ఎట్టి స్వాతంత్ర్యమును లేదు. నాటకాలు, సినీమాలు, మొదలగువాటికి వెళ్లుటకు పురుషులంగీకరింతురు కాని మామూలుగా సభలకు వెళ్లుటకు గాని, మాట్లాడుటకు గాని యీ పాడుసంఘ మంగీకరింపజాలదు. విజ్ఞానార్జనకు ఈ సంఘ మంగీకరింపదు. ఇంటియందేయుండి కూపస్థ మండూకము వలె వంట మొదలగు పనులనే చేయుచుండవలె కాని విద్యాలయములకు వెళ్లుటకు స్వేచ్ఛ లేదు. ఏమి యీ అన్యాయము! స్త్రీ వంటరిగా ఎచ్చటికి ప్రయాణము చేయరాదు కదా! ఆర్థిక స్వాతంత్ర్య మంతకుముందే లేదు. ప్రభుత్వమీ విషయముల కడు శ్రద్ధ వహించవలెను. స్త్రీలు ప్రస్తుత సంఘదాస్యము నుండి విముక్తులయిననే కాని దేశమును దాస్యము నుండి విముక్తి చేయజాలరు. ఇతర దేశములందు స్త్రీలు స్వతంత్రులుగా నుండబట్టియే ఆయా దేశములు ఉచ్ఛస్థితియందున్నవి. యుద్ధము నందు స్త్రీలును సైనికుల పురుషులతో పాటు స్వాతంత్ర్యమునకు పోరాడుచున్నారు. ఇందులకు స్పెయిన్ దేశములోని వీరనారీమణులే ప్రత్యక్ష నిదర్శనములు. అధికారమునందుండి సంఘమునందున్న లోపములను సవరించుచున్నారు. రష్యా మొదలగు దేశములలో పురుషులతో పాటు స్త్రీలుకూడ సామ్యవాద మనుభవించుచున్నారు.

**సామ్యవాదము - స్త్రీలు**

సామ్యవాదమున స్త్రీలు పురుషులతో పాటు అన్ని విషయములలోను సమానమైన హక్కులు కలిగి యుందురు. స్త్రీలు విద్యారహితులై, ఆరోగ్యముకొరకు యింత గాలినైన స్వేచ్ఛగా ననుభవించక కూపస్థ మండూకము వలె గృహములలోనే పడియుండవలసిన అగత్యము లేదు. పురుషులతో బాటు విద్య నభ్యసించ వచ్చును. ఉద్యోగములు చేయవచ్చును. వివాహము నందు

సంపూర్ణ స్వాతంత్ర్యతయే గలిగి తన ఇచ్చవచ్చిన వరునే స్వీకరించవచ్చును. స్త్రీలకున్న ప్రత్యేక యిబ్బందులలో కొన్ని మినహాయింపులున్నవి. స్త్రీలు గర్భిణీగానున్నపుడునూ, ప్రసవించిన కొన్ని దినములవరకునూ, పూర్తి జీతముమీదనే సెలవులివ్వబడును. ఇట్టివి స్వాభావికముగ నుండ వలసినవే. నారీమణులు కూడ యుద్ధమందు పాల్గొనవచ్చును. ఈ విధముగా సంపూర్ణావకాశములు స్త్రీలకుండుటచే, వారియొక్క సాహసము, తెలివితేటలు, చురుకుదనము బాగుగా కనబడుచున్నది. కాని యిప్పటికినీ, నిద్రనుండి మేల్కొనుచున్న యీ రోజులందున్నూ, స్త్రీలను ఏదోవిధముగా నణగద్రొక్క విశ్వప్రయత్నములు చేయుచున్నారు. ఆ ప్రయత్నములు తెలిసికొని మోసపోవలదని సోదరీమణులకు హెచ్చరిక చేయుచున్నాను. స్త్రీలు అబలలనియు, సుకుమారులనియు, బయటికి వచ్చుట కనేక ఆటంకములుండుననియు, కాన గృహమునందేయుండి గృహాధిపత్యమునే వహించ వలయుననెడి ప్రబోధము నానాటికి హెచ్చుగుచున్నది. కవులు కూడ ఈ విషయములో భ్రమను పొందుచున్నారు. వారి చిత్తానుసారము నాటకములు, కల్పనా కథలు వ్రాసి ప్రజలను పెడమార్గముల పెట్టుచున్నారు. స్త్రీ స్వాతంత్ర్యమునకు తప్పుడు అర్థములు తీయుట కడు అన్యాయము.

అట్లు ప్రవర్తించక, స్త్రీస్వాతంత్రోద్యమమునకూ సహాయము చేయవలసినదిగా కవులనూ, కథకులనూ ప్రార్థించుచుంటిని. "స్త్రీ సామ్రాజ్య"మను నాటకములో ప్రదర్శించినరీతి దౌర్జన్యములు పురుషులు చేసిన చేయుదురుగాక, కాని స్త్రీలుమాత్ర మెన్నటికీ చేయజాలరు. స్త్రీకున్న జాలి, దయ, క్షమ, ఆలోచనాశక్తి మరెవ్వరికీ లేవని మహాత్మ గాంధిగారే అప్పుడప్పుడూ వాక్రుచ్చుచుండిరి. మరియు నా నాటకములో స్త్రీల స్వాతంత్ర్యమును గూర్చి ప్రకటించినదంతయు కేవలము ఆక్షేపణీయమైయున్నది. స్త్రీ స్వాతంత్ర్యమా కవికి గిట్టనట్లున్నది. స్త్రీలకు స్వాతంత్ర్యమున్న ఇట్లేయగునేమోయని ప్రపంచము భయపడి అందులకు విరుద్ధముగా ప్రవర్తించవలెనని యీయన భ్రమపడుచున్నట్లున్నది. స్త్రీలు పాశ్చాత్య విద్య నభ్యసించిన పాడయిపోయెదరనియు, గృహసంబంధమైన విద్యనే నేర్చవలెననియు వ్రాసినాడు. అట్లు తలచుట పొరపాటు. అందరూ పాశ్చాత్య విద్యలను, గృహ సంబంధమైన విద్యనూ కూడా అభ్యసింపవచ్చును. మరియు స్త్రీలు సైనికులుగా ఉండుటకనర్హులనియు, స్త్రీలు ఉద్యోగములందుండి ప్రసవించుటచేతను, గర్భవతులయి యుండుటచేతను, యితర యిబ్బందులచేతనూ ఎప్పుడు హాజరు కాజాలక పోవుచుండిరనియు చూపించుట చాల హాస్యాస్పదము. ఇది నారీమణులు ఉద్యోగములు చేయుచున్నచోట్ల సైనికులుగా నున్నచోట్ల అనుభవ విరుద్ధము. యిట్టి కవుల యొక్కయు వ్యాసకారుల యొక్కయు కల్లబొల్లి మాటలకు ప్రపంచము మోసపోవలదని మనవి చేయుచున్నాను.

(ఈ పునర్ముద్రిత వ్యాసం 1937 (బహుశా) మే నెలలో 'పామర్రు ప్రథమ మహిళా మహాసభ'లో ఆహ్వాన సంఘాధ్యక్షురాలి హోదాలో శ్రీమతి వల్లభనేని సీతా మహాలక్ష్మమ్మ చేసిన ప్రసంగ పాఠం. ముందుగా ఆమె జీవితానికి సంబంధించిన వివరాలు స్థూలంగా తెలుసుకుందాం. వలసవాద వ్యతిరేక జాతీయోద్యమం లోనూ, సంఘ సంస్కరణోద్యమంలోనూ, మహిళోద్యమం లోనూ చురుకైన పాత్ర పోషించడం ద్వారా ఆధునికాంధ్ర దేశ నిర్మాణంలో విశేషమైన తోడ్పాటు నందించిన సీతామహాలక్ష్మమ్మ 1910 జనవరి 12న కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులో శ్రీ పొట్లూరి వెంకయ్య, శ్రీమతి శోభనాద్రమ్మలకు జన్మించారు. తన పదకొండవ యేట జమిగొల్వేపల్లి వాస్తవ్యులైన వల్లభనేని రామబ్రహ్మంగారిని పెళ్ళాడి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ అయ్యారు. భర్తతోపాటు జాతీయోద్యమంలో పాల్గొన్న సీతా మహాలక్ష్మమ్మ ప్రత్యేకంగా మహాత్మా గాంధీ నిర్మాణాత్మక కార్యక్రమాల్ని మరింత ముందుకు తీసుకెళ్ళడంలో విశేషమైన ప్రతిభా, అంకితభావమూ కనబర్చారు. 1930ల నాటి శాసనోల్లంఘనోద్యమానికి ఆమె అందించిన తోడ్పాటు అంతా యింతా కాదు. జాతీయోద్యమకారుల పట్ల బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన దమన నీతికి ఏమాత్రమూ చెక్కుచెదరక తన సహచర జాతీయవాద స్త్రీలలో స్థైర్యం నింపారామె. స్త్రీలు ఉద్యమంలో పాల్గొనకుండా నిరోధించడానికీ, పాల్గొన్న వారిని బెదిరించడానికీ, బెదరని వారిని వేధించడానికీ బ్రిటిష్ ప్రభుత్వం అనేక రకాలైన ఎత్తుగడల్ని అవలంబించేది. అయినా అవి సీతామహాలక్ష్మమ్మ, ఆమె సహచరుల ధైర్యస్థైర్యాలనూ, దేశ స్వాతంత్ర్యం పట్ల వారి అంకితభావాన్నీ కొంచెమైనా సడలించపోయాయి. ఈ విషయాల్ని ఒక స్వాతంత్ర సమరయోధుడి మాటల్లో చూద్దాం: 'ఈ పర్యాయము, ఇంతకు పూర్వము ఉద్యమములో లేని విశేషము ఏమనగా అసంఖ్యాకులగు స్త్రీలు ధైర్య సాహసములతో ముందుకు వచ్చి ఉద్యమ నిర్వహణ భారమును వహించుట. వీరిలో ప్రధానముగా

పేర్కొనవలసిన వారు వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ, తులశమ్మ, కౌసల్యమ్మ, దిగుమర్తి జానకమ్మ, తంగిరాల సీతారామమ్మ, గోనుగుంట్ల లక్ష్మీనరసమ్మ మొదలైన వీరవనితలు గలరు. వీరి సాహసమునకు, తెగువకు, విసుగులేని పట్టుదలను అరికట్టుట సాధ్యముకాక, వీరిని బాధించుటకై గవర్నమెంటువారు ఆడ పోలీసులను పెట్టిరి. హీనజాతి స్త్రీలను, ఎరుకల ఏనాదుల ఆడువార్లను రోజు కూలీ ఇచ్చి తెచ్చి స్త్రీ వలంటీర్లను కొట్టింపసాగిరి. స్త్రీలను పెట్టుటకు జెయిళ్ళు చాలవని భయపడి – స్త్రీలను ఎవరినీ జెయిలుకు పంపకుండా ఇతర ఉపాయములచే వెనుకకు నెట్టివేయజూచిరి. కారపు నీళ్ళను, రంగు నీళ్ళను, జలదారులలోని మురికి నీళ్ళను బక్కెట్లతోనూ, కొయ్యపిచ్చుకార్లతోనూ, స్త్రీల ముఖముల మీద, కళ్ళలోను, ముక్కులలోనికి కొట్టింపసాగిరి. కొందరిని లారీలలో ఎక్కించి, రాత్రిపూట దూరముగా ఎక్కడికో అడవులలోకి తీసుకువెళ్ళి అచట వదలి వచ్చుచుండిరి. ఇట్లు వదిలి వేయబడిన స్త్రీ వలంటీర్లు తిరిగి కాలినడకను నానా అవస్థలు పడి యధాస్థానమునకు చేరుకొనుచు, పికెటింగు మొదలగు పనులను యధాపూర్వముగ సాగించుచుండిరి. కొమరవోలు ఆశ్రమములో జెండాను సంరక్షించుటకై అచటి స్త్రీలు చూపిన పట్టుదల అత్యద్భుతము. ఎట్టి బాధలు పెట్టినను స్త్రీలు తమ పట్టుదలను వదలక పోవుటచేత ఒక్కొక్కరినే తుదకు జెయిలుకు పంపసాగిరి. ఈ రీతిగా ఈ జిల్లాలో ముప్పది మందికి పైగా జెయిలుకు వెళ్ళియుండిరి. బెయిలు దొరకక, ఇంకను బయటనుండి నానా అవస్థలు పడిన స్త్రీల సంఖ్యకు లెఖ్ఖ లేదు.' (మానికొండ సత్యనారాయణ శాస్త్రి, *కృష్ణా జిల్లా చరిత్ర : స్వాతంత్ర్యోద్యమ జ్ఞాపకాలు*, సంపా. మండలి బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, హైదరాబాద్, 2012, పు.117).

శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్న కారణంగా సీతామహాలక్ష్మమ్మను 1932 మే 2న ఒక సంవత్సర కాలంపాటు కఠిన జైలు శిక్షకు గురిచేసింది బ్రిటిష్ ప్రభుత్వం: ఆమె వెల్లూరు జైల్లోనూ, కన్ననూరు జైల్లోనూ శిక్ష అనుభవించారు. తర్వాత కాలంలో, వ్యక్తి సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్నందుకు 1941 మార్చి 13న ఆమెకు యింకోసారి జైలు శిక్ష విధింపబడింది.

వలసవాద వ్యతిరేక జాతీయోద్యమానికే కాకుండా, సంఘ సంస్కరణోద్యమానికీ, మరీ ముఖ్యంగా మహిళోద్యమానికీ విశేషమైన తోడ్పాటునందించడం ద్వారా వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ సమకాలీన ఆంధ్ర సార్వజనిక క్షేత్రాన్ని గణనీయంగా ప్రభావితం చేశారు. బ్రిటిష్ వలసపాలనా కాలంనాటి తెలుగు మహిళా మేధావులు నిర్మించిన మహిళోద్యమంలో ప్రధానభాగం మహిళా సంఘాల స్థాపన; మహిళా సమావేశాల నిర్వహణ. 20వ శతాబ్దం ప్రారంభం నుండీ ఆంధ్ర మహిళోద్యమకారులు తెలుగు నేల నాలుగు చెరుగులా ఇబ్బడి ముబ్బడిగా మహిళా సంఘాల్ని స్థాపించారు. పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా మహిళా సంఘాలు యేర్పడనారంభించాయి. మహిళా సంఘాలు ఎంత ఎక్కువ స్థాయిలో యేర్పడి చురుగ్గా పనిచేసేవంటే అయ్యదేవర కాళేశ్వరరావు లాంటి వాళ్ళు ఆశ్చర్యంతో 'అవి స్త్రీ సమాజపు రోజులు, అందువలన స్త్రీలలో జాల చైతన్యము, విద్యాభిలాష, వ్యక్తిత్వము కలిగినవి' అని ప్రకటించారు (*నవ్యాంధ్రము – నా జీవిత కథ*, తెలుగు సమితి, హైదరాబాదు, 2006, పు.64). ఈ నేపథ్యంలో తొలితరం మహిళా మేధావుల కృషిని కొనసాగించిన సీతామహాలక్ష్మమ్మ సుమారు దశాబ్దకాలంపాటు (1937–1947) కృష్ణా జిల్లా మహిళా సంఘానికి అధ్యక్షురాలిగా పనిచేసి మహిళాభ్యుదయానికి ప్రత్యక్షంగా తోడ్పడ్డమే కాకుండా, యితర ప్రాంతాల్లో కూడా మహిళా సంఘాల్ని యేర్పాటు చేయడానికి ఎంతో మందికి ప్రోత్సహమందించారు. కస్తూర్బా స్మారక జాతీయ నిధికి ఉపాధ్యక్షురాలిగానూ (ఆంధ్ర), కృష్ణా జిల్లాబోర్డు సభ్యురాలిగానూ (1939–1941), మద్రాసు రాష్ట్ర శాసన సభ్యురాలిగానూ (1946–51), ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ మెంబర్‌గానూ ఆమె తన సేవల్ని అందించారు.

పునర్ముద్రిత వ్యాసంలో వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ వెలిబుచ్చిన అభిప్రాయాల గూర్చి కొంత. దేశానికి పరాయి పాలన నుండి 'ముక్తి' కలగాలంటే ముందు స్త్రీలు అభివృద్ధి చెందాలనీ; వాళ్ళు అభివృద్ధి చెందాలంటే విద్య ప్రధానమనీ; విద్యావంతులూ, విజ్ఞానవంతులూ అయిన స్త్రీలు దేశాభివృద్ధికి విశేషంగా తోడ్పడగలరనీ ఆమె ప్రగాఢంగా విశ్వసించారు. మొదటి నుండీ 'స్త్రీ విద్య' మహిళోద్యమ అజెండాలో ప్రధాన భాగంగా వుండేది. అందుకే వలసాంధ్రలోని మహిళా మేధావులు స్త్రీవిద్యను గూర్చి మాటల్లో చెప్పలేనంత ఎక్కువగా చర్చించేవారు; వాదించేవారు. 'చదువెఱుగని స్త్రీలు తమ బిడ్డలకు శత్రువులు' అని ప్రకటించడమే కాకుండా, తమ ఆడపిల్లలకు చదువు చెప్పించని తల్లిదండ్రులను శిక్షించేందుకు చట్టాలుండాలని కూడా ఆశించారు.

క్రమక్రమంగా మహిళాభివృద్ధి పట్ల పురుషుల బేషరతైన అంకితభావాన్ని శంకించనారంభించిన స్త్రీలు (ఉదా: సారంగు సీతాదేవి మొ॥) తమ అభివృద్ధి కోసం తామే కృషి చేయాలని భావించడం మొదలు పెట్టారు. ఈ విషయాన్నే సీతామహాలక్ష్మమ్మ సున్నితంగా చెప్పారు.

ఆమె ప్రస్తావించిన విషయాల్లో యింకో ముఖ్యమైన అంశం దేశం పరప్రభుత్వ దాస్యం నుండి విముక్తి పొందాలంటే ముందు స్త్రీలు వారిని అడుగడుగునా కట్టడి చేస్తూ తరతరాలుగా కొనసాగుతోన్న సాంఘిక కట్టుబాట్ల నుండి విముక్తి పొందాలని వాదించడం. స్త్రీ స్వాతంత్ర్యాన్ని దేశ స్వాతంత్ర్యానికి pre-conditionగా ప్రతిపాదించడం విశేషమే. ఈ విషయాన్నే 1920ల చివర్లో వి.సరస్వతి అనే మహిళా మేధావి ఘాటుగా చెప్పారు. 'భారత పురుషుడు మిక్కిలి స్వార్థపరుడు' అని నిస్సంకోచంగా ప్రకటించిన సరస్వతి 'పురుషుడు (బ్రిటిష్ పాలన నుండి) స్వాతంత్ర్యము బడయగోరెనేని ముందు స్త్రీకి స్వాతంత్ర్య మీయవలెను. ఇచ్చునా భగవానుడాతనికి స్వాతంత్ర్య మిచ్చును. ఈయడా భగవానుడాతనికి స్వాతంత్ర్యమీయడు. ఇది నిశ్చయము' అని స్పష్టంగా శపించారు (వలస రాయలసీమలో మహిళా చైతన్యం, 2021, పు.34-35). సీతామహాలక్ష్మమ్మ ప్రసంగంలోని మరో ముఖ్య విషయం "స్త్రీ సామ్రాజ్యము" అనే నాటకాన్ని ప్రస్తావించి అందులో పురుషుడైన నాటకకర్త వెలిబుచ్చిన స్త్రీ వ్యతిరేక/విద్వేష భావజాలాన్ని తీవ్ర స్వరంతో ఖండించి 'యిట్టి కవుల యొక్కయు వ్యాసకారుల యొక్కయు కల్లబొల్లి' మాటలు విని మోసపోవద్దని ప్రజల్ని హెచ్చరించడం. చదువుకొని, సార్వజనికక్షేత్రంలో అడుగుపెడుతున్న స్త్రీలను గూర్చి చాలా మంది పురుషులు చులకనభావంతో మాట్లాడేవారు; హద్దులు మీరిన వారైతే అలాంటి స్త్రీలను 'సీతాకోక చిలుకలు' అని హేళన చేసేవారు. అలాంటి మగవాళ్ళ ప్రవర్తనను సీతామహాలక్ష్మమ్మ లాంటి స్త్రీలు తీవ్రంగా ఆక్షేపించారు. సీతామహాలక్ష్మమ్మ లాగే ఆలోచించిన యింకొంత మంది స్త్రీలు సాహిత్యంలోనూ, సినిమాల్లోనూ చదువుకొన్న స్త్రీలను నీచంగా చిత్రీకరించే విధానంపై తీవ్రంగా మండిపడ్డారు (ఉదా: శ్రీమతి సనందా దేవి, 'చిత్రాల వల్ల స్త్రీలకి జరుగుతున్న అన్యాయం', *ఆంధ్ర మహిళ*, 5 మార్చి 1945, పు.23).

ఇక వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ ప్రసంగ పాఠాన్ని ప్రచురించిన పత్రిక గూర్చి కొంత తెలుసుకుందాం. పై ప్రసంగ పాఠం *గృహలక్ష్మి*లో 1937 జూన్ సంచికలో ప్రచురించబడింది (పు.298-299). వలసాంధ్రలో వెలువడిన ప్రముఖమైన స్త్రీల పత్రికలోగృహలక్ష్మికి ప్రత్యేక స్థానం వుంది. వ్యవస్థాపకుడైన డా.కె.యన్. కేసరి (కోట నరసింహం) సంపాదకత్వంలో 1928 మార్చ్‌లో మద్రాసు నుండి ప్రచురితమవడమారంభించిన *గృహలక్ష్మి* 1960ల్లో కూడా కొనసాగింది. 'కవికలహంసి' చేబ్రోలు సరస్వతి కొంత కాలం దీనికి సహాయ సంపాదకురాలుగా పనిచేశారు. ఎనిమిది మందితో కూడిన 'గృహలక్ష్మి సలహా సంఘము'లో ఐదుమంది స్త్రీలుండేవారు. వారు: కనుపర్తి వరలక్ష్మమ్మ, వింజమూరి వెంకటరత్నమ్మ, చిల్కపాటి సీతాంబ, తెలికిచర్ల వసుంధరాదేవి, గంపా శివకాంతమ్మ. రాయసం వెంకట శివుడు మొదలైన వారు కూడా సలహా సంఘంలో వుండినారు. ప్రచురణ నిమిత్తం స్త్రీల రచనలకు అగ్రతాంబూలం యిచ్చిన *గృహలక్ష్మి* రచయిత్రులను ప్రోత్సహించడంతోపాటుగా, వారు తమ భావాల్ని స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి మహత్తర అవకాశం కల్గించింది. రచయిత్రులను ప్రోత్సహించడానికి 'గృహలక్ష్మీ స్వర్ణకంకణం' అనే అవార్డును కేసరి నెలకొల్పారు. స్త్రీల హక్కులకు సంబంధించిన చైతన్యం కల్గించడంలో గుమ్మడిదల దుర్గాబాయమ్మ (దుర్గాబాయ్ దేశ్‌ముఖ్) సంపాదకత్వంలో వెలువడ్డ *ఆంధ్రమహిళ* కు ఏమాత్రం తగ్గలేదు *గృహలక్ష్మి* కృషి. వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ ప్రసంగ పాఠాన్ని ప్రచురించినట్లే వివిధ మహిళా సంఘాల్లో, మహిళల సమావేశాల్లో ఎందరెందరో స్త్రీలు చేసిన ప్రసంగాల పాఠాల్ని విశేష ప్రాధాన్యంతో ప్రచురించిన *గృహలక్ష్మి* వలసాంధ్రలో మహిళోద్యమం బలంగా కొనసాగడానికి ఇతోధికంగా తోడ్పడింది. సీతామహాలక్ష్మమ్మ ప్రసంగ పాఠాన్ని *గృహలక్ష్మి*తోపాటు యింకో పత్రికయిన తెలుగుతల్లి కూడా ప్రచురించడం విశేషం (సెప్టెంబరు 1937, పు.198-200).

**ఒక విన్నపం** : ఇంతకు ముందే ప్రస్తావించిన మానికొండ సత్యనారాయణ శాస్త్రి గారు 'ఈ జిల్లాలో స్త్రీల ఉద్యమమును గురించి సంపూర్ణ చరిత్ర వ్రాయబడి నేటికిని వ్రాతప్రతిగనే వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ గారింటనున్నది' అని తన పుస్తకంలో ప్రస్తావించారు (పు.99). ఆ రాతప్రతి ఒకవేళ ప్రచురించబడి వుండని పక్షంలో పెద్దలు పూనుకొని ప్రచురించగలరని మనవి.

**డా. షేక్ మహబూబ్ బాషా**
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ
హైదరాబాద్ - 32, మొబైల్ నం : 91605 79705

# చదవండి...

**- మిసిమి**

📖 **తెలంగాణ బాపూజీ :** పాలమూరు సాహితివారి అక్షరసేవ సామాన్యమైనది కాదు. ఎన్నో పుస్తకాలు ఎందరి గురించో ప్రచురించారు.



ఇప్పుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గురించి సమగ్రంగా కాకపోయినా నరివడా సంగతులు ఈ పుటల్లో దొరుకుతాయి. గాంధీతో పోలుస్తూ లక్ష్మణ్ గారిని తెలంగాణా బాపూజీ అని సరిసమానం చేశారు. అయితే ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరులోనే నిక్షిప్తమూ వున్న 'బాపు'ని మనం వేరుగా చూడలేం. డా. భీంపల్లి శ్రీకాంత్ కృషి కొనియాడదగినది.

*పేజీలు : 40 వెల: ₹ 30/- ప్రతులకు: 9032844017*

📖 **వ్యాస మంజూష :** కథలు-కవితలు ఎక్కువగా వ్రాసి ప్రచురించిన 'జన్నాభట్ల' 'కవిశేఖర'గా బిరుదు పొందారు. మరి ఈ వ్యాస మంజూష ఏమిటి?



కరోనా కాలంలో మొదలయిన ఈ వర్తమాన జీవిత సమాజ ఘర్షణయే ఈ వ్యాసాలు. 31 వ్యాసాలు - 23 గ్రంథ సమీక్షలు-12 కవితలు ఇవన్నీ కలిపి వ్యాసమంజూషగా ప్రచురించారు. వీరికి రోజువారీ జీవితంలో - తన చుట్టూ ఏమి జరుగుతుందో ఏది న్యాయమో - ఏది అన్యాయమో చెప్పకుండా ఉండలేరు. ఆ ప్రేరణతోను ఈ వర్తమానంలో వున్నాయి. ఇది ఎంతో ప్రశంస పాత్రమైనది.

*రచన : జన్నాభట్ల నరసింహప్రసాద్, పుటలు : 199, వెల: ₹ 150/- ప్రతులకు : 829726374/7569265350*

📖 **స్పందన: వ్యాస కదంబం-నర్రెడ్డి శివరామిరెడ్డి.**

వీరు మాజీ శాసన సభ్యులు. వీరు వామపక్ష నేతలు.



అయితే మాజీ దివంగత రాజశేఖరరెడ్డి అభిమానులు. అప్పటి రాజకీయ, ఆర్థిక పరిణామాలపై 50 అంశాలుగా ఈ వ్యాస పరంపర వెలువడింది. మన శాసన సభ్యుల్లో విశ్లేషకులు అరుదు. ఆయన రాసిన దానితో మనం ఏకీభవించినా - లేకపోయినా వారి కృషిని తప్పనిసరిగా అభినందించాలి. ఇది ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి స్థితి. అయినా తెలంగాణా అంశాలను కూడా ప్రస్తావించారు. ఈనాటి పరిస్థితులను చూస్తే వారు ఆశించినట్లు చాలా విషయాలు పరిణామాలు చెందలేదు-జరగలేదు. చరిత్ర ఎవరి చేతిలోను వుండదు. దీనికి ప్రశంసాపత్రం ప్రముఖ సంపాదకులు వామపక్షవాదులు ఏ.బి.కె. ప్రసాద్‌గారు రాశారు.

*పేజీలు: 192, వెల: ₹ 90/- ప్రతులకు: 9989904389*

📖 **నవ్యాలోకనం : సాహిత్య వ్యాసాలు :** చందు సుబ్బారావు రచనను సమాజపరం చేసేది విమర్శ - సమకాలీన సమాజంలో సృజన వైశాల్యం ఎంతటిదో ఎరిగి కవి లోకం ముందర ఎప్పటికప్పుడు కొత్త లక్ష్యాలను నిర్దేశించాలి - అంటారు రామతీర్థ తన ముందు మాటలో.



భిన్నవాదాలను స్వాగతించటం, వాటికున్న పరిమితులను గుర్తుచేయటం ప్రపంచ సాహిత్య ప్రముఖుల విలువైన మాటలను అరిచేతలో ఉసిరికాయిలా, రోగనిరోధక శక్తిని పెంచేలా చేయటం - ఆచార్య చందు సుబ్బారావు వంటి విమర్శకులు మాత్రమే చేయగలరు అంటారు రామతీర్థ. ఆవంత్సా సోమసుందర ప్రియశిష్యులైన సుబ్బారావు వారిపై వ్యాసాలు ఉభయకుశలోపరి. మిత్రభాగ్యమంటూ - సుబ్బారావు తన మిత్రుల చిట్టా చదువుతుంటే ఎంతటి భాగ్యమో కదా అనిపించక మానదు. ఎంతో విలువైన భాగ్యం ఈ పుస్తకం చేతిలో ఉండటం.

*పేజీలు: 165, వెల: ₹ 150/- ప్రతులకు: చినుకు ప్రచారకులు - విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు.*

📖 **భవిష్యత్ విద్య : ఆచార్య కోదాటి వియన్నరావు.**



ఇది చాలా అవసరమయిన పుస్తకం. నేటి విద్యా విధానం-తీరుతెన్నులు కూలంకషంగా చర్చించి -భవిష్యత్తులో ఎలాంటి విద్య అవసరం, దీనికి ప్రాతిపదిక ఏమిటి- సిలబస్ ఎలా నిర్మించాలి - భవిష్యత్తులో -కృత్రిమమేధ సాంకేతిక జీవశాస్త్రము -జీవ వైవిధ్యం వంటి విషయాలను లోతుగా పరిశీలించారు. ఎల్లలు లేని తరగతి సాధ్యమేనా? నాగార్జున యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్‌గా సేవలందించిన వియన్నరావు గారు - తమ

అనుభవాన్ని భవిష్యత్తరాలకు అందించాలనీ తపన ఈ పుస్తకంలో చూడవచ్చు.
*పేజీలు : 188, వెల ₹ 150/-*
*ప్రతులకు: విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు.*

**రైతు రాజకీయంలో-విజయకుమార్ నరిసెట్టి:** ఈ పుస్తకం రాసింది ఆయన సోదరుడు నరిసెట్టి ఇన్నయ్య. ఇది విజయకుమార్ జీవిత చరిత్ర. వీరు చేసిన రైతు సమాజసేవ మరుగున పడిపోకూడదని నరిసెట్టి ఇన్నయ్య ఈ రచన చేశారు. దీనికి ప్రేరణ రాజకరణం అని చెప్పారు. ఆయన ప్రేరణతో సమాచారం సేకరించి - విజయకుమార్ ఆయన పరిచయస్తులు, కలసి పనిచేసిన వారిని ఇంటర్వ్యూలు చేసి పొందు పరచారు ఆయన భార్య



కృష్ణకుమారి, పెద్దకుమారుడు దేవరాజ్ - ఎంతో సహకారాన్ని అందించారు. నల్గొండ, గుంటూరు, తెనాలి, బెజవాడ ప్రాంతాల నుండి అరుదైన వివరాలు సేకరించారు. విజయ కుమార్ ఇందిరాగాంధికి రాసిన లేఖాప్రతిని విస్కాన్సిన్ యూనివర్సిటీలో వుంది. అమెరికా లైబ్రేరియన్‌గా పనిచేసిన మైనేని గోపాలకృష్ణ అందించారు. విజయకుమార్ ఆచార్య రంగా అనుచరుడు. ధారాళంగా ఉపన్యాసాలు ఇవ్వగల సమర్థుడు. కోస్తాజిల్లాలో విజయకుమార్ పర్యటించి ఉపన్యాసాలు ఇవ్వనిచోటు అరుదు. వారి గురించి పూర్తి వివరాలు సేకరించి పుస్తకరూపంలో ఇచ్చిన ఇన్నయ్య -మూలకారకుడైన రాజకరణం అభినందనీయులు.
*పేజీలు: 148 వెల: అమూల్యం ప్రతులకు: పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ.*

**వైనతీయ కథలు : బి. శశి.**
బాపూగారి ముఖచిత్రంలో చాలా కాలానికి ఒక పుస్తకం - అదీ కథల సంపుటి చూస్తున్నాం. ఈ కథల కమామీషు ఏమిటి?



శశి గారి మిత్రబృందం చూడండి - అవంతి సోమసుందర్, శీలా వీర్రాజు, కృష్ణమీనన్, రామడుగు రాధాకృష్ణ, మానేపల్లి సత్యనారాయణ, చాగంటి బాపిరాజు, విద్వాన్ విశ్వం, సామవేదం జనకిరాం, శ్రీపతి గారి స్నేహం అంటూ స్వగతంలో చెప్పిన శశి గారు - చిన్నవారేమీ కాదు. వారి కథలు వారి స్థాయికి తగినట్లుగానే వుంటాయి. "చుక్కలు ముసుగేసుకుని మేల్కొంటాయి. వైనతీయం వంపులు తిరిగినచోట రక్తారుణ వర్ణం తుమ్మచెట్ల కొమ్మల నీడల మధ్య ఏటిలో కరుగుతున్నది" ఇది శశి గారి స్థాయి! దురదృష్టం వారిని మనకు లేకుండా చేసింది.
*పేజీలు: 174, వెల: ₹ 100/- ప్రతులకు: బి. రవి, భాను. ఫోన్ : 9490106390*

**విష్ణుమాయా విలాసము :** కంకంటి పాపరాజు అనుంగు తమ్ముడు నారసింహరాజు. ప్రణీతమైన ఈ



ద్విపద కావ్యము అపురూపమైనది - దీనిని ఉన్నవ జ్యోతివాను గారు పరిష్కరించారు. దీనిని టి.టి.డి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో ప్రచురించారు. ఎల్లన కవి వ్రాసిన విష్ణుమాయా నాటక పద్య కావ్యానికి కంకంటి నారసింహ తిమ్మకవి సహాయంతో యధాతథంగా ద్విపదగా చెప్పారు. దీని మూలకథ - నారదుని అహంకారం - హరి మాయా - ఎంతో ప్రౌఢంగా చెప్పిన ద్విపద కావ్యం.
*పేజీలు : 178, వెల ₹ 150/-*
*ప్రతులకు: అన్ని ముఖ్య పుస్తకాల షాపుల్లో.*

**కొత్తరాగం : దర్భముళ్ల చంద్రశేఖర్**
ఇది వీరి నాల్గవ కవితా సంపుటి. ఈ కవిగారి 'అభిలాష' నిద్రపోదామని. కాని వారి కలలు



నిద్రపోనివ్వవని విచారిస్తున్నారు. ఏమిటా కలలు? వీరు మేల్కొని వుండటానికి వీరు జాగరూకత కారణం (awareness) అంటారు. ఈ కవితలు చదువుకుంటూ పోతే మీకు నిద్రపట్టదు - జాగ్రత్త సుమా! మొత్తం 197 కవితలున్నాయి.
*పేజీలు : 200, వెల ₹ 200/-ప్రతులకు: రచయిత, ఫోన్ 9491850718*

**నయగరా :** ప్రబోధ్‌కుమార్ గోవిల్ : తెలుగు అనువాదం దాటి వసంత. అనువాదం సాహిత్యానికి దివిటి లాంటి దంటారు రంగయ్య గారు. నదీజలాలు



సరిహద్దులను దాటిస్తాయి. శిఖరాల నుండి యువతలకు ప్రవహిస్తాయి. ఆకాశ-పాతాళాల సరిహద్దులు మారేవి నదీజలాలు. సముద్రంలోని ఉప్పు నీళ్ల రూపంలో సదా ప్రవహించేది నదీ జలమే. చరిత్రపుటంలో నిలిచిపోయిన మహానాయకుల ఆశల నావల తెరచాప కట్టి గుంజలు కూడా ఈ నదీజలాలే అంటారు. ప్రబోధ్‌కుమార్ గోవిల్ - మూల రచయిత ఇంతకంటే చెప్పేదేముంది?
*పేజీలు : 120, వెల ₹ 75/-ప్రతులకు: ఎమెస్కో/సాహితీ ప్రచురణలు*

# మిసిమి

మాసపత్రిక

## మీరు చందాదారులుగా చేరండి బహుమతిగా పంపండి

మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**A/C Name : Misimi Publication**
**HDFC Current Account No. 50200069769243**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

**Scan QR to Pay**

Misimi Publication

## మిసిమి ప్రచురణలు


నోబెల్ వ్యాసాలు


మిసిమి పార్థసారథి వ్యాసాలు


చిత్రకళా నీరాజనం


దూరతీరాలలో...


రజ్జు సర్పభ్రాంతి


బైరన్


పురస్కార సాహిత్యం


వ్యాస మంజూష


సారస్వత వ్యాసాలు


చార్లీ చాప్లిన్


సిద్ధార్థ


సప్తపర్ణి


షెల్లీ జీవిత కథ


దోసిట చినుకులు


నృత్యభారతి


పారిజాతం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

**మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**


-MAHABHARATA-
Amba अम्बा
Ambalika अम्बालिका
Ambika अम्बिका
Daughters of Kashya

అంబ, అంబిక, అంబాలిక

మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2021-23
Date of Posting: On 29th & 30th
Date of Publication: 25.9.2023



సిద్ధి వినాయక